Acc No: 26029

శ్రీమహాగణాధిపతయే నమః

ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, కైవల్య,
మాండూక్య సప్త ఉపనిషత్తులకు

శ్రీ శ్రీ నీలకంఠాచార్యకృతభాష్యమును, శ్రీ ముదిగొండ
నాగలింగశాస్త్రికృత సంస్కృతవ్యాఖ్యానము ననుసరించి

the Registrar ... Hyderabad 1213

శ్రీ నిర్మల శంకరశాస్త్రికృత-

శివతత్త్వప్రభాఽఽంధ్రీకరణము

ప్రకాశకులు - శివజ్ఞానలహరి, ధార్మికసంస్థ, రిజిస్టర్డ్
హైదరాబాద్.

అధ్యక్షులు-శివశ్రీ॥ అన్నదేవర సుబ్బారావుగారు,
విజయవాడ-10.

సర్వస్వామ్యము ప్రకాశకులది.

శ్రీ ధాతృ సం॥ 1996, వెల : రూ. 60/-

ప్రతులు : 500

ప్రథమ ముద్రణ : 1996

వలయువారు :

AVSR చంద్రశేఖర్

చార్టర్డ్ అకౌంటెంట్,

కార్యదర్శి శివజ్ఞానలహరి

5-9-47/5, బషీర్‌బాగ్,

హైదరాబాదు-500 029 అను అడ్రసునకు వ్రాయగలరు.

ముద్రణ :

శివాజీ ప్రెస్, 4-4-58, గంజ్ బజార్, సికింద్రాబాద్-500 003.

విషయసూచిక

తొలిపలుకు

భరత ఖండమున సర్వమతస్థులకును ప్రమాణ గ్రంథములు వేదములు. వేదమును శిరసావహించెడి మతములారు విధములు. అవి - శైవము, శాక్తము, వైష్ణవము, సౌరము, గాణాపత్యము, స్కాందములై యున్నవి. అట్టి శైవ మతమును వ్యాప్తిలోనికిఁదెచ్చి శతాధిక గ్రంథకర్తవై కృష్ణానదీ తీరమున గుంటూరునకు ఎనిమిది మైళ్ళ దూరమున నున్న తాడికొండ గ్రామమున క్రీ.శ. 1876 సం॥ సరియగు ధాతనామ సంవత్సర చైత్రశుద్ధ నవమి సోమవారమున భూలోక ప్రవేశము జేసిన, మహోపాధ్యాయ శివయోగి శివశ్రీ ముదిగొండ నాగలింగ శాస్త్రిగారు చిరస్మరణీయులు.

శ్రౌత శైవులకు వేదాగమము లుభయమును పరమ ప్రమాణములు శిరోధార్యములై యున్నవి. అట్టి వేద ప్రామాణ్యముతో ఆవిష్కరింపబడినదే వైదికపుష్టి కలిగిన శివారాధ్య శ్రౌత శైవ సంప్రదాయము. భారతీయ సంస్కృతికే మణి భూషణము. శ్రీ నాగలింగ శాస్త్రిగారిట్టి శ్రౌత శైవ సంప్రదాయమతిప్రాచీనమని తమ గ్రంథములందు నిరూపించిరి, ద్వైత, అద్వైత విశిష్టాద్వైతములను వాని బేదములను నిరూపించి, ఆయా మతాచార్యులు స్వమత ప్రతిష్ఠాపనమునకై వేదమంత్రములకును వ్యాససూత్రములకును గావించిన యర్థములు సరియైనవి కావనియు, కర్మ జ్ఞాన సముచ్చయ విలసితమై, భస్మ రుద్రాక్ష లింగధారణ సహితమైన శైవమహాదీక్షయే మోక్షసాధనమని సప్రమాణముగా నిరూపించిరి. వేదపథము, వ్యాస

పథము, శివఏవ కారణం, శ్రౌతాన్యేన శైవఖిహ్నాని, శ్రౌతమేవ హి లింగ ధారణం, శిష్టా స్సర్వే శ్శివం ప్రపన్నాః, శివాద్వైత పథము, కేవలాద్వైత ప్రతిషేధము, వేదాంతార్థ పరిష్కార తార హారము, రక్షారుద్రాక్ష చండమార్తాండము, విద్యాస్థాన వినిర్ణయము, మత వినోదచర్చ చతుర్వేద, భారత రామాయణ తాత్పర్య సంగ్రహములు, జ్ఞాన వాశిష్ఠము, శైవ సిద్ధాంత సంగ్రహము, కారణోత్తర మకుతోత్తర, చంద్ర జ్ఞాన శివాగమములకు తెలుగులో వ్యాఖ్యానములు, బసవ పురాణ పీఠికా విమర్శనము, అప్పయ దీక్షిత చరిత్ర, నీలకంఠ భాష్య చర్చ, ఇత్యాది నూరు పైగా శైవగ్రంథములు రచించి, నీలకంఠారాధ్యుల భాష్యపథమే సరియైనదనియు సిద్ధాంతీకరించిరి. ఇంకను మోక్ష స్వరూప నిర్ణయమను గ్రంథములో జీవ బ్రహ్మైక్యము ముక్తి స్వరూపమని యెన్నుట భ్రాంతి యనియు, పరమ పురుషార్థ స్వరూపమును తెలుపునట్టి వేదాన్త వాక్యముల వలనను, వాని యర్థమును నిర్ణయింపనేర్పడిన బ్రహ్మసూత్రముల వలనను పరమేశ్వరుని పరమ సారూప్యంబును సాయుజ్యంబు ననునదియే మోక్ష స్వరూపంబని నిర్ణయించిరి. 13-12-1948 సం॥ శివసాయుజ్యమునందిరి. వీరు శైవమత ప్రచారమునకై మద్రాసు నుండి శ్రౌత శైవ ప్రకాశిక యను మాసపత్రికను, తెనాలి సంస్కృత కళాశాలలో కొంతకాలము విద్యాంగఱపి తెనాలినుండి, శైవరహస్య బోధిని, జ్ఞాన వాహిని యను మాసపత్రికలను నడిపి శైవ సాహిత్యమున కెనలేని సేవఁజేసిరి. ఇటీవలనే స్వర్గస్థులైన చందనోలు శ్రీ తాదేపల్లి రాఘవ నారాయణశాస్త్రిగారు పాతంజలి భాష్యమును వీరి యొద్దనే చదివిరి. మధురావిజయమను గ్రంథమును రచించి తమ గురుపాదులు శ్రీ నాగలింగశాస్త్రిగారికి అంకితమిచ్చిరి. శ్రీ నాగలింగ శాస్త్రిగారు, భారతజాతి సంస్కృతికే మూలమైన శైవమునకు

జేసిన సేవ అపారము. అమ్మహనీయుని 120 వ జన్మదిన సందర్భ ముగా నివాళులర్పించుచు ఆయన స్మృతి చిహ్నముగా శ్రీశ్రీ నీల కంఠ భగవత్పాదాచార్య కృత ఉపనిషత్ భాష్యమును, శ్రీనాగలింగ శాస్త్రిగారి సంస్కృత వ్యాఖ్యాన సమన్వితముగా, ప్రస్తుత శైవమహా పీఠాధ్యక్షులు శ్రీ కంఠ విద్యాభూషణ, సంస్కృత సాహిత్య రత్న, ఆంధ్రానువాద కుశల, ఆసన్న అర్ధశత గ్రంధకర్తలు మల్లికార్జున పండితారాధ్య వంశీయులు గౌతమ గోత్రజులు, జ్ఞానవయోవృద్ధులు నగు శివశ్రీ నిర్మల శంకరశాస్త్రి ఆరాధ్యులవారిచే ఆంధ్ర వ్యాఖ్యానము వ్రాయఁబడి మా శివజ్ఞానలహరి ధార్మిక సంస్థ ప్రథమ కుసుమముగ జిజ్ఞాసువుల కందజేయబడుచున్నది. శ్రీ శంకరశాస్త్రి గారికి మా నమోవాకములు. ప్రశంసావాక్యములు పంపిన శివశ్రీ కాశీనాథుని పూర్ణ మల్లికార్జునుడు గారికి మా కృతజ్ఞతలు.

ది. 30-6-1996
విజయవాడ-10

అన్నదేవర సుబ్బారావు
అధ్యక్షులు శివజ్ఞాన లహరి
ధార్మిక సంస్థ హైద్రాబాదు-29

విన్నపము

మన భారతీయ సంస్కృతికి మూల గ్రంథములై, దేశ విదేశీయులచే కొనియాడబడి, ప్రస్థాన త్రయముగా భాసిల్లిన బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు భగవద్గీతల కనేకులు తమ తమ మతానుసారముగా తమ సిద్ధాంతమున కనుగుణముగా వ్యాఖ్యానములు వ్రాసి యున్నారు. వీనిలో చాలవరకు కొన్నింటిని పరిశీలించిన తర్వాత కలిగిన అభిప్రాయమేమన? ఇవి "కలౌ శైవ మరోచకమ్" యను నానుడి నాశ్రయించి వ్రాసినట్లు కనుపట్టినది. 'శివ' 'బ్రహ్మ' పదములకు శైవులు ఏక వాక్యార్థతను సాధించిరి. అది యీ వ్యాఖ్యానములలో మృగ్యము. మరియు శివపదమున కొకచోట మంగళకరుడనియు, మరియొక చోట మరియొక విధముగను "తథా శివ మనిజ్ఞాయ దుఃఖస్యాంతో భవిష్యతి" అను శ్వేతాశ్వతర మంత్ర మందలి "శివ పదమును "దేవ" పదముగా మార్చి వ్యాఖ్యానించుచు, ఇట్లే శివ, బ్రహ్మ, పశుపతి, లింగ, భర్గ, రుద్ర, త్ర్యంబక, ఈశ్వర ఇత్యాది పదములకు ఒక్కొకచోట నొక విధముగా అర్థమును వ్రాయుచు, విపరీతార్థములతో శివద్వేషమునే ప్రధానీకరించుకొని, పరమప్రామాణికమైన భస్మ రుద్రాక్ష లింగధారణ సహితమై మోక్ష సాధనమైన శైవమహాదీక్షనే, తృణీకరించుచు వ్రాసిన వ్యాఖ్యానములు జిజ్ఞాసువులను ముఖ్యముగా శైవులను తప్పుదారి పట్టించు విధముగా యుండుటచే భారతీయ సంస్కృతికి ముఖ్యములైన నీ ద్వాదశ ఉపనిషత్తులకు శివపరముగా వ్యాఖ్యానమునందించుట అవసరమైనది. ఇందు- ఈశావాస్య, కేన, కఠ, ప్రశ్న, ముండక, కైవల్య మాండూ

క్యోపనిషత్తులు ప్రథమభాగముగా శ్రీ శివశ్రీ నిర్మల శంకర శాస్త్రిగారి తెలుగర్థముతో కలవు. మిగిలిన ఛాందోగ్య, ఐతరేయ తైత్తిరీయ, బృహదారణ్యక, శ్వేతాశ్వతర ఉపనిషత్తుల సారాంశము-శివశ్రీ॥ నిర్మల శంకరశాస్త్రి గారివ్యాఖ్యానముతో రెండవ భాగముగా వెలువడగలదు. విజ్ఞులు గ్రహింతురుగాక!

విజయవాడ-10
ది. 30-6-1996

అన్నదేవర సుబ్బారావు
అధ్యక్షులు శివజ్ఞానలహరి, హైద్రాబాదు-29

ప్రశంసా వాక్యములు

శివశ్రీ ॥ లోకారాధ్యులు కాశీనాథుని పూర్ణమల్లికార్జునుడు గారు **M.A. B.L. Ex. M P.** స్వాతంత్ర్య సమర యోధులు బుట్టాయి పేట, బందరు వారి ప్రశంసా వాక్యములు.
-శివశ్రీ॥ అన్నదేవర సుబ్బారావు గారికి-శివస్మృతులతో వ్రాయునది!

'శివజ్ఞాన లహరి' యను సంస్థను స్థాపించి, తద్ద్వారా భారతీయ సంస్కృతికి మూలభూత శైవ వాఙ్మయమును, ముఖ్యముగా యీ గ్రంథమును జిజ్ఞాసువుల కందజేయ సంకల్పించుట మీ శైవ మతాభిమానమునకు తార్కాణము మీ పవిత్రాశయము శివానుగ్రహమున సఫలమగుగాక!

ఆస్తికులందరును ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రములతో బాటు, భగవద్గీతను గూడ ప్రమాణ గ్రంథములుగా స్వీకరించి వారి వారి మతానుసారముగా వ్యాఖ్యానము గావించుకొని యున్నారు. శ్రీ నీలకంఠాచార్యుల వారి సిద్ధాంతమే ఆచరణీయముగా గ్రహించువారు శ్రౌత శైవులైన ద్వాదశాచార్యులు" వారి తరువాత శ్రౌతశైవమత ప్రచారము గావించినవారు ప్రథమ శైవ మహాపీఠాధిపతులు శతాధిక గ్రంథకర్తలునగు శివయోగి శ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రిగారు. శ్రీవారు శ్రీ నీలకంఠాచార్యుల వారి గ్రంథములకు సంస్కృతములో వ్యాఖ్యానము వ్రాసిరి. సంస్కృత భాషాజ్ఞానము చాల తక్కువగా యున్న ఈ కాలములో సర్వులకు సులభగ్రాహ్యమగునట్లుగా, విద్వత్ వరేణ్యులు శివశ్రీ ॥ - నిర్మల శంకరశాస్త్రి గారు, ఈ సప్తోపనిషత్తులను ఆంధ్రీకరించి శైవులకు మహోపకారము జేసినారు శివాద్వైత సిద్ధాంతము సులభతరమును క్లేశరహితమును అగుటవలన ఈ మార్గములో సులభముగా పరమేశ్వరుని జేరుట కవకాశము గలదు.

ఈశ్వరశబ్దము శివునకే రూఢము, శివాద్వైతమతము లోని విశేష మేమనగా? వేదములు, ఉపనిషత్తులు భగవద్గీత అనువాని యందు జెప్పిన మంత్రార్థముల కనుకూలముగ, భస్మరుద్రాక్ష శివలింగ ధారణము, పంచాక్షరీ మంత్రజపము, శివలింగాభిషేకము, శివపూజ, దశావధాన కార్యక్రమము లిందుండుటయే ఇట్టి విశేషములను సామాన్యులకందుబాటులో నుండు రీతిగా ఆంధ్ర భాషలోనికి అనువదించి మతోద్ధరణఁ జేయుటయే గాక తాము జీవన్ముక్తులగుటకు పాత్రత సంపాదించిన శివశ్రీ॥ నిర్మల శంకరశాస్త్రి మహోదయులను అభినందించుచున్నాను. వారికి పార్వతీ పరమేశ్వరులు సుదీర్ఘమైన ఆయుష్యమును శారీరక మానసిక పాటవమును ప్రసాదింతురుగాక!.

కాశీనాథుని పూర్ణ మల్లికార్జునుఁడు

బందరు, ది. 21-6-1996

కృతజ్ఞత

విజయవాడ-10
ది. 1-7-1996

లోకారాధ్యులు
శివశ్రీ॥ నిర్మల శంకరశాస్త్రి ఆరాధ్యులవారికి
శరణులు నమస్కారములు-

అయ్యా!

ఈ ఏడు ఉపనిషత్తులు శివాద్వైత పరముగ వ్యాఖ్యానము వ్రాసి నాకు మహదానందము కలిగించినారు. భావితరములవారు తమ కృషి కెంతయొ ఋణపడి ఉండగలరు. వయోవృద్ధులై యుండి అనారోగ్యమును గూడ లెక్క జేయక ఈ ఉపనిషత్తుల కార్యము పూర్తి జేసినందులకు చాల కృతజ్ఞుడను. ఇటులనే మిగతా ఐదు ఉపనిషత్తులకు అవసరమైనచోట్ల మంత్రములను వ్రాయుచు మిగతా చోట్ల సారాంశము మాత్రము వ్రాసి 200 పేజీలు మించకుండా మొదటి భాగము వలెనే వ్రాసి త్వరగా పూర్తిజేయ గోర్తాను. తమ కృషికి నా అండ దండలు ఎప్పుడూ ఉంటాయి. తమ ఆశీస్సు లభ్యర్థిస్తున్నాను.

ఇట్లు విధేయుడు
అన్నదేవర సుబ్బారావు
M.A. B.L. F.R.S. (Retd)
శివజ్ఞాన లహరి
అధ్యక్షులు,

ఆశీరభినందనము

శివశ్రీ ॥ అన్నదేవర సుబ్బారావు గారు - సరస గంభీర హృదయులు, ఉదారస్వభావులు, శైవసంప్రదాయనిరతులు శివపూజా దురంధరులు, శైవమత ప్రచారమును గ్రంధరూపమున, ప్రవచనరూపమునను, పృచ్ఛకుల సందేహములను తీర్చు పరిష్కారముల తోడను-గావించుచు సమకాలిక ఆరాధ్యశైవులకు కనువిప్పు గలిగించు ఆదర్శపురుషులై యున్నవారని భావించుచు వీరిని సర్వాత్మనా అభినందించుచున్నాను. వీరికి వీరి కుటుంబమునకును దీర్ఘాయురారోగ్యభాగ్యములను కన్యాదాన సుకృతఫలములను శివుఁడు ప్రసాదించుగాక!

శ్రీవారి ప్రథమ తనూభవుఁడైన శివశ్రీ ॥ అన్నదేవర చంద్రశేఖర్ గారు - ఆంగ్లేయభాషా కోవిదుఁడైనను వేదాగమస్మృతి పురాణాదిసమ్మతమగు శైవ సంప్రదాయమునందు ఆసక్తి గలవారై నిత్యము శివారాధనముఁ జేయుచు ధన్యులగుచున్నవారు.

వీరికి దీర్ఘాయురారోగ్యభాగ్యములతో ఇహ పరములను సాధించు మర్థ్యము - శివానుగ్రహమువలన - దినదినప్రవర్ధమాన మగుగాక!

)-7-1996,

నిర్మల శంకరశాస్త్రి

శ్రీ

వాజసనేయ సంహితాంతర్గతమగు

ఈశావాస్యోపనిషత్తు

"ఓం ఈశావాస్యమిదగ్ం సర్వం-యత్కించ జగత్యాం జగత్ । తేన త్యక్తేన భుంజీథా—మా గృధః కస్యస్విద్ధనమ్"

పదార్థము. జగత్యాం=భూలోకము మొదలగు లోకములన్నిటి యందు, జగత్ = చరాచరప్రాణిజాతము, యత్కించ = ఏదేది గలదో, (తత్ అధ్యాహారము) తదిదం సర్వం = అట్టి ఈ ప్రపంచ మంతయు, ఈశావాస్యం = పరమేశ్వరునిచే వ్యాపింపఁబడినది.

తేన = సర్వనియామకుఁడైన ఈశ్వరునిచే, త్యక్తేన = నీ కొరకు విడుదల చేయఁబడిన దానితో, భుంజీథాః! = శాస్త్రముఁదగు అనుజ్ఞ గలిగిన అనుభవము ననుసంధింపఁజేసికొనుము! కస్యస్విత్ = ఎవనియొక్కయు, ధనం = స్థిరచరాస్తిని, మాగృధః! = అపేక్షింపకుము!

చేతనుఁడు—స్వభావమున, అచేతనము—స్వరూపమున ఈశ్వర భిన్నమైన మార్పుఁజెందునవగుటచే—జగత్—అను శబ్దముతో ఇఁట చెప్పఁబడినవి. "దోషము గలదని భావించి మమకారము లేనివాడవై భోగ్యము ననుభవింపుము" అనియు చెప్పవచ్చును. అనఁగా—శరీర పోషణమునకు మాత్రము ఉపయోగించు ఆహారము మొదలగువానిని

స్వీకరించుచుండుమని భావము. "ప్రతిదాని నమితముగ నపేక్షింపకుము! అనుభవింపఁదగిన వస్తుజాతమంతయు జీవమాత్రునిది కాదు. సమస్తము పరమేశ్వరునిదేను, పరమేశ్వరుఁడే ఈ చరాచరమును పుట్టించి అందు ప్రవేశించి నియమించుటచే ప్రపంచము ఈశ్వరుని శరీరమై సొత్తగుచున్నది. "నేను కర్తను నేను భోక్తను" ఇత్యాది అభినివేశము లేనివాడవై భోగ్యమునంతయు ఈశ్వరునకు నివేదించి తత్ప్రసాదముగ అనుభవింపుమని విశదార్థము.

"కుర్వన్నేవేహ కర్మాణి-జిజీవిషేచ్ఛతగ్ం సమాః। ఏవం
త్వయి నాన్యథేతోఽస్తి-న కర్మ లిప్యతే నరే" 2

ప. శతం సమాః=నూరువత్సరములు (అనగా-యావజ్జీవము) కర్మాణి=ఫలాపేక్ష లేనట్టి నిత్యనైమిత్తికాది విహితకర్మలను, ఇహ = ఈ లోకమునందు, కుర్వన్నేవ= చేయుచున్నవాడవయ్యే. జిజీవిషేత్ = జీవింపఁగోరవలెను. త్వయి = నీ విషయమై, ఏవం = చెప్పఁబడిన కర్మానుష్ఠానమే ఉచితమైనది, ఇతః = చెప్పబడిన విధానమునకంటె, అన్యథా = మరియొక విధానము, నాస్తి = లేదు, నరే= మోక్షమునపేక్షించు మానవుని విషయమై, కర్మ = నిష్కామకర్మాచరణము, న లిప్యతే = బంధమును కలిగించునది కాదు.

"జిజీవిషేత్" అనునది—జీవించుమను విధిని బోధించునదైనను "స్నాత్వా భుంజీత" "స్నానమునొనర్చి భుజింపవలెను" అను చో ...ర్మానుష్ఠానమునుగురించి స్నానమును విధించినట్లు-కర్మాచరణమును ...ధించుచున్నయది. మోక్షాపేక్ష కలిగినంతమాత్రమున జ్ఞాననిష్ఠ ...ద్ధింపదు గాన సంధ్యావందనాది నిత్యకర్మలను శ్రాద్ధాదినైమిత్తిక కర్మలను నిష్కామబుద్ధి నాచరించుచు శాంభవదీక్షా స్వీకారపురస్సర

ముగ శివు నారాధించుట యను భక్తియోగము గలవాడైనచో చిత్త శుద్ధిని ధ్యానము నభ్యసించి శివానుగ్రహమువలన శివ సాక్షాత్కారము అను అపరోక్షజ్ఞానమున ముక్తుఁడగును.

వస్తుతః-కర్మ-బంధకము కానట్టిది. భోగాపేక్షయే బంధక మగును. అని ఇందు పరమార్థము.

"అసూర్యా నామ తే లోకా - అంధేన తమసాఽఽవృతాః,
ప్రేత్యాభిగచ్ఛంతి యే కే - చాత్మహనో జనాః" 3

ప. అసూర్యానామ = తామసప్రకృతి గల అసురులను చెంది నట్టి. తే లోకాః = ప్రసిద్ధములైన లోకములు (జన్మలును) అంధేన తమసా = కటిక చీకటి (అజ్ఞానము)లో, ఆవృతాః = నిండినవి కలవు.

యే కే చ = ఎవరైతే, ఆత్మహనః = పరమాత్మయగు శివునుపా సింపనట్టి, జనాః = జనులో, తే = అట్టివారు, తాన్ = గాఢాంధకార (అజ్ఞాన) మయములగు నరకలోకములను, ప్రేత్య = మరణించిన తరువాత, అభిగచ్ఛంతి = పొందుదురు.

పరమేశ్వరుని లింగధారణదీక్షతో నుపాసింపనివారు శివద్రోహు లనఁబడుదురు. శివోపాసనలేనివారు-దానధర్మాది సుకృతముల నాచ రించి స్వర్గాది పుణ్యఫలభోగములను పొందుదురు గదా! నరకగాము లెట్లగుదురను ఆశంకకు సమాధానము-స్వర్గాదిలోకములనుండి మానవ లోకమునకు ఏతెంచి అనేక జన్మలలో సంసారవ్యామోహితులై శివుని విస్మరింతురు గాన-శివునుపాసింపనివారికి ఏనాటికైనను నరక యాతన-తప్పదని సారాంశము.

"అనేజ దేకం మనసో జవీయో - నైన ద్దేవా ఆప్నువన్

పూర్వ మర్షత్ । తద్ధావతోఽన్యా నత్యేతి - తిష్ఠ
త్తస్మి న్నపో మాతరిశ్వా దధాతి" 4

ప. అనేజత్ = కదలనిది, మనసో జవీయః = మనస్సున కంటె వేగము గలది. పూర్వం = మనస్సునకంటె ముందు, అర్షత్ = చేరునదియు నగు ఏనత్ = ఈ బ్రహ్మమును, దేవాః = హరిబ్రహ్మాద్యమరులు, నాప్నువన్ = పొందలేదు.

తత్ = అట్టి బ్రహ్మము. ధావతః = పరుగెత్తునట్టి, అన్యాన్ = గరుడాదులను, అత్యేతి = అతిక్రమించును ఐనను బ్రహ్మము తిష్ఠత్ = ఒకానొకచో స్థిరపడునదేను, తస్మిన్ = ఆ బ్రహ్మమునందు ఆధారపడిన మాతరిశ్వా = వాయువు, అపః = భూజలాగ్నిసముద్రాదికమగు సమస్తమును, దధాతి = నిలుపుచున్నది.

భావము. బ్రహ్మము(పరమేశ్వరు(డు)జీవాత్మలందరిలోనుండునదగుటచే సంకల్పాదులతో వేగముగల మనస్సునకంటె నధిక వేగము గలదని చెప్పుట పొస(గును. మనోవేగమునకు అందని వస్తువే లేదు. మనోఽధిక వేగము గల బ్రహ్మమునకు గోచరము కాని వస్తు వుండదని చెప్పనేల? మనస్సు సమీపించిన చోటునకు అంతకుముందే బ్రహ్మము చేరును.

హరిబ్రహ్మాద్యంతర్యామిగ నుండు పరమేశ్వరుని తరువాతివారైన దేవతలు గుర్తింప(జాలరు. ఇందుకు "హరిబ్రహ్మాదీనా మపి నికటభాజా మసులభం" అను ఆద్యశంకరాచార్యోక్తి-నిదర్శనము. సంసారబద్ధులందరు—అజ్ఞానాంధకారముచే గ్రుడ్డివారుగ నుందురు.

నేలలోని నిధిని తెలియనివారు-పైపై నడచినను నిధిని గుర్తింపనట్లు జగత్తును ధరించు గట్టిదనము లేనిదైనను వాయువు బ్రహ్మము నాశ్రయించియే జగద్ధారణసామర్థ్యము కలిగియుండును.

పరమేశ్వరుఁడు-ఇష్ట ప్రాణ భావ లింగరూపమున శాంభవదీక్షితు లందరిని వ్యాపించును గాన మనోవాయువేగాధికవేగముతో భక్తుల ననుగ్రహించునని గూడా చెప్పవచ్చును.

"తదేజతి తన్నైజతి - తద్దూరే తద్వదంతికే । తదంతరస్య సర్వస్య - తదు సర్వస్యాస్య బాహ్యతః" 5

ప తత్ = బ్రహ్మము, ఏజతి = చలించినట్లు కనుపడును. తత్ = బ్రహ్మము, నైజతి = వాస్తవముగ కదలికలేనిదై స్థిరపడు నది. తత్ = బ్రహ్మము, దూరే = తన నుపాసింపనివారికి అందు నది కాదు, తద్వత్ = అదే బ్రహ్మము, అంతికే=సమీపించునదియు, తత్ = బ్రహ్మము, అస్య సర్వస్య = ఈ చేతనాచేతన ప్రపంచము యొక్క, అంతరస్య సర్వస్య = లోని మనోబుద్ధ్యాది సమస్తమును, బాహ్యతః = ఆకాశాది బహిః ప్రదేశములను వ్యాపించునదియు,

భా. శాంభవదీక్షితులై శివు నుపాసించువారికి ఇష్టలింగరూప మున సన్నిహితమై, ప్రాణలింగరూపమున లోనిదై భావలింగము (బ్రహ్మము) గోచరించును. శివు నుపాసింపనివారిని జన్మపరంపరలో పడవేసి దూరమగును. అనఁగా అట్టివారికి శివభక్తి కలుగమి శివ స్వరూప సాక్షాత్కారము సంభవింపదని పరమార్థము. మాహేశ్వర రూపమున దివ్యమంగళ విగ్రహమునను చలించువాడు పరంజ్యోతిగ పరమపదమున స్థిరపడువాడు-పరమేశ్వరుఁడని తెలియవలెను.

సమస్త జీవాంతర్యామిగ సర్వవ్యాపియగు సదాశివుఁడు విభువై అణువులో నణువుగను మహత్తులో మహత్తుగ నుండు వాడనియు చెప్పవచ్చును.

యస్తు సర్వాణి భూతా-న్యాత్మన్యేవానుపశ్యతి ।
సర్వభూతేషు చాత్మానం - న తతో విజుగుప్సతే ॥ 6

ప. శివు నుపాసించు యస్తు = ఎవఁడైతే, సర్వాణి భూతాని = ప్రాణులందరిని, ఆత్మన్యేవ = పరమేశ్వరునందే, అనుపశ్యతి = భావించునో, మరియు సర్వభూతేషు = ప్రాణులందరియందు, ఆత్మానం = పరమేశ్వరు నవలోకించునో, అట్టి శివోపాసకుఁడు, తతః = శివాత్మకులుగ భావింపఁబడు ప్రాణులవిషయమైన విజుగుప్సతే = తిరస్కారభావము నొందఁజాలడు.

భా. జీవాత్మలందరును పరమేశ్వరునిపై ఆధారపడియుండువారనియు, పరమేశ్వరుఁడు జీవులందరిలో నుండువాడనియు దృఢముగా భావించు శివోపాసకునకు—ప్రపంచమున తుచ్ఛమైన వస్తువే కనుపడదు. సమస్తము శివుఁడుగానే గోచరించునని తెలియవలెను.

యస్మిన్ సర్వాణి భూతా-న్యాత్మైవాభూ ద్విజానతః ।
తత్ర కో మోహః కః శోకః-ఏకత్వ మనుపశ్యతః ॥ 7

ప. విజానతః = విమర్శించి వస్తుతత్త్వమును గుర్తించువానికి, యస్మిన్ = ఏ ఉపాసనసమయమునందు, సర్వాణిభూతాని = బ్రహ్మాది ప్రాణులందరు పరమేశ్వరునిచే నియమింపఁబడువారై ఈశ్వరాంశ గలవారగుటచే, ఆత్మైవ = శివస్వరూపులుగానే, అభూత్ = అగుదురో, తత్ర = అట్టి సమయమున, ఏకత్వం = జీవేశ్వరుల నొకచో గల స్థితిని. అనుపశ్యతః = దృఢముగ భావించు శివోపాసకునకు, మోహః = జీవాత్మ స్వతంత్రుఁడు కాడు పరతంత్రుడు అను భావము స్థిరపడును గాన-మమకారమువలన కలుగు మోహము, కః = ఎక్కడిది? శోకః = మోహముచే కలుగు దుఃఖము, కః = ఎక్కడిది?

శరీరమే ఆత్మయనియు, శరీరేంద్రియాదిభిన్నుఁడైన జీవాత్మయే పరమాత్మయనియు, ప్రతిశరీరమున గల జీవాత్మ స్వతంత్రుఁడ

నియు భావించువారికి—జీవశివసమానాధికరణ భావము గోచరింపదు గాన వారు శోకమోహముల పాలగుదురు. ఎవరైతే "సర్వా మాహేశ్వరీ ప్రజా" అన్నట్లు చరాచరప్రపంచమంతయు శివాంతర్యామికమని గుర్తించి శివశరీరము జగత్తని భావింతురో అట్టివారికి శివానుగ్రహము వలన శోకమోహములు సంఘటింపవని సారాంశము.

> స పర్యగా చ్ఛుక్ర మకాయ మవ్రణ-మస్నావిరం
> శుద్ధ మపాపవిద్ధమ్। కవి ర్మనీషీ పరిభూః స్వయంభూ
> ర్యాథాతథ్యతోఽర్థాన్ వ్యదధా-చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః"

ప. సః = సర్వభూతముల నంతర్యామియగు పరమాత్మ నుపాసించువాడు, శుక్రం = స్వప్రకాశుఁడైన, అకాయం = ప్రాకృతశరీరము లేనట్టి, అవ్రణం=ప్రాకృతశరీరము లేనివాడగుటచేతనే వ్రణాదులు లేనట్టి, అస్నావిరం = నరాలు లేనట్టి, శుద్ధం = ఆకలి దప్పి మున్నగు వికారములు లేనట్టి, అపాపవిద్ధం = పుణ్యపాపరూపములగు కర్మలచే ఆక్రమింపఁబడనట్టి బ్రహ్మమును (శివుని) పర్యగాత్ = ధ్యానమున పూర్తిగ పొందెను.

అట్టి శివోపాసకుఁడు- కవిః = వ్యాసాదులవలె శివపారమ్యమును ప్రతిపాదించు ప్రబంధములను రచించువాడై, మనీషీ = బుద్ధి బల సంపన్నుఁడై, పరిభూః = కామక్రోధాది అరిషడ్వర్గము నదుపులో పెట్టువాడై. స్వయంభూః = ఇతరాపేక్ష లేనివాడునై శాశ్వతీభ్యః సమాభ్యః = చిరకాలపర్యంతము, అర్థాన్ = వేదవేదాంత శివాగమాది ప్రోక్తములగు పశుపాశపతి సంబంధము గలయట్టి విషయములను యాథాతథ్యతః = ఉపక్రమాది షడ్విధ తాత్పర్య లింగ సమన్వయముతో, వ్యదధాత్ = మనస్సున నిలుపుకొనెను.

అథవా-

సః = ఉపాస్యుఁడైన శివుఁడు- కవిః = సర్వజ్ఞుఁడు, మనీషీ= మనస్సును శాసించువాఁడు, పరిభూః = హరిబ్రహ్మాదులకు అందరాని ఉన్నతస్థానమునందు స్థిరపడువాడు, స్వయంభూః = తనంతటతానే ఆవిర్భవించువాడునై, శాశ్వతీభ్యః సమాభ్యః = చిరకాలముండునట్లు, అర్థాన్ = ఆకాశాదులను, యాథాతథ్యతః=పూర్వకల్పములయందున్నట్లే, వ్యదధాత్ = నిర్మించెను.

శాంభవదీక్షితుఁడై శివు నుపాసించు మాహేశ్వరుఁడు శివోపాసనసమయమున. శివుఁడు ప్రకృతిఁజెందిన పాంచభౌతిక శరీరము లేనివాఁడై దివ్యమంగళవిగ్రహము గలిగియుండుననియు, శివుని విగ్రహము- జరామరణవ్యాధివ్రణాదిరహితమనియు కర్మబంధము లేనిదనియు, భావించుచు సేవ్యసేవకభావమున ఇష్టలింగము నారాధించుచు పరాభక్తిని ప్రాణలింగమును శివషడక్షరీమహామంత్రానుసంధానరూపమున భజించుచు "శివోఽహం" భావనతో భావలింగమును దర్శించువాడగునని విదితమైనది.

"అంధం తమః ప్రవిశంతి- యేఽవిద్యా ముపాసతే,
తతో భూయ ఇవ తే తమో-య ఉ విద్యాయాం
రతాః" 9

ప. యే = ఎవరు, ప్రపంచభోగములను పరలోకసుఖముల పేక్షించుచు, అవిద్యాం = కర్మనుమాత్రము, ఉపాసతే = ఆచరింతురో, తే = వారు, అంధంతమః = గ్రుడ్డిచీకటిఁబోలినట్టి సంసారమును, ప్రవిశంతి = పొందుచుందురు.

యే = ఎవరు, విద్యాయాం ఉ = జ్ఞానమునందే, రతాః =

ఆసక్తి గలవారో, తే = వారు, తతః = కర్మనిష్ఠులకన్న, భూయ
ఇవ = అధికముగానే, తమఃస్వరూపమైన నికృష్టదశను పొందుదురు.

భా. కేవలము కర్మ నాచరించువారు-సంసారమున జన్మ పరం
పరను పొందుచు ముక్తిని పొందఁజాలరనియు, నిత్యనైమిత్తిక కర్మ
లను బొత్తుగా విడనాడి ఆత్మజ్ఞానమునకై పాటుపడువారు కర్మకర్తల
కంటె నధికము పతితులగుదురనియు వివేకము. కర్మతోఁగూడిన
జ్ఞానము (శివోపాసన) ఆరాధ్యశైవులందే నుండుటచే వారు-ముక్తి
సౌధసోపానముల నధిరోహింతురనుట ఇలదు పరమార్థము.

"అన్యదేవాఽఽహు ర్విద్యయాఽన్యదాహు రవిద్యయా,
ఇతి శుశ్రుమ ధీరాణాం - యే న స్తద్విచచక్షిరే" 10

ప. విద్యయా = కేవల విద్యవలన, అన్యదేవ = వేరైన ఫలమే
ననియు, అవిద్యయా = కేవల కర్మవలన, అన్యత్ = వేరైన ఫలము
చేకూరుననియు, ఆహుః = వేదవేదాంతవిదులు వక్కాణించిరి.

ఇతి = ఇట్లు, యే = ఎవరు, నః = మాకు, విచచక్షిరే = ఉప
దేశించిరో, ధీరాణాం = అట్టి విజ్ఞానుల వచనమును, శుశ్రుమ = విను
చున్నాము (అంగీకరించుచున్నాము)

తొమ్మిదవ మంత్రమునందు గల విషయము మరియొక భంగి
మగ నిందు వక్కాణింపఁబడినది. అనఁగా వేదాంత వాక్యజ్ఞానము
నందే నిష్ఠగలవారికి-ముక్తికంటె వేరైనఫలము (దృఢమైన సంసార
బంధము) తారసిల్లుననియు, నిత్యనైమిత్తికకామ్య కర్మలను
మాత్రము ఆచరించుచు శివోపాసనాత్మకమగు జ్ఞానము నవలంబింపని
వారికి. శివసాయుజ్యమునకంటె వేరైన ఫలము (జన్మ పరంపర)తప్ప
దనియు విదితమైనది.

"విద్యాం చావిద్యాం చ-యుస్తద్వేదోభయం సహ
అవిద్యయా మృత్యుం తీర్త్వా-విద్యయాఽమృత
మశ్నుతే" 11

ప. యః = ఎవఁడు. విద్యాం = జ్ఞానమును, అవిద్యాంచ = కర్మను, తదుభయం = కర్మజ్ఞానములను, సహ = కూడనుండునవిగ, వేద = గుర్తించునో, సః = వాడు, అవిద్యయా = కర్మచేత, మృత్యుం = జ్ఞానమును భంగపఱచునట్టి పుణ్యపాపకర్మ బంధమును, తీర్త్వా = అతిక్రమించి, విద్యయా = ఇష్టప్రాణభావలింగోపాసనచే అమృతం = మోక్షమును, అశ్నుతే = పొందును

ఫలాభిసంధి లేనట్టి కర్మ, శివోపాసనాత్మకంబగు జ్ఞానంబు-అంగాంగిభావమున మోక్షము అను ఒకే ఫలము నాపాదించునవి. ఉపాసనాత్మక జ్ఞానమునకు పూర్వకృతపుణ్యపాపములు ప్రతిబంధకములగుటచే-ఇహజన్మయందు సుకృతములను ఫలము నపేక్షింపక చేయుచున్నయెడల చిత్తశుద్ధిద్వారా శివునియందు అనన్య భక్తి-స్థిరపడును అట్టి భక్తితో శివు నారాధించువాడు-శివసాక్షాత్కారము నంత్యకాలమున పొంది ముక్తుఁడగునని సారాంశము

"అంధం తమః ప్రవిశంతి - యేఽసంభూతి ముపాసతే
తతో భూయ ఇవ తే - య ఉ సంభూత్యాం రతాః" 12

"అన్యదేవాహుః సంభవా - దన్యదాహు రసంభవాత్
ఇతి శుశ్రుమ ధీరాణాం - యే న స్తద్విచచక్షిరే" 13

"సంభూతిం చ వినాశం చ - య స్తద్వేదోభయం సహ
వినాశేన మృత్యుం తీర్త్వా-సంభూత్యాఽమృత మశ్నుతే" 14

ప. యే = ఎవరు, అసంభూతిం = నిత్యాత్మస్వరూపమునే, ఉపాసతే = చింతించుచుందురో, తే = వారు, అంధంతమః = కటికచీకటివలె దుఃఖమయమగు సంసారమును, ప్రవిశంతి = పొందుచుందురు, యే = ఎవరు, సంభూత్యాం ఉ = కేవలకర్మయందే రతాః = ఆసక్తి గలవారో, తే = వారు, తతోభూయః = సంసారమునకంటె నధికముగ, అంధంతమః = గాఢాంధకారబంధురమగు నరకజాతము నొందుదురు.

సంభవాత్ = కేవలకర్మవలన కలుగు ఫలము, అన్యదేవ = మరియొకటేనని ఆహుః = విబుధులు చెప్పుదురు. అసంభవాత్ = కేవల జ్ఞానమువలన కలుగు ఫలము, అన్యదేవ = మరియొకటేనని, ఆహుః = విజ్ఞానులు వక్కాణింతురు.

ఇతి = ఈవిధము, యే = ఎవరు, నః = మాకు, విచచక్షిరే = ఉపదేశించిరో, తద్ధీరాణాం = అట్టి ఉపాసకుల వచనమును, శుశ్రుమ = వినుచున్నాము.

యః = ఎవఁడు, (అ)సంభూతిం = జ్ఞాననిష్ఠను, వినాశం = కర్మాచరణమును, తదుభయం = ఆ రెంటిని, సహ = అంగాంగిభావముతో కూడియుండునవిగ, వేద = గుర్తించునో, సః = వాడు, వినాశేన = కర్మతో, మృత్యుం = సంసారబంధమును తీర్త్వా = త్రెంచుకొని, అసంభూత్యా = శివోపాసనతో, అమృతం = మోక్షమును, అశ్నుతే = పొందును

శ్రుతులలో పునరుక్తిదోషమును పాటింపరాదు గావున 9, 10 11 వాక్యములలో చెప్పఁబడిన కర్మజ్ఞానసముచ్చయమునే 12, 13, 14 వాక్యములయందు శబ్దభేదముతో విశదీకరించుట- కర్మజ్ఞాన సముచ్చయమున గల ఆదరమును వ్యక్తీకరించుచున్నయది.

సంభూతియనఁగా-ఉత్పత్తి వినాశములు గల కర్మయగును అసంభూతియనఁగా-ఉదయాంతములు లేనట్టి పరమాత్మస్వరూప మగును. మోక్షాపేక్షతో కర్మను విడనాడి కేవలము జ్ఞానమునందే ప్రవర్తించు వారికి- చిత్తశుద్ధి కలుగమి=జ్ఞానభ్రష్టత ఏర్పడును. జ్ఞానము నభ్యసింపక కర్మయందే లంపటులగువారికి సంభవించు స్వర్గాదిపుణ్యలోకసుఖానుభవము శాశ్వతము కాకుండుటచే-పునఃపునః కలుగు సంసారబంధమున మమకారాదులతో నరకప్రవేశము సంఘటించును.

అందువలన సంధ్యావందనాది వర్ణాశ్రమధర్మము ననుష్ఠించుచు బాహ్యమున ఇష్టలింగము నారాధించుచు మనస్సున ప్రాణలింగమును శివషడక్షరీ మహామంత్రముతో అనుసంధించుచు భావలింగమును "శివోఽహం" భావనతో ధ్యానించినచో కర్మజ్ఞానసముచ్చయము గలవాడై తరించునని భావము

"హిరణ్మయేన పాత్రేణ - సత్యస్యాపిహితం ముఖం,
తత్త్వం పూష న్నపావృణు - సత్యధర్మాయ దృష్టయే" 15

వ. సత్యస్య = జీవాత్మయొక్క, పరమాత్మయొక్కయు, ముఖం = ద్వారమగు మనస్సు, హిరణ్మయేన పాత్రేణ = బంగారు గిన్నెవలె మనస్సునాకర్షించునట్టి శబ్దాదివిషయజాతముతో అపిహితం = ఆచ్ఛాదింపఁ బడినది విషయవాసనతో ఆత్మస్వరూపమును గుర్తించుటకు సమర్థము కానిదని భావము.

పూషన్ = సర్వరక్షకుఁడవైన పరమేశ్వరా! త్వం = నీవు, తత్ = అట్టి ఆచ్ఛాదనమును. దృష్టయే = ఉపాసన సిద్ధించుటకై, సత్యధర్మాయ = పరమేశ్వరుని పొంది అపహతపాప్మత్వాది నిజధర్మములను ఆవిష్కరింపఁజేసికొనుటకొరకును. అపావృణు = తొలగింపుము!

భా. "సత్యం చానృతం చ" ఇత్యాది శ్రుతి ననుసరించి సత్య శబ్దము-జీవాత్మను. సర్వవిధముల సత్యమగు బ్రహ్మమును చెప్పు నట్టిది. ఆత్మస్వరూపమును గుర్తించుటకు-మనస్సు ద్వారమగునట్టిది. అందువలన ఆత్మజ్ఞానమునకు మనస్సు ముఖమని చెప్పఁబడినది. శబ్ద స్పర్శ రూప రస గంధాదులగు ఇంద్రియార్థములు మనస్సును పరమాత్మ నుపాసింపనీయనివై తమవైపు ఆకర్షించును గాన హిర ణ్మయ పాత్రవంటివని నిరూపింపఁబడినవి.

ఇంద్రియములు-విషయములను, మనస్సు-ఇంద్రియములను, బుద్ధి-మనస్సును, జీవాత్మ-బుద్ధిని, అవ్యక్తము జీవాత్మను, పరమ పురుషుఁడు అవ్యక్తమును నిగ్రహింపవలెను.

"పరమేశ్వరా! మనస్సుతో ఇంద్రియములను నిగ్రహింపఁ జాలను. అవి మనస్సును పీడించుచున్నవి గాన నీవే రక్షించువాడవని శరణాగతుఁడై ఇష్టలింగమును ప్రార్థించినచో-పరమేశ్వరుఁడు ప్రస న్నుఁడై మనోనిగ్రహము ననుగ్రహించును.

"పరంజ్యోతి రుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే" అను శ్రుతి ననుసరించి-ముక్తాత్మ-పరంజ్యోతిః స్వరూపుఁడైన పరమే శ్వరుఁజేరి-నిజరూపమును ఆవిష్కరింపఁజేసికొను" నని తెలియ నైనది.

"పూషన్నేకర్షే యమ సూర్య - ప్రాజాపత్య వ్యూహ
రశ్మీన్, సమూహ తేజో - యత్తే రూపం కల్యాణతమం
తత్తే పశ్యామి, యోఽసా వసౌ పురుషః సోఽహమస్మి" 16

ప. పూషన్ = ఆశ్రితులను పోషించువాడా! ఏకర్షే = ఇంద్రి యములకు గోచరము కానట్టిదానిని గుర్తించువాడా! అథవా ఏక =

ముఖ్యుడవైన, ఋషే = సర్వజ్ఞుఁడా! ("విశ్వాధికో రుద్రో మహర్షిః" అను శ్రుతివాక్యము ఇందుకు ప్రోద్బలకము) యమ = జీవాత్మలలో ప్రవేశించి నియమించువాడా! సూర్య=సర్వాత్మనా నిన్నాశ్రయించు వారి బుద్ధిని ప్రేరేపించువాడా! ప్రాజాపత్య=ప్రజలకు ప్రభువగువాడా రశ్మీన్ = నీ దివ్యదేహకాంతులను, వ్యూహ = క్షణమాత్రము ఉప సంహరింపుము! యత్తేజః=మా నేత్రములకు సుఖము కలుగఁజేయు ఏ ప్రకాశమో, తత్ = అట్టి, నీ సౌమ్యతేజస్సును, సమూహ = కూర్పుము! యత్ కల్యాణతమం తే రూపం = ఏ నీ దివ్యరూపము సమస్త మంగళములను కలుగఁజేయునదో, తత్ తే పశ్యామి = అట్టి నీ దివ్యమంగళ విగ్రహమును చూడఁగలుఁగుదును యః అసౌ పురుషః = ఏ ఈ పరమపురుషుఁడున్నాడో. సోఽహ మస్మి = అట్టి పరమశివుఁడు నేనగుదును. ("శివోఽహం" భావనతో శివుని ధ్యానించి శివుఁడ నగుదును) ఇట్టి దివ్యతేజోమయుఁడగు శివుని చూడఁజాలని కొందరు. శివానుగ్రహదూరులై శివుని నిరాకారునిగ చెప్పుదురు.

ఇట్టి దివ్య ప్రభావము కోటిసూర్యప్రకాశంబు గల పరమేశ్వరుని ఉగ్రకాంతులను చూడఁజాలనివాడై ముక్తదశయందు శివుని కల్యాణతమమగు సౌమ్యరూపమును గాంచుచు శివానందము ననుభవించుచు శివసముఁడగుటకు ఈ వాక్యమునందు-పరమేశ్వరుని-పోషించువాడనియు. సర్వజ్ఞుఁడనియు, సన్మార్గము వైపు ప్రేరేపించు వాడనియు, చరాచరప్రభువనియు, శివోపాసకుఁడు-ఇష్టలింగము నందు- ప్రార్థించుచు శరణాగతుఁడు కావలెనని విశదమైనది.

"వాయు రనిల మమృత మథేదం - భస్మాంతగ్ం శరీరం, ఓం క్రతో స్మర, కృతగ్ంస్మర, క్రతో స్మర, కృతగ్ం స్మర"

ప. వాయుః = గమనశీలుడు, అనిలం = ఒకచో స్థిరనివాసము లేనివాడు, అమృతం = జరామరణాదులు లేనివాడును జీవాత్మ యగును.

అథ = మరియు, ఇదం శరీరం = ఈ శరీరము, భస్మాంతం = చివర బూడిద యగునది. (అథవా భూనిక్షిప్తమగుచో కీటాంతం = చివర పురుగులగునది).

ఓం క్రతో = యజ్ఞ స్వరూపుడవైన పరమేశ్వరా! నాచేత చేయఁబడిన పుణ్యములకు ఉపాసనలకును గురి యగువాడా! స్మర! = నిన్ను స్మరించు నన్ను కనిపెట్టుము! కృతగ్ం స్మర = కర్మ యోగపూర్వకమగు ఆరాధనముచే కలిగించిన నీ ప్రీతిని స్వీకారముతో స్మరించుము! క్రతో స్మర! కృతగ్ం స్మర" అని రెండు పర్యాయములు చెప్పుట-ఆదరముతో నని తెలియపలెను.

భా. వాయువునందు పరిమళము మొదలగువాని నారోపించినట్లు ఆత్మ-దేవాదినానాశరీరములయందు ప్రవేశించి-స్థూలదేహముల కంటె విలక్షణుఁడైనను శరీరగతదోషముల నాత్మయందు ఆరోపింతురు. వాయువునకు ఎట్లు ఒకచో నిలుకడ లేదో అట్లే జీవాత్మకు అనేక శరీర ప్రవేశమువలన స్థిరనివాసము లేదు. జరామరణాది దోషములు వస్తుతః ఆత్మకు ఉండవుగాన అమృతుఁడనఁబడును.

ఎంతో మనోహరముగ కనఁబడు శరీరము-ఏనాటికైనను నశించునదే నని-భస్మాంతం, కీటాంతం అని చెప్పఁబడినది, "నా కృతము నంతయు కనిపెట్టి అనుగ్రహముతో నన్నుద్ధరింపుమని" ఉపాసకుఁడు అంత్యకాలమున శివునకు మొఱపెట్టుకొనవలెనని "ఓం క్రతో" ఇత్యాది వాక్యము విశదీకరించినది.

"అగ్నే నయ సుపథా రాయే - అస్మాన్ విశ్వాని
దేవ వయునాని విద్వాన్ । యుయోధ్యస్మ జ్జుహురాణ
మేనో, భూయిష్ఠాం తే నమఉక్తిం విధేమ" 18

ప. అగ్నే = ఊర్ధ్వగతిని పొందించు, దేవ = పరమేశ్వరా! సుపథా = శోభనమైన అర్చిరాదిమార్గముతో, రాయే = ముక్తిసంపదకై, అస్మాన్నయ = మమ్ము గొంపోవుము! జుహురాణం = విడువనలవిగానట్టి, ఏనః = సంచిత ఆగామి కర్మరూపమగు పాపమును, అస్మత్ = మానుండి, యుయోధి = విడిపించుము! మా అంత్యకాలము సమీపించినది గాన, తే=నీకు (నిన్ను గురించి) భూయిష్ఠాం = పూజాదులకంటె శ్రేష్ఠమగు నమ ఉక్తిం = నమఃశబ్దోచ్చారణము విధేమ = చేయుచున్నాము.

హృదయమున జీవాత్మ నంతర్యామి యగు భావలింగము అనఁదగు పరమాత్మయొక్క అనుగ్రహముచే ప్రకాశించు (కనఁబడు) మూర్ధన్యనాడీద్వారముగుండా ముక్తాత్మప్రయాణము నంభవించుటఁ జేసిఁ "అగ్నే నయ సుపథా రాయే" అని ఇందు చెప్పఁబడినది.

శాంభవదీక్షచే తన నాశ్రయించిన శైవులను శివుఁడు-అర్చిరాది మార్గమున పయనింపఁజేసి-పునరావృత్తిరహితమైన శాశ్వతంబగు పరమపదమునఁ బ్రవేశింపఁజేయునని-ఈవాక్యమున వ్యక్తమగుచున్నయది.

పాశుపతదీక్షా స్వీకారమున ఇష్టలింగమును ధరించినంత మాత్రమున శివుఁడు కరుణించి-ఉపాసకుల ప్రారబ్ధకర్మదక్క- నితరకర్మలన్నిటిని నిర్మూలింపఁజేయుననియు, అంత్యకాలమున అశక్తస్థితిని నమఉక్తి అనఁబడు శరణు నుచ్చరించుట తోడనే శివుఁడనుగ్రహించునియు విదితమైనది.

ముఖ్యసారాంశము–ఈ ఉపనిషత్తున–ఆత్మ పదమునకు పరమేశ్వరుఁడను నర్థముఁజేసి–సర్వభూతాంతరాత్మ, సర్వభూతాధారుఁడు అను లక్షణములతో పరమేశ్వర సమర్థనము గలదని నిర్ణయింపవలెననియు; చివరన "కవిర్మనీషీ" ఇత్యాదులతో పరమేశ్వరుఁడు–సర్వజ్ఞత్వాది అనంతమాంగళ్యగుణములు గలవాడని నిరూపించుచు "యత్తే రూపం కల్యాణతమం పశ్యామి" అనుచో దివ్య మంగళ విగ్రహము గలవాడు.పరమేశ్వరుఁడని ప్రతిపాదించుటచే ఈ ఉపనిషత్తు శివాద్వైతపరమే నని విశదమగును. కేవలాద్వైతము– బ్రహ్మము రూపరహితమని చెప్పును గాన నియ్యది కల్యాణతమమగు శివరూపమును నిర్వచించుటచే శివేతరమతములవారికి సమర్థనీయము కాదని–చదువరులు గ్రహింతురు గాక!

ఇయ్యది

శ్రీ నీలకంఠీయ భాష్యమున శ్రీ నాగలింగీయ వ్యాఖ్యానమున ఈశావాస్యోపనిషత్తు సమస్తమునకు శాంకరీయ "శివతత్త్వ ప్రభ" అనెడు ఆంధ్రానువాదము-సమాప్తము.

—

శ్రీ మహాగణాధిపతయే నమః

కేనోపనిషత్తు

"కేనేషితం పతతి ప్రేషితం మనః, కేన ప్రాణః ప్రథమః ప్రైతి యుక్తః। కేనేషితాం వాచ మిమాం వదంతి చక్షుః శ్రోత్రం క ఉ దేవో యునక్తి" 1

పదార్థము-మనః=మనస్సు; కేన=ఎవనిచేత ప్రేషితం= ప్రేరేపింపఁబడినదై; ఇషితం=ఇష్టమునుగురించి; పతతి=సమీపించి పడును? ప్రథమః=ముఖ్యమగు; ప్రాణః=ప్రాణవాయువు; కేన= ఎవనిచేత; యుక్తః= సంయోగమును పొందినదై ప్రైతి=తన కార్యమునకై బయలుదేరును? కేన= ఎవనిచే ప్రేరేపింపఁబడినవారై ప్రజలు, ఇషితాం= ఇష్టమైన, వాచం= వాక్కును; వదంతి= పలుకుచున్నారు? చక్షుః=నేత్రమును; శ్రోత్రం = చెవిని; క ఉ దేవో = ఏ దేవుఁడు; యునక్తి= ప్రేరేపించును?

"వాచం" అనునది - కర్మేంద్రియములను; "చక్షుః శ్రోత్రం" అనునవి-జ్ఞానేంద్రియములను చెప్పునవి.

ఇంద్రియాధిపతియైన మనస్సు గాని, పంచప్రాణముఖ్యమగు ప్రాణవాయువు గాని, వాక్కు మొదలగు కర్మేంద్రియములు గాని, కన్ను చెవి మున్నగు జ్ఞానేంద్రియములు గాని తమంతట తాము ప్రవర్తించునవి కావనియు, జీవాత్మయు పరతంత్రుఁడేననియు ...యుఁడు గుర్తించి—జీవాత్మకంటె నితరుఁడైన వాడే మనఃప్రాణా

ములను ప్రేరేపించునేమోయని సంశయించి-గురువును ప్రశ్నించెనని ఇందు విదితమైనది.

"శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్-వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః। చక్షుష శ్చక్షుః అతి ముచ్య ధీరాః-ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవంతి" 2

పదార్థము-స ఉ=ఆ సదాశివుఁడే; శ్రోత్రస్య=చెవికి: శ్రోత్రం =శబ్దమును వినుపించు వాస్తవమైన శ్రవణేంద్రియ మగువాడు; మనసః=మనోబుద్ధి అహంకారచిత్తాత్మకమగు అంతఃకరణమునకు; మనః=నిజమైన అంతఃకరణ మగువాడు; వాచో హ=వాచం= (ద్వితీయాంతము ఛాందసము) వాక్కును పలికించువాడు; ప్రాణస్య =ప్రాణవాయువునకు; ప్రాణః=ఆత్మను శరీరధారిగ జీవింపజేయు వాడు; చక్షుషః=నేత్రగోళమునకు; చక్షుః=ప్రకాశమును కలుగఁ జేయువాడు నగును.

ధీరాః=బుద్ధిబలము గలవారు; అస్మాల్లోకాత్=ఈ భూలోక మునుండి; ప్రేత్య=బయలుదేరి; (మరణించినతరువాత) అమృతాః =పరమశివపదముఁజేరి ముక్తులు; భవంతి=అగుదురు.

పరమేశ్వరుఁడే శ్రోత్రాది ఇంద్రియములను శబ్దశ్రవణాది విషయ గ్రాహకములుగ ప్రేరేపించుచు జీవాత్మను ఇంద్రియ విషయ ముల ననుభవింపఁజేయువాడు. కర్మవశ్యుఁడు పరతంత్రుఁడు పరా ధీనకర్తయు నగు జీవాత్మ-ఇంద్రియములను ప్రవర్తింపఁజేయఁ జాలడు.

"శ్రోత్రాంగే తు ప్రసాదకం" "హృదయాంగే మహా లింగం" "దృగంగే శివలింగకం" "ఆచారలింగం ప్రాణాఖ్యం"

ఇత్యాది శివాగమవాక్యములు—చెవి మొదలగు ఇంద్రియములలో ప్రసాదలింగాదిసూక్ష్మరూపములతో శివుఁడు నివసించి ఇంద్రియములను ప్రేరేపించుననియు; ఆ యా ఇంద్రియ విషయములను శివోపాసకుఁడు తనకై గాక-పరమేశ్వరునకే అనుభవకాలమున సమర్పింపవలెననియు విదితమైనది. ఇందువలన సర్వాంగలింగ సాహిత్యము ఏర్పడునని సారాంశము.

> "న తత్ర చక్షు ర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి-నో మనో న విద్మో న విజానీమో, యథైత దనుశిష్యా ద్దన్యదేవ-తద్విదితా దథో అవిదితా దధి। ఇతి శుశ్రుమ పూర్వేషాం-యే న స్తద్వ్యాచచక్షిరే" 3

పదార్థము-తత్ర = ఆ పరమేశ్వరుని విషయమై; చక్షుః = నేత్రము=న గచ్ఛతి=గమనమును చేయఁజాలదు. వాక్ = వాక్కు; న గచ్ఛతి = సమీపించి వెళ్ళునది కాదు. నో మనో = మనస్సు ప్రవర్తింపఁజాలదు. ఏతత్ = ఈ శివస్వరూపమును యథా = ఎవ్విధము, అనుశిష్యాత్ = గురువు ఉపదేశించునో, తథా = అవ్విధమును, నవిద్మః = గుర్తింపఁజాలము. పరమేశ్వరునిఁబోలిన వస్తువును న విజానీమః = తెలియలేము. తత్ = ఆ శివతత్త్వము, విదితాత్ = తెలియఁబడు జడప్రపంచమున కంటె, అన్యదేవ = వేరైనదేను, అథో = మరియు, అవిదితాత్ = ఇంద్రియాగోచరమైన జీవాత్మకన్న, అధి = శ్రేష్ఠమై వేరైనదగును.

ఇతి = ఇట్లు, యే = ఎవరు, నః = మాకు, తత్ = ఆ శివతత్త్వమును గురించి, వ్యాచచక్షిరే = వక్కాణించిరో, పూర్వేషాం = అట్టి పూర్వికులగు శివయోగుల యొక్క సదుపదేశమును, శుశ్రుమ = వినుచున్నాము.

పరమేశ్వరుఁడు-ప్రత్యక్షముగ చూడనలవిఁగాని నాడనియు, అనుమానము (ఊహ)తో సాధింపదగినవాడు కాడనియు, వేదవాక్కు-నకు అందువాడనియు, లౌకికవస్తువులకన్న విలక్షణుఁడనియు, పూర్తిగ తెలిసినవాడు కాడనియు పూర్తిగ తెలియనివాడు కాడనియు, విదితుఁడైనట్లు స్ఫురించి అవిదితుఁడగుననియు, అందువలననే జిజ్ఞాసకు విషయమగుననియు" శైవసంప్రదాయపరులగు మహాను భావులు ఇట్లు నిర్వచించినారని సారాంశము.

"యద్వాచాఽనభ్యుదితం-యేన వాగభ్యుద్యతే
తదేవ బ్రహ్మ త్వం విద్ధి-నేదం యదిద ముపాసతే"4

యత్ = ఏ శివస్వరూపము, వాచా=వాక్కు-చే, అనభ్యుదితం= ప్రకాశింపఁబడదో, యేన = ఏ శివునిచేత, వాక్ = వాగింద్రియము, అభ్యుద్యతే = ఉపయోగముగలదిగ ప్రకాశింపఁబడునో, తదేవ = అట్టి శివలింగమునే, బ్రహ్మ = బ్రహ్మముగ, త్వం విద్ధి = నీవు గుర్తింపుము, (ఉపాసింపుము!)

అట్టిదే పరశివతత్త్వమనఁబఱఁగును. యదిదం ఏ = ఈ మూర్త్యాత్మలగు విష్ణుబ్రహ్మాది దేవతలను, ఉపాసతే = ఉపాసించు చున్నారో, ఇదం= ఈ మూర్త్యాత్మక దేవతాగణము, న=బ్రహ్మము కాదు.

"సోమః పవితే జనితా, పృథివ్యాజనితాగ్నేః జనితా, సూర్యస్య జనితేంద్రస్య, జనితాఽథ విష్ణోః" ఇత్యాదిశ్రుతి-పృథవ్యగ్ని సూర్య ఇంద్ర విష్ణ్వాదులను పుట్టించువాడు పరమేశ్వరుఁడేనని చెప్పుటచే-విష్ణ్వాదులు మూర్త్యాత్మలై శివుని వలన జన్మించు చున్నందున-సర్వకారణకారణుఁడైన శక్తి విశిష్టుఁడు నగు శివుని- శివలింగముగ భావించి-ఇష్టప్రాణభావలింగములను గురువువలన

స్వీకరించి ధరించి పూజింపవలెననియు, శివమంత్రమును జపింపవలె ననియు, శివుని ధ్యానింపవలెననియు తేటపడుచున్నందున ముముక్షువు లందరిచే ముఖ్యముగ నుపాసింపఁదగినది - శివస్వరూపమనఁదగు శివలింగమే ననియు శాంభవదీక్షితుఁడే శివోపాసనార్హుఁడనియు విదిత మైనది.

నారాయణుఁడు పరమాత్మ యనుచో "న, అరాః, అణః" అను పదచ్ఛేదమున అరాః = దరిద్రము, అణః = దుఃఖము, న = ఎవని శక్తిచే నుండవో, అట్టి శివుఁడు నారాయణ శబ్దవాచ్యుండగు" నను నిర్వచనము కలదు గాన నారాయణుఁడు-మూర్త్యాత్మయగు విష్ణువు గాక-శివుఁడే నని పరమార్థవిదుల ప్రతిపాదనము.

"యన్మనసా న మనుతే-యేనాఽహు ర్మనో మతం,
తదేవ బ్రహ్మ త్వం విద్ధి-నేదం యదిద ముపాసతే" 5

పదార్థము-యత్ = ఏ పరశివలింగమును, మనసా = ఇంద్రియ లోలంబగు మనస్సుచే, న మనుతే = భావించుచు గుర్తింపఁజాలరో, యేన = ఏ పరశివునిచే, మనః = మనస్సు మతం = స్వాభిముఖముగ ప్రకాశింపఁజేయబడునని, శివయోగులు అహుః = చెప్పుచున్నారో, తదేవ = అట్టి పరశివలింగమునే, బ్రహ్మ = బ్రహ్మముగ, త్వంవిద్ధి = నీవు ఉపాసింపుము ! యత్ = ఏ, ఇదం = ఈచేతనాచేతనవర్గమును, ఉపాసతే = స్వల్పబుద్ధి గలవారు ఉపాసింతురో, ఇదం = ఇదంతయు న = సాక్షాత్ బ్రహ్మము కాదు.

భా. శివలింగస్వరూపము అపరిచ్ఛిన్నమగుటచే బ్రహ్మమగు ననియు, హరిబ్రహ్మాది చేతనులు-ఆకాశాద్యచేతనములును ఆకారము మొదలగు పరిమితి గలవారగుటచే బ్రహ్మము కారనియు, శివుఁడు-భక్తుల ననుగ్రహించుటకు ఇష్టప్రాణభావలింగరూపములతో విలసిల్లి ను సర్వస్వతంత్రుఁడగుటచే పరిమితి లేనివాడనియు తెలియవలెను.

ఇందుకు-"సద్రూపం భావలింగం స్యాత్-చిద్రూపం ప్రాణలింగకం,
ఆనందరూప మాచార్యై-రిష్టలింగ ముదాహృతమ్"

అను ఆగమప్రమాణము-నిదర్శనము.

"యచ్చక్షుషా న పశ్యతి-యేన చక్షూంషి పశ్యతి,
తదేవ బ్రహ్మ త్వం విద్ధి-నేదం యదిద ముపాసతే" 6

"యచ్ఛ్రోత్రేణ న శృణోతి-యేన శ్రోత్రమిదం శ్రుతం,
తదేవ బ్రహ్మ త్వం విద్ధి-నేదం యదిద ముపాసతే" 7

"యత్ ప్రాణేన న ప్రాణితి-యేన ప్రాణః ప్రణీయతే,
తదేవ బ్రహ్మ త్వం విద్ధి-నేదం యదిద ముపాసతే" 8

ప. యత్ = ఏ పరశివలింగమును, చక్షుషా = ప్రాకృత నేత్రముచే' న పశ్యతి = సాక్షాత్కరింపఁజేసికొనలేరో, యేన = ఏ శివుని ప్రేరణచే, చక్షూంషి = నేత్రములను, పశ్యతి = చూపు గలుగునట్లు చేసికొనుచున్నారో, (ఇట "పశ్యతి" అను ఏకవచనము ఛాందసము) యత్ = ఏ పరశివమహిమను, శ్రోత్రేణ = చెవిలో, న శృణోతి = అవధరింపఁజాలరో, యేన = ఏ సదాశివునిచే, ఇదం = ఈ; శ్రోత్రం = కర్ణము, శ్రుతం = వినగలుగునో,

యత్ = ఏ పరమాత్మ, ప్రాణేన = ప్రాణవాయువుచే, న ప్రాణితి = జీవనవ్యాపారము నవలంబింపదో, యేన = ఏ పరమాత్మచే ప్రాణః = ప్రాణవాయువు (లేక) శరీరధారియగు జీవాత్మ, ప్రణీయతే = జీవనమును కొనసాగించునో, తదేవ = అట్టి పరశివ జ్యోతిర్లింగ స్వరూపమునే, బ్రహ్మ = బ్రహ్మముగ, త్వం విద్ధి = నీవుపాసింపుము! యత్ = ఏ, ఇదం = ఈ ఇంద్ర చంద్రాది చేతన వర్గమును,

ఉపాసతే = అల్పజ్ఞానులు ఉపాసించుచున్నారో, ఇదం = ఈ చేతన వర్గము, న = బ్రహ్మము కాదు.

చేతనాచేతన ప్రపంచమంతయు పరమేశ్వరుని కార్యము కాగా పరమేశ్వరునిచే అంతర్యామిగ వ్యాపింపఁబడినదగుటఁజేసి సమస్తంబు శివాధీనమైనదనియు. శివలింగమే ఉపాస్యంబనియు విదితమైనది.

ఇయ్యది-శ్రీ నీలకంఠ శివాచార్య ప్రణీత భాష్యమునకు
శ్రీ నాగలింగ శాస్త్రికృత సంస్కృత వ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కేనోపనిషద్గత ప్రథమ ఖండము.

—:o:—

శ్రీ మహాగణాధిపతయే నమః

కేనోపనిషత్-ద్వితీయ ఖండము

"యది మన్యసే సువేదేతి-దభ్రమేవాపి నూనం,
త్వం వేత్థ బ్రహ్మణో రూపం-యదస్య త్వం యదస్య
దేవేష్వథ-ను మీమాంస్య మేవ, తే మన్యే విదితమ్" 1

వ. సువేద = నేను శివస్వరూపమును విశదముగ గుర్తెరుగుదును, ఇతి = అని, మన్యసేయది = భావించుచున్నచో, తత్ = ఆ శివ స్వరూపము, దభ్రమేవ = స్వల్పమైనదేను, న్యూనమపి = ఇద్ది ముమ్మాటికి నిశ్చయము.

అస్య = ఈ శివునియొక్క, రూపం=స్వరూపమును, యత్ = ఏ ఈ లోకమున, త్వం = నీవు, వేత్థ=గుర్తెరుగుచున్నావో, మరియు యదస్య = ఏ ఈ శివునియొక్క. దేవేష్వథ = దేవతలలోనైనను రూపం = స్వరూపమును, త్వం వేత్థ = నీవు కనిపెట్టుచున్నావో, తదుభయం దభ్రం ను=అ రెండును స్వల్పములేను. అతః = ఇందు వలన. తే విదితం = నీకు తెలిసినదంతయు, మీమాంస్యమేవ = పరిచ్ఛిన్నమగుటచే మరల విచారింపఁదగినదే నని, మన్యే = భావించు చున్నాను.

శ్లో॥ పరబ్రహ్మ మహాలింగం-ప్రపంచాతీత మవ్యయం ।
తదేవ సర్వభూతానా -మంత స్త్రిస్థానగోచరమ్ ॥

మూలాధారే చ హృదయే - భ్రూమధ్యే సర్వదేహినాం।
జ్యోతిర్లింగం తదాభాతి-యద్బ్రహ్మేత్యాహు రాగమాః॥
అపరిచ్ఛిన్న మవ్యక్తం - లింగం బ్రహ్మ సనాతనం।
ఉపాసనార్థ మంతఃస్థం - పరిచ్ఛిన్నం స్వమాయయా॥

ప్రాకృతిక ప్రపంచము నతిక్రమించినదియు, వినాశము లేనిదియు నగు పరబ్రహ్మము మహాలింగ మనబడును. అదియే ప్రాణులందరిలో మూలాధారము హృదయము భ్రూమధ్యము నను మూడు ప్రదేశములయందు ఉపాసకులందరికి జ్యోతిర్లింగముగ ఉపాసనసమయమునందు ప్రకాశించును. ఆ జ్యోతిర్లింగము బ్రహ్మం బని వేద ఆగమాదులు-వక్కాణించుచున్నవి.

వస్తుతః-శివుని మహాలింగ స్వరూపము-పరిమితి లేనిదై ప్రాకృత నేత్రములకు కనుపడునది కాదు. ఐనను భక్తులు ఉపాసించుటకు తన మాయాశక్తి సంబంధమున పరిమితి గలదై హృదయాది స్థానములయందు గోచరమగునట్టిది.

ఉపాసించుతఱి దివ్యదృష్టిలో గోచరించు ప్రాణభావలింగములు గూడ పరిచ్ఛిన్నములనియు, మూర్ధన్యనాడి ద్వారా నిష్క్రమించి పరమపదముఁ బ్రవేశించిన తరువాతనే నిజరూప ఆవిష్కరణద్వారా ముక్తాత్మకు శివసాయుజ్యము ఘటించుననియు, శరీరమునుండి బయలుదేరిన పిమ్మటనే సంపూర్ణ శివదర్శనమగుననియు సారాంశము.

"నాహం మన్యే సువేదేతి_నో న వేదేతి వేద చ।
యో న స్తద్వేదనో - న వేదేతి వేద చ॥ 2

ప. సువేదేతి=పరశివస్వరూపమును బాగుగా గుర్తెరుగుదునని, అహం = నేను, న మన్యే = భావించుచులేను. కింతు = కాని, వేదచ

= స్వల్పముగ బ్రహ్మమును గుర్తెరుగుచున్నాను. న వేదేతి = బ్రహ్మమును పూర్తిగ తెలియలేను, నో = అని కాదు.

నః = మాలో, యః = ఎవఁడు, తత్ = పరశివస్వరూపమును, వేద = స్వల్పముగ గుర్తెరుగునో, సః=వాడే, తత్=బ్రహ్మమును, వేద = పూర్తిగ గుర్తెరుగఁజాలును. న వేదేతి = పూర్తిగ తెలియఁజాలఁడని, నో = కాదు. వేద చ=స్వల్పముగ తెలియువాడేను.

భా. గురువునకు శిష్యుడు నివేదించు వాక్యమిది, శిష్యుఁడు కల్యాణదేశికునివలన శాంభవదీక్షఁబరిగ్రహించి-కరతలమున ఇష్ట లింగమును గాంచుచు గురూపదేశము ననుసరించి ఇందు ప్రాణభావ లింగములను భావించుచున్నను సంపూర్ణ శివదర్శనము ఘటింప లేదనియు తథాపి స్వల్పముగ శివజ్ఞానము కలుగుచున్నందున నావలె శాంభవదీక్షితుఁడై ప్రయత్నించు మాహేశ్వరుఁడు మొదట కొద్ది కొద్దిగా శివజ్ఞానముగలవాడై సాధన క్రమమున భావలింగ సాక్షాత్కారముతో పరంజ్యోతిఁజేరుననుట-ఇందు పరమార్థము

"యస్యామతం తస్య మతం-మతం యస్య న వేద సః,
అవిజ్ఞాతం విజానతాం-విజ్ఞాత మవిజానతామ్" 3

గురుశిష్య సంవాదమును విరమించి శ్రుతి-స్వయం నిరూపించు చున్నది. ఎట్లనగా ?

ప. యస్య = ఎవనికి బ్రహ్మము, అమతం = సంపూర్ణముగ బుద్ధి బలముచే తెలియ నలవి గాదో, తస్య = అట్టి జిజ్ఞాసువునకు, మతం = శాస్త్ర ఆచార్య ఉపదేశము వలన ఉపాసనచేతను సంపూర్ణ ముగ తెలిసికొన శక్యంబగును. యస్య = ఎవనికి, మతం = బుద్ధి బలముచే బ్రహ్మము తెలిసినట్లుండునో, సః = అట్టివాడు, న వేద=

ఉపాసనచే సంపూర్ణముగ తెలిసికొనుటకు అర్హుడు కాజాలడు, విజానతాం = నేను బ్రహ్మమును గుర్తెరుగుదునని భావించువారికి, అవిజ్ఞాతం = బ్రహ్మము ఎన్నటికైనను తెలియునది కాదు. అవిజానతాం = "పూర్తిగా తెలియలేదు బ్రహ్మము" అని అనుకొనువారికి, విజ్ఞాతం = మొదట పరోక్షముగ తదువాత అపరోక్షముగను తెలియునదగును.

బ్రహ్మము (పరశివతత్త్వము) సర్వాత్మనా తెలియునది కాదనిన చో "తెలియు" నని చెప్పిన వాక్యములు వ్యర్థములగును. ఉపాసనచే కలుగు దివ్యదృష్టికి గోచరమగు బ్రహ్మము-ఎవరికిని సాక్షాత్కరింపదనునెడ-"ఆత్మా వా రే ద్రష్టవ్యః" ఇత్యాది శ్రుతులకు సార్థక్యము ఏర్పడదు గాన శాంభవదీక్షితుడై శివునుపాసించువానికి-అంత్యకాలమున శివసాక్షాత్కారము సంభవించునని-విదితమైనది.

"ప్రతిబోధవిదితం మత-మమృతత్వం హి విందతే,
ఆత్మనా విందతే వీర్యం. విద్యయా విందతేఽమృతమ్"

ప ప్రతిబోధమనగా - లింగాంగ సామరస్యమనదగు శివాద్వైతజ్ఞానము, అట్టి ప్రతిబోధముతో విదితం = ఉపాసింపబడు శివస్వరూపము, మతం = బాగుగ నవగతమగును. హి = ఎందువలన ననగా ? ప్రతిబోధముతో శివునుపాసించు మాహేశ్వరుడు అమృతత్వం = జరామరణరాహిత్యమును విందతే = పొందును.

ఆత్మనా = పరమాత్మయగు శివుని యనుగ్రహమున, వీర్యం = శివదర్శనానకూలమగు సామర్థ్యమును, విందతే = పొందును విద్యయా = ఇష్ట ప్రాణభావలింగోపాసనాత్మకమగు జ్ఞానముతో, అమృతం = పునరావృత్తి రహితమగు పరమపదప్రవేశముతో శివానందమును, విందతే = అనుభవించువాడై పొందును.

శ్లో॥ శివ ఏవ జగత్సర్వం-శివ ఏవాహ మిత్యపి।
భావయన్ పరమో యోగీ-భవదోషై ర్నలిప్యతే॥
రేణుకాచార్యులు.

శ్లో॥ అథ మోక్షార్థిభిః ప్రాజ్ఞైః—శివ ఏవ శివంకరః।
ధ్యేయః సర్వం పరిత్యజ్య-శివా దన్యత్తు దైవతమ్ ॥
సూతసింహిత-యజ్ఞవైభవఖండము.

శ్లో॥ ఈశ్వరః సర్వభూతానాం-హృద్దేశేఽర్జున తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని యంత్రా రూఢాని మాయయా॥
తమేవ శరణం గచ్ఛ-సర్వభావేన భారత॥ భగవద్గీత.

శ్లో॥ కీటో భ్రమరయోగేన-భ్రమరో భవతి ధ్రువం।
మానవః శివయోగేన-శివో భవతి సర్వదా ॥ స్మృతి.

ఇత్యాది ప్రమాణములు-మోక్షాపేక్ష గల శాంభవదీక్షితుఁడు—హరిబ్రహ్మాద్యమరుల నుపేక్షించి శివునినే ధ్యానింపవలెనని సిద్ధాంతీకరించుచున్నవి. అందువలన శివోపాసకులకు ఐహికఫలముల యపేక్ష లేకున్న నవ్వారి యోగక్షేమములను శివుఁడే ప్రసాదించునని తేటపడినది,

శ్లో॥ కిమస్తి బహునోక్తేన—మానుషం జన్మ దుర్లభం।
తత్రాపి దుర్లభం జన్మ-కులే శైవస్య కస్యచిత్ ॥

పెక్కు మాటలేల ? మానవజన్మ—సామాన్యముగ లభించునది కాదు. మానవ జన్మలో శైవకులమందు జన్మించుట దుర్లభమైనదిగాన ఇష్టలింగధారులైన ద్విజులందరు శివునినే ఉపాసించి తరింపవలెనని సారాంశము.

"ఇహ చే దవేదీ దథ సత్య మ స్తి-న చేదిహావేదీత్
మహతీ వినష్టిః, భూతేషు భూతేషు విచింత్య ధీరాః-
ప్రేత్యాస్మా ల్లోకా దమృతా భవంతి" 5

వ. ఇహ = శాస్త్రాధికారయోగ్యమగు నీ మాహేశ్వర జన్మ యందే, అవేదీచ్చేత్ = "శివోఽహ"మను భావనతో శివుని గుర్తించిన యెడల, అథ = ఈ శరీరమును విడిచిన వెనువెంటనే, సత్యం = శాశ్వతమైన మోక్షఫలము, అస్తి = ప్రాప్తంబగును. ఇహ = ఈ శ్రౌతశైవారాధ్యజన్మయందు నావేదీచ్చేత్ = శివు నుపాసింపనిచో, మహతీ = గొప్పదైన, వినష్టిః = "సంసారబంధ సంబంధము" అను వినాశము సంభవించును.

భూతేషు భూతేషు = చరాచరప్రాణులందరిలో, విచింత్య = అవినాభావముతో శివుఁడున్నాడని గుర్తించి, ధీరాః = శివజ్ఞానముతో రమించు మాహేశ్వరులు, అస్మాల్లోకాత్ = ఈలోకమునుండి, ప్రేత్య = నిర్గమించి, అమృతాః = ముక్తులు, భవంతి = కాగలరు.

శివుఁడు సర్వాంతర్యామి యని భావించుచు ఇష్టలింగమును పూజించుచు ప్రాణలింగమును శివపంచాక్షరీ మంత్ర జపముతో అనుసంధించుచు "శివోఽహం" అను భావనతో భావలింగమును ధ్యానించి శివసాయుజ్యము నొందవలెనని సారాంశము.

ఇయ్యది-శ్రీ నీలకంఠశివాచార్య ప్రణీతభాష్యమునకు
శ్రీ నాగలింగశాస్త్రికృత సంస్కృత వ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కేనోపనిషద్గత-ద్వితీయఖండము.

శ్రీ మహాగణాధిపతయే సాంబశివాయ నమః

కేనోపనిషత్-తృతీయఖండము

"బ్రహ్మ హ దేవేభ్యో విజిగ్యే—అథ తస్య హ బ్రహ్మణో విజయే దేవా అమహీయంత, త ఐక్షం తాస్మాక మేవాయం విజయోఽస్మాక మేవాయం మహిమేతి" 1

ప. బ్రహ్మ హ = సర్వోపరి విరాజమానుండగు శివుఁడే, దేవేభ్యః = ఇంద్రాది దేవతల ప్రయోజనమునకై, విజిగ్యే = రాక్షసులను పరాజితులఁజేయించెను. అథ = ఆ వెనువెంటనే, తస్య బ్రహ్మణో హ = ఆ పరశివుని యొక్క, విజయే = గెలుపునొనఁ గూర్చుటయందు, దేవాః = దేవతలు, అమహీయంత = గొప్పగా ప్రశంసింపఁబడిరి. తే = అట్టి అమరులు, అయం విజయః = ఈ విజయము,అస్మాకమేవ=మా సామర్థ్యముననే లభించినదని, ఐక్షంత =గర్వముతో భావించుచుండిరి. అయం మహిమా=ఈ గొప్పదనము, అస్మాకమేవేతి = మాదేనని విఱ్ఱవీగుచుండిరి.

భా. మొదటి రెండవ ఖండములలో ఇంద్రియాధిపతియొక్క ప్రభువగు పరమేశ్వరుని లక్షణమును నిరూపించి మూడవ ఖండము నందు పరమేశ్వరునిచే ప్రసాదింపఁబడిన శరీరవాఙ్మనోబలము- ఇట ఆఖ్యాయికతో ప్రతిపాదింపఁబడుచున్నయది.

అమరుల నంతర్యామిగ నుండు పరశివుఁడే శరీరాదిసాధనము లకు బలము నొసఁగి విజయమును చేకూర్చెను.

పూర్వకల్పమున ప్రళయము సంభవించిన తటి- మొదట జన్మించిన హరిబ్రహ్మలు-నేను పెద్ద, నేను పెద్దనని పోరాడినపుడు పరిపూర్ణుఁడైన పరమేశ్వరుఁడు- జ్యోతిః స్తంభరూపమున నావిర్భవించి- హరిబ్రహ్మలయొక్క అహంకారమును పోనాడినట్లు- ఇం దాదుల అభిమానమును నిరాకరింప యక్ష (పూజ్యమగు శివలింగ) రూపమున నావిర్భవించెనని- తరువాతి వాక్యములలో గాననగును.

"తద్ధైషాం విజజ్ఞౌ-తేభ్యో హ ప్రాదుర్బభూవ।
తన్న వ్యజానంత-కిమిదం యక్ష మితి ॥ 2

ప. ఏషాం = ఈ దేవతలయొక్క, తత్ = అట్టి అభిమానమును, విజజ్ఞౌ = పరశివాఖ్యమగు బ్రహ్మము గుర్తెరిగెను. తేభ్యోహ = అమరుల అహంకారము నణచి అనుగ్రహించుటకై, ప్రాదుర్బభూవ = పూజ్యమగు శివలింగ స్వరూపముతో బ్రహ్మము ఆకాశమునందు గోచరమయ్యెను.

ఇదం యక్షం = ఈ యక్షస్వరూపము, కిమితి = ఏమిటని తర్కించినవారై తత్ = బ్రహ్మమును, న వ్యజానంత = అమరులు తెలియకుండిరి.

కరిగిన నెయ్యి గట్టిపడినట్లు సర్వాంతర్యామియగు పరశివుఁడు- ఒకానొక తేజఃపుంజరూపమున-దేవతల గర్వమును పోగొట్టి-మీరు స్వతంత్రకర్తలు గాక శివాధీనకర్తృత్వము గలవారని-బోధించుటకు సాక్షాత్కరించెను. అందువలన అమరులు చకితులై అంతరిక్ష గోచరమగు యక్షస్వరూపమును కనుగొనఁదలచిరని సారాంశము.

"శివో దాతా శివో భోక్తా-శివః సర్వ మిదం జగత్" ఇత్యాది ప్రమాణములు-జయాపజయాదులు శివాధీనములని తెలుపుచున్నవి.

"తే౽గ్ని మబ్రువన్, జాతవేద ఏతద్విజానీహి,
కిమిదం యక్షమితి - తథేతి" 3

ప. తే = ఆ అమరులు అజ్ఞానవశమున, జాతవేదః = అగ్నీ, ఏతద్యక్షం = ఈ యక్షరూపము, కిం = ఎట్టిదో, ఇదం = ఈ విషయమును, విజానీహి = గుర్తింపుము ! ఇతి = ఈ విధముగా, అగ్నిం = అగ్నిదేవునిఁ గూర్చి, అబ్రువన్ = పలికిరి తథేతి = అగ్ని అటులే నని యంగీకరించి,

"తదభ్యద్రవ త్తమభ్యవదత్-కో౽సీ త్యగ్నిర్వా అహ
మస్మీ త్యబ్రవీ జ్జాతవేదా వా అహ మస్మీతి" 4

తత్ = బ్రహ్మమును గురించి, అభ్యద్రవత్ = వడిగా పరుగెత్తెను. తం = అగ్నిని, యక్షరూపము = కో౽సీతి = ఎవడవని, అభ్యవదత్ = అభిముఖముగ ప్రశ్నించి పలికెను.

అహం = నేను, అగ్నిర్వా = అగ్ని దేవుడను, అస్మి = అగుచున్నాను. జాతవేదా వా అహ మస్మి = జాతవేదుడుగ నేను ఉన్నాను, ఇతి = ఇట్లు, అబ్రవీత్ = అగ్ని యక్షునుద్దేశించి గర్వముతో వక్కాణించెను.

"తస్మింం స్త్వయి కిం వీర్య మిత్యపీదగ్ం౦ దహేయం,
యదిదం పృథివ్యా మితి" 5

"తస్మై తృణం నిదధా వేతద్దహేతి, తదుప ప్రేమాయ
సర్వజవేన తన్న శశాక దగ్ధుమ్, స తతఏవ నివవృతే
నైత దశకం విజ్ఞాతుం, యదేత ద్యక్ష మితి" 6

వ. తస్మిన్ = అగ్నియని జాతవేదుఁడు నని పేరు

3 \

యట్టి, త్వయి = నీయందు, వీర్యం = సామర్థ్యము, కిం = ఎట్టిదని యక్షుఁడు అడుగగా- పృథివ్యాం = భూమి మొదలగు ప్రపంచమున, యదిదం = ఏ ఈ దృశ్యమానము గలదో, ఇదం సర్వం = దీని నంతటిని, దహేయం = కాల్చుదు నని అగ్ని పలికెను.

ఏతత్ = దీనిని, దహేతి = కాల్చుమని, తస్మై = అగ్నికొరకు, తృణం = గడ్డిపఱకను, నిదధౌ = ఉంచెను, తత్ = ఆ తృణమును, సర్వజవేన = సమస్తబలముతో, ఉపప్రేయాయ = సమీపించెను. ఐనను తత్ = గడ్డిపఱకను, దగ్ధుం = దహించుటకు, న శశాక = అగ్ని సమర్థుఁడు కాలేదు. సః = ఆ అగ్ని, ఏతద్యక్షం = ఈ యక్ష స్వరూపము, యత్ = ఎట్టిదో, ఏతత్ = ఈ యక్షమహిమను, విజ్ఞాతుం = విశేషించి తెలిసికొనుటకు, నాశకం = అసమర్థుఁడనైతి నని, అగ్ని-తత ఏవ = ఆ క్షణముననే, నివవృతే = మఱలెను

"అథ వాయు మబ్రువన్, వాయవేతద్విజానీహి,
కిమేత ద్యక్ష మితి తథేతి" 7

"తదభ్యద్రవ త్త మభ్యవదత్ కోఽసీతి, వాయుర్వా
అహ మస్మీత్యబ్రవీ న్మాతరిశ్వా వా అహ మస్మీతి" 8

"తస్మిం స్త్వయి కిం వీర్య మిత్యపీదగ్ం సర్వ మాద
దీయం, యదిదం పృథివ్యా మితి" 9

ప. అథ = తరువాత, వాయుం = వాయుదేవుని, ఏతద్యక్షం ఈ యక్షస్వరూపము, కిం = ఎట్టిదో, ఏతత్ = ఈ యక్షస్వరూప మును, విజానీహి = బాగుగ తెలిసికొనుము! అని అమరులు చెప్పిరి. తథేతి = అటులే నని వాయువు-

తత్ = యక్షస్వరూపమును గురించి, అభ్యద్రవత్ = అభిముఖ

ముగ వేగమున నడచెను. కోఽసీతి = నీవు ఎవడవని, తం = వాయువును, అభ్యవదత్ = పూజ్యమగు శివలింగమున భాసించు పరమేశ్వరుఁడు ప్రశ్నించెను. అహం = నేను, వాయుర్వా = వాయుదేవుడను, అస్మి = మీ ముందున్నాను. మాతరిశ్వావా అహమస్మి = మాతరిశ్వను నేను"

తస్మింస్త్వయి = అట్టి నీయందు, కిం వీర్యం = ఎట్టి సామర్థ్యము కలదని యక్షస్వరూపము ప్రశ్నింపగా వాయువు- పృథివ్యాం = పృథివి మొదలగు ప్రపంచమున, జదం = దృశ్యమానమగు యత్ = ఏదేది గలదో, సర్వమపీదం = ఈ సమస్తమునంతయు, ఆదదీయం = ఆకర్షింతును" అని పలికెను.

యక్షమనగాఁ పూజనీయమని నైఘంటుకార్థము. హరిబ్రహ్మాద్యర్చనీయంబగు మహాశివలింగము అంతరిక్షమునందు ప్రత్యక్షమై అగ్నివాయువుల ద్వారా అమరుల మదము నణచి తన దివ్యవాణితో మందలించుటయు, "అసురుల నోడించుట మనది కాదని" ఇంద్రాదులు గుర్తించి స్వాభిమానమును విడనాడుటయు ఇందున్నందున ప్రతి మాహేశ్వరుఁడును భావలింగప్రేరితుఁడై ప్రాణలింగాశ్రయమున నిశ్చయించుకొని "జయాపజయములు సుఖదుఃఖాదులు నీవలననే కలుగుచున్నవని'' ఇష్టలింగమును ప్రార్థించి పూజింపవలెనని విదితమైనది.

"తస్మై తృణం నిదధా వే తదాదత్స్వేతి తదుపప్రేయాయ,
సర్వజవేన తన్న శశాకాదాతుం, స తత ఏవ నివవృతే,
నైత దశకం విజ్ఞాతుం యదేత ద్యక్ష మితి" 1

ప. ఏతత్ = దీనిని, ఆదత్స్వ = కదలించి ఆకర్షింపుః ఇతి = అని, తస్మై = ఆ వాయువు ఆకర్షించుటకై, తృణం నిదధౌ

శ్రీ మహాగణాధిపతయే సాంబశివాయ నమః

కేనోపనిషత్-చతుర్థఖండము

"సా బ్రహ్మేతి హోవాచ, బ్రహ్మణో వా ఏతద్విజయే
మహీయధ్వ మితి, తతో హ వై విదాంచకార బ్రహ్మేతి" 1

ప. సా = భగవతియగు పార్వతీదేవి, బ్రహ్మేతి = మీకు కనుపడిన యక్షస్వరూపము-బ్రహ్మ (పరశివమహాలింగ) మని, ఉవాచ హ = ప్రతిపాదించెను. బ్రహ్మణో వా = పరశివునియొక్క, ఏతద్విజయే = ఈ రాక్షసులను ఓడించుట విషయమైన కర్తృత్వము సంభవించుటచే, మహీయధ్వం = గొప్పవారుగ సంతోషించుడు! తతో హ వై = పార్వతీ దేవియొక్క ఉపదేశమువలననే, బ్రహ్మేతి = యక్ష స్వరూపము పరశివుని జ్యోతిఃస్తంభాకారమగు బ్రహ్మంబని, విదాంచకార = దేవేంద్రుఁడు తెలిసికొనెను.

అగ్నివాయువుల గర్వాపహరణము ఐన తరువాత దేవేంద్రుఁడు అహంకారముతో సమీపింపగా-యక్షస్వరూపము కనుమఱుగై—పార్వతీదేవి ప్రబోధించినందున- తన యభిమానమును విసర్జించి—యక్షరూపము బ్రహ్మంబే నని నిర్ధారించుకొనెనవి సారాంశము.

"తస్మాద్వా ఏతే దేవా అతితరా మివాన్యాన్ దేవాన్,
యదగ్నిర్వాయు రింద్రస్తే హ్యేనన్నేదిష్ఠం పస్పృశు స్తే,
హ్యేనత్ ప్రథమో విదాంచకార బ్రహ్మేతి" 2

ప. తస్మాద్వా = అందువలననే, యత్ = ఏ, అగ్నిః=అగ్ని, వాయుః = వాయువు, ఇంద్రః = దేవేంద్రుఁడు ఉన్నారో, తే = అవ్వారు, ఏనత్ = ఈ బ్రహ్మమును, నేదిష్ఠం = సమీపించినదానిగ, పస్పృశుః = అవలోకించి సంభాషించిరి. ఏతే దేవాః = ఈ అగ్ని వాయ్వింద్రులు, అన్యాన్ దేవాన్ = ఇతరదేవతలను, అతితరా మివ అతిక్రమించి అధికులైనవారేను, హి = ఎందువలన ననఁగా? తే = ఆ ముగ్గురు దేవతలు, ఏనత్ = ఈ ప్రత్యక్షమైనదానిని, బ్రహ్మేతి = బ్రహ్మంబని, విదాంచకార = గుర్తెరిగిరి.

భా. శివ దర్శనము వలన శివునితో సంభాషించుటవలనను మొదట అగ్ని వాయు ఇంద్రులకు, తరువాత అమరులకు జ్ఞానోదయము కలిగెనని.

"తస్మా ద్వా ఇంద్రోఽతితరా మివాన్యాన్ దేవాన్, స హ్యేన న్నేదిష్ఠం పస్పర్శ, స హ్యేనత్ ప్రథమో, విదాంచకార బ్రహ్మేతి" 3

ప. తస్మాద్వా = అందువలననే, ఇంద్రః = దేవేంద్రుఁడు, అన్యాన్ దేవాన్ = ఇతరులైన అగ్నివాయ్వాది దేవతలను, అతితరామివ = అతిశయించినవాడేను, హి = ఎందువలననసఁగా? సః = ఇంద్రుఁడు. నేదిష్ఠం = సమీపించినట్టి, ఏనత్ = ఈ బ్రహ్మమును, పస్పర్శ = సంవాదముతో చేరువై గుర్తించెను. హి = మరియు, సః = దేవేంద్రుఁడు, ప్రథమః = అగ్నివాయువులకంటె ముందు, ఏనత్ = ఈ యక్షస్వరూపము, బ్రహ్మేతి = బ్రహ్మంబని, విదాంచకార = తెలిసికొనెను.

భా. దేవేంద్రుఁడు మొదట యక్షము దేవీప్రబోధముచే శివ

మహాలింగమని గుర్తించి చెప్పగా అగ్నివాయువులు తెలిసికొనిరి. పిమ్మట నమరులు గుర్తించిరి గాన అమరులకంటె నగ్నివాయువులు శ్రేష్ఠులనియు, అగ్నివాయువులను మించినవాడు ఇంద్రుఁడనియు వివేకము.

"తస్యైష ఆదేశో, యదేతద్విద్యుతో వ్యద్యుతదా ఇతీ
న్న్యమీమిషదా, ఇత్యధిదైవతమ్" 4

ప. యత్ = ఎందువలన, ఏతత్ = యక్షరూపమున కనుపడిన ఈ బ్రహ్మము, విద్యుతః = మెరుపుయొక్క, వ్యద్యుతదా = (తత్ = అ) ప్రకాశమువలె ఆవిర్భవించినదో, న్యమీమిషదా = (మిషత్ = అ) మరల మెరుపుయొక్క అప్రకాశమువలె నంతర్ధానముఁ జెందినదో, ఇదే విధము ఉపాసనాకాలమున దృశ్యము అదృశ్యంబు నగునని, తస్య = శివలింగ స్వరూపుండగు పరమేశ్వరునియొక్క, ఏషః = ఈ. ఆదేశః = ఆజ్ఞారూపమైన ఉపదేశము, ఇతి = ఇట్లు, ధిదైవతం = ఇంద్రాది దేవతల నుద్దేశించి మెఱుపు ఉపమానముతో చేయఁబడిన ప్రబోధమని తెలియవలెను.

"అథాధ్యాత్మం, యదేతత్ గచ్ఛతీవ, చ మనోఽనేన
చైత దుపస్మర త్యభీక్ష్ణం సంకల్పః" 5

ప. అథ = బాహ్యోపదేశానంతరము, అధ్యాత్మం = అంతఃకరణమును గురించి–ఆధ్యాత్మికోపదేశము చేయఁబడినది.

మనః = మనస్సు, ఏతత్ = ఈ బ్రహ్మమును, గచ్ఛతీవేతి యత్ = పొందుచున్నట్లు తోచుట ఏదో, మనః = మనస్సు, అనేన ఇట్టి ప్రాప్తితో, ఏతత్ = ఈ బ్రహ్మమును, అభీక్ష్ణం = అత్యంతము, పస్మరతి = సమీపించి ధ్యానించుచున్నదనుట- సంకల్పః = మనస్సు

సంకల్పవికల్పాత్మక మగుటచే మనస్సును చిరకాలము శివునియందు నిలుపుట సాధ్యము కాదను నర్థము గలిగియున్నది.

మనస్సు చంచల మగుటఃజేసి పరమేశ్వరునందు స్థిరపఱుప రాదు. అనాదివిషయవాసనాబద్ధమగు మనస్సును బలాత్కారముగ శివధ్యాన నిమగ్నముగ జేయుట- శివానుగ్రహము వలననే ఘటించు నని సారాంశము.

"తద్ధి తద్వనం నామ, తద్వనమిత్యుపాసితవ్యం, స ఏతదేవం వేదాభిహైనగ్ం సర్వాణిభూతాని సంవాంఛంతి" 6

ప. తత్ = పరశివాఖ్య బ్రహ్మము, వనం నామ = భక్తులందరిచే ప్రార్థింపఁదగినది గదా! ఎందునలన బ్రహ్మము ప్రార్థింపఁదగినదో, తత్ = అందువలన, తత్ = బ్రహ్మము, వనమితి = ప్రార్థింపదగినదని, ఉపాసితవ్యం = శాంభనదీక్షా స్వీకార పూర్వకముగ ఉపాసింపఁదగినది. సః = అట్టి శివోపాసకుఁడు, ఏతత్ = బ్రహ్మమును, ఏవం = ప్రార్థింపఁదగినదానిగా, వేద = గుర్తెరిగి యుపాసించునెడ, ఏనమభి = ఇట్టి యుపాసకుని గూర్చి, సర్వాణిభూతాని ప్రాణులందరు, సంవాంఛంతి = విధేయులై "ఈ శైవుఁడు మనందరికంటె చాల గొప్పవాడు" అను ఆదరముతో నభిలషించుచుందురు.

ఇట వన శబ్దమునకు ప్రార్థింపఁబడునదను నర్థము- ఉచితమగుటచే- శాంభవదీక్షితుఁడు-స్వవామకరతలమున ప్రత్యక్షముగ నవలోకించుచు ప్రార్థింపఁదగినది అరాధింపఁదగినదియు ఇష్టలింగమే నని ద్యోతకమగుచున్నందున- అట్టి ఇష్టలింగమును శివాగమోక్త రీతిని నిత్యము పూజించుచు భోగ్యమునంతయు శివప్రసాదముగ స్వీకరించు మాహేశ్వరుని-తోటి మాహేశ్వరులే గాక శివభక్తులందరును ప్రశంసించుచుందురని వివేకము.

"ఉపనిషదం భో బ్రూహీత్యుక్తా, త ఉపనిషద్, బ్రాహ్మీం వావ, త ఉపనిషద మబ్రూమేతి" 7

ప. భోః = ఆచార్యా! ఉపనిషదం = శివోపాసనారహస్యమును, బ్రూహి = వివరించి వక్కాణింపుము అని శిష్యుఁడు ప్రశ్నింపగా. తే = నీకు, ఉపనిషత్ = శివోపాసనలో రహస్యమైన ఇష్ట ప్రాణ భావ లింగోపాసన, ఉక్తేతి = చెప్పఁబడినదనియు, తే = నీకు, ఉపనిషదం = అట్టి శివోపాసనాదార్ఢ్యమునకై, నిగమాగమాంతసారాంశముగ రహస్యమైన "వనం" ఇత్యాదివాక్యమున ఇష్టలింగాద్యర్చనాదికమును అబ్రూమ వావ = చెప్పినవారమేను.

"తస్యై తపో దమః కర్మేతి ప్రతిష్ఠా, వేదాః సర్వాంగాని సత్య మాయతనమ్" 8

ప. తస్యై = బ్రహ్మవిద్యయనఁదగు శివోపాసనకై, తపః = నక్తవ్రతాదికమగు తపస్సు, కర్మేతి = శివార్చనాదికమగు కర్మయు, దమః = ఇంద్రియనిగ్రహమున్ను, ప్రతిష్ఠా = సాధనములై శివోపాసనను నిరంతరము నిలుపునవగును, వేదాః = వేదములు, సర్వాంగాని = వేదాంగములు, శివాగమాదులును, సత్యం = యథార్థమైన, ఆయతనం = శివోపాసనను బలపఱచు స్థానములగును.

భావము-"శివార్థే దేహసంశోష - స్తప ఇత్యుచ్యతే బుధైః-శివార్చా కర్మ విజ్ఞేయం - నాన్యత్ కర్మ ప్రశస్యతే" ఇత్యాది ప్రమాణములు శివారాధనమునే ముఖ్యకర్తవ్యముగ నిరూపించుట గమనార్హము.

శ్లో॥ తపో దమో వివేకశ్చ - వైరాగ్యం పూర్ణభావనా,
క్షాంతిః కారుణ్యసంపత్తిః - శ్రద్ధా సత్యసముచ్చయా।

ర క్తిః పరో ధర్మః - శివజ్ఞానస్య బాంధవాః ॥
సిద్ధాంతశిఖామణి–రేణుకాచార్యులు

వ్రతా దులతో శివషడక్షరీమహామంత్రజపరూపమైన తపస్సు, ంద్రియములను అదుపులో నుంచుకొనుట, దేశకాలపాత్ర సరించిన శాస్త్రీయ లౌకికమైన వివేకము, అహంకార మమ ప తగ్గించి విరక్తి కలిగియుండుట, శివుడే సూక్ష్మరూప నా చేతనములయందు నిండియున్నాడని భావించుటయు, క్షురైన ఆర్తుల యందు కరుణ, యథార్థదృష్టిని కలుగు శివుని పై ఏకాగ్రభక్తి, వర్ణాశ్రమధర్మములలో స్వవర్ణాశ్రమ పిన శ్రేష్ఠమైన ధర్మాచరణము ఇష్టప్రాణభావలింగోపాస కూలములగునవి.

॰ ఏతా మేవం వేదాపహత్య పాప్మాన మనంతే
కే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి" 8

యోవా = ఎవడైతే, ఏతాం = ఈవరకు చెప్పఁబడిన బ్రహ్మ సోపాసన)ను, ఏవం = తపస్సు మొదలగు అంగములతో నిగా, వేద = గుర్తించి చేయునో, అట్టివాడు- పాప్మానం త దుష్కృతరూపమగు సంచితకర్మను, అపహత్య = ని, అనంతే=కాలపరిచ్ఛేదరహితమగు (అథవా=అనంతుఁ)ఁబడు శివునిచే నిండియుండునట్టి,) జ్యేయే = సర్వశ్రేష్ఠ స్వర్గే లోకే=నిరతిశయ ఆనందాస్పదమగు శివలోకమునందు, తి= శాశ్వతకాలము నివసించును. ప్రతితిష్ఠతి అను ద్విరు తో చేయఁబడినది.

త్ర హారిశ్చ భగవా - నాద్యంతం నోపలబ్ధవాన్,
ర్యే చ సురా యస్మా-దనంతోఽహ ముతోస్మ్యహమ్"

"బ్రహ్మదేవుఁడు, భగవానుఁడగు శ్రీహరియు, అమరులును నా ఆద్యంతములను కనుగొనలేదు గావున అనంతుఁడ నని చెప్పఁబడుదును" అని పరమేశ్వరుఁడు—పద్మపురాణమున శివగీతలో శ్రీరామచంద్రునకు చెప్పినట్లు కలదు. అందువలన అనంతుడను నామధేయము శివునకే చెల్లునని విదితమైనది.

ఇయ్యది
శ్రీ నీలకంఠ శివాచార్య ప్రణీత భాష్యమునకు
శ్రీ నాగలింగశాస్త్రి కృత సంస్కృత వ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కేనోపనిషత్తు—చతుర్థఖండముతో
సర్వంబు సమాప్తము

ముఖ్య సారాంశము

ఇందు గల మనోబుద్ధ్యాదులను ప్రేరేపించుట యను లక్షణము భర్గపదఘటితమగు గాయత్రీ మంత్రమున ప్రతిపాదింపఁబడిన పరమేశ్వరునకే సరిపడుచున్నందున, మరియు తృతీయచతుర్థఖండముల లోని ఆఖ్యాయికవలనను ఈ కేనోపనిషత్తు-శివపారమ్యమును, జీవాత్మ యొక్క పరాధీనకర్తృత్వమును నిరూపించుచు శివాద్వైతసిద్ధాంతమును సమర్థించుచున్నయది.

శ్రీ మహాగణాధిపతయే నమః

కఠోపనిషత్తు - ప్రథమాధ్యాయము

"ఉశన్ హ వై వాజశ్రవసః సర్వవేదసం దదౌ,
తస్య హ నచికేతా నామ పుత్ర ఆస" 1

ప. వాజమనఁగా అన్నము, అద్దాని నొసగుట వలన, శ్రవం = కీర్తిని పొందినవాడు వాజశ్రవుఁడనఁబడును. వాజశ్రవుని పుత్రుఁడగు వాజశ్రవసుఁడు, ఉశన్ = ఫలమును కోరినవాడై, విశ్వజిత్ అను యాగమును చేయుచు, సర్వవేదసం = సమస్తమైన సొత్తును దదౌ = = ఋత్విజులకు సమర్పించెను. తస్య = ఆ వాజశ్రవసునకు, నచికేతా నామ = నచికేతుఁడను, పుత్రః = కుమారుఁడు, ఆస = ఉండెను.

వాజశ్రవసుఁడు స్వర్గసుఖాదుల నపేక్షించి మహాయాగము నొనర్చి - సర్వస్వమును ఋత్విజులకు సమర్పింపఁదలచెను. నచికేతుఁడను కుమారుఁడు ఉండుటచే వాజశ్రవసుఁడు గృహస్థుఁడని విదితమైనది.

"తగ్ంం హ కుమారగ్ంం సంతం దక్షిణాసు నీయ-
మానాసు, శ్రద్ధాఽఽవివేశ, సోఽమన్యత" 2

ప. దక్షిణాసు = యజ్ఞదక్షిణలుగా వాజశ్రవసునిచే సమర్పింపఁబడిన ఆవులు, నీయమానాసు = ఋత్విజులచే తీసికొనఁబడుచుండగా కుమారం సంతం = పదునైదువత్సరముల కౌమారదశయందున్నను,

తం = ఆ నచికేతుని, శ్రద్ధా = తన జనకునకు యజ్ఞఫలము లభింప వలెనను పట్టుదల, ఆవివేశ = ప్రవేశించెను, సః = ఆ నచికేతుఁడు అమన్యత = దిగువవిధము విచారించెను.

వాజశ్రవసుఁడు ఋత్విజులకు దక్షిణలుగా ఇచ్చిన ఆవులు పనికిరానివని నచికేతుఁడు గుర్తించి-తన తండ్రిని గూర్చి విచారపడె నని భావము.

"పీతోదకా జగ్ధతృణా - దుగ్ధదోహా నిరింద్రియాః,
అనందా నామ తే లోకా - స్తాన్ స గచ్ఛతి తా దదత్" 3

ప. పీతోదకాః = ఈ వరకే నీరు త్రాగినవి, జగ్ధతృణాః = గడ్డిమేసినవి, దుగ్ధదోహాః = పాలు పితికింపఁబడినవి, నిరింద్రియాః = పుట్టించు శక్తి లేనివియు, తాః = అట్టి ఆవులను, దదత్ = ఇచ్చు నట్టి, సః = వాజశ్రవసుఁడు, అనందా నామ = సుఖము లేనివని ప్రసిద్ధములైన, తే లోకాః = లోకములు ఏవి గలవో, తాన్ = అట్టి లోకములను, గచ్ఛతి = పొందును.

వాజశ్రవసుఁడు దానముఁజేసిన ఆవులు-ప్రస్తుతము నీరు త్రాగ లేవనియ, గడ్డి మేయలేవనియు, దూడలను కనలేవనియు నచి కేతుఁడు గుర్తించి-తన తండ్రికి నరకలోకములు రాకూడదని మదిఁ దలచియు పనికిరాని ఆవుల నీయకూడదని చెప్పినచో వాజశ్రవ సుఁడు అంగీకరింపదని భావించినవాడై దిగువవిధము ప్రశ్నించె నని సారాంశము.

"స హోవాచ పితరం - తాత! కస్మై మాం దాస్యసీతి,
ద్వితీయం తృతీయం తగ్ం హోవాచ, మృత్యవే త్వా
దామీతి" 4

ప. సః = ఆ నచికేతుఁడు, తాత = నాయనా! మాం = నన్ను, కస్మై = ఏ ఋత్విజునకు, దాస్యసీతి = దానము చేయగల వని, పితరం = తండ్రిఁ గూర్చి, ఉవాచ = పలికెను, ద్వితీయం = రెండవ తూరి, తృతీయం = మూడవ తడవ, తం = ఆ వాజశ్రవసు నుద్దేశించి, ఉవాచ = ప్రశ్నగా సంభాషించెను. అట్టితఱి వాజశ్రవ సుఁడు కృద్ధుఁడై, త్వా = నిన్ను, మృత్యవే = యమునకు, దదామి = సమర్పింతును, ఇతి = అని పలికెను.

తన తండ్రికి "విశ్వజిత్" అను యజ్ఞముఁదగు ఫలముః లభింప వలెనని మదిఁ దలచిన నచికేతుఁడు- పితృసర్వస్వములో తాను చేరినవాడగుటచే "నన్నెవరి కిత్తు"వని మాటిమాటికి ప్రశ్నించినందున "వీడు పిల్లతనమునఁజేసి నిరర్థకముగ మాటలాడుచున్నాడని ఒకటి రెండు పర్యాయములు నచికేతుని ప్రశ్నకు సమాధానము నిడలేదు. మూడవ తడవ గూడా ప్రశ్నించినందున వాజశ్రవసుఁడు కుపి తుఁడై "నిన్ను యమున కీయగల" నని అనాలోచితముగ పలికె నని భావము

"బహూనా మేమి ప్రథమో-బహూనా మేమి మధ్యమః
కిం స్విద్యమస్య కర్తవ్యంయన్మయాఽద్య కరిష్యతిః"ర్

ప. బహూనాం = పెక్కు సేవకులలో, ప్రథమః = మొదటి వాడనై ఏమి = యమునిఁజేరుదును. (అథవా) బహూనాం = పరిచార కులనేకులలో మధ్యమః = రెండవవాడనై, ఏమి = మృత్యుదేవతను సమీపింతును. అద్య = ఇప్పుడు, యమస్య = యమునిసంబంధముగ, కింస్విత్ = ఎట్టి యభీష్టము, కర్తవ్యం? = నా తండ్రిచే సాధింపఁ దగినది ? మయా = యమునకు దానముఁజేయఁబడిన నాచే, యత్ = ఎట్టి ప్రయోజనమును, కరిష్యతి? యముఁడు సాధించును ?

ప్రభువు శాసింపకమునుపే సందర్భమును కనిపెట్టి పనులు చేయువాడు-పరిచారకులలో ప్రథముఁడు కాగా-అధికారి ఆజ్ఞానుసారము ప్రవర్తించువాడు-మధ్యముఁడుగాను, ఏలికనుడివిన నాతని యానతిని పాటింపనివాడు అధముఁడుగాను పరిగణింపఁబడుదురు.

తనను ఋత్విజునకు దానముఁజేయక-యమునకిత్తునని తండ్రి నుడువుటచే యజ్ఞఫలము సంప్రాప్తింపదు గాన యమునివలన తన తండ్రి ఆశించునదేమి? ఇట్లు నచికేతుఁడు విచారపడెను కాని యముని సన్నిధికి ఏగుటకు వెనుకంజ వేయలేదని భావము.

"అనుపశ్య యథా పూర్వే-ప్రతిపశ్య తథాఽపరే,
సస్య మివ మర్త్యః పచ్యతే-సస్య మివాజాయతే పునః" 6

ప. నాయనా! నిన్ను యమునకీయగలనని కోపముతో పలికి పశ్చాత్తాపముఁ జెందుచున్నావు. యథా = ఏ విధముగా, పూర్వే = పితామహాది మన పూర్వీకులు ఆడినమాట తప్పలేదో, అనుపశ్య = వారిని అనుసరించి పరిశీలింపుము! తథా = అదే విధముగా, అపరే ఇప్పటి మనవారు ఎట్లున్నారో, ప్రతిపశ్య = గమనింపుము!

ఈలోకమున ప్రాణుల పరిస్థితి నాలోచింపగా-మర్త్యః = మానవుఁడు, సస్యమివ = పైరువలె, పచ్యతే = ఫలించి జీర్ణించును. సస్యమివ = పైరువలె, పునః = మరల, ఆజాయతే = త్వరలో జన్మించును.

భా. తండ్రి నన్ను యమునకు సమర్పించినను బాధపడను. ప్రపంచమున జీవనము శాశ్వతము కాకుండుటచే-పుత్రవియోగమునకు దుఃఖింపక-సత్యవాక్యమును పరిపాలింపుమని నచికేతనుఁడు రాజశ్రవసు నోదార్చెనని భావము.

"వైశ్వానరః ప్రవిశత్యతిథి ర్బ్రాహ్మణో గృహాన్,
తస్యైతాగ్ంం శాంతిం కుర్వంతి హర వైవస్వతోదకమ్"7

ప. వైవస్వత = యమా! అతిథిర్బ్రాహ్మణః = అతిథియగు బ్రాహ్మణుఁడుగ, వైశ్వానరః=అగ్నిదేవత, గృహాన్=గృహమును గురించి, ప్రవిశతి = ఏతెంచి ప్రవేశించును. తస్య = అట్టి అతిథికి, ఏతాం = అర్ఘ్యపాద్యాది రూపంబగు, శాంతిం = ఉపశమనమును, కుర్వంతి = వృద్ధులు చేయుచుండెడివారు. అందువలన ఉదకం = పాదప్రక్షాళనార్థము ఉదకము మొదలగువానిని, హర = తీసికొనిరమ్ము.

నచికేతసుఁడు-వాజశ్రవసుని సమ్మతిఁబడసి యమలోకమునకు ఏగినతఱి-ఆ సమయమున యముఁడు ఇంటిలో లేనందున-ఉపవాసముతో ద్వారముచెంత నుండెను. యముఁడు రాఁగానే అగ్నికల్పుఁడైన బ్రాహ్మణుని శాంతింపఁజేయుటకు పాద్యోదకము మున్నగు వానిని గొనితెమ్మని వృద్ధులు యమునకు హితమును వాక్రుచ్చిరని సారాంశము.

"ఆశాప్రతీక్షే సంగతగ్ంం సూనృతాం చేష్టాపూర్తే
పుత్రపశూగ్ంం శ్చ సర్వాన్। ఏ తద్వృఙ్క్తే పురుషస్యా
ల్పమేధసో, యస్యానశ్నన్ వసతి బ్రాహ్మణో గృహే"8

ప. అల్పమేధసః = కొద్ది తెలివిగల, యస్య పురుషస్య = ఏ పురుషునియొక్క, గృహే = ఇంటియందు, బ్రాహ్మణః = బ్రాహ్మణుఁడు, అనశ్నన్ = అతిథిగ నేతెంచి ఉపసించునో, ఏతత్ = బ్రాహ్మణుని ఉపవాసమువలన కలుగు అపరాధము, తస్య=అట్టి గృహస్థుని యొక్క। ఆశాప్రతీక్షే = ఆశ = పొందని దానిని సంపా

దించు కోరిక, ప్రతీక్షా = లభించినదాని ననుభవింప నెంచుట, ఈ రెంటినే గాక సంగతం = పుణ్యాత్ము-లతో సహవాసముఁదగు ఫలమును, సూనృతాం = సత్యవాక్య పరిపాలనమును, ఇష్టాపూర్తే = ఇష్టం = = యజ్ఞయాగఫలమును, పూర్తం = బావి మొదలగు జలాశయముల నేర్పరచిన పుణ్యమును, పుత్ర పశూంశ్చ సర్వాన్ = పుత్రులు మున్నగు కుటుంబమును పశువులు మొదలగు సమస్త సంపదను, వృఙ్క్తే = నశింపఁజేయును.

అపరిచితములైన స్వర్గసుఖాదుల నపేక్షించుట-ఆశయనియు, పరిచితములగు ధనాదుల నపేక్షించుట-ప్రతీక్ష యనియు వివేకము. గృహస్థుఁడు—అతిథిని సత్కరింపనిచో తన సర్వస్వమును పోగొట్టు కొనునని తేటపడినది.

"తిస్రో రాత్రీ ర్యదవాత్సీ ర్గృహే మేఽనశ్నన్ బ్రహ్మ
న్నతిథి ర్నమస్యః,నమస్తేఽస్తు బ్రహ్మన్, స్వస్తి మేఽస్తు,
తస్మాత్ ప్రతి త్రీన్ వరాన్ వృణీష్వ" 9

ప. ఇట్లు పెద్దలు బోధించిన పిదప యముఁడు-నచికేతసు నర్ఘ్యపాద్యాదులతో సత్కరించి, బ్రహ్మన్ = బ్రాహ్మణా! నమస్తేఽస్తు = నీకు నమస్కారమగుగాక! అతిథిః = అతిథివై, మే గృహే = నా ఇంటియందు, తిస్రోరాత్రీః = మూడు అహోరాత్రములు, యత్ = ఎందువలన, అనశ్నన్ = ఉపవసించి, అవాత్సీః = ఉంటివో, తస్మాత్ = ఆ కారణమువలన, నమస్యః = నమస్కారాదులతో సత్కరింపఁదగినవాఁడవైతివి, మే = అపరాధినగు నాకు, స్వస్త్యస్తు = శుభమగుగాక! ప్రతి = నా యపరాధమునకు పరిహారముగ, త్రీన్ వరాన్ = మూడు వరములను, వృణీష్వ = కోరుము!

అతిథియగు నచికేతసుఁడు రాగానే సత్కరింపనందున అతిథి-అగ్నితో సమానుఁడగుటచే తన సర్వస్వము నశించునని యముఁడు భయపడినవాడై మూఁడువరములతో నచికేతసుని ప్రసన్నుఁజేయ తలపెట్టెనని భావము.

"శాంతసంకల్పః సుమనా యథా స్యా ద్వీతమన్యు
ర్గౌతమో మాఽభి మృత్యో, త్వత్ప్రసృష్టం మాఽభి
వదేత్ ప్రతీత. ఏత త్త్రియాణాం ప్రథమం వరం వృణే"10

ఇవ్విధము యముఁడు వినయముతో ప్రార్థించినందున నచికేతసుఁడు దిగువవిధము మొదటివరమును కోరెను.

వ. మృత్యో = మృత్యుస్వరూపుఁడవైన యమధర్మరాజా! గౌతముఁడనఁబఱఁగు నా తండ్రి, శాంతసంకల్పః = "నా కుమారుఁడు యమునిఁజేరి ఎట్టి అవస్థ ననుభవించునో" అను చింత లేనివాడై, సుమనాః = ప్రసన్నమైన మనస్సు గలవాడై, వీతమన్యుః = తనను విసిగించినాడను రోషము లేనివాఁడును, యథా స్యాత్ = ఎట్లగునో, మరియు త్వత్ప్రసృష్టం = ప్రసన్నుడవైన నీచే పంపఁబడిన, మాఽభి = నన్ను గురించి, ప్రతీతః = "భువినుండి యమలోకమున కేగిన నా కుమారుఁడే మానవ రూపమున మరల నాయొద్దకు వచ్చినాడని" విశ్వసించినవాడై, వదేత్ = నాతో సంభాషించునో, తథా కురు ఆ విధముగా నా జనకు నుండఁజేయుము! త్రయాణాం = మూడిటిని, ఏతత్ = ఈ, ప్రథమం వరం = మొదటి వరమును, వృణే = కోరుచున్నాను.

"యథా పురస్తాత్ భవితా ప్రతీత-ఔద్దాలకి రారుణి
ర్మత్ ప్రసృష్టః, సుఖగ్ం రాత్రీః శయితా వీతమన్యుః
త్వాం దదృశివాన్ మృత్యుముఖాత్ ప్రముక్తమ్"

ప. ఔద్దాలకిః=ఉద్దాలకుఁడనఁదగునట్టి, ఆరుణిః= అరుణుని వంశమునందు జన్మించినట్టి, గౌతముఁడనఁబడు వాజశ్రవసుఁడు, మత్ప్రసృష్టః = నాచే అనుగ్రహింపఁబడినవాఁడై, పురస్తాత్ = నీవు ఈ లోకమునకు రాకమున్ను, యథా = ఎట్లుండెనో, తథా భవితా= అట్లే ఉండుగాక! ప్రతీతశ్చ = విశ్వాసముగలవాఁడగును కూడ, మృత్యుముఖాత్ = మృత్యుదేవతయగు నా సన్నిధినుండి, ప్రముక్తం = బయలుదేరుటకు విడుదలఁజెందినట్టి, త్వాం = నిన్ను, దదృశివాన్ = చూచినవాఁడై, వీతమన్యుః = కోపములేనివాఁడునై, రాత్రీః రాత్రులందు, సుఖంశయితా = సుఖముగ నిద్రించును.

నచికేతసుని వినయశీలమునకు యముఁడు సంతసించి-అడుగుటయే తడవుగా మొదటివరమును ప్రసాదించెనని భావము.

> "స్వర్గే లోకే న భయం కించ నాస్తి, న తత్ర త్వం
> న జరయా బిభేతి, ఉభే తీర్త్వాఽశనాయాపిపాసే,
> శోకాతిగో మోదతే స్వర్గలోకే" 12

స్వర్గప్రాప్తిసాధనమగు అగ్ని విద్య నుపదేశింపుమని నచికేతసుఁడు-రెండవ వరమును కోరుచు స్వర్గ స్వరూపమును నిర్దేశించుచున్నవాడు.

ప. స్వర్గలోకే-సర్వోత్తరమగు పరమపద (శివలోక) మున; భయం కించ = ఎంతమాత్రము పతనభయము నాస్తి-లేదు. తత్ర = ఆచోట, త్వం = నీవు, న = ఉండవు. జరయా = ముదుసలితనముచే, న బిభేతి=భయపడవలసిన అవసరము లేదు. అశనాయాపిపాసే ఉభే = ఆకలి దప్పికల రెంటిని, తీర్త్వా = లేకుండఁజేసి, శోకాతిగః=దుఃఖము నతిక్రమించినవాఁడై, స్వర్గలోకే=శివలోకమున, మోదతే = ఆనందించును.

ఇఁట స్వర్గ శబ్దము - ఇంద్రాదిలోకములఁజెప్పనిదై - పరశివ లోకార్థము గలదని నిర్వచింపవలెను. ఎందుకనఁగా ? మరణ భయక్షుత్పిపాసాదుఃఖములు-సామాన్య స్వర్గమునందుండున వగుటచే- అట్టివి లేనిది పరమపద (పరశివలోక)ము ఒక్కటేనని సారాంశము.

యముని రెండవవరముఁగోరునపుడే మోక్షస్థానమును ప్రతి పాదించుటచే నచికేతసుఁడు ముముక్షువుగ పరిగణింపఁబడుచున్న వాడని వివేకము.

"స త్వ మగ్నిగ్ం స్వర్గ్య మధ్యేషి మృత్యో-ప్రబ్రూహి తగ్ం శ్రద్దధానాయ మహ్యాం, స్వర్గలోకా అమృతత్వాం భజంతే-ఏతద్ ద్వితీయేన వృణే వరేణ" 13

ప. మృత్యో= మృత్యుస్వరూపము గల యమధర్మరాజా! సః = లోకవేదప్రసిద్ధుఁడవైన, త్వం=నీవు, అగ్నిగ్ం=అగ్నివిద్యను, స్వర్గ్యం=స్వర్గసాధనముగ, అధ్యేషి=గుర్తెరుగుదువు, శ్రద్దధానాయ = శ్రద్ధ గలయట్టి, మహ్యాం= నాకు, తగ్ం = అట్టి అగ్ని విద్యను, ప్రబ్రూహి=బాగుగా వక్కాణింపుము! స్వర్గలోకాః=స్వర్గ మనఁబడు పరమపదముఁజేరినవారు, అమృతత్వాం = జన్మమరణా దులు లేనట్టి ముక్తిని, భజంతే = పొందుదురు. ఏతత్ = ఈ అగ్ని విద్యా పరిజ్ఞానమును, ద్వితీయేన వరేణ=రెండవ వరముగ, వృణే= కోరుచున్నాను.

పునర్జన్మ లేనట్టి శాశ్వత శివసాయుజ్యము నపేక్షించి-అట్టి ముక్తిని చిత్తశుద్ధిద్వారా కలుగఁజేయునట్టి అగ్నిహవనాది నిష్కామ కర్మయోగమును నీవలన తెలియఁగోరుచున్నానని నచికేతసుఁడు యముని ప్రశ్నించెనని విదితమైనది.

"ప్ర తే బ్రవీమి తదు మే నిబోధ, స్వర్గ్య మగ్నిం
నచికేతః ప్రజానన్, అనంతలోకాప్తి మథో ప్రతిష్ఠాం_
విద్ధి త్వ మేతం నిహితం గుహాయామ్'' 14

యముఁడు - చెప్పుచున్నాడు.

ప. నచికేతః = నచికేతసుఁడా ! స్వర్గ్యం = పరమపదప్రాప్తికి సాధనమగు, అగ్నిం = అగ్నిహవనాదికర్మయోగమును ప్రజానన్ = గుర్తెరిగిన నేను, తే = నీకు, ప్రబ్రవీమి = పూర్తిగ వివరించి చెప్ప గలను. తదు = అట్టి కర్మయోగ విధానమును, మే = నావలన, నిబోధ = తెలిసికొనుము ! అనంతలోకాప్తిం = అవధిలేని లోకము నొందుటకు సాధనమైనట్టి, అథ = మరియు, ప్రతిష్ఠాం = శాశ్వత స్థితికి సాధనము నగు, ఏతం = చెప్పబోవు విధము గల అగ్ని హవనాదికమును, గుహాయాంనిహితం = అతి రహస్యమైనదిగా, త్వం నిబోధ = నీవు గుర్తింపుము !

"లోకాది మగ్నిం తమువాచ తస్మై, యా ఇష్టకా
యావతీ ర్వా యథా వా, స చాపి తత్ప్రత్యవదద్యథోక్త
మథాస్య మృత్యుః పున రేవాహ తుష్టః'' 15

ప. లోకాదిం = పరమపదమునకు కారణమైన, తం = లోకవేద ప్రసిద్ధమైన, అగ్నిం = అగ్ని విద్యయనఁదగు కర్మయోగవిధానమును, తస్మై = ఆ నచికేతనునకు, ఉవాచ = చెప్పెను.

యా ఇష్టకాః = ఏ ఆహుతులు, యావతీర్వా = ఎన్ని సమర్పింపఁదగినవో, యథా వా = ఎట్లు సమర్పింపవలెనో, యముఁడు విశదీకరించి వక్కాణించెను. సచాపి = ఆ నచికేతసుఁడును, యథోక్తం = యముఁడు చెప్పినట్లు, తత్ = ఆ అగ్నిహవనాదికమును, ప్రత్య

వదత్ = మరల వివరించి నుడివెను. అథ = తాను బోధించిన కర్మ విధానమునంతయు నచికేతసుఁడు బాగుగా విశదీకరించి చెప్పినందున, మృత్యుః = యముఁడు, తుష్టః = సంతోషించినవాడై, అస్య = ఈ నచికేతునకు, పునరేవ = మరల తనంతట తానే, ఆహ = పలికెను.

ఉపాసనాత్మకమగు జ్ఞానము-నిష్కామకర్మతో కూడినపుడే చిత్తశుద్ధి ద్వారా శివానుగ్రహనిదానమై ముక్తిప్రదంబగునని సారాంశము.

"తమబ్రవీత్ ప్రీయమాణో మహాత్మా-వరం తవేహాద్య
దదామి భూయః, తవైవ నామ్నా భవితాఽయ మగ్నిః
సృంకా చేమా మనేకరూపాం గృహాణ!" 16

ప. మహాత్మా = గంభీరమానసుఁడైన యముఁడు, ప్రీయమాణః = సర్వాత్మనా ప్రసన్నుఁడై, అద్య = ఇప్పుడు। ఇహ = ఈ చెప్పబోవు, వరం = వరమును. భూయః = మరల, తవ = నీకు, దదామి = ఇచ్చుచున్నాను.

అయం = ఈ, అగ్నిః = అగ్నిహోత్రము, తవైవ నామ్నా = నీ పేరుతోడనే, భవితా = ప్రసిద్ధంబగును. అనేకరూపాం = నానా విధములైన వన్నెలు గలయట్టి, ఇమాం = ఈ, సృంకాం = శబ్దముఁజేయు రత్నమాలికను, గృహాణ = స్వీకరింపుము!

ఈవరకు యముఁడొసగెదనని చెప్పిన మూడు వరములే గాక నియ్యది నాలుగవ వరమని విదితమైనది.

"త్రిణాచికేత స్త్రిభి రేత్య సంధిం-త్రికర్మకృ త్తరతి
జన్మమృత్యూ-బ్రహ్మజజ్ఞం దేవ మీడ్యం విదిత్వా-
నిచాయ్యేమాగ్ం శాంతి మత్యంత మేతి" 17

ప. "త్రికర్మకృత్ = యజ్ఞ, వేదశాస్త్రాభ్యాస, దానములనఁదగు మూఁడు కర్మలను చేయువాఁడై, త్రిణాచికేతః = ప్రాతర్మధ్యాహ్న సాయంకాలములయందు అగ్ని నాహుతులను సమర్పించువాఁడునై, త్రిభిః = ఆహవనీయ గార్హపత్య దక్షిణాగ్నులతో సంధిం = శివోపాసన యొక్క సంబంధమును, ఏత్య = పొందినచో, జన్మమృత్యూ = జననమరణములను, తరతి = అతిక్రమించును.

శివోపాసన మెట్లనఁగా ?

బ్రహ్మజజ్ఞం = పరమేశ్వరునివలన ఆవిర్భవించునట్టి, కించిజ్ఞుఁడైనట్టియు జీవాత్మను, ఈడ్యం = నుతింపఁదగిన, దేవం = పరమేశ్వరుని, విదిత్వా = శాస్త్ర ఆచార్యోపదేశము వలన పరోక్షముగ గుర్తించి, నిచాయ్య = పూజాజపధ్యానములతో ప్రత్యక్షముగ దర్శించియు, ఇమాం = పూర్వోక్తమగు, అత్యంతం శాంతిం = సంసార బంధము పూర్తిగ తొలగుట (మోక్షము)ను, ఏతి = పొందును.

త్రివిధకర్మలను కాలత్రయకర్తవ్యమగు హవనమును ఈశ్వరార్పణబుద్ధితో నాచరించుచు అట్టి కర్మయోగమున చిత్తశుద్ధిఁబడసియు, చిత్తశుద్ధ్యనంతరము గూఢా కర్మలను విడనాడక శివు నుపాసించువాడు-నిజరూపము ను శివసాక్షాత్కారమును పొందినవాడై ముక్తుఁడగునని సారాంశము.

"త్రిణాచికేత స్త్రయ మేత ద్విదిత్వా-య ఏవం విద్వాగ్ంశ్చినుతే నాచికేతం–స మృత్యుపాశాన్ పురతః ప్రణోద్య-
శోకాతిగో మోదతే స్వర్గలోకే" 18

ప. యః = ఎవఁడు, ఏతత్ = ఈ, త్రయం = అగ్నిజీవాత్మ పరమాత్మ స్వరూపములను. విదిత్వా = వేదశాస్త్రములవలన గుర్తించి,

ఏవం = పూర్వవాక్యోక్తరీతిని, విద్వాన్ = భావించువాడై, నాచికేతం = అగ్నిని, చినుతే = ఉపాసించునో, సః = అట్టివాడు, మృత్యుపాశాన్ = మృత్యుదేవతయొక్క పాశములనఁదగు రాగద్వేషాది వికారములను, పురతః = శరీరత్యాగమునకు మున్నే, ప్రణోద్య = పోగొట్టుకొని, స్వర్గేలోకే = స్వర్గమనఁదగు శివలోకమున, శోకాతిగః = సంసార దుఃఖము లేనివాడునై, మోదతే = నిజరూపావిష్కారముతో ఆనందించును.

కర్మయోగమున ముఖ్యమగు అగ్నిహవనమును శాస్త్రోక్తరీతిని ఆచరించు జీవాత్మ- తాను పరమాత్మవలన నావిర్భవించువాఁడనని గుర్తించి-నిజరూపమును ముక్తదశయందు బయలుపఱచుకొనియు శివసాయుజ్యమును పొందునని భావము.

"ఏష తేఽగ్ని ర్నాచికేతః స్వర్గ్యో యమవృణీథా ద్వితీయేన వరేణ, ఏత మగ్నిం తవైవ ప్రవక్ష్యంతి జనాస-స్తృతీయం వరం నాచికేతో వృణీష్వ" 19

ప. నాచికేతః = నచికేతసుఁడా! యం = ఏ అగ్నివిద్యను, ద్వితీయేన వరేణ = రెండవవరముతో, అవృణీథాః = తెలియఁగోరితివో, స్వర్గ్యః = మోక్షస్థానప్రాప్తి సాధనమగు, ఏషః = ఈ, అగ్నిః = అగ్నియందు హవనరూపముగ ఆచరింపఁబడు కర్మయోగము, తే = నీకు చెప్పఁబడినది. జనాసః = లోకులు, ఏతమగ్నిం = ఈ యగ్నిని, తవైవ = నీ పేరుతోడనే, ప్రవక్ష్యంతి = చెప్పుదురు నాచికేతః = నచికేతసుఁడా! తృతీయం వరం = మూడవ వరమును, వృణీష్వ = కోరుము!

నిష్కామకర్మయోగమును గురించి నచికేతసుఁడు యముని

ప్రశ్నించినందున యముఁడు ఉపయోగించిన స్వర్గశబ్దమునకు మోక్ష స్థానము అను నర్థమే సమంజసమైనది. నిష్కామకర్మానుష్ఠానము శివధ్యానమునకు వలయు చిత్తశుద్ధిని కలుగఁజేయును గాన-శివధ్యాన సాధనములగు జపపూజాదుల నొసర్చి - శివధ్యాననిష్ఠుఁడై శివాను గ్రహపాత్రుఁడు కావలసియుండును. పరంపరయా కర్మయోగము మోక్షసాధనముగుననియు, అందువలననే స్వర్గము పరమపదమనఁ బఱఁగు ననియు విదితమైనది

యేయం ప్రేతే విచికిత్సా మనుష్యేఽస్తీత్యేకే,
నాయ మస్తీతి చైకే - ఏతద్విద్యా మనుశిష్ట
స్త్వయాఽహం - వరాణా మేష వరస్తృతీయః" 20

ప. మనుష్యే = మానవశరీరాదులయందలి జీవాత్మ, ప్రేతే = = చివరిశరీరమునుండి వెళ్ళగా, యా = ఏ, ఇయం = ఈ, "అస్తీతి = జీవాత్మ ఉండునని, ఏకే = కొందరు చెప్పుటయు, అయం = ఈ జీవాత్మ, నాస్తీతి = లేకుండునని, ఏకే = మరికొందరు నిరూపించు టయు" అను విచికిత్సా = సంశయమో. త్వయా = నీచేత. అనుశిష్టః = ఉపదేశింపఁబడినవాడనై, ఏతత్ = ఈ చెప్పఁబోవు ముక్తస్థితిఁ గూర్చి, విద్యాం = సంశయనివృత్తితో గుర్తెరుగుదును గాక! ఏష = వరః = ఈ వరము, వరాణాం = వరములలో, తృతీయః = మూడవ దగును.

చిత్తశుద్ధిని కలిగించు అగ్నిహవనాదికర్మయోగమును తెలిసి కొనిన నచికేతసుఁడు-ముక్తపురుషుని లక్షణమును తెలియఁగోరిన వాడై ఆదివరకు గల వాదములను నిరూపించి-మృత్యుదేవతకే ఈ యంశము బాగుగా తెలియునని భావించి పైవిధము యముని ప్రశ్నించె నని సారాంశము.

"దేవై రత్రాపి విచికిత్సితం పురా, న హి సువిజ్ఞేయ
మణు రేష ధర్మః - అన్యం వరం నచికేతో వృణీష్వ!
మా మోపరోత్సీ రతి మా సృజైనమ్" 11

అత్ర = నీవడిగిన ముక్తపురుషుని స్థితిం గూర్చి, దేవైరపి = అమరులచేతగూడ, పురా = పూర్వకాలమున, విచికిత్సితం = సంశయింపఁబడినది. హి = ఎందువలన ననఁగా? న సువిజ్ఞేయం = సుకరముగ తెలియునది కాదు, ఏషధర్మః = ముక్తస్వరూపము, అణుః = సూక్ష్మమైనది, అందువలన నచికేతః = నచికేతసుఁడా! అన్యం వరం = మఱియొక వరమును, వృణీష్వ = కోరుము! మా = నన్ను, మోపరోత్సీః = ఇదే వరము కావలెనని నిర్బంధింపకుము! ఏనం = ఇదేవరముఁ గూర్చి, మా = నన్ను, అతిసృజ = బొత్తుగా విడువుము!

రెండవ వరము నచికేతసుఁడు కోరిన అగ్నివిద్య—ఇంద్రుని స్వర్గముఁదగు సుఖము లభించుటకు సాధనముగ యమునిచే నుపదేశింపఁబడినదను పక్షమున గూడ నీ సంవాదమును సమర్థింపవచ్చును. ఎట్లనఁగా? మానవలోక గతములైన భయ క్షుత్ పిపాసాదులు స్వర్గమున నుండవు గాన అట్టి సుఖభోగము నచికేతసునకు విదితమగుటకై యముఁడు- అగ్నిహవనాది కర్మవిధానమును వివరించినను నచికేతసుఁడు స్వర్గసుఖమునందు విరాగము గలవాడై ముక్తపురుషుని స్వరూపమును గూరించి ప్రశ్నించెననియు, అట్టి నచికేతసుని ముముక్షను దృఢపరచుటకై ముక్తస్థితి సులభముగ తెలియునది కాదని యముఁడు పరీక్షించెననియు విదితమైనది.

"దేవై రత్రాపి విచికిత్సితం కిల - త్వం చ మృత్యో యన్న

సువిజ్ఞేయ మాత్థ - వక్తా చాస్య త్వాదృగన్యో న లభ్యో-
నాన్యో వరస్తుల్య ఏతస్య కశ్చిత్" 22

నచికేతసుఁడు-

ప. అత్ర = ముక్తపురుషస్థితి విషయమై, దేవైరపి=అమరుల చేతగూడ, విచికిత్సితం కిల = సంశయింపఁబడినది గదా! మృత్యో= యమధర్మరాజా! త్వం చ = నీవు గూడ, యత్ = ఏ ముక్తస్వరూపము, న సువిజ్ఞేయం = సుఖముగ తెలియనలవిగానిదని ఆత్థ = చెప్పుచున్నావో, అస్య = ఇట్టి ముక్తస్థితిని, త్వాదృక్ వక్తా= నీవంటి ఉపదేశకుఁడు, అన్యః = మరియొకఁడు, నలభ్యః=లభింపడు, అందువలన, ఏతస్య = ఈవరమునకు, తుల్యః=సమానమైన, అన్యో వరః = మరియొక వరము, కశ్చిత్ = ఏదియు, న = లేదు, అని పలికెను.

ముక్తపురుషస్థితిని గూర్చి- మానవుల కన్న నధికమైన బుద్ధి బలము గల దేవతలే తేల్చలేదు గాన మృత్యువును కలుగఁజేయు నీవే నిర్ధారించి చెప్పవలెనని నచికేతసుఁడు యముని ప్రార్థించె నని భావము.

"శతాయుషః పుత్రపౌత్రాన్ వృణీష్వ - బహూన్
పశూన్ హస్తిహిరణ్య మశ్వాన్ - భూమే ర్మహదాయతనం
వృణీష్వ - స్వయం చ జీవ శరదో యావ దిచ్ఛసి" 23

నచికేతసుఁడు-వైరాగ్యముతో ముక్తిని గురించి వివరింపుమని ప్రశ్నించినను యముఁడు నచికేతసు నింకను పరీక్షించుచున్నవాడు.

ప. శతాయుషః = నూరేండ్లు బ్రతుకునట్టి, పుత్రపౌత్రాన్ =

కుమారులను, మనుమలను. మరియు బహూన్ పశూన్ = గోవృష భాది అనేక పశువులను, హస్తి హిరణ్యం = ఏనుగలను బంగారమును, అశ్వాన్ = గుఱ్ఱములను, వృణీష్వ = కోరుము! ఇంతియే గాక, భూమేః = భూమిఁ జెందినట్టి, మహత్ = గొప్పదైనట్టి ఆయతనం = స్థానమును, అనఁగా రాజ్యమును, వృణీష్వ = కోరుము! యావత్ శరదః ఇచ్ఛసి = ఎన్ని సంవత్సరములు, భువిని జీవింపఁ గోరుదువో, అన్ని సంవత్సరములు, స్వయం చ జీవ = స్వయముగ జీవించుము!

దీర్ఘాయుష్యమును స్వేచ్ఛామరణమును సుఖజీవనమును గొప్ప పదవిని, అతులితసంపదను ఇచ్చెదనని ఆపేక్షను కలుగఁజేసి యముఁడు నచికేతసుని-ప్రకృతి భోగములవైపు మరల్ప యత్నించెనని ఇందు తేటపడినది.

"ఏతత్తుల్యం యది మన్యసే వరం-వృణీష్వ విత్తం
చిరజీవికాం చ, మహాభూమౌ నచికేత స్త్వమేధి-కామానాం
త్వా కామభాజం కరోమి" 24

ప. నచికేతః = నచికేతసా! ఏతత్తుల్యం = ముక్తస్వరూప పరిజ్ఞానముఁ గూర్చిన వరముతో సమానమగుదానిగ; వరం = మరియొక వరమును, మన్యసే యది = భావింతువేని, విత్తం = సువర్ణాది ధనమును, చిరజీవికాంచ = చిరంజీవిత్వమును, వృణీష్వ = కోరుము! ఇంతియే గాక మహాభూమౌ = విశాలమైన భూప్రదేశమునందు, త్వం = నీవు, ఏధి = నచికేతసుఁడను పేరుతో, రాజవ్యచూడామణివై వెంపొందుము! త్వా = నిన్ను, కామానాం = దివ్యాంగనాసాహచర్యము మొదలగు మహాభోగ్యములను, కామభాజం = తృప్తిగ ననుభవించువానిగా, కరోమి = చేయగలను.

నచికేతసుఁడా! ముక్త స్వరూపమును తెలిసికొనుటతో ప్రయోజనము లేదు. సార్వభౌముఁడవై భువిని దివ్యసుఖముల ననుభవించు చిరంజీవివై కాంతాకనకసమృద్ధితో ప్రసిద్ధుఁడవు కమ్మని యముఁడు నచికేతసుని మరియొకసారి పరీక్షించెనని భావము

"యే యే కామా దుర్లభా మర్త్యలోకే - సర్వాన్ కామాగ్ం శ్ఛందతః ప్రార్థయస్వ. ఇమా రామాః సరథాః సతూర్యా-
నహీదృశా లంభనీయా మనుష్యైః । అభి ర్మత్ప్రత్తాభిః
పరిచారయస్వ - నచికేతో మరణం మాఽనుప్రాక్షీః" 25

ప. నచికేతః=నచికేతసా! యే యే కామాః=ఏ యే కోరికలు మర్త్యలోకే= మానవలోకమున, దుర్లభాః=పొందనలవిగానివో, సర్వాన్ కామాన్=అట్టి కోరికల నన్నిటిని, ఛందతః=ఇష్టప్రకారము, ప్రార్థయస్వ=విశేషించి కోరుము! ఇమాః=ఈ, రామాః=పురుషుని రమింపఁజేయు అమరనారీమణులు, సరథాః=రథాశ్వగజములతోడను, సతూర్యాః=దివ్యమంగళవాద్యముల తోడను నీకొరకు సిద్ధములుగా నున్నవి.

ఈదృశాః=ఇట్టి దివ్యభోగములు, మనుష్యైః=మానవులచేత, నలంభనీయాః=పొందఁదగినవి కావు, మత్=నాచేత, ప్రత్తాభిః=ఈయఁబడినట్టి, అభిః=ఈ దివ్యాంగనలు మున్నగు పరిచారికలతో, పరిచారయస్వ=సేవింపఁజేసికొనుము! కాని మరణం=మోక్షమును గురించి, మాఽనుప్రాక్షీః=ప్రశ్నింపకుము!

స్వర్గమున అనుభవింపఁదగు భోగములను భూలోకమున నొసఁగెదనని- యముడు నచికేతసుని వైరాగ్యము దృఢపడుటకు నీ వాక్యమునందును పరీక్షించె నని విదితమైనది.

"శ్వోఽభావా మర్త్యస్య యదంతకైతత్సర్వేంద్రియాణాం
జరయంతి తేజః - అపి సర్వం జీవిత మల్పమేవ, తవైవ
వాహా స్తవ నృత్యగీతే' 26

నచికేతసుఁడు దిగువవిధము వక్కాణించెను.

ప. అంతక=యమధర్మరాజా! మర్త్యస్య=మానవుని భోగములు, శ్వోఽభావాః=మరునాడు ఉండునవి కావు, (అనిత్యములని భావము) యదేతత్ = ఏ నీచే ఈయఁబడు దివ్యభోగములైతేనో, సర్వేంద్రియాణాం = ఇంద్రియములన్నిటియొక్క, తేజః = బలమును, జరయంతి = క్షీణింపఁజేయున వి, జీవితం సర్వమపి = జీవితమంతయు, అల్పమేవ = కొద్దికాలముండునదియేను, వాహాః=గజాశ్వరథాదులు, తవైవ = నీకే నుండుగాక! నృత్యగీతే = నాట్య సంగీతములును, తవ = నిన్నే చెందియుండుగాక!

భా. యముఁడు స్త్రీ గజాశ్వసువర్ణగీర్వాయురారోగ్యాదిసంపద ననుగ్రహింతునని నచికేతుని ప్రాకృతభోగాపేక్షను పరీక్షింపగా- నచికేతుఁడు నిండు వైరాగ్యము గలవాడగుటఁజేసి- భోగము లన్నియు శాశ్వతములు కావని ఇందు నిరూపించెను.

"న విత్తేన తర్పణీయో మనుష్యో - లప్స్యామహే విత్త
మద్రాక్ష్మ చేత్త్వా-జీవిష్యామో యావదీశిష్యసి త్వం - వరస్తు
మే వరణీయః స ఏవ'' 27

ప. మనుష్యః = మానవుఁడు, విత్తేన = సువర్ణాదిధనముతో, తర్పణీయః = తృప్తిఁజెందింపఁదగినవాడు, న = కాడు, త్వా = నిన్ను, అద్రాక్ష్మచేత్ = దర్శించినంతమాత్రమున విత్తం = సర్వవిధ సంపదను, లప్స్యామహే=పొందగలుగుదుము. మరియు త్వం

= నీవు, యావత్ = ఎంతకాలము, ఈశిష్యసి = ప్రాణికోటిని శాసించుచుందువో, (తావత్ = అంతకాలమువరకు,) జీవిష్యామః = బ్రతుకగలము. అందువలన స ఏవ వరః = ముక్తస్వరూప ప్రబోధముఁగూర్చిన వరమే. మే = నాకు, వరణీయః = కావలసినది.

భా. ముముక్షువైన మానవునకు గజాశ్వసువర్ణాదిసంపద నిచ్చినను తృప్తి కలుగదనియు, యముని మానవుఁడు జీవితమున దర్శించినంతమాత్రమున సంపన్నుఁడు చిరంజీవి యగునని నచికేతుఁడు భావించి-మరణానంతరము ముక్తుఁడను కావలెనని ఆశించి అట్టి వరమే కావలెనని ప్రార్థించెను.

"అజీర్యతా మమృతానా ముపేత్య - జీర్యన్మర్త్యః
క్వధఃస్థః ప్రజానన్ । అభిధ్యాయన్ వర్ణరతిప్రమోదా
నతిదీర్ఘే జీవితే కో రమేత? 28

ప. జీర్యన్ = జరామరణధర్మము గల, మర్త్యః = నావంటి మానవుఁడు, క్వధఃస్థ, = కుత్సితము క్రిందిదియు నగు భూలోకమున నుండువాడై, ప్రజానన్ = తన జీవితము జరామరణాది దుఃఖభూయిష్ఠమని గుర్తించిన వాడునై, అజీర్యతాం = జరామరణాదులు లేనట్టి, అమృతానాం = ముక్తపురుషులయొక్క స్వరూపస్థితులను, ఉపేత్య = నీవంటివారివలన కనుగొని, వర్ణ = సూర్యాదిరూపములను, రతిప్రమోదాన్ = బ్రహ్మదేవుని ఆనందము ననుభవించుట మున్నగు సుఖవిశేషములను, అభిధ్యాయన్ = చింతించువాడై, అతిదీర్ఘే = చిరకాలస్థాయి యగు, జీవితే = జీవించుట యందు, కో రమేత? = ఎవఁడు ఆసక్తి కలవాడగును?

చిరంజీవిత్వంబు శాశ్వతము కాదని నచికేతసుఁడు భావించి

పునరావృత్తి లేనట్టి శాశ్వతశివసాయుజ్యమే కావలెనని అపేక్షించి-ముక్తస్థితిఁగూర్చియే యముని ప్రశ్నించెనని సారాంశము.

"యస్మి న్నిదం విచికిత్సంతి మృత్యో - యత్సాంపరాయే మహతి బ్రూహి న స్తత్ । యోఽయం వరో గూఢ మను ప్రవిష్టో-నాన్యం తస్మాన్నచికేతా వృణీతే" 29

ప. మృత్యో = మృత్యుదేవా! యస్మిన్ = ఏ ముక్తపురుషుని విషయమై, ఇదం = ఉన్నాడు లేడు అను నీ యంశమును గురించి, విచికిత్సంతి = అమరులు గూడ సంశయించుచున్నారో, మహతి = సర్వోత్తరమగు, సాంపరాయే = పరశివలోకప్రాప్తి విషయమై ఎద్ది తెలిసికొనఁదగినదో, తత్ = ఆ యంశమును, నః = మాకు, బ్రూహి = చెప్పుము! గూఢం = రహస్యభావమును, అనుప్రవిష్టః = పొందినట్టి, యోఽయం = ఏ యీ, వరః = నేనడిగిన వరమో, తస్మాత్ = అట్టి వరమున కంటె, అన్యం = మరియొక వరమును, నచికేతాః = నచికేతసుఁడు, న వృణీతే = కోరఁడు.

స్వర్గాదిభోగములు గూడ శాశ్వతములు కావని గుర్తించి-బ్రహ్మాండోపరి దివ్యాంతరిక్షమున నిత్యప్రకాశముతో రాణించు పరమపదముఁ జేరునట్టి ముక్తపురుషుని లక్షణముఁదగు పరిజ్ఞానము కలుగఁజేయుటయే మూడవ వరమనియు, మరియొక వరము వలదనియు నచికేదసుఁడు-తన పేరుతో యముని ప్రార్థించెను.

ఇయ్యది
శ్రీ నీలకంఠశివాచార్యప్రణీతభాష్యమునకు
శ్రీ నాగలింగశాస్త్రికృత సంస్కృతవ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కఠోపనిషద్గత-ప్రథమవల్లి-సమాప్తము.

శ్రీ మహా గణాధిపతయే నమః

కఠోపనిషత్తు-ద్వితీయవల్లి

"అన్యచ్ఛ్రేయోఽన్యదుతైవ ప్రేయ-స్తే ఉభే నానార్థే పురుష గ్ం సినీతః । తయోః శ్రేయ ఆదదానస్య సాధు-భవతి హీయతేఽర్థాద్య ఉ ప్రేయో వృణీతే" 1

నచికేతుని ముముక్షుత్వమును పరీక్షించి యముఁడు మొదట మోక్షమును ప్రశంసించుచున్నవాఁడు

ప. శ్రేయః = శ్రేయస్సు. అన్యత్ = వేరైనది. ప్రేయః = ప్రేయస్సు, అన్యత్ = వేరైనది. అనఁగా శ్రేయస్సు ప్రేయస్సుగాదు, ప్రేయస్సు శ్రేయస్సు గాదని భావము. ఉతైవ = మరియు, నానార్థే = భిన్నప్రయోజనము గల, తే ఉభే = ఆ రెండు, పురుషం = పురుషుని, సినీతః = తమ వశునిఁ జేసికొనునట్టివి.

తయోః = ఆ శ్రేయఃప్రేయస్సులలో, శ్రేయః = శ్రేయోవిధానమును, ఆదదానస్య = అవలంబించువానికి, సాధు = భద్రము, భవతి = అగుచున్నది. యః = ఎవఁడైతే, ప్రేయః = ప్రేయోవిధానమును, వృణీతే = అపేక్షించునో, (సః = అట్టివాఁడు) అర్థాత్ = పరమ పురుషార్థమునుండి, హీయతే = భ్రష్టుఁడగును.

కేవలము ప్రేయోవిధాన (కర్మయోగ)ము నవలంబింపక నీశ్వ ౹ర్పణబుద్ధితో సంధ్యావందనాది నిత్యనైమిత్తికకర్మల నాచరించుచు చిత్తశుద్ధిఁబడసియు శివపూజనధ్యానాది శ్రేయోవిధానము ననుష్ఠించు

వానికి- పరమపురుషార్థమనఁదగు మోక్షము ఆత్మోన్నత్యముతో చేకూరునని భావము

"శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేత-స్తౌ సంపరీత్యవివినక్తి ధీరః॥ శ్రేయో హి ధీరోఽభిప్రేయసో వృణీతే-ప్రేయో మందో యోగక్షేమాద్వృణీతే" 2

ప. శ్రేయశ్చ= మోక్షవిధానము, ప్రేయశ్చ= కర్మవిధానంబు. మనుష్యం= మానవుని, ఏతః= అభిముఖములుగ పొందునట్టివి, ధీరః= బుద్ధిమంతుఁడు, తౌ= ఆ రెంటిని, (రాజహంస-నీరక్షీరములను వలె) సంపరీత్య=బాగుగా పరిశీలించి, వివినక్తి= విభజించును.

ధీరో హి=బుద్ధిమంతుఁడైతేనో, ప్రేయసోఽభి= ప్రేయస్సును మించిన దానిగా, శ్రేయః= శ్రేయస్సును, వృణీతే= అపేక్షించి ఆచరించును. మందస్తు= అల్పబుద్ధిగలవాడైతే= యోగక్షేమాత్= యోగక్షేమముల కారణముగా, ప్రేయః= ప్రియమైన భోగ్యజాతమును, వృణీతే= కర్మనాచరించుచు అపేక్షించును.

తన బుద్ధిని శివజ్ఞానము ననుష్ఠించుటకు స్థిరపరచినవాడై ఇంద్రియభోగములకై దేవమానవశరీరములు తటస్థించినను శరీరేంద్రియాదులపై మమకారమును తగ్గించుకొని శాంభవదీక్షితుఁడై ముక్తుఁడు కావలెనని సారాంశము.

"స త్వం ప్రియాన్ ప్రియరూపాగ్ంశ్చ కామా-న్నభిధ్యాయన్నచికేతోఽత్యస్రాక్షీః-నైతగ్ం సృంకాం విత్తమయీ మవాప్తో-యస్యాం మజ్జంతి బహవో మనుష్యాః" 3

ప. నచికేతః= నచికేతసా! సః= శ్రేయః ప్రేయస్సులలో

నేదేని కోరు నవకాశము గలయట్టి, త్వం = నీవు, ప్రియాన్ = సహజ ముగ ప్రియములగు పుత్రాదులను, ప్రియరూపాన్ = మనస్సునకు ఇంపైన రూపము గల, కామాన్ = అమరాంగనాసుఖభోగాది కామ్యము లను, అభిధ్యాయన్ = దుఃఖభూయిష్ఠములుగ భావించినవాడవై, అత్యస్రాక్షీః = విడనాడితివి, మరియు ఏతాం = ఈ, విత్తమయీం = ధనపూర్ణంబగు, సృంకాం = తుచ్ఛమైన గతిని, నావాప్తః = పొందని వాడ వైతివి, యస్యాం = ఏ తుచ్ఛమైన సుఖానుభూతియందు, బహవో మనుష్యాః = అనేక మానవులు, నిమజ్జంతి = జలప్రవాహమునందు మునిగినట్లు ఆసక్తులగుచున్నారో.

"దూర మేతే విపరీతే విషూచీ-అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా । విద్యాఽభీప్సినం నచికేతసం మన్యే - న త్వా కామా బహవోఽలోలుపంత" 4

ప. యాచ = ఏది, విద్యేతి = విద్యయనియు, యాచ = ఏది, అవిద్యేతి = అవిద్యయనియు, జ్ఞాతా = పండితులచే తెలియఁబడినవో, ఏతే = అట్టి యీ విద్యావిద్యలు, దూరం = మిక్కిలి, విషూచీ = వేరు వేరు గమనము గలవై, విపరీతే = ఒకదానికి మరియొకటి విరుద్ధమైనవి. ఇతే నచికేతసం = నచికేతసుఁడను నిన్ను, విద్యాభీప్సినం = నిష్కామ కర్మసముచ్చితమైన శివోపాసనమను విద్య నపేక్షించువానిగ, మన్యే = భావించుచున్నాను. కుతః = ఎందుకనఁగా? కామాః = స్వర్గ సుఖాది వాంఛలు, బహవోఽపి = అనేకవిధములైనను, త్వా = నిన్ను న అలోలుపంత = ఆకర్షింపలేదు.

కేవల కర్మగాని, కేవల జ్ఞానముగాని మానవుని తరింపఁజేయఁ జాలవు, నిష్కామనిత్యనైమిత్తికకర్మతో శివు నుపాసించుట యను జ్ఞానమార్గము నవలంబించి తరించవలెనని సారాంశము.

"అవిద్యాయా మంతరే వర్తమానాః - స్వయం ధీరాః
పండితంమన్యమానాః । దంద్రహ్యమాణాః పరియంతి
మూఢా-అంధేనైవ నీయమానా యథాఽంధాః" 5

ప. పుత్ర పశు అన్నాది భోగముల స్వరూపము గల యట్టి అవిద్యాయాం = అ(ల్ప) జ్ఞానమునందు, అంతరే = నడుమ, వర్తమానాః = ఉండునట్టి, స్వయంధీరాః = తమంతటతాము ప్రజ్ఞాశాలుర మని బావించునట్టి. పండితంమన్యమానాః = మేమే వేదశాస్త్ర పండితు మనీ విఱ్ఱవీగునట్టి, మూఢాః = తెలివితక్కువవారు, అంధేనైవ = గ్రుడ్డివానిచే, నీయమానాః = గొంపోవఁబడు, అంధా యథా = గ్రుడ్డి వారివలె, దంద్రహ్యమానాః = కుటిలగతిఁజెందినవారై, పరియంతి = సంసారచక్రమున జననమరణాదులతో పరిభ్రమించుచుందురు.

కామ్యములైన శాస్త్రీయకర్మల యందాసక్తులై స్వర్గసుఖాదుల ననుభవించినను మానవజన్మలు అనివార్యములగుటచే నవ్వానియందు పుణ్యములను పాపములఁజేయుచు-అనుభవమునకై మరల మరల పుట్టుచు గిట్టుచు ఎల్లకాలము సంసారబద్ధులగుదురు గాన నిష్కామ కర్మసహితమగు శివోపాసనచే జన్మరాహిత్యము ఒనగూరుటయే గా॰ శాశ్వత శివానందప్రాప్తి చేకూరునని వివేకము.

"న సాంపరాయః ప్రతిభాతి బాలం-ప్రమాద్యంతం విత్త
మోహేన మూఢమ్। అయం లోకో నాస్తి పర ఇతి
మానీ—పునః పున ర్వశ మాపద్యతే మే" 6

ప. ప్రమాద్యంతం = పుత్ర పశు అన్నాదులయందు అత్యాసక్తితో శాస్త్రీయమార్గమునుండి జారిపడునట్టి, విత్తమోహేన = ధన కనక వస్తువాహనాదుల యందలి అనురాగముతో, మూఢం = తెలివిఁదప్పి

నట్టి, బాలం ప్రతి = వివేకహీనుఁగూర్చి, సాంపరాయః = పరమపదప్రాప్తి సాధనమగు శాస్త్రీయమైన శివోపాసనామార్గము, నభాతి = ప్రకాశింపదు. అనఁగా అవగతము కాదని భావము.

అయం లోకః = ఈ భూలోకము మాత్రము కలదనియు, పరః = పైలోకము నాస్తీతి = లేదనియు, మానీ = భావించువాడు, పునః పునః = మరల మరల, మే = నాయొక్క, వశం = అధీనత్వమును, ఆపద్యతే = పొందును.

దారాపుత్రాది మమకారముతో పరమార్థమును సాధింపనివాడు-జనన మరణములను పొందుచు యమయాతనల ననుభవించుచుండు నని భావము.

> "శ్రవణాయాపి బహుభి ర్యో న లభ్యః-శృణ్వంతోఽపి బహవో యం న విద్యుః। ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా-ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః" 7

ప. యః = ఏ పరమాత్మ, శ్రవణాయాపి = వినుటకు గూడ. బహుభిః = అనేకులచేత. నలభ్యః = పొందనలవిఁగానివాడో, శృణ్వం తోఽపి = వినువారుగూడ, బహవః = పెక్కురు, యం = ఏ పరమాత్మను. న విద్యుః = తెలిసికొనఁజాలరో, అస్య = ఇట్టి పరమాత్మను గురించి, కుశలో వక్తా = సమర్థుఁడైన వక్త, ఆశ్చర్యః = అబ్బురుగ నుండువాడు, కుశలానుశిష్టః = సమర్థుఁడగు ఆచార్యునిచే ఉపదేశింపఁ బడినట్టి, జ్ఞాతా = పరమాత్మను తెలియువాడు, ఆశ్చర్యః = ఒకానొకఁడుగ నుండును. లబ్ధా = పరమాత్మను పొందువాడును, ఆశ్చర్యః = ప్రాకృత జనులకు అచ్చెరువుగ నుండును.

పరమేశ్వరుని గురించి వివరించి చెప్పువారును, భక్తిశ్రద్ధలతో వినువారును, గురూపదిష్టులును ఆజన్మాంతము శివు నుపాసించియే

చిత్తశుద్ధి గలవారై శివోఽహం భావనతో శివుని ధ్యానించి-ప్రారబ్ధ శరీర త్యాగానంతరము పరంజ్యోతిని దర్శించి ముక్తులగుదురని ఇందు విదితమైనది.

"న నరేణావరేణ ప్రోక్త ఏష-సువిజ్ఞేయో బహుధా చింత్యమానః। అనన్యప్రోక్తే గతిరత్ర నాస్త్యణీయాన్-హ్యతర్క్య మణుప్రమాణాత్" 8

ప. ఏషః = ఈ పరమాత్మ, అవరేణ = అభిజ్ఞుఁడు కానట్టి, నరేణ = మానవునిచే, ప్రోక్తః = ఉపదేశింపఁబడినను, బహుధా = ఊహాపోహలతో అనేకవిధములు, చింత్యమానోఽపి = చింతింపఁబడి నను, న సువిజ్ఞేయః = సుఖముగ తెలియువాఁడు కాఁడు. అనన్యప్రోక్తే = సమర్థుఁడైన ఆచార్యునిచే బోధింపఁబడనట్టి, అత్ర = ఈ పరమాత్మ విషయమై- గతిః = తెలిసికొను నవకాశము గూడ, నాస్తి = ఉండదు; ఎందుకనఁగా ? అణుప్రమాణాత్ = సూక్ష్మమగు పరమాణువుకన్న, అణీయాన్ = అతిసూక్ష్మమైనదీ పరమాత్మతత్త్వము; ఇందువలన నిది అతర్క్యం = ఊహింపనలవిఁగానిది,

శివారాధనము లేని పండితులు అవరులనఁబడుదురు- ఇట్టివారు బోధించినను శివజ్ఞానము సంభవింపదు. సమర్థులు బోధించినను అనాది పాపవాసనలు గలవారికి అవగతము కాదు. ఒకవేళ తానే ఊహతో పరమేశ్వరుని గుర్తింపగలనని పెక్కుభంగిముల నాలోచించి నను శివజ్ఞానము కలుగదు గాన శివయోగివర్యుఁడైన కల్యాణదేశికు నాశ్రయించి శాంభవదీక్షితుఁడై శివు నారాధించుచు ధ్యానించినచో పాప పుంజములను విదలించుకొని శివసాక్షాత్కారము నంత్యకాలమునఁ బడయునని సారాంశము.

"నైషా తర్కేణ మతి రాపనేయా- ప్రోక్తాఽన్యేనైవ
సుజ్ఞానాయ ప్రేష్ఠ। యాం త్వమాపః సత్యధృతి ర్బతాసి-
త్వాదృజ్ నో భూయాన్నచికేతః ప్రష్టా" 9

ప ఏషా మతిః = పరమాత్మను గురించి కలిగిన ఈ బుద్ధి, తర్కేణ = ఊహచేత, నాపనేయా = పొందింపఁదగినది కాదు- యాం = ఏ బుద్ధిని, త్వం = నీవు, ఆపః = పొందితివో, హే ప్రేష్ఠ ? మిక్కిలి ప్రియమైనవాడా! ఈ బుద్ధియు, అన్యేన = గురువుచేత, ప్రోక్తా ఏవ = చెప్పఁబడినదే, సుజ్ఞానాయ = పరిపూర్ణ శివజ్ఞానమునకై ఉపయోగించును. నచికేతః = నచికేతసా! సత్యధృతిః = స్వర్గసుఖ భోగాదుల నపేక్షింపక మోక్షమునకై యథార్థమగు ధైర్యము గల వాడవు, అసి = ఐతివి, బత = సంతోషము, త్వాదృక్ = నీయటువంటి, ప్రష్టా = పరమార్థమును గురించి ప్రశ్నించువాడు, నః = మాకు, భూయాత్ = ఇకముందు నుండుగాక!

వివేకము వైరాగ్యము ముముక్షుత్వము సంశయరాహిత్యము మొదలగు సద్గుణములు నచికేతసునకు గలవని యముఁడు ప్రశంసించి- ప్రసన్న చిత్తుఁడై నచికేతసుని పరమార్థజిజ్ఞాసకు అనుగుణమైన ప్రబోధము నొనర్చుచున్నవాడని విదితమైనది.

"జానామ్యహం శేవధి రిత్యనిత్యం - న హ్యధ్రువైః
ప్రాప్య తే హి ధ్రువం తత్ । తతో మయా నాచికేత
శ్చితోఽగ్ని-రనిత్యై ర్ద్రవ్యైః ప్రాప్తవానస్మి నిత్యమ్"

ప శేవధిః = సువర్ణనిధివంటి కర్మఫలము, అనిత్యమితి = శాశ్వతము కాదని, అహం జానామి = నేను గుర్తెరిగియున్నాను. హి = ఎందువలన ననఁగా ? అధ్రువైః = అనిత్యములైన ఇంద్రాది పద

వులతో, ధ్రువం=నిత్యమగు, తత్=పరశివ స్వరూపము, నప్రాప్యతే = పొందఁబడదు. తతః = అందువలన, మయా=నాచేత, నాచికేతః = నచికేతసుని పేరు గల, అగ్నిః = అగ్నిహోత్రము, చితః = వ్రేల్చఁబడినది అనిత్యైః=శాశ్వతములు కానట్టి, ద్రవ్యైః=ఇటికెలు మున్నగు వస్తువులతో, నిత్యం = శాశ్వతమైన శివజ్ఞానమును, ప్రాప్తవానస్మి = పొందిన వాడనైతిని.

యముఁడు ప్రసన్నుఁడై-కామ్యకర్మఫలభోగము శాశ్వతము కాదని గుర్తించి ఇటికెలు సమిధలు ఘృతము ధాన్యము ఇత్యాది అనిత్య వస్తువులచే ఆహుతుల నగ్నియందు నిష్కామ్యముగ శివార్పణ బుద్ధితో సమర్పించి చిత్తశుద్ధిద్వారా శివధ్యాననిష్ఠ యనఁదగు జ్ఞానము నల వఱచుకొంటినని — నచికేతసునకు తన యోగ్యతను వివరించెనని భావము.

"కామస్యాప్తిం జగతః ప్రతిష్ఠాం-క్రతో రానంత్య మభ
యస్య పారమ్ । స్తోమం మహ మురుగాయం ప్రతిష్ఠాం-
దృష్ట్వా ధృత్యా ధీరో నచికేతోఽత్యస్రాక్షీః" 11

ప నచికేతః = నచికేతసా! ధీరః = స్థితప్రజ్ఞుఁడవై, క్రతోః = యాగాది కామ్యకర్మకు, ప్రతిష్ఠాం=ఫలరూపముగ ఆధారమైనట్టి, జగతః = బ్రహ్మాది చరాచరముఁజెందిన, కామస్య = కోరికల చేరిక యొక్క, ఆప్తిం = పొందుటను, క్రతోః = నిష్కామకర్మానుష్ఠాన పూర్వకముగ శివునుపాసించుటఁగురించి, అనంత్యం=అవధిలేకుండు టను, అభయస్య=క్షుత్పిపాసాజరామరణాది భయములేకుండుటకు, పారం = ఆశ్రయమగుటను, స్తోమం = అపహతపాప్మత్వాది నిజగుణసముదాయ ఆవిర్భావమును, మహత్ = సర్వాతిశయమైన, ఉరుగాయం = లోకవేదములందు గొప్ప కీర్తి గలయట్టి, ప్రతిష్ఠాం = పునరావృత్తిరహిత శాశ్వతస్థితిని, దృష్ట్వా=పరిశీలించి, ధృత్యా

= ధైర్యముతో, అత్యస్రాక్షీః = జగద్గతకామ్యముల నన్నిటిని విసర్జించితివి.

నేను నీకు ప్రాకృత దివ్యసుఖభోగములను కలుగఁజేయుదునని చెప్పినను నీవు నిష్కామకర్మననుష్ఠించి చిత్తశుద్ధిని సంపాదించుకొని శివధ్యానముతో సంభవించు శాశ్వత ముక్తస్థితినే ఆశించితివి గాన ధన్యుఁడవని యముఁడు నచికేతసుని ప్రశంసించుచు తన ప్రసన్నతను చాటెనని ఇందు విదితమైనది.

"తం దుర్దర్శం గూఢ మనుప్రవిష్టం-గుహాహితం గహ్వరేష్ఠం పురాణం। అధ్యాత్మయోగాధిగమేన దేవం-మత్వా ధీరో హర్షశోకౌ జహాతి" 12

ప- ధీరః = నిశ్చితబుద్ధిమంతుఁడు. దుర్దర్శం = సుఖముగ చూడనలవిగానట్టి, గూఢం = మాయయవనిక (తెఱ) యందు దాగినట్టి, గుహాహితం = హృదయగుహయందు కర్మవశమున పడవేయఁబడినట్టి జీవాత్మను, అనుప్రవిష్టం = అనుసరించి ప్రవేశించినట్టి, గహ్వరేష్ఠం = బద్ధజీవులకు ప్రవేశింపనలవిగాని దివ్యనుహాకైలాసమున నివసించు, పురాణం = జగత్కారణముగ ప్రాచీనుఁడైన, తం = వేద ప్రసిద్ధుఁడగు దేవం = పరమాత్మను, అధ్యాత్మయోగాధిగమేన = బాహ్యమునుండి మనస్సును మఱల్చి ఆత్మయందు మనస్సును నెలకొలుపుట-అధ్యాత్మయోగమనఁబడును. అట్టి యోగము నభ్యసించుటచే కలుగు విజ్ఞానమున. మత్వా = ఉపాసించి, హర్షశోకౌ = సుఖదుఃఖములను, జహాతి = విడుచును.

శాశ్వత శివసాయుజ్యము-మొదట ఇంద్రియ నిగ్రహముతో మనస్సును నిజరూపజ్ఞానమునకై ఉపయోగించి-ఆత్మదర్శనము.

ద్వారా పరమాత్మను హృదయమున భావించినచో-సమకూరునని. ఇందు విదితమైనది.

"ఏతచ్ఛ్రుత్వా సంపరిగృహ్య మర్త్యః-ప్రవృహ్య ధర్మ్య
మణుమేత మాప్య। స మోదతే మోదనీయం హి లబ్ధ్వా-
వివృతం సద్మ నచికేతసం మన్యే" 13

ప. మర్త్యః = మానవాది ఉత్తమాధికారి, ఏతత్ = ఈ అంతర్యామియగు పరమేశ్వరుని స్వరూపమహిమాదికమును, శ్రుత్వా = సద్గురువువలన విని, సంపరిగృహ్య = మనస్సున బాగుగా విచారించి. ధర్మ్యం = ధర్మసాధనమగు శరీరమును, ప్రవృహ్య = వేరుచేసి (పరిత్యజించి,) ఏత మణు మాప్య = ఈ సూక్ష్మతమమగు పరమాత్మ నాశ్రయించియు, సః = అట్టి శివోపాసకుఁడు, మోదనీయం = అపహతపాప్మత్వాది నిజ స్వరూపమును. లబ్ధ్వా = పొంది, మోదతే = ఆనందించును. నచికేతసం = నచికేతసుఁగూర్చి, సద్మ = పరశివలోకము, వివృతం = తెఱువఁబడిన ద్వారము గలదని, మన్యే = భావించుచున్నాను.

వేదశాస్త్రములవలన పరమాత్మనుగురించి ఆపాతతః జ్ఞానము కలిగినను సంశయనివృత్తికై సద్గురువు నాశ్రయింపవలెననియు, గురూపదిష్టమును ఆచరణలో పెట్టినవాడై శరీర వియోగము వరకు శివు నుపాసించినచో మరణానంతరము పరమేశ్వరుని సంపూర్ణదర్శనమున నిజరూపమును పొంది శివసాయుజ్యముతో బ్రహ్మానందము ననుభవించుననియు వివేకము.

ఆత్మ-పరమాత్మలో లీనమగు ననుటయు, లింగశరీరభంగమే మోక్ష మనుటయు, నిరాధారములని ఇందు తేటపడినది.

"అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాదన్యత్రాస్మాత్కృతాకృతాత్।
అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ-యత్తత్పశ్యసి తద్వద ॥ 14

ప. ధర్మాత్ = పుణ్యమునకంటె, అన్యత్ = వేరైనది, అధర్మాత్ = పాపమునకంటెను, అన్యత్ర = భిన్నమైనదియు, అస్మాత్ = ఈ, కృతాకృతాత్ = కార్యకారణములకంటెను. అన్యత్ర = విలక్షణమైనదియు, భూతాచ్చ = ఐనదానికంటెను, భవ్యాచ్చ = కానున్నదానికంటెను, అన్యత్ర = మరియొకటి; యత్ = ఏ సాధనమును, పశ్యసి = భావనతో ఆచరించుచున్నావో, తత్ = అట్టి పరమసాధనమును వద = వివరించి చెప్పుము !

పుణ్యము శుభమును పాపము అశుభమును కలుగఁజేయుననుట ప్రసిద్ధము గదా ! భూతభవిష్యత్తులు-ప్రపంచమునకు చెందినవగును. వీని నన్నిటిని మించినట్టి శివోపాసన సాధనమును ఈవరకన్న విశదముగా బోధింపుము! అని నచికేతసుఁడు యముని మరల ప్రశ్నించుటచే నచికేతసుని మోక్షేచ్ఛ ప్రబలము నిష్కళంకము నని ఇఁట విదితమైనది.

"సర్వే వేదా యత్పద మామనంతి-తపాంసి సర్వాణి చ
యద్వదంతి। యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి-
తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్" 15

ప సర్వే వేదాః = ఋగ్యజుఃసామాదర్వణవేదములు, యత్ = ఏ, పదం = పరమాత్మ స్వరూపమును ఆమనంతి = ఇంద్రచంద్రాది ద్వారా, సాక్షాత్తుగాను కీర్తించుచున్నవో, సర్వాణి తపాంసి చ = వేదాంతము (ఉపనిషత్తు)లన్నియు, యత్ = ఏ బ్రహ్మమును, వదంతి = ప్రతిపాదించుచున్నవో, యత్ = ఏ పరమాత్మ సంపదను, ఇచ్ఛంతః = కోరువారై, బ్రహ్మచర్యం = గురుకులవాసము స్త్రీసంబంధత్యాగము మొదలగు బ్రహ్మచర్యమును, చరంతి = ఆచరించుచున్నారో, తత్పదం = అట్టి పరమాత్మ

స్వరూపమును, సంగ్రహేణ = బాగుగా తనలో నిమిడ్చుకొను శబ్దముతో, బ్రవీమి = నిరూపించి చెప్పెదను. ఏతత్ = ఇది, ఓమితి = ఓమనునది యగును.

వేదవేదాంత ప్రతిపాద్యమగు పరశివతత్త్వము నవగతముఁజేసికొనుటకై శివయోగిచెంత శాంభవదీక్షఁబరిగ్రహించి స్థూలపంచాక్షరికి సూక్ష్మ పంచాక్షరి యనఁదగు ప్రణవము మూలమని గుర్తించియు ప్రణవసహితశివపంచాక్షరీ మహామంత్రమును జపించుచు ఇష్ట ప్రాణ భావలింగముల నారాధింపవలెనని సారాంశము.

"ఏదద్ధ్యేవాక్షరం బ్రహ్మ-ఏతద్ధ్యేవాక్షరం పరమ్ ।
ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా-యో యదిచ్ఛతి తస్య తత్" 16

ప. ఏతదక్షరమేవ = ఈ ప్రణవాక్షరమే, బ్రహ్మ = జపాదికముచే అభీష్టముల నిచ్చునదగుటఁజేసి-బ్రహ్మముగ ప్రశంసింపఁబడునది. ఏతదక్షరమేవ = ఈ ఓంకారాక్షర మే, పరం = జపింపఁదగిన మహామంత్రములలో శ్రేష్ఠమైనది. ఏతదక్షర మేవ = ఈ ప్రణవాక్షరమునే, జ్ఞాత్వా = ఉపాసించి (అనుష్ఠించి) యః = ఎవఁడు, యత్ = దేనిని, ఇచ్ఛతి = కోరునో, తత్ = అదియంతయు సిద్ధించును.

"ఏతదాలంబనం శ్రేష్ఠ-మేతదాలంబనం పరమ్ ।
ఏతదాలంబనం జ్ఞాత్వా-బ్రహ్మలోకే మహీయతే" 17

ప. ఏతత్ = ఈ అక్షరమే, ఆలంబనం = ధ్యానాధారముగ శ్రేష్ఠం = ముఖ్యమైనది. కావుననే ఏతదాలంబనం = ఈ ప్రణవమే ఆధారముగా గల శివోపాసనము, పరం = సమస్తమహామంత్రానుష్ఠానములలో మిన్నయైనది.

ఏతత్ = ఈ ప్రణవాక్షరముతో కూడిన శివపంచాక్షరీమహా

మంత్రమునే, ఆలంబనం = శివధ్యానమునకు నతిముఖ్యసాధనముగ, జ్ఞాత్వా = భావించి జపించినచో, బ్రహ్మలోకే = శివలోకమునందు, మహీయతే = శివసముద్రై చిరకాలము నివసించును

అకార ఉకార మకార బిందు నాదములతో సూక్ష్మ పంచాక్షరి యనఁదగు ప్రణవమునకు-స్థూలపంచాక్షరియనఁదగు శివమంత్రమునకు ఇతర మంత్రములకన్న నధికసమీపసంబంధముండుటఁజేసి-నాలుగు ఆశ్రమముల వారికి ప్రణవ సహిత శివషడక్షరీ మహామంత్రజపమే. శివోపాసనకు ముఖ్యమైనదని సారాంశము.

"న జాయతే మ్రియతే వా విపశ్చి-న్నాయం కుతశ్చిన్న
బభూవ కశ్చిత్। అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో.
న హన్యతే హన్యమానే శరీరే" 18

ప. విశేషేణ = ప్రత్యేకించి. పశ్యంతీ = కనిపెట్టు, చిత్ = జ్ఞానము గలవాడగుటచే, విపశ్చిత్ = కించిజ్ఞుఁడైన, అయం = ఈ జీవాత్మ, న జాయతే=జన్మించువాడు కాడు,న మ్రియతే=మరణించువాడు కాడు, మరియు కుతశ్చిత్ = ఏదేనొక వ్యక్తినుండి పుట్టువాడు కాడు. ఇంతియే గాక, కశ్చిత్=దేవమానవాదులలో నొకానొకఁడుగ, నబభూవ = లేకుండెను.

ఇందు వలననే "నిజః" "నిత్యః" "శాశ్వతః" అని చెప్పఁబడు యం = ఈ జీవాత్మ, శరీరే హన్యమానే సత్యపి = శరీరము సంహపఁబడినను, న హన్యతే = హింసింపఁబడువాడు కాడు.

కావున నీ యాత్మ-పురాణః = అనాది యని చెప్పఁబడును.

ప్రణవపంచాక్షరితో పరమాత్మ నుపాసించుటకు రాను ఎట్టివాడో

తెలిసికొనుట యవసరమగుటచే యముఁడీవాక్యమున జీవాత్మ యొక్క లక్షణమును వివరించెను.

"హంతా చే న్మన్యతే హంతుం-హత శ్చే న్మన్యతే హతం।
ఉభౌ తౌ న విజానీతో-నాయం హంతి న హన్యతే" 19

ప. హంతా = చంపువాడు, హంతుం (హంతారం) తనను చంపువానిగా, మన్యతే చేత్ = భావించునెడల, హతః = చంపఁబడువాడు, హతం = తనను మరియొకరిచే చంపఁబడువానిగా, మన్యతే చేత్ = తలచునెడల, ఉభౌ తౌ = వారిద్దరు, న విజానీతః = ఆత్మను గుర్తింపనివారగుదురు. వాస్తవమేమనఁగా ? అయం = ఈ జీవాత్మ, న హంతి = సంహరించువాడు కాడు. న హన్యతే = చంపఁబడువాడును కాడు.

పగతుఅచే శరీరము హింసింపఁబడును గాని అతిసూక్ష్మమగు ఆత్మకు ఎట్టి బాధయుండదని గుర్తించి శరీరేంద్రియాదులపై మమకారమును తగ్గించుకొని-శరీరమే నేను-అను భావన లేనివాడై "శివో౭హం" భావనతో శివానుగ్రహపాత్రుఁడు కావలెనని సారాంశము

"అణో రణీయాన్ మహతో మహీయా-నాత్మా౭స్య
జంతో ర్నిహితో గుహాయాం। తమక్రతుః పశ్యతి వీత
శోకో-ధాతుః ప్రసాదా న్మహిమాన మాత్మనః" 20

ప ఆత్మ = పరమాత్మ, అణోః = సూక్ష్మ స్వరూపుఁడైన జీవాత్మకంటె, అణీయాన్ = అతిసూక్ష్మమైనవాడు మహతః = గొప్పదైన ఆకాశమునకన్న, మహీయాన్ = గొప్పవాడగును. 'ఇంతియేగాక, అస్య జంతోః = ఈ ప్రాణియొక్క, గుహాయాం = హృదయగుహయందు, నిహితః = దాగియున్నవాడు.

తం = అట్టి పరశివుని, అక్రతుః = కర్మఫలము నాశింపనివాడై ఉపాసించునెడల, ధాతుః = పరమేశ్వరుని యొక్క, ప్రసాదాత్ = అనుగ్రహమువలన, వీతశోకః = దుఃఖములేనివాడై, ఆత్మనః = పరమాత్మ యొక్క, మహిమానం = గొప్పదనమును, అనఁగా ప్రాకృత ప్రపంచమును మించిన శివస్వరూపమును, పశ్యతి = అవలోకించును.

అణువునకంటె అణువుగ నుండుటయు, మహత్తునకంటె మహత్తుగనుండుటయు పరమేశ్వరుని మహిమలు కాగా-కామ్యములను విసర్జించి చిత్తశుద్ధితో తన నారాధించుచు ధ్యానించువారిని శివుఁడనుగ్రహించి సాక్షాత్కరించునని సారాంశము. మరియు నుపాసించుటకు హృదయగుహయందు సన్నిహితుఁడగు పరశివుని-ఇష్టలింగముగ-బాహ్యమున ధరించి-నిత్యము పూజింపవలెనని ఇందు ద్యోతకమగుచున్నయది.

"ఆసీనో దూరం వ్రజతి-శయానో యాతి సర్వతః ।
కస్తం మదామదం దేవం-మదన్యో జ్ఞాతు మర్హతి?"21

ప. మరియు నీ పరమాత్మ ఆసీనః = ఒకచో స్థిరపడినవాడైనను, దూరం వ్రజతి = దూరప్రదేశములకు వెళ్ళఁగలుగును. శయానః = పరుండినను, సర్వతః = ప్రపంచమునంతయు, యాతి = పొందును. మదామదం = సంతోషదుఃఖభావములు గల, దేవం = స్వయం ప్రకాశ మానుఁడగు పరమాత్మను, మదన్యః = నాకంటె నితరుఁడు, జ్ఞాతుం = తెలిసికొనుటకు, అర్హతి = యోగ్యుఁడగును ?

అణువునకంటె నణువై సర్వవ్యాపియగు పరమాత్మను అనుపాసకుఁడు గుర్తింపఁజాలఁడనియు, నేనాపరమాత్మ నుపాసించి శివతాదాత్మ్యము నొందితిననియు యముఁడు నచికేతునునకు శివోపాసన

యందు ఆత్మవిశ్వాసము కలిగించెనని వివేకము. జీవాత్మద్వారా దుఃఖనటనము, స్వయం సుఖపూర్ణతగలవాడు పరమాత్మయని ఇందు రహస్యము.

''అశరీరం శరీరేష్వ-నవస్థేష్వవస్థితం। మహాంతం విభు
మాత్మానం-మత్వా ధీరో న శోచతి'' 22

ప. ఆత్మానం = పరమాత్మను, అనవస్థేషు శరీరేషు= శాశ్వత స్థితి లేనట్టి దేవమానవాది శరీరములలో, అవస్థిత మపి= అంతర్యామిగ నివసించినను, అశరీరం= ప్రాకృతశరీరము లేనివానిగను, మహాంతం = గొప్పవానిగను, విభుం = సర్వవ్యాపకునిగాను, ధీరః శాంతవదీక్షచే బుద్ధిబలము కలిగిన మహాపురుషుడు, మత్వా = పూజాజపధ్యానముల నుపాసించినచో, నశోచతి= ప్రారబ్ధాంతమున దుఃఖములేనివాడగును.

పరమాత్మ సర్వవ్యాపియై జీవాత్మను వెంటాడినను కర్మవశ్యమగు శరీరము లేనివాడై దివ్యశరీరముతో మహాకైలాసమున నివసించినను భక్తుల మొఱలాలించి రక్షింప వడిగా నేతెంచు మహిమ గలవాడని చింతించువాడు-శరీరవియోగమే తడవుగా పరమపదమున ఆనందించునని ఇందు తేటపడినది.

"నాయ మాత్మా ప్రవచనేన లభ్యో-న మేధయా
నబహునా శ్రుతేన।యమేవైష వృణుతే తేన లభ్య- స్తస్యై
ఆత్మా వివృణుతే తనూగ్ం స్వామ్" 23

ప. అయం = ఈ, ఆత్మ=పరమాత్మ, ప్రవచనేన = వేదాంతములను బాగుగా వివరించి చెప్పుటచేతను, న లభ్యః = లభించువాడు కాడు. మేధయా= గ్రంథార్థమును విని జ్ఞప్తియందు ఉంచుకొను తెలివి

తోడను, న = అందువాడు కాడు. బహునా శ్రుతేన = పలుమారులు వినుట తోడను, న = గోచరింపడు.

ఐతే ఏషః = ఈ పరమాత్మ, యం = ఏ ఉపాసకుని, వృణుతే = అనుగ్రహించునో, తేనైవ = అట్టి ఉపాసకునిచేతనే, లభ్యః = పొందఁదగినవాడు మరియు ఏష ఆత్మా = ఈ పరమాత్మ, స్వాం తనూం = తనదైన దివ్య స్వరూపమును, వివృణుతే = విశదీకరించుటద్వారా ప్రసాదించును పరమేశ్వరుని దర్శించుటకు ప్రవచనము, మేధ, బహుశ్రుతము ఉపయోగింపవనియు, నిశ్చలమనంబున శాంభవదీక్షితుఁడై శివారాధనమును శివమంత్రజపమును శివధ్యానమును నిత్యము ఆజన్మాంతము ఆచరించు శివయోగిని పరమేశ్వరుఁడనుగ్రహించి-తన ఆనందమయ స్థితి నొసఁగుననియు వివేకము.

"నావిరతో దుశ్చరితా - న్నాశాంతో నాసమాహితః,
నాశాంతమానసో వాఽపి-ప్రజ్ఞానేనైన మాప్నుయాత్"

ప. దుశ్చరితాత్ = దుర్మార్గప్రవర్తనమునుండి. అవిరతః = తప్పుకొననివాడు, అశాంతః=ఇంద్రియచాంచల్యము గలవాడు, అసమాహితః = ఏకాగ్రచిత్తము లేనివాడు, అశాంతమానసః = మనోవికారములఁజెందువాడు, ప్రజ్ఞానేనవాఽపి = వేదాంత పరిజ్ఞానమాత్రమున, ఏవం = ఈ పరమాత్మను, నాప్నుయాత్=పొందఁజాలడు.

వేదశాస్త్ర పాండిత్యముచే శివస్వరూపమును పరోక్షముగ గుర్తించి పరమేశ్వరుని సాక్షాత్కారము అను అపరోక్షజ్ఞానమునకై పూజా జప ధ్యానముల నాచరించు శివయోగికే-ప్రారబ్ధాంతమున శివానుగ్రహముచే శివానందము లభించునని-ఇందు విదితమైనది.

"యస్య బ్రహ్మ చ క్షత్రం చ-ఉభే భవత ఓదనః,
మృత్యు ర్యస్యోపసేచనం-క ఇత్థా వేద యత్ర సః"25

ప. యస్య = ఏ పరమాత్మకు, బ్రహ్మ చ = బ్రాహ్మణవర్గము, క్షత్రం చ = క్షత్రియులు మొదలగు ప్రాణులందరును, ఉభే = ఈ రెంటితో నిండిన ప్రపంచము, ఔదనః = ప్రళయమున ఆహారము, భవతః = అగుచున్నదో, యస్య = ఏ శివునకు, మృత్యుః = మృత్యు కారకులగు యమాదులు, ఉపసేచనం = వ్యంజనమో, యత్ర = ఎట్టి మహిమయందు, సః = ఆ పరమాత్మ యుండునో, అట్టి మహిమ ఇత్థా = ఇవ్విధంబేనని, కః = ఎవఁడు, వేద = గుర్తెరుగును ?

"బ్రహ్మ చ క్షత్రంచ" "బ్రాహ్మణులు, క్షత్రియులు" అని చెప్పుట-ప్రపంచమున దేవమానవాదులలో బ్రాహ్మణులుక్షత్రియులు ముఖ్యులని తెలుపునది. ప్రపంచమును ఆహారముగ స్వీకరించు పరమేశ్వరుని మహిమ చెప్పనలవిఁగానిదగుటచే-మేధాదులచే పరమాత్మను కనుగొనఁజాలరనియు, శాంభవదీక్షితులై తననుపాసించువారికే శివుని మహిమ అవగత మగుననియు సారాంశము.

ఇయ్యది
శ్రీ నీలకంఠ శివాచార్య ప్రణీత భాష్యమునకు
శ్రీ నాగలింగశాస్త్రి కృత సంస్కృత వ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కఠోపనిషద్గత ద్వితీయవల్లి-సమాప్తము.

శ్రీ మహా గణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణా మూర్తయే నమః

కఠోపనిషత్తు-ప్రథమాధ్యాయము

తృతీయ వల్లి

"ఋతం పిబంతౌంసుకృతస్య లోకే-గుహాం ప్రవిష్టౌ
పరమే పరార్థ్యే-ఛాయాఽతపౌ బ్రహ్మవిదో వదంతి-
పంచాగ్నయో యే చ త్రిణాచికేతాః'' 1

ప. జీవాత్మ పరమాత్మలు, సుకృతస్య = పుణ్యముయొక్క, లోకే = భోగరూపమగు మానవలోక (శరీర)మునందు, ఋతం = జీవపరముగా కర్మఫలమును, ఈశ్వరపరముగా సంకల్ప ఫలమును, పిబంతౌ = అనుభవించువారై, గుహాం = హృదయగుహను, ప్రవిష్టౌ = ప్రవేశించినవారై, పరమే = ఉత్కృష్టమగు, పరార్థ్యే = సర్వ శ్రేష్ఠమైన చిదాకాశమునందు ఛాయాచు తపౌ = నీడ ఎండల వలె వర్తింతురు.

ఈవిధముగా-బ్రహ్మవిదః = శివోపాసకులు, పంచాగ్నయః = గార్హపత్య దక్షిణ, ఆహవనీయ, సభ్య, ఆవసధ్యములు అనఁబడు ఐదుగ్నుల నుపాసించిన వారు, త్రిణాచికేతాః = ప్రాత ర్మధ్యాహ్న సాయంకాలముల నగ్నిని హవనముఁజేయువారును-వదంతి = వక్కాణించుచున్నవారు.

రెండవవల్లి యందు జితేంద్రియులై తన నుపాసించువారిని శివుఁడను గ్రహించునని నిరూపింపఁబడినది. ఇఁక నీ తృతీయవల్లి యందు- ఇంద్రియములను జయించి శివునుపాసించుట-కఠినము కాద నియు, తన నుపాసించుటకై శివుఁడు-జీవాత్మకు చేరువగా హృదయ గుహలో దహరాకాశమునందు నివసించుననియు, జీవాత్మ-హృదయ గుహయందు నీడవంటివాడై కించిజ్ఞుఁడుగా కర్మఫలమునను భవించు ననియు, పరమాత్మ-ఎండవంటివాడై సర్వజ్ఞుఁడుగా తన సంకల్ప ముచే లీలావిలాసముగ హృదయగుహయందు రాణించుననియు ఇందు విదితమైనది.

జీవాత్మకు హృదయ గుహయందు సన్నిహితుఁడగు పర మాత్మను బాహ్యమున లింగాంగ సామరస్యముతో ఇష్టలింగము నారాధించినచో-అంతర్దృష్టి గలవాడై భావలింగమును ధ్యానించి దహరాకాశమున శివుని దర్శింపఁగలుగునని వివేకము.

"యః సేతు రీజానానా-మక్షరం బ్రహ్మయత్పరం,
అభయం తితీర్షతాం పారం-నాచికేతగ్ం శకేమహి" 2

ప. యః = ఏ పరమాత్మ, ఈజానానాం = ఇంద్రవరుణాది దేవతల నారాధించువారికి, సేతుః = పరమావధిగ నుండువాడో, అక్షరం బ్రహ్మ = బ్రహ్మమనఁదగు ప్రణవాక్షరము (ప్రణవ సహిత శివ పంచాక్షరము) యత్పరం = ఏ పరమాత్మ పరుఁడుగా కలదో, (లేక) యత్ = ఏ శివతత్త్వము, పరం = శ్రేష్ఠమైన, అక్షరం = = వినాశములేనట్టి, బ్రహ్మ = సర్వవ్యాపకమగు బ్రహ్మయో, తితీర్ష తాం = బ్రహ్మమును పొందఁగోరువారికి, అభయం పారం = భయము లేని తీరమగునో, అట్టి పరమాత్మను నాచికేతం = అగ్నిహవనాది

కర్మసహిత జ్ఞానయోగముచే ప్రాప్యునిగా కనుగొనుటకు శక్తేమహి = సమర్థులము కాగలము.

వ. పరమాత్మ హృదయగుహావర్తిగ సన్నిహితుఁడగుటచే నా పరమ పురుషుని ప్రణవపంచాక్షరితో నుపాసించుటకు మనము సమర్థులమే, కాని ఇంద్రియజయమునకై ప్రయత్నింపవలెననియు, ఆయాదేవతల నంతర్యామియై సర్వకర్మఫలముల నొసఁగువాడు శివుఁడే ననియు, తన భూమిలో హిరణ్య నిధి యున్నదని తెలిసిన వాడు నిధికై శత ప్రయత్నముల నొనర్చునట్లు—స్వహృదయాంతర్వర్తియగు శివుఁజేరుటకు మనో నిగ్రహమును ఇంద్రియజయమును సాధింపవలె ననియు ఇందు ద్యోతకమగుచున్నందున, కెగువన ఇంద్రియజయ విధానము నిర్దేశింపఁబడినది.

"ఆత్మానం రథినం విద్ధి-శరీరం రథ మేవ తు,
బుద్ధిం తు సారథిం విద్ధి-మనః ప్రగ్రహ మేవ చ" 3
"ఇంద్రియాణి హయా నాహు-ర్విషయాం స్తేషు గోచరాన్,
ఆత్మేంద్రియమనోయుక్తం-భోక్తే త్యాహు ర్మనీషిణః"4

వ. ఆత్మానం = జీవాత్మను; రథినం = రథస్వామిగాను; శరీరం = దేహమును; రథం = రథముగాను విద్ధ = గుర్తింపుము! బుద్ధిం = నిశ్చయాత్మకబుద్ధిని; సారథిం = నియంతగాను; మనః = మనస్సును; ప్రగ్రహం = పగ్గముగాను; విద్ధి = తెలియుము!

ఇంద్రియాణి = కర్మజ్ఞానేంద్రియములను; హయాన్ = అశ్వములుగా; విషయాన్ = శబ్ద స్పర్శరూప రస గంథాది విషయములను; తేషు = ఆ ఇంద్రియముల విషయమై; గోచరాన్ = మార్గములుగా; ఆహుః = విజ్ఞానులు చెప్పుదురు. ఆత్మేంద్రియమనో

యుక్తం = శరీర ఇంద్రియ మనస్సులతో కూడిన జీవాత్మను; భోక్తేతి = సుఖ దుఃఖముల ననుభవించువానిగా; మనీషిణః = విద్వాంసులు; ఆహుః = వక్కాణింతురు.

మనస్సను పగ్గముతో ఇంద్రియములను గుఱ్ఱముల నడుపులో పెట్టుటకు బుద్ధియను సారథియొక్క సహకారము అవసరమనియు, సారథి రథికుఁడును అధిష్ఠించుటకు శరీరము ఆధారమనియు; శరీరము మనస్సు ఇంద్రియములుకలిగి యున్నచో జీవాత్మ-కర్త భోక్తయు కాజాలుననియు, ఇందు రథిక రథ సారథి అశ్వ మార్గముల రూపకముతో జీవాత్మాదుల లక్షణములు పేర్కొనఁబడి నవని వివేకము.

ఇఁట గల ఆత్మశబ్దమునకు-"తాను అనఁగా శరీరముతో కూడిన ఆత్మ అను నర్థమే సమంజసంబైనది.

"య స్త్వవిజ్ఞానవాన్ భవ త్యయు క్తేన మనసా సదా,
తస్యేంద్రియాణ్యవశ్యాని-దుష్టాశ్వా ఇవ సారథేః" 5

ప. యస్తు = ఏజీవాత్మ ఐతేనో, అవిజ్ఞానవాన్ = అవివేకము గలవాడై, అయుక్తేన = నిగ్రహము లేనట్టి, మనసా = మనస్సుతో, సదా = ఎల్లకాలము, భవతి = ఉండునో, తస్య = అట్టి రథికున (జీవాత్మ)కు, ఇంద్రియాణి = జ్ఞానకర్మేంద్రియములు, సారథేః = అసమర్థుఁడైన సారథికి, దుష్టాశ్వా ఇవ = దుడుకు గుఱ్ఱములవలె, అవశ్యాని = స్వాధీనములు కాకుండును.

బుద్ధిబలముతో మనస్సు నదుపులో పెట్టనివాని యొక్క ఇంద్రియములు-విషయములవైపు పరుగిడుననియు, మనశ్చాంచల్యముచే శివు నుపాసించు యోగ్యత లేనివాడై వ్యసనములపాలై ప్రపంచపర మార్థములకు దూరమగునని భావము.

"యస్తు విజ్ఞానవాన్ భవతి-యుక్తేన మనసా సదా,
తస్యేంద్రియాణి వశ్యాని-సదశ్వా ఇవ సారథేః' 6

ప. యస్తు = ఎవఁడైతే, విజ్ఞానవాన్ = ధర్మాధర్మవివేకము గలవాఁడై, యుక్తేన = నిగ్రహింపబడిన, మనసా = అంతఃకరణముచే సదా = జీవితము మొత్తము, భవతి = ఉండునో, తస్య = అట్టి మహా పురుషునకు, ఇంద్రియాణి = త్వక్ చక్షుః శ్రోత్రజిహ్వాఘ్రాణములు, వాక్ పాణిపాదపాయూపస్థములు అను దశేంద్రియములు, సారథేః = సమర్థుఁడైన సారథికిః సదశ్వాఇవ = ఉత్తమాశ్వములవలె, వశ్యాని = లొంగినవగును.

పూర్వజన్మ సుకృతమున శాస్త్ర ఆచార్యోపదేశమునందలి విశ్వాసముతో ఏర్పడిన వివేక (బుద్ధిబల)ము వలన మనస్సును నిగ్రహించువానికి-మంచి గుఱ్ఱములు-నేర్పరియగు రథసారథికి అనుకూలములగునట్లు-ఇంద్రియములన్నియు స్వాధీనములగుటచే మనోబుద్ధిబలముతో శివు నారాధింప నర్హుఁడగునని-సారాంశము.

"యస్త్వవిజ్ఞానవాన్ భవత్యమనస్కః సదాఽశుచిః,
న స తత్పద మాప్నోతి-సంసారం చాధిగచ్ఛతి" 7

"యస్తు విజ్ఞానవాన్ భవతి-సమనస్కః సదా శుచిః,
సతు తత్పద మాప్నోతి-యస్మా ద్భూయో న జాయతే"8

ప. యస్తు = ఎవఁడైతే, అవిజ్ఞానవాన్ = బుద్ధిబలము లేనివాఁడై, అమనస్కః = మనోనిగ్రహము లేనివాఁడునై, సదా = ఎల్లకాలము, అశుచిః = శరీర వాఙ్మనఃశుద్ధి లేనివాఁడుగా, భవతి = ఉండునో, సః అట్టి కనిష్ఠుఁడు, తత్పదం = శివస్వరూపమును, నాప్నోతి = పొంద

కుండును. మరియు సంసారంచ = జనన మరణజరాతాపత్రయసంభ రితమగు సంసారమును, అధిగచ్ఛతి = పునఃపునః పొందుచుండును.

యస్తు = ఎవడైతే, విజ్ఞానవాన్ = బుద్ధిబల (వివేక)ము గల వాడై, సమనస్కః = స్థిరమైన మనస్సు గలవాడునై, సదా = జీవిత మంతటను, శుచిః = నిర్మలుడై, భవతి = ఉండునో, సతు = అట్టి ఉత్తముడే, యస్మాత్ = ఏ స్వరూపమువలన, భూయః = మరల, న జాయతే = జన్మింపడో, తత్పదం = అట్టి దివ్యశివస్వరూపమును ఆప్నోతి = పొందును.

ఇంద్రియ మనోనిగ్రహము బుద్ధిబలంబు లేనివానికి-శివోపాస నము ఘటింపదు గాన అట్టివాడు జన్మపరంపరలో నుండుననియు మనోనిగ్రహముతో ఇంద్రియముల నరికట్టుటకు వలయు బుద్ధిబల మున శివు నుపాసించువానికి-పునరావృత్తిరహితమగు శివసాయు జ్యము చేకూరునని వివేకము.

"విజ్ఞానసారథి ర్యస్తు-మనఃప్రగహవా న్నరః ।
సోఽధ్వనః పార మాప్నోతి-తద్విష్ణోః పరమం పదమ్"

ప. యస్తు నరః = ఏ మానవోత్తముడైతే, విజ్ఞానసారథిః = సమీచనబుద్ధి సారథిగ గలవాడై, మనఃప్రగహవాన్ = వికల్పరహిత మైన మనస్సును పగ్గముగ నమర్చుకొనినవాడై, శివు నారాధించునో, సః = అట్టి మహాత్ముడు, అధ్వనః = సంసారమార్గమునకు, పారం = పరమావధి యగు స్థానమును, ఆప్నోతి = పొందును.

తత్ = అట్టి స్థానము, విష్ణోః = బ్రహ్మాండసీమయగు విరజా నదీతీరమునందు గల వైకుంఠమున నివసించు విష్ణువునకంటె, పర మం = శ్రేష్ఠంబగు, పదం = స్వరూపంబగును.

"ఉభయనిర్దేశే పంచమీబలీయాన్" పంచమీషష్ఠీవిభక్తుల నిర్దేశమున-పంచమీవిభక్త్యర్థము బలిష్ఠ" మను పూర్వమీమాంసాన్యాయము ననుసరించి "విష్ణోః" అనుచో "విష్ణువునకంటె" అని చెప్పుటయే సమంజసమైనది.

బ్రహ్మాండమునకు పొలిమేఱ యగు విరజానదియొక్క తీరము నందు విలసిల్లు వైకుంఠము ననుసరించియే శివపదమును ముక్తపురుషుఁడు చేరును. మనోబుద్ధుల సహకారమున శివు నుపాసించువారు-శరీరము విడిబడుటయే తడవుగా-శివలోకముఁజెంది శివానందామృతాస్వాదలోలురై తుచ్ఛమైన దేవమానవాది జన్మపరంపరలోనికి రారని-కఠోపనిషద్గతమైన యమనచికేతః సంవాదము నొక్కి చెప్పుచున్నయది.

"ఇంద్రియేభ్యః పరా హ్యర్థా-అర్థేభ్యశ్చ పరం మనః,
మనస స్తు పరా బుద్ధి-ర్బుద్ధే రాత్మా మహాన్ పరః" 10
"మహత పరమవ్యక్త-మవ్యక్తాత్ పురుషః పరః,
పురుషా న్న పరం కించిత్-సా కాష్ఠా సా పరా గతిః"

ప. ఇంద్రియేభ్యః = ఇంద్రియములకంటె, అర్థాః = విషయములు, పరాః = శ్రేష్ఠములు, అర్థేభ్యః = విషయములకంటె, మనః = మనస్సు, పరం = బలిష్ఠము, మనసః = మనస్సునకంటె, బుద్ధిః = బుద్ధి, పరా = ముఖ్యమగునది, బుద్ధేః = బుద్ధికన్న, మహాన్ ఆత్మా = ఇంద్రియవిషయ మనోబుద్ధులను ఆశ్రయమగుటచే మహాన్ అనఁదగు జీవాత్మ, పరః = మిన్నయగుమ.

మహతః = జీవాత్మకంటె, అవ్యక్తం = శరీరము, పరం = శ్రేష్ఠమైనది, అవ్యక్తాత్ = శరీరమునకన్న, పురుషః = పరమాత్మ,

పరః = ఉత్తముఁడగును, పురుషాత్ = పరిపూర్ణుఁడైన పరమాత్మ కంటె, కించిత్ = ఏదియు, పరం న = శ్రేష్ఠము లేదు. సా = అట్టి పరమపురుషప్రాప్తియే, కాష్ఠా = జీవాత్మప్రాప్యముగ పరమావధి యగునది, సా = అట్టి పరమేశ్వరుఁ జేరుటయే, పరాగతిః = ఉత్తమ గతియగును.

నిశ్చయాత్మకబుద్ధిబలమున జీవాత్మ మనస్సును నిగ్రహించి ఇంద్రియములను విషయములనుండి మఱల్చి పరమేశ్వరాభిముఖము లుగ నొనర్చియు పరమేశ్వరుని ప్రార్థింపవలెనని సారాంశము.

"ఏష సర్వేషు భూతేషు-గూఢోఽఽత్మా న ప్రకాశతే,
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా-సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః

ప. సర్వేషు భూతేషు = ప్రాణులందరిలో, గూఢః = దాగినట్టి, ఏష ఆత్మా = ఈ పరమాత్మ, న ప్రకాశతే = బాహ్యేంద్రియగోచ రుఁడు కాడు, కింతు = కాని, సూక్ష్మదర్శిభిః = జీవాత్మకంటె సూక్ష్మ మగు పరమాత్మ నుపాసించువారిచే, అగ్ర్యయా = ఏకాగ్రమగునట్టి సూక్ష్మయా = వివేకముచే వికల్పములేనట్టి, బుద్ధ్యా = ధ్యానరూపమగు భావనచే, దృశ్యతే = గాంచఁబడును.

చిత్తశుద్ధితో ఏకాగ్రబుద్ధిని శివపూజాజపధ్యానముల నొనర్చు వారికి-పరమాత్మ సాక్షాత్కరించునని ఇందు విదితమైనది.

"యచ్ఛేద్వాఙ్మనసీ ప్రాజ్ఞ-స్తద్యచ్ఛేత్ జ్ఞాన ఆత్మని
జ్ఞాన మాత్మని మహతి-నియచ్ఛే త్తద్యచ్ఛే చ్ఛాంత ఆత్మని"

ప. ప్రాజ్ఞః = విడువదగినది ఏదియో, గ్రహింపఁదగినదేదియో, నిర్ణయించుకొను వివేకము గలవాడు, వాక్ = వాక్కు మొదలగు

ఇంద్రియములను, మనసి = మనస్సునందు నియమింపవలెను, తత్ = ఇంద్రియములను లోబఱచుకొనిన మనస్సును, ఆత్మవి జ్ఞానే = జీవాత్మను సమీపించియుండు బుద్ధియందు, యచ్ఛేత్ = నిలుపవలెను.

జ్ఞానం = తెలివిగ పేర్కొనఁదగు బుద్ధిని, మహతి ఆత్మని = ఇంద్రియ మనోబుద్ధులకన్న గొప్పయగు జీవాత్మయందు, నియచ్ఛేత్ = స్థిరపరుచవలెను, తత్ = ఇంద్రియమనోబుద్ధులను తన యధీనముల నొనర్చుకొనిన జీవాత్మను, శాంతే ఆత్మని = నిర్వికారుఁడైన పరమాత్మయందు, యచ్ఛేత్ = నిలుపవలెను.

బుద్ధియొక్క అదుపులో నుండు మనస్సును ఇంద్రియములవైపు పోనీయక అనఁగా- ఇంద్రియవ్యాపారముల నన్నిటిని మనస్సు ద్వారా బుద్ధినాశ్రయింపఁ జేయవలెననియు, బుద్ధిని ఆత్మయందు నిలిపి-ఆత్మను-పరమాత్మను ధ్యానించుటలో ఉపయోగింపవలెను. దీనినంతటిని చేయుటకు-శాంభవదీక్షితుఁడు సమర్థుఁడగునని భావము.

"ఉత్తిష్ఠత జాగ్రత! ప్రాప్య వరా న్నిబోధత,
క్షురస్య ధారా నిశితా దురత్యయా-దుర్గం పథ
స్తత్కవయో వదంతి" 14

ప. ఉత్తిష్ఠత = ముముక్షువులారా! ఇంతపరకు పరమేశ్వరుని మఱచి ఇంద్రియసుఖానుభవము గల అజ్ఞాననిద్రలోనుంటిరి. అట్టి నిద్రను చాలించి మేలుకొనుఁడు! వరాన్ = శివయోగిశ్రేష్ఠులను, ప్రాప్య = ఆశ్రయించి, నిబోధత = శివోపాసనవిధానమును తెలిసికొనుఁడు!

ఒకవేళ మీ బుద్ధిబలముతోడనే శివజ్ఞానమును సంపాదింపనెంతు

రేని దురత్యయా = దుఃఖముచేతగూడా అతిక్రమింప నలవిగానట్టి క్షురస్యధారేవ = కత్తి అంచువలె, దుర్గం పథః = గురుకటాక్షము లేనిది-పరమేశ్వరునుపాసించి సాక్షాత్కరింపఁజేసికొనుట- కంటక పాషాణాదిసంకులమైన మార్గముగ నుండును.

కల్యాణదేశికునిఁజేరి ప్రార్థించి శాంభవదీక్షఁబరిగ్రహించినవాడై ఇష్టప్రాణభావలింగాత్మకుఁడగు పరమేశ్వరుని పూజాజపధ్యానము లతో అరాధించువానికే పరమేశ్వరుఁడు ప్రసన్నుఁడై ప్రారబ్ధాంత మున సాక్షాత్కరించునని సారాంశము.

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం-తథాఒరసం
నిత్యమగంధవచ్చ యత్, అనాద్యనంతం మహతః
పరం ధ్రువం నిచాయ్య తన్మృత్యుముఖాత్ప్రముచ్యతే"

ప. పంచభూతాత్మక ప్రకృతిఁ జెందిన శబ్ద స్పర్శరూపములు లేని దగుటచే-అశబ్దము, అస్పర్శము అరూపంబునని చెప్పఁబడునట్టి, అవ్యయం = వృద్ధిక్షయములు లేనిదియు, అరసం = రసము లేనిదియు, అగంధవచ్చ = గంధము లేనిదియు, నిత్యం = శాశ్వతమైన దియు నగునది, యత్ = ఎద్దియో, తత్ = అట్టి శివతత్త్వమును అనాద్యనంతం = ఆది అంతములు లేనిదిగను, మహతః = జీవాత్మ కంటె, పరం = శ్రేష్ఠమైనదిగాను, ధ్రువం = స్థిరమైనదానిగాను, నిచాయ్య = ఉపాసించి సాక్షాత్కరింపఁజేసికొని, మృత్యుముఖాత్ = జననమరణరూపమగు మృత్యుముఖమునుండి, ప్రముచ్యతే = విడి బడును.

శివస్వరూపము- ప్రాకృతము గానిదై దివ్యంబని భావించు

శైవుఁడు-అంత్యకాలమున శివుని దర్శించి ముక్తుఁడగునని ఇందు విదిత మైనది.

"నాచికేత ముపాఖ్యానం-మృత్యుప్రోక్తం సనాతనం,
ఉక్త్వాశ్రుత్వాచ మేధావీ-బ్రహ్మలోకే మహీయతే" 16

ప. నాచికేతం = నచికేసుఁ జెందినట్టి, మృత్యుప్రోక్తం = యమునిచే చెప్పఁబడినట్టియు, సనాతనం = అనాదికాలస్థితమగు, ఉపాఖ్యానం = ఇతిహాసమును, మేధావీ = గ్రంథార్థమును నిరూపించు ప్రజ్ఞగల పండితుఁడు, ఉక్త్వా = వక్కాణించినను, శ్రుత్వా చ = సమర్థునివలన వినినను, బ్రహ్మలోకే = శివలోకమునందు, మహీయతే = శివసముఁడై శివానందము ననుభవించు గొప్పవాడగును.

ఈ నచికేతోయమ సంవాదమును వివరించి చెప్పువాడు, మనః పూర్వకముగ వినువాడును శివానుగ్రహపాత్రులగుదురని భావము.

"య ఇమం పరమం గుహ్యం-శ్రావయేత్ బ్రహ్మసం
సది, ప్రయతః శ్రాద్ధకాలే వా-తదానంత్యాయ కల్పతే,
తదానం త్యాయ కల్పతే" 17

ప. యః = ఏ భక్తుఁడు, పరమం = శ్రేష్ఠము, గుహ్యం = రహస్యము, ఇమం = ఈ ఆఖ్యానమును, ప్రయతః = సదాచారాది నియమము గలవాడై బ్రహ్మసంపది = బ్రాహ్మణసమాజమున, శ్రాద్ధ కాలే వా = పితృకర్మసమయమునందైనను, శ్రావయేత్ = శ్రాద్ధభోక్త లకు వినిపించునో, తత్ = అట్టి శ్రాద్ధము, ఆనంత్యాయ = అనంత ఫలప్రాప్తికై, కల్పతే = సమర్థంబగును.

సదాచార సంపన్నులకు శ్రాద్ధభోక్తలకును ఈ కఠోపనిషద్గత

మైన యమనచికేతః సంవాదమును వినుపించుట-వక్తకు శ్రోతకును శ్రేయస్కరమై శ్రాద్ధాదికర్మలను పరిపుష్టములఁ జేయునని వివేకము.

ఇయ్యది
శ్రీ నీలకంఠ శివాచార్యప్రణీత భాష్యమునకు
శ్రీ నాగలింగశాస్త్రికృత సంస్కృత వ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కఠోపనిషద్గత-తృతీయవల్లి,
ప్రథమాధ్యాయము-సమాప్తము.

* * *

ఓమ్

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణా మూర్తయే నమః

కఠోపనిషత్తు-ద్వితీయాధ్యాయము

ప్రథమవల్లి

"పరాంచి ఖాని వ్యతృణ త్స్వయంభూ-స్తస్మా త్పరాఙ్
పశ్యతి నాంతరాత్మన్, కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్ష
దావృత్తచక్షు రమృతత్వ మిచ్ఛన్" 1

ప. ఖాని = దశేంద్రియములను, పరాంచి = ఇంద్రియభిన్నములు ఇంద్రియ గతములు నగు విషయములను వెలుబఱచునవిగా, స్వయంభూః = పరమేశ్వరుఁడు, వ్యతృణత్ = మధించి సృష్టించెను, తస్మాత్ = అందువలన, పరాఙ్ = విషయములనే, పశ్యతి = అవలోకింతురు. అంతరాత్మన్ = అంతర్యామియగు పరమేశ్వరుని, న= దర్శింపరు. ఐతే కశ్చిత్ = ఒకానొక, ధీరః = పురుషశ్రేష్ఠుఁడు, ఆవృత్తచక్షుః = నేత్రము మొదలగు ఇంద్రియములను విషయముల నుండి మరల్చినవాడై, అమృతత్వం = మోక్షమును, ఇచ్ఛన్ = కోరువాడునై, ప్రత్యగాత్మానం = జీవాత్మ ప్రేరకుఁడగు పరమాత్మను ఐక్షత్ = అవలోకింపఁగలుగును.

పరమేశ్వరుఁడు సర్వస్వతంత్రుఁడగుటచే- సృష్టిపరంపర కొనసాగుటకై ఇంద్రియములను విషయాభిముఖములుగ నిర్మించి

తనను ప్రార్థించినచో విషయముల నుండి ఇంద్రియములను నిగ్రహింపఁగలుగు సామర్థ్యమును ధీరునకు ప్రసాదించి సాక్షాత్కరించుననియు, ప్రవాహమును ఎదురుప్రవాహము అడ్డుకొనునట్లు ధీరుఁడు ఆత్మబలముతో పరమేశ్వరుని దర్శింపఁగలుగుననియు విదితమైనది.

"పరాచః కామా ననుయంతి బాలా-స్తే మృత్యో ర్యంతి
వితతస్య పాశం, అథ ధీరా అమృతత్వం విదిత్వా—
ధ్రువ మధ్రువేష్విహ న ప్రార్థయంతే" 2

ప. బాలాః = అజ్ఞానులు, పరాచః = ఇంద్రియవిషయగతములైన, (పరాన్ = విషయములను. అంచంతీతి = పొందుచున్నవిగాన పరాంచి అనఁబడును.) (పరాఙ్ పరాంచౌ పరాంచః, పరాంచం పరాంచౌ పరాచః, అని పులింగ శబ్ద నిర్వచనము).

కామాన్ = కోరికలను, అనుయంతి = అనుసరింతురు. తే = అట్టి స్వల్పప్రజ్ఞులు. వితతస్య = విస్తరించియుండు, మృత్యోః = మృత్యువుయొక్క. పాశం = బంధమువంటి జననమరణాత్మక సంసారమును, యంతి = పొందుచుందురు.

అథ = స్వల్పప్రజ్ఞులకంటె వేరైన, ధీరాః = నిశ్చయాత్మకమైన బుద్ధిగల నిష్కాములు. అమృతత్వం = మోక్షమును, ధ్రువం = శాశ్వతముగా, విదిత్వా = గుర్తించి, ఇహ = ఈ బ్రహ్మాండమున, అధ్రువేషు = అశాశ్వతములైన భోగములలో, నప్రార్థయంతే = ఏ ప్రాపంచికసుఖభోగమును గూడ నభిలషించువారు కారు.

స్థిరమైన బుద్ధి లేనివారు-ఇహపరలోకసుఖముల నపేక్షించుచు-స్వాంతర్యామియగు శివుని పూజాజపధ్యానాదుల నారాధింపక-పునఃపునః పుట్టుచు గిట్టుచుందురు. శివానుగ్రహపాత్రుఁడైన ఒకానొక

ధీరుఁడు మాత్రము ఇంద్రియసుఖభోగముల నపేక్షింపక—పరమేశ్వరునందే చిత్తమును నిలిపి-సంసారబంధనిర్ముక్తుఁడగునని భావము.

"యేన రూపం రసం గంధం-శబ్దాన్ స్పర్శాంశ్చ మైథునాన్,
ఏతేనైవ విజానాతి—కిమత్ర పరిశిష్యతే ? ఏతద్వై తత్" 3

ప, యేన = ఏ అంతరాత్మచే, రూపం = రూపమును, రసం = రసమును, గంధం = వాసనను, శబ్దాన్ = శబ్దములను, స్పర్శాంశ్చ = తాకిడులను, మైథునాన్ = స్త్రీ పురుషసంబంధములగు శృంగారానుభవములను, ఏతేనైవ = ఈ అంతరాత్మబలము వలననే, విజానాతి = శరీరేంద్రియ విశిష్టుఁడైన జీవాత్మ గుర్తించునో, అత్ర = ఈ పరమాత్మబలమువిషయమై, కిం = ఏది, పరిశిష్యతే = మిగిలి యుండును? ఏతద్వై = సర్వేంద్రియ విషయములను వెల్లడించునదియే, తత్ = ఆ శివతత్త్వము.

జీవాత్మ పొందువాడుగను, పరమాత్మ పొందఁబడువాడుగ నిదివరలో "ఋతం పిబంతౌ" ఇత్యాదిని నిరూపించి ప్రాప్తవ్యుఁడైన పరమాత్మ యొక్క బలము వలననే ప్రాప్తయగు జీవాత్మ ఇంద్రియ సుఖముల ననుభవింపఁగలుగునని సారాంశము.

"స్వప్నాంతం జాగరితాంతం-చోభౌ యేనానుపశ్యతి,
మహాంతం విభు మాత్మానం-మత్వా ధీరో న శోచతి" 4

ప స్వప్నాంతం = స్వప్నము (నిద్ర)లోని విషయమును, జాగరితాంతం = మెలకువ యందలి ప్రత్యక్షములను, ఉభౌచ = రెంటిని గూడ, యేన = ఏపరమాత్మ ఆశ్రయముచే, అనుపశ్యతి = అనుభవముతో నుపయోగింపఁగలుగునో, అట్టి విభుం = సర్వవ్యాపకుఁడైన, మహాంతం ఆత్మానం = పరమాత్మను (శివుని)

మత్వా = ఉపాసించుచు శరణాగతుఁడైనచో, ధీరః = బుద్ధిమంతుడు, న శోచతి = దుఃఖింపడు.

లౌకిక విజ్ఞానమునకు గూడ కారకుఁడైన సదాశివుని సర్వాత్మనా ప్రార్థించి ఇహపర దుఃఖములను పోగొట్టుకొనవలెనని భావము.

"య ఇమం మధ్వదం వేద-ఆత్మానం జీవ మంతికాత్,
ఈశానం భూతభవ్యస్య-న తతో విజుగుప్సతే" 5

ప యః = ఎవడు, ఇమం = ఈ, జీవమాత్మానం = జీవాత్మను, మధ్వదం = కర్మఫలము ననుభవించువానిగాను. భూతభవిష్యత్ ప్రపంచము యొక్క, ఈశానం = శాసించు ప్రభువైన పరమాత్మను, అంతికాత్ = జీవాత్మను సమీపించి కర్మఫలము ననుభవింపఁజేయువానిగాను, వేద = గుర్తించి భావించునో, అట్టి మహనీయుడు, తతః = అట్టి భావనవలన, న విజుగుప్సతే = తనను దాచుకొను నవసరము లేనివాడగును.

జీవాత్మను కర్మఫలము ననుభవింపఁజేసి నిష్కామ నొనర్చి పరమాత్మ అనుగ్రహించునని వివేకము.

"యః పూర్వం తపసో జాత-మద్భ్యః పూర్వ మజాయత।
గుహాం ప్రవిశ్య తిష్ఠంతం-యో భూతేభి ర్వ్యపశ్యత,
ఏతద్వైతత్" 6

ప. యః = ఏ పరమాత్మ, అద్భ్యః పూర్వం = ఉదకములు మొదలగు పంచ మహాభూతముల కన్న ముందు, పూర్వం=సృష్టిలో మొదటివాడైన బ్రహ్మదేవుని, అట్లే మహదాదులను, తపసః = తన సంకల్పముచేతనే, జాతం = ఆవిర్భవించినట్టి, గుహాం బ్రహ్మాండాంతర్భాగమును, ప్రవిశ్య = ప్రవేశించి, తిష్ఠంతం = ఉన్నట్టి బ్రహ్మ

దేవుని, అజాయత = పుట్టించెనో, యః=ఏ పరమాత్మ, భూతేభిః= **సూక్ష్మ**పంచభూతములతో కూడియున్నవానిగా, వ్యపశ్యత = అనుగ్రహముతో బ్రహ్మదేవు నవలోకించెనో, ఏతద్వై= బ్రహ్మాది స్తంబావధిక ప్రపంచమును పుట్టించునదియే, తత్ = ఆ శివతత్త్వము,

సమస్త సృష్టికర్త - పరమేశ్వరుఁడేనని సారాంశము.

"యా ప్రాణేన సంభవ-త్యదితి ర్దేవతామయీ,
గుహాం ప్రవిశ్య తిష్ఠంతీ-యా భూతేభి ర్వ్యజాయత,
ఏతద్వై తత్" 7

వ. దేవతామయీ = శరీరమును ప్రకాశింపఁజేయునవగుటచే ఇంద్రియములు - శరీరగతదేవతలుగా నిట వ్యవహరింపఁబడినవి. అట్టి కర్మజ్ఞానేంద్రియమయుఁడగు, యా = ఏ, అదితిః = (అత్తి కర్మఫలానీతి = అదితిః) జీవాత్మ, ప్రాణేన = ప్రాణవాయువుతో కూడ, సంభవతి = జన్మించునో, యా = అదితి యనఁదగు ఏ జీవాత్మ, గుహాం = హృదయగుహను, ప్రవిశ్య = ప్రవేశించి, భూతేభిః = శరీరముగా పరిణమించు పృథివ్యాది పంచభూతములతో, తిష్ఠంతీ = ఉన్నదై, వ్యజాయత = జన్మించెనో, ఏతద్వై = ఈ జీవాత్మలోనిదే, తత్, ఆ శివతత్త్వము.

పరమాత్మయొక్క అంశమగుటచే-జీవాత్మయు శివస్వరూపుఁడేని ఇందు విదితమైనది,

"అరణ్యో ర్నిహితో జాతవేదా-గర్భ ఇవ సుభృతో
గర్భిణీభిః, దివేదివ ఈడ్యో జాగృవద్భి-ర్హవిష్మద్భి
ర్మనుష్యేభిరగ్నిః, ఏతద్వై తత్" 8

ప. జాతవేదాః = అగ్నిహోత్రుడు, గర్భిణీభిః = ఋత్విజులచే, అరణ్యోః = ఆరణులలో, గర్భఇవ = గర్భమువలె, సుభృతః = రక్షింపఁబడును. మరియు అగ్నిః = ఈ అగ్నియే, జాగృవద్భిః మేలుకొనినట్టి, హవిష్మద్భి,=హవిస్సులుగలయట్టి, మనుష్యేభిః = మానవులచే, దివే దివే = ప్రతిదినము, ఈడ్యః = ప్రార్థింపఁబడును.

పరమేశ్వరప్రాప్తిసాధనమగు యజ్ఞముఁజెందు అగ్ని-పరమేశ్వరాంశమేనని భావము.

"యతశ్చోదేతి సూర్యోఽస్తం యత్ర చ గచ్ఛతి,
తం దేవాః సర్వే అర్పితా- స్తదు నాత్యేతి కశ్చన ఏతద్వైతత్"।

ప. సూర్యః = సూర్యుఁడు, యతశ్చ=ఏ పరమాత్మనుండి ఉదేతి = ఉదయించునో, యత్ర చ = ఏ పరమాత్మయందు, అస్తంగచ్ఛతి = అస్తమించునో, తం = అట్టిపరమాత్మను, సర్వే దేవాః=అగ్న్యాదిదేవతలందరు, అర్పితాః=ఆశ్రయించియుండువారు, తదు = ఆ పరమాత్మను, కశ్చన=ఏ చేతనము గూడా, నాత్యేతి = అతిక్రమింపఁజాలదు.

ఏతద్వై=సర్వాధారమగు నిదియే, తత్=ఆ శివతత్త్వమగును. దేవ మానవాదిసమస్తప్రాణులును పరమాత్మపై ఆధారపడునవని వివేకము

"యదేవేహ తదముత్ర-యదముత్ర తదన్విహ.
మృత్యోః స మృత్యు మాప్నోతి-య ఇహ నానేవ పశ్యతి॥10
"మనసైవేద మాప్తవ్యం-నేహ నానాఽస్తి కించన,
మృత్యోః స మృత్యుం గచ్ఛతి-య ఇహ నానేవ పశ్యతి"11

ప. ఇహ = ఈ లోకమున. యదేవ = ఏ పరమాత్మ-చేతనాచేతనరూపమున నున్నదో, అముత్ర = పరలోకమున, తత్ = ఆ పరమాత్మయే నుండును. యత్ = ఏ పరమాత్మ, అముత్ర = పరలోకమునందున్నవాడో, తదను = ఆ పరమాత్మయే, ఇహ = ఈ లోకమునందుండువాడేను,

యః = ఎవ౦డు, ఇహ = ఈ ప్రపంచమున, నానేవ = పరమాత్మ ననేక విధములు గలవానిగా, పశ్యతి = భావించునో, సః = అట్టివాడు, మృత్యోః = జననమరణాదికమునుండి, మృత్యుం = జననమరణాదికమును, ఆప్నోతి = పొందుచుండును. 10

ఇహ = ఈ జగత్తున, కించన = ఏదియు, నానా = పరమేశ్వరుని వేఱుపఱచునది, నాస్తీతి = లేదని, మనసైవ = మనస్సుచేతనే, ఇదం = ఈ పరమాత్మతత్త్వము ఒకటేనని, ఆప్తవ్యం = భావింప౦దగినది. 11

బాహ్యేంద్రియములకు నానావిధములుగ కన౦బడు ప్రపంచమున అంతర్యామియు, పరమపదమున విరాజమానంబునగు శివతత్త్వమొకటియేనని భావించువారికి-జన్మమృత్యువరంపర-అంతరించునని. సారాంశము

"అంగుష్ఠమాత్రః పురుషో-మధ్య ఆత్మని తిష్ఠతి,
ఈశానో భూతభవ్యస్య-న తతో విజుగుప్సతే, ఏతద్వై తత్" 12
"అంగుష్ఠమాత్రః పురుషో-జ్యోతిరివాధూమకః,
ఈశానో భూతభవ్యస్య-స ఏవాద్య స ఉ శ్వః,
ఏతద్వై తత్" 13

ప. పురుషః = పరమపురుషుఁడైన శివుఁడు, అంగుష్ఠమాత్రః బొటనవ్రేలంతవాడై, ఆత్మని మధ్యే—ఒడలునడుమ మనస్సులో, అధూమకః = పొగలేనట్టి, జ్యోతిరివ = అగ్నివలె ప్రకాశించుచు, తిష్ఠతి = ఉండును. తతః=అట్టి హృదయమునుండి, న విజుగుప్సతే = తనను మఱుగుపరచుకొనువాడు కాడు. ఏతద్వై = సమస్తప్రాణి హృదయాంతర్వర్తియగునదియే, తత్ = ఆ పరశివతత్త్వము.

స ఏవ = నిర్ధూమాగ్నిప్రకాశమానుఁడగు శివుఁడే. అద్య = ప్రస్తుతముండువాడు, స ఉ = అట్టి శివుఁడే, శ్వః = భవిష్యత్తునందుండువాడును.

ఏతద్వై = భూతభవిష్యత్ ప్రపంచమును శాసించునదియే. తత్ = ఆ పరశివతత్త్వము.

శరీరధారులగు జీవాత్మలందరి హృదయములలో నివసించుచు కరుణతో నవ్వారిని విడువక—ప్రేరేపించుచుండువాడే పరమాత్మ యని విదితమైనది.

"యథోదకం దుర్గే వృష్టం—పర్వతేషు విధావతి,
ఏవం ధర్మాన్ పృథక్ పశ్యం-స్తానేవానువిధావతి" 14

ప. యథా = ఏవిధముగా, దుర్గే = పోనలవిగానట్టికొండపై వృష్టం = కురిసినట్టి, ఉదకం = జలము, పర్వతేషు = క్రిందికొండ నేలలయందు, విధావతి = పరుగుడి పడునో, ఏవం = అదేవిధముగా, ధర్మాన్ = దేవత్వమానవత్వాది స్వరూపవైఖరులను, పృథక్ = ప్రత్యేక స్వతంత్రములుగా, పశ్యన్ = భావించువాడు, తానేవ = అట్టి దేవత్వమానవత్వాది ధర్మములనే, అనుధావతి = అనుసరించి పరుగిడుచుండును,

ఎత్తుపై పడిన నీరు క్రింది చోట్లకు పడునట్లు-దేవతలు మానవులు మొదలగు శరీరధారి జీవాత్మలు-స్వతంత్రులుగా వేరు వేరని భావించువాడు- పరమాత్మ సర్వత్ర సర్వదా వ్యాపించియుండు ననియు, దేవమానవాదులు స్వతంత్రులు కారనియు భావింపనిచో జన్మల నొందుచుండునని భావము

"యథోదకం శుద్ధే శుద్ధ-మాసిక్తం తాదృగేవ భవతి,
ఏవం మునే ర్విజానత-ఆత్మా భవతి గౌతమ" 16

ప. గౌతమా = నచికేతా! యథా = ఎట్లు, శుద్ధం = పరిశుభ్రమైన, ఉదకం = జలము, శుద్ధే = పరిశుభ్రజలమునందు, ఆసిక్తం = కలిసినదై, తాదృగేవ = అట్టి శుద్ధోదకమే, భవతి = అగునో, విజానతః = దేవమానవాదులలో నంతర్యామి పరమేశ్వరుఁడేనని గుర్తించునట్టి, మునేః = నిరంతరము భావించువానియొక్క, ఆత్మా = స్వరూపము, ఏవం = పరమేశ్వరస్వరూపముగా, భవతి ఏర్పడును.

"పరమేశ్వరుఁడు- సర్వాంతరాత్మ ఒకఁడే పలురకములనుండువాడు, చరాచరప్రపంచమునకు కారణము, సమస్తమునకు ఆధారము, ఉపాసకుల హృదయములలో నుండువాడని" తమ మనస్సులో భావించుటయేగాక-శాంభవదీక్షా స్వీకృతమైన ఇష్టలింగమును పూజించుచు అందు (పరమేశ్వరుని) ధ్యానించువాడు-ముక్తుఁడై శివసముఁడగునని విదితమైనది.

ఇయ్యది
శ్రీ నీలకంఠ శివాచార్యప్రణీత భాష్యమునకు
శ్రీ నాగలింగశాస్త్రికృత సంస్కృత వ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కఠోపనిషద్గత ద్వితీయాధ్యాయమున ప్రథమవల్లి- సమాప్తము.

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః

కఠోపనిషత్తు-ద్వితీయాధ్యాయము

60-00

ద్వితీయవల్లి

ACC NO. 26029

"పుర మేకాదశద్వార-మజస్యావక్రచేతసః,
అనుష్ఠాయ న శోచతి-విముక్తశ్చ విముచ్యతే,

294.592
NLR

ఏతద్వై తత్" 1

ప, అజస్య = జన్మమరణాదిరహితుఁడై నిత్యుఁడైన, అవక్ర చేతసః = సంపూర్ణజ్ఞానము గల పరమేశ్వరుని కొరకై, ఏకాదశ ద్వారం = పదునొకండు ద్వారములు గల, పురం = శరీరమును, అనుష్ఠాయ = ఉపయోగించినచో, నశోచతి = దుఃఖింపఁజాలఁడు. మరియు విముక్తశ్చ = జీవితముననే రాగద్వేషాదులచే విడిబడిన వాఁడైనచో విముచ్యతే = దేహాంతమున పరమపదముఁజెంది నిజ రూపము గలవాఁడై శివసాయుజ్యము నొందును

ముఖమున ఏడు, నాభితోఁగూడ క్రిందివి మూఁడు, శిరస్సు, ఇవి- ఏకాదశద్వారములు కాగా-త్వఙ్మాంసరక్తాదులు ప్రాకారములు, త్వఙ్మాంసాదుల నధిష్ఠించు ఆదిత్యాదులు-ద్వారపాలురు నగుటచే శరీరము పురమనియు, ఇంద్రియములనెడు పౌరులద్వారా నానావిధ భోగముల ననుభవించు జీవాత్మ-ప్రభువనియు వర్ణింపఁబడినది.

పురము పౌరులు ద్వారపాలురు ననువానికన్న-ఆత్మ-విలక్షణుఁడని గుర్తించినను జీవాత్మను శరీరేంద్రియాదిప్రభువుగ నియమించిన వాడు పరమేశ్వరుఁడగుటచే-జీవాత్మ తాను స్వతంత్రుఁడనని భావింపక—పరమాత్మకై శరీరాదుల నుపయోగించినచో-రాగద్వేషాది రహితమగు చిత్తవిశ్రాంతి గలవాడై ముక్తుండగును.

శరీరాదులు-ఇష్టప్రాణభావలింగధారణతోడనే శివునకు ఉపయోగింపఁదగిన వనుట- ఇందు పరమార్థము-

> "హగ్ంసః శుచిషద్వసు రంతరిక్షసద్ధోతా వేదిషదతిథి
> ర్దురోణసత్, నృషద్వరస దృతస ద్వ్యోమ ప దబ్జా
> గోజా ఋతజా అద్రిజా ఋతం బృహత్" 2

ప. శుచిషత్ హంసః = పరిశుభ్రమైన ఆకాశమునందు సంచరించు సూర్యుఁడు, అంతరిక్షసత్ వసుః = అంతరిక్షమున నిరంతరము వీచునట్టి వాయువు. వేదిషత్‌హోతా = వేదికయందు నెలకొనియుండు అగ్ని. దురోణసత్ అతిథిః = గృహమునఁ బ్రవేశించునట్టి అతిథి, నృషత్ = మానవజన్మస్థుఁడు, వరసత్ = దేవయోనివిద్యమానుఁడు, ఋతసత్=సత్యలోకమున విరాజిల్లువాడు, వ్యోమసత్=దివ్యాంతరిక్షమున ఆనందించువాడు, అబ్జాః=జలమందు జన్మించునట్టి, గోజాః = నేలలో పుట్టునట్టి, ఋతజాః=ఆకాశమున సంభవించునట్టి, అద్రిజాః = కొండలయందు ఆవిర్భవించునట్టి జీవాత్మలు-బృహత్=అపరిచ్ఛిన్నమగు (ఇంత అంత యని కొలత లేనట్టి) ఋతం = బ్రహ్మంబేను.

"ఋతం సత్యం పరంబ్రహ్మ" ఇత్యాది శ్రుతి ననుసరించి "ఋతం" అనగా-బ్రహ్మంబని చెప్పఁబడినది. ఇఁట గల ఋత

శబ్దము—ఒకచో సత్యలోకమనియు, మరియొకచో ఆకాశమనియు సందర్భానుసారముగ నిర్వచింపఁబడినది.

చరాచర ప్రపంచమంతయు పరమేశ్వరుఁడంతర్యామిగ గల దగుటచే సూర్య వాయు అగ్ని అతిథి మానవ దేవతాదిరూపములుగల జీవులందరు ఏనాటికైనను ముక్తులగుదురు గాన శివస్వరూపులని ఇందు విశదీకరింపఁబడినది.

"ఊర్ధ్వం ప్రాణ మున్నయ-త్యపానం ప్రత్యగస్యతి,
మధ్యే వామన మాసీనం-విశ్వేదేవా ఉపాసతే" 3

ప. యః = ఎవఁడు, ప్రాణం = ప్రాణవాయువును, ఊర్ధ్వం ఉన్నయతి = పైకి నడిపించునో. అపానం = అపానవాయువును, ప్రత్యగస్యతి = క్రిందికి నడిపించునో, తం = అటువంటి, మధ్యే = హృదయకమలమధ్యమున, ఆసీనం = నెలకొనిన, వామనం = హృదయపుండరీకగత ప్రదేశమున ఇముడఁగలుగు చిన్న రూపము గల పరమాత్మను, విశ్వే దేవాః = దైవీసంపద గల సత్త్వగుణ ప్రధానులు, ఉపాసతే = పూజాజపధ్యానముల నుపాసింతురు.

దేవమానవాదులలో సత్త్వగుణసంపన్నులగువారు — తమ హృదయమున భావలింగమును "శివోఽహం" అని ధ్యానించుచు, ప్రాణలింగమును శివపంచాక్షరీజపముతో అనుసంధించుచు, హృదయమున అంగుష్ఠమాత్రుఁ (వామనుఁ)డై నివసించు పరమేశ్వరుని ప్రతిరూపముగ ఇష్టలింగమును ధరించి-శివాగమోక్తరీతి నర్చించుచు జన్మాంతమున ముక్తులగుదురని వివేకము.

"అస్య విస్రంసమానస్య-శరీరస్థస్య దేహినః,
దేహా ద్విముచ్యమానస్య-కిమత్ర
పరిశిష్యతే, ఏతద్వై తత్" 4

ప. శరీరస్థస్య = దృఢశరీరమునందు ఉన్నట్టి, దేహినః = ప్రాణియగు, అస్య = ఈ ఉపాసకుని పరిగణింపక, విస్రంసమానస్య = శిథిలమైనశరీరము గల, దేహాత్ = దేహమునుండి, విముచ్యమానస్య = ప్రాణము విడిపోవుచుండగా, అత్ర = ఈ విషయమై, కిం పరిశిష్యతే = మిగులునదేమిటి ? ఏతద్వై = శరీరమునుండి ప్రాణమును విడిపించునధియే, తత్ = ఆ శివతత్త్వమగును.

ఎన్నాళ్ళు జీవించినను ఇంకను బ్రతుకవలెనని భావించు జీవాత్మను రోగాదులచే వృద్ధత్వమువలనను జీర్ణించిన శరీరమునుండి ప్రాణముతో సహ బయలుపఱచువాఁడు. శివుఁడే గాని జీవుఁడు కాఁడని ఇందు తేటపడినది.

"న ప్రాణేన నాపానేన-మర్త్యో జీవతి కశ్చన,
ఇతరేణ తు జీవంతి-యస్మిన్నేతా వుపాశ్రితౌ." 5

ప. కశ్చన మర్త్యః = ఏ మానవుఁడైనను, ప్రాణేన = ప్రాణవాయువుతో, న = జీవింపఁడు, తథా = అట్లే, అపానేన = అపానవాయువుతో, న జీవతి = మనుగడఁ జేయఁజాలఁడు. యస్మిన్ = ఏ శివునియందు, ఏతౌ = ఈ ప్రాణ అపానములు, ఉపశ్రితౌ = ఆధారపడియున్నవో, ఇతరేణ తు = ప్రాణాపానభిన్నుఁడైన శివునిచేతనే, జీవంతి = ప్రాణులు బ్రతుకుచున్నవి.

ప్రాణుల జీవితములు శివాధీనములని భావము.

"ప్రాణానాం గ్రంథి రసి రుద్రో మా విశాంతకః" అను శ్రుతి వాక్యము-ఇందుకు ప్రోద్బలకము.

"హంత త ఇదం ప్రవక్ష్యామి-గుహ్యం బ్రహ్మ సనాతనం,
యథా చ మరణం ప్రాప్య-ఆత్మా భవతి గౌతమ" 6

పదార్థము - గౌతమ = నచికేతసుఁడా! తే = నిష్కాముడ వైన నీకు; గుహ్యం = రహస్యమైన; సనాతనం = శాశ్వతమైన; ఇదం = ఇంతవరకు నిర్దేశింపఁబడిన ఈ; బ్రహ్మ = పరమాత్మను గురించి, ప్రవక్ష్యామి = మరల వివరించి చెప్పెదను. ఆత్మా = జీవాత్మ; పరమాత్మనుపాసింపనిచో; మరణం = మరణమును; ప్రాప్య = పొంది; యథా = ఏవిధము; భవతి = అగుచున్నాడో; హంత = ఆశ్చర్యము;

శివునుపాసింపని పామరుని గతిని చెప్పినచో శివోపాసకుఁ డైన పండితుని శరీర పాతానంతర స్థితి అవగతమగునని సారాంశము.

"యోని మన్యే ప్రపద్యంతే - శరీరత్వాయ దేహినః,
స్థాణు మన్యేఽను సంయంతి-యథాకర్మ యథాశ్రుతమ్"

పదార్థము - దేహినః = బ్రహ్మజ్ఞాన (శివోపాసన)ము లేనట్టి ప్రాణులైన, అన్యే = పూర్వకృతప్రారబ్ధకర్మభోగులు కొందరు, శరీరత్వాయ = మరియొక శరీరము కలిగియుండుటకై, యోనిం = బ్రాహ్మణాది మానవజన్మను, ప్రపద్యంతే = పొందుదురు. అన్యే = మరికొందరు, స్థాణుం = వృక్షాదిజన్మను, ప్రపద్యంతే = పొందుదురు. వీరందరును యథాకర్మ = పూర్వకర్మ ననుసరించియు, యథా శ్రుతం = పూర్వజన్మసంపాదితజ్ఞానము ననుసరించియు, అనుసం యంతి = జననమరణాత్మకమగు సంసారము ననుసరించువారేను:

వస్తుతః దుఃఖభూయిష్ఠమైన సంసారమునందు విరక్తిగలవారై జన్మ మరణ పరంపరా పాశమును విడిపించుకొని శివసాయుజ్యము నొందవలెనని ఇందు ద్యోతకమగుచున్నయది.

"య ఏష సుప్తేషు జాగర్తి - కామం
కామం పురుషో నిర్మిమాణః,
తదేవ శుక్రం తద్బ్రహ్మ — తదేవామృత ముచ్యతేః
తస్మింల్లోకాః శ్రితాః సర్వే - తదు నాత్యేతి కశ్చన,
ఏతద్వై తత్" 8

పదార్థము–సుప్తేషు=ప్రాణులు నిద్రించుచుండగా, యఏషః= ఏ ఈ, పురుషః = పరమాత్మ, కామంకామం = నిద్రించిన జీవాత్మ యొక్క కర్మభోగమునకు అనుగుణముగా సంకల్పించి, నిర్మిమాణః = స్వప్నవిషయములను నిర్మించునో, తదేవ = అట్టి శివ తత్త్వమే. శుక్రం = ప్రకాశకముగా, తత్ = అదియే, బ్రహ్మ = బ్రహ్మముగా, తదేవ = అదియే, అమృతం = అనాదిముక్తముగా, (లేక) నిరవధిక ముక్తాత్మభోగ్యంబుగాను, ఉచ్యతే = చెప్పఁబడు చున్నది. తస్మిన్ = ఆ పరశివునందు, లోకాఃసర్వే = సత్యలోకాదులు, (లేక) దేవమానవాది జనులందరును, శ్రితాః = ఆధారపడి యుండునవి, (ఉండువారు) తదు=ఆ పరశివ తత్త్వమును, కశ్చన= ఏప్రాణియు, నాత్యేతి = అతిక్రమింపజాలదు, ఏతద్వై=శుక్రత్వాది లక్షణములు గలదియే, తత్ = పరశివతత్త్వంబగును.

స్వప్నములో నానావిధ వస్తువులను చూపెట్టు సామర్థ్యము శివునకే కలదనియు, జీవాత్మ పరతంత్రుఁడగుటచే స్వప్న విషయములను కల్పింపలేడనియు, సమస్తలోకాధారము శివుఁడే ననియు ఇందు విదితమైనది.

"అగ్నిర్యథైకో భువనం ప్రవిష్టో- రూపంరూపం ప్రతి
రూపో బభూవ, ఏకస్తథా సర్వభూతాంతరాత్మా—
రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ" 9

పదార్థము = యథా = ఏవిధముగా, అగ్నిః = అగ్ని, భువనం = కాష్ఠాదిస్థానమును, ప్రవిష్టః = పొందినదై, రూపం రూపం = పొందఁబడినవస్తువుగా, ప్రతిరూపః = ఆయా వస్తువుల రూపము గలది, భవతి = అగుచున్నదో, తథా = ఆ విధముగా, ఏకః = ఒకే పరమాత్మ, సర్వభూతాంతరాత్మా = ప్రాణులందరిలో చేరినవాడై, రూపంరూపం = తాను లోనఁబ్రవేశించిన దేవమానవాదులుగా, ప్రతిరూపః = ఆ యా వ్యక్తుల రూపము గలవాడగును. బహిశ్చ = బ్రహ్మాండమునకు వెలుపలైతే అంతట వ్యాపించువాడు పరమాత్మయేను.

సంపూర్ణజ్ఞాన స్వరూపుఁడగు పరమాత్మచే జీవాత్మలు వ్యాపింపఁబడినను కర్మానుసారముగ జ్ఞానసంకోచము గలవారగుదురనియు, దేవమానవ పశు పక్ష్యాది శరీరములయందు నిండు అభిమానము గలవారగుటచే జీవాత్మలు-శరీరేంద్రియాది సుఖభోగలాలసులై-నిజరూపజ్ఞానమును గోలుపోయినందున జ్ఞానసంకోచ (అవివేక) ముచే పరమాత్మ తమలో నున్నాఁడని గుర్తింపక-బాధపడుచుందురని సారాంశము.

"వాయు ర్యథైకో భువనం ప్రవిష్టో - రూపం రూపం
ప్రతిరూపో బభూవ, ఏక స్తథా సర్వభూతాంతరాత్మా
రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ" 10

వాయుదృష్టాంతముతో పూర్వవాక్యమునందు చెప్పఁబడిన పరమేశ్వర సర్వాంతర్యామిత్వము ఈ వాక్యమున బలపరుపఁబడినది.

"సూర్యోయథా సర్వలోకస్య చక్షు - ర్న
లిప్యతే చాక్షుషై ర్బాహ్యదోషైః, ఏక స్తథా

సర్వభూతాంతరాత్మా - న లిప్యతే
లోకదుఃఖేన బాహ్యః" 11

సూర్యుఁడు సమస్త ప్రపంచమునకు నేత్రముగా నుండినను నేత్ర సంబంధములగు వికారములు లేనివాడైనట్లు-ఒకే పరమాత్మ-ప్రాణులందరిలో నుండినను జీవాత్మల సుఖదుఃఖములు లేనివాడై చేతనాచేతనములకన్న విలక్షణుఁడునై కర్మపరాధీనుఁడు కాదని భావార్థము.

"ఏకో వశీ సర్వభూతాంతరాత్మా - ఏకం బీజం
బహుధా కరోతి, త మాత్మస్థం యేఽను పశ్యంతి ధీరా-
స్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్" 12

పదార్థము - సర్వభూతాంతరాత్మా = ప్రాణులందరిలో సూక్ష్మాతి సూక్ష్మరూపమున నివసించునట్టి, వశీ=చరాచరప్రపంచమును తన యధీనము నొనర్చుకొనినట్టి, ఏకః = ఒకే పరమాత్మ ఏకం = తన నెడబాయనట్టి, బీజం = పంచభూతాదులకు కారణమైన ప్రధానమును (ప్రకృతిని) బహుధా = మహత్తు మొదలగు రూపములతో పలువిధములు గలదానిగా, కరోతి = తన సంకల్పముచేతనే, విపులీకరించువాడు.

ఆత్మస్థం=తమలోనున్నట్టి, తం=ఆ పరమాత్మను, యేధీరాః= ఏ బుద్ధిమంతులు, అనుపశ్యంతి = శ్రవణమననాదులతో సాక్షాత్కరింపఁజేసికొందురో, తేషాం = అట్టివారికే, శాశ్వతం సుఖం = శాశ్వతమైన మోక్షసుఖము చేకూరును. ఇతరేషాం = అనుపాసకులగు ఇతరులకు, న= జన్మరాహిత్యము సంభవింపదు.

ప్రకృతిని వశపఱచుకొని ప్రకృతిని విడువనివాడై ప్రకృతిని

విస్తరింపఁజేయు మహాపురుష (శివు)నితో సమానుఁడు గాని శివుని కంటె గొప్పవాడు గాని లేనందున - ప్రకృతిద్వారా ప్రపంచజనకుఁడైన పరమాత్మ-తనలో ఉన్నాడు - అనుటకు గుర్తుగా - బాహ్య లింగధారణఁ జేసికొని శివునుపాసించు భక్తునకే మోక్షము సిద్ధించు నని ఇందు విదితమైనది.

"నిత్యో నిత్యానాం చేతన శ్చేతనానా - మేకో
బహూనాం విదధాతి కామాన్, తమాత్మస్థం యేఽను
పశ్యంతి ధీరా-స్తేషాం శాంతిః శాశ్వతీ నేతరేషామ్" 13

పదార్థము = నిత్యులైన జీవాత్మలకు, నిత్యః = అంతర్యామిగ నెల్లకాలము సమీపించువాడు, చేతనానాం = తెలివిగల ఆత్మలకు, చేతనః = తెలివిని పెంపొందించువాడు, ఏకః = ఒక్కఁడే, బహూనాం = అనేకులైన భక్తులయొక్క, కామాన్ = ఐహిక ఆముష్మికములగు కోరికలను. విదధాతి = సిద్ధింపఁజేయువాడును పరమేశ్వరుఁడేను.

"అట్టి పరమాత్మ తమలో నున్నవాడని" భావించుచు పూజా జప ధ్యానములతో ప్రార్థించువారికే శాశ్వతశాంతి (శివసాయుజ్యము) చేకూరును. తదితరులకు సంసారప్రవృత్తియే నని ఉత్తరవాక్యార్థముగ విదితమైనది.

"తదేతదితి మన్యంతేఽనిర్దేశ్యం పరమం సుఖం,
కథం ను తద్విజానీయాం-కిము భాతి విభాతి వా" 14

పదార్థము - అనిర్దేశ్యం = ఇది ఇంతేనని నిరూపింపనలవిఁగానిది, పరమంసుఖం = సర్వశ్రేష్ఠమైన ఆనందమునగు తత్ = బ్రహ్మము, ఏతదితి = నిరతిశయ సుఖస్వరూపంబని, మన్యంతే = నీవంటి జ్ఞానులు భావింతురు.

తత్ = బ్రహ్మము, భాతి కిము = దివ్యవిగ్రహముతో ప్రకాశించునా ? విభాతి కిము వా = సంపూర్ణజ్యోతిః స్వరూపమున రాణించునా ? కథం విజానియాం = ఎట్లు తెలిసికొనవలెను ?

అపరిచ్ఛిన్నమగు బ్రహ్మమునకు దివ్యవిగ్రహము కలదని నిర్ణయమగుచో సామాన్యతః బ్రహ్మమును గుర్తించి - అఖండ జ్యోతిని భావించుచు విశేషతః బ్రహ్మసాక్షాత్కారమును పొంద వచ్చునా ? అని శిష్యుఁడు ఆచార్యుని ప్రశ్నించెనని ఇందలి సారాంశము.

"న తత్ర సూర్యో భాతి న చంద్రతారకం – నేమా విద్యుతో భాంతి కుతోఽయ మగ్నిః, తమేవ భాంత మను భాతి సర్వం-తస్య భాసా సర్వమిదం విభాతి".

పదార్థము – తత్ర = అఖండజ్యోతివిషయమై. సూర్యః = రవి, నభాతి = ప్రకాశింపడు. చంద్రతారకం = చంద్రుఁడు నక్షత్రములును, న = ప్రకాశింపవు- ఇమా విద్యుతః = ఈ మెఱుపులు, నభాంతి = ప్రకాశింపవు- అయం అగ్నిః = ఈ అగ్ని, కుతః? = ప్రకాశింపదని వేరుగా చెప్పనవసరము లేదు.

భాంతం = స్వయంప్రకాశమానుఁడగు, తమేవ = అఖండజ్యోతియగు పరమేశ్వరునే, సర్వం = సూర్యచంద్రాది తేజస్సులన్నియు, అనుభాతి = అనుసరించి ప్రకాశించునవి. తస్య = పరమేశ్వరుని యొక్క, భాసా = సహజమైన కాంతిచే, ఇదంసర్వం = సూర్య చంద్రాదికమగు ఈ జగత్తంతయు, విభాతి = వెలుగందుచున్నయది.

అఖండజ్యోతియొక్క లక్షణమును నిర్దేశించి - సూర్యాదులకు తేజస్సు నొసఁగునట్టి అఖండజ్యోతిని-పరమేశ్వరుని దివ్యవిగ్రహము

నందు దర్శింపవలెననియు, అందుకు సమీపసాధనము—ఇష్టప్రాణభావలింగారాధనమనియు ఈ చివరి వాక్యమందు ద్యోతకమగుచున్నయది.

ఇయ్యది
శ్రీ నీలకంఠ శివాచార్య ప్రణీత భాష్యమునకు
శ్రీ నాగలింగశాస్త్రి కృత సంస్కృత వ్యాఖ్యానమునకును
"శివతత్త్వప్రభ" అను శాంకరీయ ఆంధ్రానువాదమున
కఠోపనిషద్గత — ద్వితీయాధ్యాయమున ద్వితీయవల్లి
సమాప్తము

శ్రీ మహా గణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః

కఠోపనిషత్తు-ద్వితీయాధ్యాయము

తృతీయవల్లి

"ఊర్ధ్వమూలోఽవాక్ శాఖ-ఏషోఽశ్వత్థః సనాతనః,
తదేవ శుక్రం తద్బ్రహ్మ-తదేవామృత ముచ్యతే।
తస్మిన్ లోకాః శ్రితాః సర్వే-తదు నాత్యేతి కశ్చన॥
ఏతద్వై తత్॥ 1

ఏషః = ఈ ప్రపంచము, ఊర్ధ్వమూలః = పై హిరణ్యగర్భుఁడు మూలముగా గలిగినట్టి, అవాక్ శాఖః = క్రిందనుండు దేవ మనుష్యాదులు కొమ్మలుగా గలిగినట్టి, సనాతనః = అనాదికాలము నుండి ప్రవర్తించునట్టి. అశ్వత్థః = రావిచెట్టుగ నుండునది.

అశ్వత్థః = రేపు ఉండనిదగుటచే ప్రపంచము శాశ్వతము కాదని గుర్తింపవలెను. ప్రపంచమునకు మూలము పరమాత్మ యనినచో ప్రపంచమువలె పరమాత్మ గూడా శాశ్వతుఁడు కాదని అర్థమగునుగాన ప్రపంచ మూలము బ్రహ్మదేవుఁడని చెప్పవలసి వచ్చినది.

తదేవ = ప్రపంచవిలక్షణమైన శివతత్త్వమే, శుక్రం = సర్వ

ప్రకాశకముగా, తత్ = ఆ శివతత్త్వము, బ్రహ్మ = బ్రహ్మముగా, తదేవ = అదియే. అమృతం = అనాదిముక్తముగా, (లేక) నిరవధిక ముక్తాత్మభోగ్యంబుగాను, ఉచ్యతే = చెప్పఁబడుచున్నది. తస్మిన్ = ఆ పరశివునందు, లోకాః సర్వే = దేవమానవాది జనులందరును, శ్రితాః = ఆధారపడియుండువారు. కశ్చన = ఎవఁడును, తదు = ఆ పరశివస్వరూపమును, నాత్యేతి = అతిక్రమింపఁజాలఁడు. ఏతద్వై = శుక్రత్వాదిలక్షణములు గలదియే, తత్ = ఆ పరశివతత్త్వం బగును.

పరమేశ్వరుఁడే ఇంద్రచంద్రాదిలోకములను వ్యక్తపఱచువాడై శాశ్వతుఁడై యుండునని గుర్తించి అనిత్యమగు ప్రపంచముపై మమకారమును విడనాడవలెనని భావము.

''యదిదం కించ జగత్సర్వం-ప్రాణ ఏజతి నిఃసృతం,
మహద్భయం వజ్ర ముద్యతం-య ఏతద్విదు
రమృతా స్తే భవంతి" 2

"భయాదగ్ని స్తపతి-భయాత్తపతి సూర్యః,
భయా దింద్రశ్చ వాయుశ్చ-మృత్యుర్ధావతి పంచమః"3

ప. నిఃసృతం = తననుండి వెలువడినట్టి, యదిదం కించ = ఏ ఈ, జగత్సర్వం = జగత్తునంతటిని, ప్రాణః = పరమాత్మ,

ఉద్యతం = లేపఁబడిన, వజ్రం = వజ్రాయుధమువలె, మహద్భయం = గొప్పభయమును కలుగించువాడై, ఏజతి = వణికించును. భయాత్ = భీతివలన, అగ్నిః = అగ్ని, తపతి = తపించును. సూర్యః = సూర్యుఁడు, భయాత్ = పరమేశ్వరునివలన నైన వెఱపువలన, తపతి = ఆకాశమున సంచరించుచు ప్రకాశించును.

ఇంద్రః = దేవేంద్రుఁడు, వాయుశ్చ = వాయుదేవుడును, పంచమః = ఐదవదైనట్టి, మృత్యుః = మృత్యుదేవత, భయాత్ ధావతి = భయపడి పరుగిడునట్లు ప్రవర్తించును.

అగ్ని రవి ఇంద్ర వాయు మృత్యుప్రభృతికులగు లోకపాలురు సమర్థులైనను శివాజ్ఞాబద్ధులై శివశాసనమును జవదాటనివారై తమ తమ పనులను కొనసాగించుచుందురని భావము.

"ఇహ చే దశక ద్బోద్ధుం-ప్రాక్ శరీరస్య విస్రసః,
తతః సర్గేషు లోకేషు-శరీరత్వాయ కల్పతే" 4

ప. ఇహ = ఈ మానవలోకమున, శరీరస్య = దేహముయొక్క, విస్రసః = శిథిలత్వమునకంటె, ప్రాక్ = ముందు, బోద్ధుం = దేవమానవాదిచేతనవర్గమును తన శాసనముచే వశపఱచుకొనునట్టి పరమేశ్వరు నుపాసించుటకు, అశకచ్చేత్ = సమర్థుఁడు కానిచో, తతః = ఆటుపిమ్మట, సర్గేషులోకేషు = పశుపక్ష్యాదిజన్మల యందు, శరీరత్వాయ = శరీరముగలిగి యుండుటకై, కల్పతే = అర్హుఁడగును.

దుర్లభమైన ఈ మానవజన్మలోనే శాంభవదీక్షితుఁడై పరమేశ్వరు నారాధింపనిచో-ఈ శరీరమును విసర్జించిన తరువాత పశుపక్ష్యాదిజన్మల నొందునని భావము.

"యథాఽఽదర్శే తథాఽఽత్మని-యథా
స్వప్నే తథా పితృలోకే। యథాఽప్సు
పరీవ దదృశే-తథా గంధర్వలోకే,
ఛాయాతపయో రివ బ్రహ్మలోకే" 5

ప. యథా = ఏ విధము, ఆదర్శే = స్వచ్ఛమైన అద్దమునందు

ముఖము స్పష్టముగ కనుపడునో, తథా = అదే విధము, ఆత్మని = తన హృదయములో ధ్యానరూపముగ నుపాసించునెడల, పరమాత్మ సంపూర్ణముగ గోచరించును.

పితృలోకే = గంధర్వలోకే = బ్రహ్మలోకే = పితృ గంధర్వ హిరణ్యగర్భలోకాదులలో దర్శింపనుపాసించువానికి స్వప్నే యథా = స్వప్నమునందువలె, అప్సుయథా = ఉదకమునందువలె, పరీవ = స్వల్పముగానే దదృశే = పరమాత్మ కనుపడును.

హృదయమున శివసాక్షాత్కారము-ఎండవలె సంపూర్ణ ప్రకాశమానము కాగా పితృలోకాదులందు మహేశ్వర దర్శనము నీడవలె స్వల్పప్రకాశము కలదగును

సర్వోత్తరమైన పరమపదముఁజేరుటకు - మానవుడు తన హృదయములోనే శివుని ధ్యానింపవలెననియు, హృదయమున శివుని ధ్యానింపఁజాలక - పై దేవలోకాదులయందు శివుని దర్శించుటకు బాహ్యమున ప్రార్థించినచో అట్టివారికి శివదర్శనము సంపూర్ణముగ కాదనియు విదితమైనది.

"ఇంద్రియాణాం పృథక్ భావ-ముదయాస్తమయౌ చ యత్,
పృథగుత్పద్యమానానాం-మత్వా ధీరో న శోచతి" 6

ప. పృథక్ = వేరు వేరు స్వభావముతో, ఉత్పద్యమానానాం = ఆవిర్భవించునట్టి, ఇంద్రియాణాం = జ్ఞానకర్మేంద్రియముల యొక్క, పృథక్ భావం = వేరువేరు స్థితిని, ఉదయాస్తమయౌచ = విషయముల ప్రకాశన (ఉదయ)మును, అప్రకాశన (అస్తమయ) మునున్ను, ధీరః = ధీరుఁడు, మత్వా = భావించినచో, న శోచతి = దుఃఖింపడు.

ఇంద్రియములలో ఒకటి రూపమును చూపెట్టును. మరియొకటి-శబ్దమును వినుపించును. ఇట్లు ఇంద్రియములు వేరువేరు గుణములు కలవికాగా అవ్వాని ఉపయోగము ఉదయమనియు, అనుపయోగము అస్తమయమనియు గుర్తించి-పృథక్భావము ఉదయాస్తమయములు-ఇంద్రియములకు మరియు దేహమునకు మాత్ర ముండుననియు, జీవాత్మకు ఉండవనియు భావించువాడు-సంసారదుఃఖము ననుభవింపఁ జాలడని సారాంశము.

"ఇంద్రియేభ్యః పరం మనో-మనసః సత్త్వ ముత్తమం,
సత్త్వా దధి మహానాత్మా-మహతో౽వ్యక్త మత్తమమ్" 7
అవ్యక్తాత్తు పరః పురుషో-వ్యాపకో౽లింగ ఏవ చ,
యం జ్ఞాత్వా ముచ్యతే జంతు-రమృతత్వం చ గచ్ఛతి"

ప. మనః = మనస్సు, ఇంద్రియేభ్యః = ఇంద్రియములకన్న, రం = శ్రేష్ఠమైనది. మనసః = మనస్సునకంటె, సత్త్వం = బుద్ధి, ఉత్తమం = ముఖ్యమగునది. సత్త్వాత్ = బుద్ధికన్న, మహానాత్మా = జీవాత్మ, అధి = అధికుఁడగును. మహతః = జీవాత్మకంటె, అవ్యక్తం = అవ్యక్త (ప్రపంచభూతశరీరముగ పరిణమించు ప్రధాన)ము, ఉత్తమం = మించినది. అవ్యక్తాత్ = అవ్యక్తమునకంటె అలింగః = శకర్ణాదివిషయములనఁదగు గుర్తులచే గోచరుఁడు కానట్టి, వ్యాపకః చరాచరప్రపంచమును వ్యాపించునట్టి, పురుషః = పరమపురుషుఁ రశివుఁ)డు పరః = శ్రేష్ఠుఁడగువాడు.

జంతుః = దేవమానవాది ప్రాణిమాత్రుఁడు, యం = ఏ పరమ పురుషుని, జ్ఞాత్వా = సర్వశ్రేష్ఠునిగా గుర్తించి ఉపాసించి దర్శించినచో,

ముచ్యతే=సంసార బంధవిముక్తుఁడగును. మరియు అమృతత్వంచ= శివసాయుజ్యమును, గచ్ఛతి=పొందును.

పరమాత్మనాశ్రయించి "నీవేగతి" యని ప్రార్థించు ఆత్మ ప్రకృతికి లొంగక బలిష్ఠమగును - ఆత్మబలమున బుద్ధి-వశవర్తి యగును బుద్ధిబలముచే-మనస్సు అదుపులో నుండును నిశ్చలమనంబున ఇంద్రియములు స్వాధీనములగునని భావము.

"న సందృశే తిష్ఠతి రూప మస్య—న
చక్షుషా పశ్యతి కశ్చనైనం, హృదా
మనీషా భక్త్యా ధృత్యా మనసాఽభిక్లుప్తో-య
ఏతద్విదు రమృతా స్తే భవంతి" 8

ప అస్య=ఈ పరమపురుషునియొక్క, రూపం=దివ్యము అప్రాకృతంబునగు స్వరూపము. సందృశే=ప్రాకృత దృక్పథమందు, న తిష్ఠతి=లభ్యము కాదు. మరియు కశ్చన=ఎవఁడును, చక్షుషా=ప్రాకృతనేత్రముతో, ఏనం=ఈ పరమపురుషుని, న పశ్యతి=చూడలేడు.

హృదా=సమీపస్థములు దూరస్థములు నగు వస్తువులను కనిపెట్టు చిత్తముతో, మనీషా=(ప్రథమాంతము ఛాందసము) ఆత్మానాత్మ వివేచన సమర్థమగు బుద్ధితో, మనసా=మననాత్మకమగు ఉపాసనముచేతను, అభిక్లప్తః=అభిముఖముగ సాక్షాత్కరించువాడే పరమాత్మ, యే=ఎవరు, ఏతత్=ఈ విధము, విదుః=భావింతురో, తే=వారు, అమృతాః=ముక్తులు, భవంతి=అగుదురు.

"రూపము, రూపముగలది" అను విభాగము అవసరములేనిదై

నికటదూరవర్తి అర్థజాతమును గ్రహించునది-చిత్తమగును. నేత్రాదులు రూపముగల వస్తువులను మాత్రము కనిపెట్టును. నేత్రాదులకు గోచరముకానట్టి విషయములను గ్రహించు సామర్థ్యము-శివపూజా స్తోత్రాదులచే సంస్కరింపఁబడిన మనస్సు అనఁదగు చిత్తమునకే నుండును. ఆత్మ ఏది, ఆత్మకానిది ఏది అని విమర్శించు శక్తి గల బుద్ధి-శివోపాసనమునకు ముఖ్యసాధనము కాగా-శివధ్యానము (శివోఽహంభావన) శివదర్శనము నొదపఁజేయును

శాస్త్ర పాండిత్యముచే ఆత్మానాత్మ వివేచన పరిజ్ఞానము కలిగినను శివసాక్షాత్కారము సంభవింపదు. మననమనగా-వివేచనముతో పరమాత్మగా గుర్తింపఁబడిన పరమపురుషుని చింతనము, భక్తి (హృత్)చేతను. ధైర్యము (ధృత్యా) చేతను పరమేశ్వరుని దర్శింపఁగలుగుదురనియు చెప్పవచ్చును.

"యదా పంచావతిష్ఠంతే-జ్ఞానాని మనసా సహ ।
బుద్ధిశ్చ న విచేష్టేత-తామాహుః పరమాం గతిమ్"10

ప. "యదా = ఎప్పుడు, పంచజ్ఞానాని = ఐదు జ్ఞానేంద్రియములు, మనసాసహ = మనస్సుతో గూడ, అవతిష్ఠంతే = పరమాత్మకు అభిముఖములై నిలుచునో, బుద్ధిశ్చ = బుద్ధియు, న విచేష్టేత = నిశ్చలమగునో, తాం = అట్టి స్థితిని, పరమాంగతిం = మోక్షసాధనమైన ముఖ్యమగు పరమపదప్రాప్తి సాధనముగా, ఆహుః = చెప్పుదురు.

మనస్సు సంకల్ప వికల్పములను మానుకొని శ్రోత్రాదిజ్ఞానేంద్రియములు శ్రవణాదులు లేనివై స్తంభించునెడ-బుద్ధియు పరమాత్మ

శివుని గురించియే ప్రవర్తించునెడ-అట్టి యోగధారణమే మోక్ష సౌధసోపానమగునని వివేకము,

"తాం యోగ మితి మన్యంతే-స్థిరా మింద్రియ ధారణాం,
అప్రమత్తస్తదా భవతి-యోగో హి ప్రభవాప్యయౌ" 11

ప. తాం = పూర్వమంత్రమునందు చెప్పఁబడిన, స్థిరాం = స్థిరమైన, ఇంద్రియధారణాం=ఇంద్రియములను నిలుపుటను, యోగ మితి = యోగమని, మన్యంతే = యోగసిద్ధివిదులు భావింతురు.

తదా=అట్టి సమయమున, అప్రమత్తః=ప్రమాదములేనివాడై, భవతి = ఉండవలెను. హి = ఎందుకనఁగా? యోగః = ప్రాణాయామాది యోగాభ్యాసము, ప్రభవాప్యయౌ = వృద్ధిక్షయములు గలదగును.

యోగాభ్యాసమున-మనస్సు బుద్ధి ఇంద్రియములు శరీరంబు స్థిరములైనను పొరపాటు (యోగసాదనలో తొట్రుపాటు) ఏర్పడును. గాన జాగరూకుఁడైనచో యోగసిద్ధి కలుగునని సారాంశము.

"నైవ వాచా న మనసా-ప్రాప్తుం శక్యో న చక్షుషా,
అస్తీతి బ్రువతోఽన్యత్ర-కథం తదుపలభ్యతే ?" 12

ప. చక్షుషా = ప్రాకృతనేత్ర దృష్టిచే, మనసా = ఊహాపోహలతో కూడిన మనస్సుతో, వాచా = వాదోపవాదనైపుణ్యము గల వాక్కుతోడను, ప్రాప్తుం = నిశ్చయించుటకు, న శక్యః=పరమాత్మ సమర్థింప వలనుపడనివాడు.

అస్తీతి = పరమేశ్వరుఁడు హృదయాదిస్థానములలో ఉన్నవాడని, బ్రువతః = చెప్పునట్టి వేదవాక్కుకంటె, అన్యత్ర=మరియొక

రీతిని, తత్ = బ్రహ్మము, కథం = ఎట్లు, ఉపలభ్యతే = అవగత మగును ?

శ్రుతిస్మృతి శివాగమ పురాణాది వాఙ్మయము ప్రమాణము కాదని లౌకిక వాక్యములతో దేశభాషా నిబద్ధములగు రచనల తోడను పరమేశ్వర పరిజ్ఞానము సంభవింపదని ఇందు విదితమైనది.

"అస్తీత్యేవో లబ్ధవ్య- స్తత్త్వభావేన చోభయోః,
అస్తీత్యేవోప లబ్ధస్య-తత్త్వభావః ప్రసీదతి" 13

ప అస్తీత్యేవ = బ్రహ్మము కలదనియే, తత్త్వభావేన = యథార్ధమైన స్థితిని భావించుటతో, ఉపలబ్ధవ్యః = తెలియదగినవాడు పరమాత్మ, ఉభయోః = ఆస్తిక్య తత్త్వభావములలో, అస్తీత్యేవ = బ్రహ్మము ఉన్నదను ఆస్తిక్యమును, ఉపలబ్ధస్య = దృఢముగ పొందినవానికి, తత్త్వభావః బ్రహ్మముఁదగు స్వరూపము, ప్రసీదతి = సాక్షాత్కారయోగ్యముగ ప్రసన్న మగును. తత్త్వభావః ప్రసీదతి = మనస్సు ప్రసన్నమగుననియు చెప్పవచ్చును.

వేదశాస్త్రాదులయందు అప్రామాణ్యబుద్ధి లేనట్టి ఆస్తికశిఖామణులే శాంభవదీక్షితులై ఇష్టలింగము శివుఁడేనని దృఢముగ విశ్వసించి ప్రాణలింగానుసంధానమును చేయుచు భావలింగసాక్షాత్కారమును స్వాత్మలో బడయుదురని సారాంశరహస్యము.

"యదా సర్వే ప్రముచ్యంతే-కామా యేఽస్య హృది శ్రితాః,
అథ మర్త్యోఽమృతో భవ-త్యత్ర బ్రహ్మ సమశ్నుతే" 14

ప. యదా = ఎప్పుడు, అస్య = ఈ శివోపాసకుని యొక్క, హృది = హృదయమునందు, శ్రితాః = పాదుకొనియున్నట్టి, కామాః

= అవిహితములైన కోరికలు, సర్వే = అన్నియు, ప్రముచ్యంతే = విడిపోవునో, అథ = కామవిమోచనానంతరము, మర్త్యః = ఉపాసకుఁడైన మానవుఁడు, అమృతః = జననమరణరహితుఁడు, భవతి = అగును. మరియు అత్ర = ఈ ప్రారబ్ధాంతమున, బ్రహ్మ = బ్రహ్మమును, సమశ్నుతే = ఆనందాస్వాదరూపమున అనుభవించును.

శివధ్యానయోగసిద్ధునకు శివప్రాప్తి నిశ్చితమైనను కామము విరోధించునదగుటచే శరీరవియోగమునకు ముందే మనస్సులో దాగియున్న కోరికలు నసిపోవలెననియు, అట్టివానికే శివసాయుజ్యము చేకూరుననియు విదితమైనది.

"యదా సర్వే ప్రభిద్యంతే-హృదయస్యేహ గ్రంథయః,
అథ మర్త్యోఽమృతో భవ-త్యేతావదనుశాసనమ్" 15

వ. యదా = ఏ సమయమున, హృదయస్య = హృదయముఁజెందిన గ్రంథయః = గ్రంధులవలె విడువనలవిఁగాని ఇంద్రియసుఖవాననలు, సర్వే = అన్నియు, ఇహ = ఈ జీవితమునందే, ప్రభిద్యంతే = అంతరించునో, అథ = ఆ సమయమున, మర్త్యః = శివోపాసకుఁడైన మానవుఁడు, అమృతః = మరణధర్మరహితుఁడు, భవతి = (భవేత్) అగును. ఏతావత్ = ఇదియే, అనుశాసనం = మహోపదేశము,

కోరికలులేకుండుటయే గాక కోరికలనుద్భవింపఁజేయు వాసనా గ్రంధులు నశించినదో బ్రహ్మప్రాప్తి సమకూరునని సారాంశము.

"శతంచైకా చ హృదయస్య నాడ్య-స్తాసాం మూర్ధానమభినిఃసృతైకా, తయోర్ధ్వ మాయ న్నమృతత్వమేతి-
విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవంతి" 16

ప. హృదయస్య=హృదయమునకు సంబంధించిన, నాడ్యః = నరములు, శతంచైకాచ=నూటనొక్కటి యుండును. తాసాం= అవ్వానిలో, ఏకా = సుషుమ్నానాడియొకటి, మూర్ధానం = శిరస్సును, అభినిఃసృతా = అంటుకొనియుధిడునది తయా = ఆ మూర్ధన్యనాడి ద్వారా, ఊర్ధ్వం = పై శివలోకమునుగూర్చి, ఆయన్=వెళ్ళునట్టి జీవాత్మ, అమృతత్వం = మోక్షమును, ఏతి = పొందును. అన్యాః = ఇతరనాడులు, విష్వక్ = శరీరమంతటినుండి, ఉత్క్రమణే = లేచుటవిషయమై, భవంతి = ఉపయుక్తములగునవి.

శివయోగసిద్ధుఁడు మూర్ధన్యనాడిద్వారా శిరస్సునుండి బయలు దేరి శివలోకముఁజేరుననియు, ఇతర నాడుల ద్వారా నిష్క్రమణము దేవమానవ పశు పక్ష్యాదిజన్మల నొసఁగుననియు వివేకము.

"అంగుష్ఠమాత్రః పురుషోఽంతరాత్మా-సదా జనానాం హృదయే సన్నివిష్టః, తం స్వా చ్ఛరీరాత్ ప్రవృహే-న్ముంజాదివేషీకాం ధైర్యేణ, తం విద్యా చ్ఛుక్ర మమృతమితి" 17

ప. పురుషః=పరమపురుషుఁడు, అంతరాత్మా = ఆత్మలోని వాడై, జనానాం హృదయే = ప్రాణుల హృదయమునందు, అంగుష్ఠ మాత్రః = బొటనవ్రేలంతటి రూపముతో, సదా సన్నివిష్టః = ఎల్ల కాలము నివసించువాడు. (తథాపి = ఐనప్పటికి) తం = ఆ పరమ పురుషుని, ముంజాత్ = మంజుగడ్డినుండి, ఇషీకామివ = లోని గడ్డి పఱకనువలె, స్వాత్ = తనదైనట్టి, శరీరాత్ = శరీరము నుండి, ధైర్యేణ = బుద్ధిబలముతో, ప్రవృహేత్ = వేరు చేయవలెను.

తం = శరీరగతదోషములు అంటనివాడని భావింపఁబడు

పరమపురుషుని, శుక్రం = జరామరణాదిరాహిత్యముతో స్వచ్ఛమైన వానిగాను, అమృతం = అనాదిముక్తునిగాను, విద్యాత్ = గుర్తింపవలెను

శరీరములో జీవాత్మలో నుండువాడైనను పరమాత్మ నిర్దోషుఁడనియు, శరీరాదివిలక్షణుఁడనియు తెలిసికొని భావింపవలెనని సారాంశము.

"మృత్యుప్రోక్తాం నాచికేతోఽథ లబ్ధ్వా-విద్యా మేతాం
యోగవిధిం చ కృత్స్నం, బ్రహ్మప్రాప్తో విరజోఽభూ
ద్విమృత్యు-రన్యోఽప్యేవం యో విదధ్యాత్మ మేవ"

ప నాచికేతః = నచికేతసుఁడు, మృత్యుప్రోక్తాం = యమునిచే చెప్పఁబడిన, ఏతాం విద్యాం = ఈ బ్రహవిద్యను, యోగవిధిం కృత్స్నంచ = సమస్తమైన శివధ్యానయోగవిధానమును, లబ్ధ్వా = స్వీకరించి, బ్రహ్మప్రాప్తో బ్రహ్మముఁజేరినవాడై, విరజోవిమృత్యుః = క్షుత్పిపాసాదులు లేనట్టి జననమరణాది రహితంబు నగు నిజరూపము గలవాడు, అభూత్ = ఆయెను అన్యోఽపి = ఇతరుఁడు కూడ, అధ్యాత్మ = పరమాత్మను, విత్ = ఉపాసించి ధ్యానించునెడ, ఏవమేవ = నచికేతసునివలె ముక్తుఁడే నగును

"సహ నా వవతు సహ నౌ భునక్తు సహ వీర్యం కరవావహై,
తేజస్వి నా వధీత మస్తు మా విద్విషావహై"

ఓం శాంతిః శాంతిః శాంతిః.

"శాంతిః" = అని మున్మారు పలుకుట సర్వదోషశాంతిప్రదమగును. ధర్మవిరుద్ధమును బోధించు ఆచార్యుఁడు, నీతినియమరహితుఁడై ప్రశ్నించు శిష్యుఁడును ద్వేషపాత్రులగుదురని పైశాంతి పాఠములోని చివరి పదముయొక్క తాత్పర్యము.

ఇయ్యది
శ్రీ నీలకంఠ శివాచార్య ప్రణీత భాష్యమునకు
శ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రి మహోపాధ్యాయ కృత
సంస్కృత వ్యాఖ్యానమునకు "శివతత్త్వప్రభ" అను
శాంకరీయ ఆంధ్రానువాదమున కఠోపనిషత్తు నందలి
రెండవ అధ్యాయమునందలి మూడవ వల్లి-సర్వంబు
సమాప్తము.

కఠోపనిషత్-సారాంశము

ప్రథమాధ్యాయగత తృతీయవల్లి యందు "ఋతం పిబంతౌ" అను ప్రథమమంత్రమున "గుహాం ప్రవిష్టా వాత్మానౌ హి తద్దర్శనాత్" అను వ్యాససూత్రము ననుసరించి హృదయగుహయందు ఉన్నవారు జీవేశ్వరులే సనియు, బుద్ధి జీవులు కారనియు విశదమగుచున్నందున "ద్వాసుపర్ణా సయుజా సఖాయా" ఇత్యాది శ్రుతిచే 'భేదవ్యపదేశాచ్చ" అను వ్యాససూత్రముఁ బట్టియు జీవేశ్వరభేదము జీవేశ్వరసాహచర్యంబు కల్పితములు కావని తేట పడుచున్నందునను, "యస్య బ్రహ్మచ క్షత్రంచ" ఇత్యాది మంత్రమున-సమస్త జగత్తు పరమేశ్వరునకు ఆహారమగునని నిరూపించి-జగత్తు భ్రాంతిపరికల్పితము గానిదై నిత్యమగునని తేల్చినందునను, ముక్తజీవుఁడు గూడా మూర్ధన్యనాడిద్వారా శరీరమునుండి లేచి పరమ పదముఁజేరి-నిజ రూపావిష్కారముతో శివసాయుజ్యము నొందునని ప్రతిపాదించుట వలనను ఈ యుపనిషత్తు-శివాద్వైతపరమైనదే ననియు, కేవలాద్వైతమును బోధింపదనియు విదితమైనది.

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః

ప్రశ్నోపనిషత్సారాంశము

ప్రథమప్రశ్నలో గల పదునైదు (15) వాక్యములయందు భరద్వాజపుత్రుఁడగు సుకేశుఁడు, శిబిసంతానమగు సత్యకాముఁడు, గర్గగోత్రికుఁడు సౌర్యుని సంతానము నగు ఒకానొక మునీంద్రుఁడు, ఆశ్వలాయనసంతానమగు కౌశలుఁడు, భృగుగోత్రికుఁడు విదర్భి సంతానము నగు ఒకనొక జిజ్ఞాసువు, కాత్యాయన గోత్రికుఁడైన కబంధియను మహామహుఁడును వీరు ఆరుగురు- వేదార్థవిచారపరులు తపోనిష్ఠులునై పరబ్రహ్మను తెలియఁగోరినవారై బ్రహ్మజ్ఞాన పరిపూర్ణుఁడైన పిప్పలాదుఁడను మహామునిని శిష్యభావముతో సమీపించి ప్రశ్నింపగా-పిప్పలాదుఁడు- మొదట సృష్టిని గురించి దిగువ విధము ఉత్తరించెను.

సూర్యుఁడు చంద్రుఁడు మొదలగు ప్రపంచమును పరమేశ్వరుఁడు పుట్టించి దక్షిణోత్తరాయణాది కాలవిభాగము నేర్పరచియు యజ్ఞాది కామ్యకర్మల నాచరించినవారు చంద్రునిద్వారా స్వర్గముఁ జేరినవారై మరల భువిని జన్మించునట్లు విధించెననియు, నిష్కామ కర్మాచరణులు సూర్యుని ద్వారా పరమపదముఁజేరి పునర్జన్మ లేనివారగుదురనియు, అన్నము శివస్వరూపమగుటచే అన్నము వలన రేతస్సు, రేతస్సు వలన ప్రజలు జన్మింతురనియు, ప్రబోధించి.

"యేషాం తపో బ్రహ్మచర్యం-యేషు సత్యం ప్రతిష్ఠితం,
తేషా మసౌ విరజో బ్రహ్మలోకో-న యేషు జిహ్మమనృతం
న మాయా చేతి" అను వదునారవ వాక్యమున.........

శివజ్ఞానప్రదమైన శాంభవదీక్షాస్వీకారము అను తపస్సు, బ్రహ్మ చర్యము, (ఋతుకాలభార్యాగమనము) త్రికరణశుద్ధిని శివారాధనము, సత్ ప్రవర్తనము, సత్యవాక్యంబు గల మాహేశ్వరులకే-ప్రాకృతము కానట్టి శివలోకము లభించునని పిప్పలాదుఁడు-ముని షట్కమునకు ఉపదేశించెను.

ఆదిత్యుఁడనగా - జీవుఁడని, ఉదయమనఁగా సుషుప్తినుండి జాగ్రత్తని, నిర్వచించువారి వాదము-క్లిష్టార్థకమగునని పాఠకులు గ్రహింతురు గాక!

ద్వితీయ ప్రశ్నలో 13 వాక్యములు కలవు.

భార్గవుఁడైన వైదర్భి-పిప్పలాదు నిట్లు ప్రశ్నించెను.

ఈ శరీరమును పోషించువారెందరు? ఎవరీ శరీరధారణమును వెల్లడింతురు? శరీరధారకులలో ముఖ్యుఁడెవరు?

ఆకాశ వాయు అగ్ని ఉదక భూములు వాగాది ఇంద్రియములును శరీరమును నిలుపునవని పిప్పలాదుఁడు చెప్పఁదొడఁగెను. ఆవ్వానిలో ప్రాణవాయువు ముఖ్యమనఁగా-ఆకాశాదులు అంగీకరింపనందున ప్రాణము శరీరమునుండి బయలుపడుచుండ ఆకాశాదులు అనివార్యముగ శరీరమును విడిచిపోవలసి వచ్చెను. అట్టితటి ప్రాణము యథాస్థానమున నుండగా ప్రాణము నాశ్రయించి ఆకాశాదులు శరీరమునందు ఉండఁగలిగినవి. అందువలన వాఙ్మనశ్చక్షుః శ్రోత్రములు సంతసించి ప్రాణమును దిగువ విధము ప్రశంసించినవి.

ముఖ్యప్రాణమే అగ్నిరూపమున తపించునది, మరియు సూర్య రూపమున ప్రకాశించునదియు, మేఘరూపమున వర్షించునది— ప్రాణమేను, త్రిలోకాధిపతియగు ఇంద్రరూపమున—ముఖ్యప్రాణము ప్రవర్తించును. ఈ ప్రాణమే మేఘాదులను విడదీయును. చరాచర ప్రపంచమును ధరించు భూమి-ప్రాణమేను, ఈ ముఖ్యప్రాణమే-ఓషధులను పోషించు చంద్రుడగుటయే గాక సూక్ష్మము,స్థూలంబు, అజరామరత్వము నొసగు శివతత్త్వంబు నగు. ఋగ్యజుః సామవేదములు,స్థావర జంగమములన్నియు,వేదచోదితమైన యజ్ఞాదిసుకృతంబు యజ్ఞాదులను రక్షించు క్షత్రియవర్గము, యజ్ఞాదులను ప్రవర్తింపఁ జేయు బ్రాహ్మణవర్గంబు, సమస్తము ప్రాణమునందే ఆధారపడి యున్నవి.

ప్రాణమా! నీవే బ్రహ్మదేవుఁడవై గర్భమునందు సంచరింతువు, పుత్రాది రూపమున జన్మించువాడవు నీవేను, ప్రజలు నీ కొరకు అన్నాదులను బలిగా సమర్పించుచుందురు, దేవతలకు హవిస్సులను, పితరులకు ప్రియమైన ఆహారమును. అందించువాడవు నీవేను, అథర్వాంగిరసులు అను ఋషుల యథార్థప్రవర్తనను నీ వలననే సంభవించును. ప్రాణమా! నీవు పరమేశ్వరుఁడవు, తేజస్సుతో రుద్రుఁడవు, రక్షించు విష్ణువగుదువు, నీ శక్తి—వాగింద్రియమున శ్రోత్రమున నేత్రమందు మనస్సునందును ప్రతిష్ఠింపఁడియున్నందున వాగాది మనఃపర్యంతములగు ఇంద్రియములయందు గల నీ శక్తిని శుభమయముగ నొనర్పుము!

ప్రాణమా! భూలోకమున స్వర్గమందును గలదంతయు నిన్నాశ్రయించియున్నది. అందువలన-మాత పుత్రులను వలె-నీవు మమ్మురక్షింపుము! మాకు సంపత్తును తెలివి నొసఁగుము!

తృతీయ ప్రశ్నలో 12 వాక్యములు కలవు

కౌశల్యుఁడు పిప్పలాదుని దిగువ విధము ప్రశ్నించెను.

పూజ్యుఁడా! ప్రాణము దేనినుండి ఆవిర్భవించును! శరీరమున ఎట్లు ప్రవేశించును? జీవాత్మకంటె వేరు ఎట్లుండును? ఏ విధముగా శరీరమునుండి లేచును? సూక్ష్మ స్థూల శరీరముల నెట్లు నిలుపును?

పిప్పలాదుఁడు-ఇట్లు సమాధానము నొసఁగెను.

ముఖ్యప్రాణము పరమేశ్వరుని వలననే ఆవిర్భవించి-మనః కృతమగు కర్మ ననుసరించి శరీరమునఁ బ్రవేశించును-పురుషుని నీడవలె-జీవాత్మననుసరించి ప్రాణము గమనాగమనములఁ జేయు చుండును. రాజు-అధికారులను నియమించునట్లు-ముఖ్యప్రాణమే నేత్రాది ఇంద్రియములను ప్రేరేపించుచు స్వకార్యములయందు వేరు వేరు ప్రవర్తింపజేయును.

ప్రాణము నీవిధము భావించువానికి వంశవృద్ధియే గాక-మోక్షము సమకూరును. అనఁగా ప్రాణాధారుఁడగు పరమేశ్వరుఁడు-బంధవిముక్తిఁజేయునని తెలియవలెను.

ప్రాణము-పరమేశ్వరునినుండి వచ్చుననియు, కర్మచేత నిలచు ననియు. అపానాదులపై అధికారము కలిగియుండుననియు, శరీర ములో ప్రాణ అపాన వ్యాస ఉదాన సమాన రూపమున నివసించు ననియు, బాహ్యమున సూర్యరూపమున ప్రకాశించుననియు భావించు శివోపాసకుఁడు-ముక్తుఁడగును.

చతుర్థప్రశ్నలో గల 11 వాక్యముల యందు-

సౌర్యాయణి యనఁబడు గార్గ్యుని ప్రశ్నకు పిప్పలాఁదుఁడు-"సూర్యుఁడు అస్తమించునపుడు కిరణములు సూర్యునితో ఏకీభవించు

నట్లు-నేత్రాది ఇంద్రియములు స్వప్నమునందు మనస్సుతో ఏకీభవించును నిద్రయందు వినుట, చూచుట, వాసనఁజూచుట, రుచిఁ గ్రహించుట, తాకుట, మాటలాడుట, స్వీకరించుట, సంతోషించుట, విడచుటయు, సంభవింపవు. అందువలన నీ పురుషుఁడు నిద్రించుచున్నట్లు మాత్రము గుర్తింపఁబడును. ప్రాణవాయువు మాత్రము ఈ శరీరమునందు మేలుకొనియుండును.

ఇంద్రియములన్నియు మనస్సులో దాగియున్న తరువాత, గాఢనిద్రకు ముందు ఈ జీవాత్మ-స్వప్నమునందు రథగజాద్యుపయోగమును పొందును. చూచినదానిఁగాంచును. వినినదానిని వినును. దేశదేశములయందు దిగంతరములయందును సంచరించును, సర్వస్వరూపుఁడై సమస్తము ననుభవించును.

జీవాత్మ - పరమాత్మతో నేకీభవించినతఱి- స్వప్నములను గాంచక- ఇంద్రియసుఖాతీతమైన సుఖము ననుభవించును. మరియు సుషుప్తి (గాఢనిద్ర) యందు పక్షులు గూడులయందువలె-విషయములతో కూడ ఇంద్రియములన్నియు జీవాత్మద్వారా పరమాత్మయందు విశ్రమించును. జీవాత్మ గూడ పరమాత్మయందే విశ్రమించును. ఇట్టి పరమాత్మను జీవాత్మ-ఏనాటికైన నుపాసించి దర్శించినచో ముక్తుండగును-అని సమాధానము నొసఁగెను.

పంచమ ప్రశ్నలో 7 వాక్యములు గలవు.

సత్యకాముఁడు దిగువ విధము ప్రశ్నించెను.

పూజ్యుఁడా ! మానవులు జీవితాంతము వరకు ప్రణవమ ఓంకారఘటితమైన శివపంచాక్షరీమహామంత్రము ననుసంధించి(జపించెడ-ఎట్టి స్థానము లభించును ?

పిప్పలాదుఁడు చెప్పఁదొడఁగెను.

సత్యకామా! ఓంకారము-పరమనియు అపరమనియు రెండు విధములు గలదగును. అపరము-చతుర్ముఖుఁడు అవధికలది కాగా-పరము శివుఁడే నగును. చతుర్ముఖాదుల నుద్దేశించి ఓంకారమును జపించువారు - మానవలోకమున సదాచారసంపన్నులుగ జన్మించి మానవసుఖము నంతయు ననుభవింతురు.

ఓంకారమును రెండుమాత్రలు గలదానిగ జపించువారు-చంద్రుని ద్వారా స్వర్గముఁజేరి అమరసౌఖ్యముల ననుభవించి మరల భూలోకమున ఉత్తములై జన్మింతురు.

అ. ఉ. మ్. అను త్రిమాత్రలు గలదిగ ప్రణవమును ప్రణవసహిత శివపంచాక్షరిని జపించుచు శివుని ధ్యానించువారు ఆరు క్షుత్పిపాసాది ఊర్ములు లేనట్టి. జరామరణరహితంబు నగు పరమాత్మఁజెందినవారై పరమకైలాసమున శివానందము ననుభవించుచుందురు. అట్టి వారికి పునర్జన్మ సంభవింపదు.

షష్ఠప్రశ్నలో 8 వాక్యములు గలవు.

పదునారు కళలు గల పురుషుఁడెచ్చోట నుండునని భరద్వాజుఁడు ప్రశ్నింపగా పిప్పలాదుఁడు-

పదునారు కళలు ఎవనియందు ఆవిర్భవించినవో అట్టి పరమపురుషుఁడు-ఈ శరీరమునందే జీవాత్మనంటుకొని యుండును. పరమాత్మ శరీరమునఁబ్రవేశించుటను శరీరమునుండి లేచుటను జీవాత్మద్వారా చేయుచున్నను జీవాత్మవలె కర్మబద్ధుఁడు కానివాడై స్వతంత్రభావమున సర్వశరీరములయందు విహరించువాడగును. అందువలన ప్రాణము మొదలగు పదునారు కళలు గలవాడు-పరమపురుషుఁడే నని తెలియవలెను.

గంగాది మహానదులు-సముద్రమునాశ్రయించుతఱి విభజింప రాని నామరూపములు గలవగునట్లు-ఈ ప్రాణాదిషోడశకళలు-జీవాత్మ - పరమాత్మఁజెందినపుడు-స్థూలములైన నామరూపములు లేనివగును. అట్టి శివోపాసకుఁడు అమృతుఁడు పరిపూర్ణుఁడు నగును. ప్రాకృతనామరూపములు లేనివాడై శివసముఁడగునని భావము. ఇంతమాత్రము నేనెరుగుదును. ఇంతకు మించినది లేదని—నిర్వ చించెను.

అట్టితఱి—ఆరుగురు మునులు-మా అజ్ఞానమును తొలగించి శివజ్ఞానము నంకురింపఁజేసిన పరమాచార్యుఁడవని — పిప్పలాదుని ప్రశంసించి-ప్రణామాదులతో సత్కరించిరి.

(మొత్తం 66 వాక్యములు) ప్రశ్నోపనిషత్సారాంశము-

సమాప్తము.

ఓమ్

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః

అథర్వణవేదమున శౌనక శాఖయందలి

ముండకోపనిషత్తు

శివతత్త్వ ప్రభాఽఽలంద్రీకరణము

నిర్మల శంకరశాస్త్రి

శాంతిమంత్రము

"ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః! భద్రం పశ్యేమాక్షభి ర్యజత్రాః। స్థిరై రంగై స్తుష్టువాగ్ంస స్తనూభిః, వ్యశేమ దేవహితం యదాయుః। స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః, స్వస్తినః పూషా విశ్వే దేవాః। స్వస్తిన స్తార్క్ష్యోఽరిష్టనేమిః, స్వస్తినో బృహస్పతి ర్దధాతు".

ఓం శాంతిః శాంతిః శాంతిః

మంత్ర పదార్థము-

దేవాః! = చక్షుఃశ్రోత్రాది ఇంద్రియాభిమాని దేవతలారా!, కర్ణేభిః = మాచెవులతో, భద్రం = సర్వమంగళాస్పదమగు శివ పంచాక్షరీ మహామంత్రమును, శృణుయాము=వినుటకు సమర్థులము

అగుదుముగాక! అక్షభిః = నేత్రములతో, భద్రం = ఇష్టలింగరూపుఁడగు సదాశివుని, పశ్యేమ = చూడఁగలుఁగుదుము గాక! స్థిరైః = నిత్యములగు, అంగైః = సర్వజ్ఞత్వాది షడంగములతో కూడనుండునట్టి, భద్రం = ఇష్టలింగమును, యజత్రాః = ధరింతుముగాక! ఇందువలననే తుష్టువాంసః = ఇష్టలింగధారణపూజనాదులచే సంతృప్తిపడు మేము. దేవహితం = బ్రహ్మవిష్ణ్వాదిదేవతలకు ఇష్టమైన శివలింగమును, యదాయుః = దేవాదులలో మా ఆయుష్యము ఉన్నంతవరకు, తనూభిః = స్థూలశరీరాదులచే, వ్యశేమ = పొందుదుము గాక!

వృద్ధశ్రవాః = పెంపొందిన కీర్తి గల యట్టి, ఇంద్రః = దేవేంద్రుఁరు, నః = మమ్ము, స్వస్తి = శివలింగమును, దధాతు = ధరింపఁజేయుగాక! పూషా = సూర్యుఁడు, విశ్వేదేవాః = విశ్వేదేవతలు, తార్క్ష్యః = గరుత్మంతుఁడు, అరిష్టనేమిః = శుభప్రాపకుఁడైన విష్ణువు, బృహస్పతిః = దేవాచార్యుఁడును, స్వస్తి దధాతు = ఇష్టలింగమును ధరింపఁజేయుదురు గాక!

లింగమహాపురాణమున

శ్లో॥ భద్రం పరశివం భక్త్యా-శృణుయామ సురర్షభాః।
భద్రం నేత్రైః ప్రపశ్యామో-లింగరూపం సదాశివమ్ ॥
భద్రం యజామః సతతం-తుష్టువామో యథావిధి।
యావదాయుః ప్రవర్తేత-తావద్దేవహితం శివమ్ ॥
తనూభిః సతతం భక్త్యా-స్థాపయామో యథావిధి ॥
స్వస్త్యాఖ్యం శాంభవం లింగ-మింద్రో వృద్ధశ్రవాస్తథా।
పూషా చ విశ్వేదేవాశ్చ-తార్క్ష్యో విష్ణుస్తథైవ చ॥
బృహస్పతిస్తథా లింగం-దధాతు పరమైశ్వరమ్ ॥

అమరశ్రేష్ఠులారా! పరశివాత్మకము సర్వమంగళాస్పదంబు నగు శివపంచాక్షరీ మహామంత్రమును వినఁగలుఁదుము గాక! ఇష్టలింగస్వరూపుడైన సదాశివుని కన్నులతో చూడఁగలుఁగుదుము గాక! ఇష్టలింగము నహోరాత్రములు ఆజన్మాంతము ధరింతుముగాక! ఇష్టలింగధారణ పూజనాదులచే సంతృప్తిపడునట్టి మేము-స్థూలదేహాదులచే ఆయుష్యమున్నంతవరకు భక్తిచే అరాధింతుము గాక !

స్వస్తి యనఁబడు శివలింగమును గొప్ప కీర్తిగల-దేవేంద్రుఁడు, సూర్యుఁడు, విశ్వేదేవతలు, గరుత్మంతుఁడు, విష్ణుమూర్తి బృహస్పతియు (శివలింగమును) ధరింపఁజేయుదురు గాక! అని శ్లోకార్థసంగ్రహము

ముండుకోపనిషత్తు-ప్రథమము, ద్వితీయము, తృతీయంబు నని మూడు విభాగములు గలది కాగా-ఒక్కొకవిభాగమున రెండేసి ఖండములు నిర్దేశింపఁబడినవి.

ప్రథమముండకమున-ప్రథమఖండమునందు ఎనిమిది వాక్యములు గలవు.

విష్ణ్వాది దేవతలలో మొదటివాడైన చతుర్ముఖబ్రహ్మదేవుఁడు పరమేశ్వరునినుండి జన్మించి జగత్తును సృజించి పాలించువాడయ్యెను. అట్టి బ్రహ్మదేవుఁడు-సమస్త విద్యాధారమగు వేదవిద్యను జ్యేష్ఠ పుత్రుఁడైన అథర్వునకు ఉపదేశించెను.

అథర్వుఁడు = అంగిఋషికి, అంగిఋషి = భరద్వాజ పుత్రుఁడైన సత్యవాహునకు, సత్యవాహుఁడు=అంగిరస్సునకు నుపదేశించిరి. ఇఁట గురుపరంపర-వేదవిద్య-ప్రవర్తించుటకు చెప్పబడినది.

ఆత్యాశ్రమి గృహస్థుఁడు నగు శౌనకుఁడు- సమిధలు

మొదలగు వానిని చేతఁబట్టుకొని అంగిరస్సును సమీపించి "భగవానుఁడా! దేనిని తెలిసికొనినచో చరాచరప్రపంచమంతయు తెలియునని ప్రశ్నించెను అంగిరస్సు-శౌనకునకు దిగువ విధము సమాధానము నొసఁగెను. పర, అపర అనఁబడు విద్యలు రెండని బ్రహ్మవిదులు వక్కాణింతురు. ఋగ్యజుఃసామాథర్వవేదములు, శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము నను వేదాంగములును అపరవిద్య యనఁబడును.

"అథ పరా-యయా తదక్షర మధిగమ్యతే" 5వ వాక్యము.

ప. "యయా = ఏ మహావిద్యచేత, (నాలుగవవాక్యమునగల యచ్ఛబ్దముచే పరామృష్టమైన) తత్ = అట్టి, అక్షరం = పరశివలింగము, అధిగమ్యతే = పొందఁబడునో, (సా = అట్టివిద్య) పరా = శ్రేష్ఠమైనదని, అథ = అపరవిద్యానిరూపణానంతరము అని ఇందు నిర్దేశింపఁబడినది.

ఇందుకు ప్రమాణములు-

"పంచాక్షరీం పరాం విద్యాం" అను అనుభవసూత్రోక్తిచే-ప్రణవసహిత శివ పంచాక్షరీమహామంత్రము-పరావిద్యయని తేటపడుచున్నయది

శ్లో॥ జపేత్ పంచాక్షరీ మేతాం-విద్యాం పాశవిముక్తయే ।
యథాఽనాది ర్మహాదేవః—సిద్ధః సంసారమోచకః ॥
తథా పంచాక్షరో మంత్రః-సంసారక్షయకారకః॥

"ఓం నమఃశివాయేతియాజుషమంత్రోపాసకో రుద్రత్వ మాప్నోతి."

"యజుర్వేదమున రుద్రాధ్యాయమునందు చెప్పఁబడిన-ఓం నమఃశివాయ అను మహామంత్రమును శివప్రీత్యర్థము జపించు వాడు శివసాయుజ్యము నొందును" త్రిపురతాపిన్యుపనిషత్తు.

సద్యోజాతాది పంచ బ్రహ్మములనుండి నకారాదిపంచాక్షరములు ఉద్భవింపగా-నకారాదులనుండి ఋగ్వేదాదులు అవిర్భవించుటచే పంచాక్షరి - కారణమనియు, ఋగ్వేదాదులు - కార్యమనియు తెలియవలెను.

శ్రీ రుద్రాధ్యాయము, పంచబ్రహ్మోపనిషత్తు, పంచాక్షర జాబాలోపనిషత్తు, సిద్ధాంతశిఖోపనిషత్తు, భస్మజాబాలోపనిషత్తు మొదలగు పరమప్రమాణములు-ప్రణవసహిత శివపంచాక్షరీ మహా విద్య-వేదవిహితంబని-చాటుచున్నవి.

"పంచాక్షరీ పరా విద్యా-శివజ్యోతి రవాప్తయే"శివాగమము

ప్రణమము-ఆకార ఉకార మకార బిందునాదములు కలిగి యుండుటచే సూక్ష్మపంచాక్షరి యనియు, నకారాదులు గలది. స్థూల పంచాక్షరి యనియు వివేకము.

శ్లో॥ తద్బీజం సర్వవిద్యానాం-మంత్ర మాద్యం షడక్షరం।
అతిసూక్ష్మం మహార్థం చ-జ్ఞేయం తద్వటబీజవత్॥
సాంగాని వేదశాస్త్రాణి-సంస్థితాని షడక్షరే॥

ఇత్యాది ప్రమాణములు-శివపంచాక్షరియే పరవిద్యయగునని నిరూపించినవి.

"నాయమాత్మా బలహీనేన లభ్యః" ఇత్యాది శ్రుతి వాక్యములు శివపంచాక్షరీ స్వీకార పూర్వక లింగధారణదీక్ష-అను బలము లేని వానికి-పరమాత్మ-లభ్యుఁడు కాదని విశదీకరించినవి.

ఇష్ట ప్రాణభావలింగాత్మకుఁడైన శివుఁడు - శాంభవదీక్షచే శుద్ధమైన అంతఃకరణము గలవానికే సాక్షాత్కరించుననియు, బహిరింద్రియములచేఁ గుర్తింపఁబడనివాఁడనియు(భావమనఁగా-శివోఽహంభావమగును) "శివోఽహమితిభావోహి-శివత్వావాప్తికారణమ్" అని ఆచార్య భగవత్పాదుల నిర్వచనము. గోత్ర వర్ణములు జ్ఞానకర్మేంద్రియములు లేనివాఁడనియు దేశకాలపరిచ్ఛేదరహితుఁడు, అక్షరపదవాచ్యుఁడు, త్రికాలాబాధ్యుఁడు, సూక్ష్మాతిసూక్ష్ముఁడు విశ్వకారణుఁడు ననియు ఆరవ వాక్యము నిరూపించినది.

ఇట్టి పరంజ్యోతిః స్వరూపుఁడైన శివుని-వేధా మను క్రియాత్మకమగు లింగధారణదీక్షచే చిచ్ఛక్తి వికాసము గల ధీరులే దివ్యనేత్రముతో-చూడఁగలుగుదురు.

సాలెపురుఁగు-తనలో దాగిన దారములను పుట్టించి-తనలో ఇమిడ్చుకొనువట్లు, నేలలోని ఓషధులు వర్షాకాలమున అంకురించి వేసవివేళ నంతరించునట్లును, శరీరధారియగు జీవాత్మనుండి వెంట్రుకలు ఉదయించునట్లును, అక్షరుఁడనఁబఱఁగునట్టి శివుని వలన చేతనాచేతన ప్రపంచము జన్మించి శివునిలో దాగియుండును.

ఏడవ వాక్యముఁదగు భావము.

జ్ఞానమయమగు తపస్సు (స్వసంకల్పము)చే బ్రహ్మము (శివుఁడు) విస్తరించెను. అట్టి శివుని నుండి-త్రిగుణమయంబగు ప్రకృతి-ఆవిర్భవించినది. ప్రకృతినుండి ప్రాణము మనస్సు జీవకోటియు శివపంచాక్షరీ మంత్రజపముతో కూడిన శివలింగార్చనాది సుకృతముల వలన మోక్షము అనదగు శివసాయుజ్య ప్రాప్తియు సంభవించినవి.

మోక్షము నిత్యమైనను లింగధారణ పూర్వక శివారాధనా

దులచే దురితనివృత్తి కాగా చిత్తశుద్ధి ఏర్పడును. చిత్తశుద్ధితో ధ్యానించువారిని శివుఁడు అనుగ్రహించి ముక్తులఁజేయును గాన నిట అమృతశబ్దవాచ్యంబగు మోక్షము-శివారాధనాదులచే సంభవించునని ప్రతిపాదింపఁబడినది.

శో॥ కీటో భ్రమరయోగేన-భ్రమరో భవతి ధ్రువం,
మానవః శివయోగేన-శివో భవతి సర్వదా॥

కీటము (పుఱుఁగు) భ్రమర (తుమ్మెద) సంబంధముచే భ్రమరమైనట్లు మానవుఁడు శివసంబంధము (లింగధారణ)చే ఎల్ల కాలము శివుఁడై యుండును.

"కర్మచే మోక్షము లేదు" "నాస్త్యకృతః కృతేన" అను శ్రుతి వాక్యము-ఫలాభిసంధిగల కర్మతో మోక్షము లభింపదు. అను నర్థముఁజెప్పును. గాన శాంభవదీక్ష గూడా నిష్కామ్యమగుటచే మోక్షావహమగునని తెలియవలెను.

"యః సర్వజ్ఞః సర్వవిత్-యస్య జ్ఞానమయం తపః"
తొమ్మిదవ వాక్యము.

సమస్తమును గుర్తించునట్టి సర్వజ్ఞుఁడు-జ్ఞాన (ఆలోచన) మయమైన తపస్సు నొనర్చువాడు నగు శివుని నుండి మూల ప్రకృతియే గాక స్థూల ప్రపంచగతములైన నామరూపములు అవిర్భ వించుచున్నవి

"కృశానురేతాః సర్వజ్ఞో - ధూర్జటి ర్నీలలోహితః"అను నిఘంటువు-సర్వజ్ఞశబ్దము శివునకే చెల్లునని-నిరూపించుటచే నిట-

"సర్వవిత్" విశేషణము, "సర్వజ్ఞః" విశేష్యంబునని తెలియ వలెను.

సూతసంహితలో బ్రహ్మగీతయందు-

"యుష్మభ్యోఽహం మహాప్రాజ్ఞో-మత్తః ప్రాజ్ఞోజనార్దనః,
జనార్దనాదపి ప్రాజ్ఞః-శ్రీరుద్రో గురుమూర్తిమాన్"
తతః ప్రాజ్ఞతమః సాక్షాత్-శివఃసాంబః సనాతనః
సఏవ సాక్షాత్ సర్వజ్ఞ-స్తతోఽన్యో నాస్తి కశ్చన"

"మీ కంటె నేను ప్రాజ్ఞుఁడను, నన్ను మించినవాఁడు నారాయణుఁడు, నారాయణు నతిక్రమించి శ్రేష్ఠమైన స్వరూపముగలవాడు శ్రీరుద్రుఁడు. శ్రీరుద్రునికన్న నత్యంత శ్రేష్ఠుఁడు-సనాతనుఁడైన సాంబశివుఁడగును. సాంబశివుఁడే సాక్షాత్ సర్వజ్ఞుఁడనఁబఁగును. సాంబశివుని మించినవాఁడు మరియొకఁడు లేడు. శివుఁడే-లింగము,

లింగమనఁగా-శక్తి విశిష్ట శివుఁడని "లింగంతు శివయోర్దేహః" అను శివాగమవాక్యము విశదీకరించినది.

"లయం గచ్ఛతి యత్రైవ-జగదేతచ్చరాచరం, పునఃపునః సముత్పత్తిం-తల్లింగం బ్రహ్మ శాశ్వతమ్" సిద్ధాంతశిఖామణి.

ఇయ్యది-ప్రథమ ముండకమున-ప్రథమ ఖండము-

అథ

ప్రథమ ముండకమున ద్వితీయ ఖండము-

ఇందు 13 వాక్యములు గలవు.

"ఋగ్వేదాదులలో గల శివప్రీతికరములైన శివపంచాక్షరీ జపాది సుకృతములను అతీంద్రియ విషయ జ్ఞాన సమర్థులైన కవులు నిరూపించిరి. అయ్యవి-త్రేతాదియుగములయందు శివయోగ సిద్ధ

పురుషులచే బహుళ ప్రచారము చేయఁబడినవి. మోక్షాపేక్షతో శాంభవ దీక్షితులగు వారందరు అట్టి సుకృతములనే ఆ జన్మాంతము ఆచరింప వలెను-అని ప్రథమవాక్య సారాంశము. శాశ్వత శివసాయుజ్యము నకు ఇదియే శ్రేష్ఠమైన మార్గము. ఇందుకు-

"నకారాది యకారాంతం-జ్ఞాత్వా పంచాక్షరీం జపేత్"

"నకారము మొదలుకొని యకారము వరకు గల పరమార్థ మును గురుముఖతః తెలిసికొని శివపంచాక్షరీ మహామంత్రమును జపింపవలెను."

"యదా చర్మవదాకాశం-వేష్టయిష్యంతి మానవాః,
తదా శివ మవిజ్ఞాయ-దుఃఖస్యాంతో భవిష్యతి"

"ఆకాశమును చర్మవలె చుట్టఁగలిగినచో-మానవదేవతాదులు శివారాధనము లేకయే మోక్షమును పొందవచ్చును. అనఁగా శివు నారాధించినవారే ముక్తులగుదురని భావము."

ఇత్యాది ప్రసిద్ధ ప్రమాణములు-ప్రోద్బలకములగుచున్నవి. 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, వాక్యములయందు ప్రజ్వలించు అగ్నియొక్క జ్వాలాగ్రము కదులునప్పుడు వేల్వఁబడు హవిస్సు స్వర్గసుఖాదుల నొసఁగును.

దర్శపౌర్ణమాసీ చాతుర్మాస్య ఆగ్రయణములనఁబడు ఇష్టులు లేనిది, అతిథిసత్కారము, వైశ్వదేవాదులు లేనిది, విధిలేనిదియు, నగు హవనము-భూలోకాది సత్యలోకాంతములగు ఏడు లోకములను లభింపఁజేయును.

కాలి, కరాలి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరుచి, అను కదలుచుండు ఏడు నాలుకలు-అగ్నికి ఒప్పారునవి.

ఈ సప్తవిధములైన అగ్నిజిహ్వలయందు హవనము నాచరించు వానిని- అమరప్రభువైన చతుర్ముఖుని సత్యలోకమునకు సూర్య కిరణములు గొంపోవును.

భువిని, విధివిహితములైన అహుతులు-యజమానుని-సూర్య రశ్మిద్వారా-రమ్ము రమ్మని ఆహ్వానించును. ప్రియముఁబలుకును. ఇదియే మీకు సుఖమునొసఁగు బ్రహ్మలోకంబని చూపెట్టును-

జీర్ణములైన నౌకలు-నీటను ముంచునట్లు-యజ్ఞాది రూపము లగు కామ్య కర్మలు-సంసారసముద్రనిమగ్నులఁజేయుచు ఇదియే శ్రేయస్కరమని భావించు మూఢులకు జనన జరా మృత్యువులను పునఃపునః కలుగఁజేయును.

"అమృతస్య దేవధారణో భూయాసం" "సర్వాలింగగ్గ్ స్థాపయతి పాణిమంత్రం పవిత్రమ్" "ఓం నమో బ్రహ్మణే, ధారణం మేఽస్త్వనిరాకరణం ధారయితా భూయాసం" "మోక్షార్థినాం ముక్తిహేతు-ర్లింగధారణ మిష్యతే"

ఇత్యాది అసంఖ్యాత ప్రమాణములచే ప్రతిపాదింపఁబడు శివలింగ ధారణము నిష్టపడనివారు-మూఢులై-కామ్యకర్మప్రవృత్తులగుదురు. లింగధారణాంగములైన భస్మరుద్రాక్షధారణ శివమంత్ర జపముల నాచరింపనివారును మూఢులనఁబడుఁగుదురు.

కామ్యకర్మకర్తలు-శివవిజ్ఞానదూరులై-తాము పండితులమని భావించుచు జరామరణాదులచే బాధపడుచుందురు.

యజ్ఞాదులు స్వర్గ సుఖప్రదములగుటచే సుకృత శ్రేష్ఠములని గుర్తించి-కామ్యకర్మను మించిన సుకృతములేదని భావించియు

స్వర్గాదులయందు అమరసుఖము ననుభవించి–మరల భువిని జన్మించు చుందురు.

11 వ వాక్యము

"తపః శ్రద్ధే యే హ్యుపవసంత్యరణ్యే-శాంతా విద్వాంసో భైక్షచర్యాం చరంతః॥ సూర్యద్వారేణ తే విరజాః ప్రయాంతి-యత్రామృతః స పురుషో హ్యవ్యయాత్మా"

భస్మరుద్రాక్షధారణ శివపంచాక్షరీ మంత్రజపాది శివధర్మ ములతో కూడిన ఇష్ట ప్రాణభావలింగారాధనము తపస్సనఁబడును. గురూపదిష్ట మహామంత్రానుష్ఠానమునందు విశ్వాసము-శ్రద్ధయనఁ బడును ఇట్టి తపః శ్రద్ధలుగలవారై ఏకాంత స్థలమున నివసించుచు యాచనతో జీవించువారై శాంతస్వభావులై–శివజ్ఞానులై ప్రవర్తించు వారు–నిర్మలులై సూర్యమండలమును భేదించి అమృత పురుష శబ్దవాచ్యుఁడు నిత్యస్వరూపుఁడునగు పరమేశ్వరునిచే అధిష్ఠింపఁబడిన శివలోకముఁజెంది శివానందామృతరసాస్వాద లోలురగుదురు.

ఇందుకు ప్రమాణములు–

శ్లో॥ లింగాంగ సంగం కుర్వంతం-దృష్ట్వా ద్విజవరం రవిః।
స్థానాచ్చలత్యయం భిత్వా-మండలం మే వ్రజేచ్ఛివమ్॥

లింగధారియగు శ్రోత్రియుని రవి చూచి "ఈతఁడు నా మండలమును భేదించి శివుఁజేరు"నని తన స్థానమునుండి కదలును" అని వాతూలాగమశ్లోకార్థము

అమృత పురుషశబ్దములు–బహుశ్రుతిప్రమాణములచే పరమేశ్వరునే చెప్పునని విదితమగుటచే–ఇట ముముక్షుప్రాప్యము శివలోకమే యగుననియు, చతుర్ముఖబ్రహ్మలోకపరమగు వ్యాఖ్యానము సమంజసము కాదనియు తెలియవలెను.

12 వ వాక్యము

"పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో-నిర్వేద మాయా న్నాస్త్యకృతః కృతేన। తద్విజ్ఞానార్థం స గురు మేవాభిగచ్ఛేత్-సమిత్పాణి శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్"

ఎవడు స్వర్గాదిలోకములు-కర్మసంపాదితములగుటచే అనిత్య ఫలము నొసగునవని మదిని పరిశీలించి వైరాగ్యమును పొందునో, అట్టి శైవ బ్రాహ్మణుఁడు-ఫలాభిసంధిగల (కామ్య) కర్మతో మోక్షము లభింపదని నిశ్చయించుకొనినవాడై పరశివతత్త్వమును తెలిసికొనుటకై-శివనిష్ఠుఁడు శ్రోత్రియుఁడు నగు కల్యాణదేశికుని (శాంభవ దీక్ష గురువును) లింగధారణాంగ హవనాదులకు ఉపయోగించు సమిధలు మొదలగువానిని చేతఁబట్టుకొని-ఆశ్రయింపవలెను.

"శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం స్వగురుం గచ్ఛేద్యథావిధి, గురుస్తస్మై పరాం విద్యాం-దద్యాత్ బ్రహ్మాత్మబోధినీమ్" అను రుద్రహృదయోపనిషద్వాక్యము—పై విషయమును సమర్థించుచున్నయది.

"వ్రతమేత చ్ఛాంభవం, తత్సమాచరే న్ముముక్షు రపునర్భవాయ"

"ముముక్షువు - పునర్జన్మరాహిత్యమునకై శివలింగధారణాత్మకమగు శాంభవవ్రతము నాచరింపవలెను" తైత్తిరీయము-

"తస్మై స విద్వా నుపసన్నాయ సమ్యక్—ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ। యేనాక్షరం పురుషం వేద సత్యం—ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్"

లింగాంగ సామరస్యజ్ఞానము గల ఆచార్యుఁడు-యథావిధి సమిత్ పాణియై తనను సమీపించినట్టి, నిర్మల మనస్కుఁడగు. శుద్ధ చిత్తుఁడునైన శిష్యునకు-అక్షరుఁడు పరిపూర్ణుఁడు సత్యస్వరూపుఁడు నగు పరశివుని తెలుపునట్టి, యథార్థముగ బ్రహ్మవిద్య యనఁబఱఁగు శివపంచాక్షరీ (షడక్షరీ) మహామంత్రము నుపదేశింపవలెను.

"పంచాక్షరీ పరావిద్యా-సతారా తు షడక్షరీ"

అను ప్రమాణము ననుసరించి-పంచాక్షరీ -- లేక-షడక్షరీ మంత్రము పరవిద్యయని తెలియుటచె పరవిద్యయే బ్రహ్మవిద్యగా ఇఁట చెప్పఁబడినది.

"తస్యై దక్షిణకర్ణే తు-నిగూఢమపి కీర్తయేత్" రేణుకాచార్యులు తత్త్వమస్యాది మహావాక్యములును లింగాంగసామరస్యమునే బోధించునవి. తత్-లింగము, త్వం-నీవు, అసి అగుదువు. త్వం అనుదానితో జీవాత్మ-అంగముగాను, తత్ అనుదానితో పరమాత్మ-లింగముగాను నిరూపింపఁబడుటచే ఏనాటికైనను జీవుఁడు శివుఁడగునని తేటపడుచున్నది

"పంచాక్షరప్రభావేన-సర్వేకామాః సమాహితాః, సత్యం
సత్యం పునః సత్యం-సర్వసంజీవనౌషధమ్"
క్రియాసారము.

"పంచాక్షరీ జపమహిమతో భుక్తి ముక్తి రూపములగు కోరికలన్నియు సిద్ధించును శివపంచాక్షరీ మహా మంత్రానుష్ఠానము - సాధకులందరిని శాశ్వతులుగ నొనర్చు పర మౌషధమగును"

ప్రథమ ముండకమున-ద్వితీయ ఖండము-సమాప్తము.

ద్వితీయముండకము-ప్రథమఖండము

ఇందు 10 వాక్యములు గలవు

1 వ వాక్యమున

బాగుగా మండుచున్న అగ్నినుండి-అగ్నిఁబోలిన వేలకొలది మిణుగురులు-ఆవిర్భవించినట్లు-శివునినుండి జీవాత్మలు-సృష్టికాలమున విడిబడి-ప్రళయమున-అక్షరమనఁబడు పరశివు నాశ్రయించును.

ప్రళయములో జీవాత్మలు మరుగుపడుటయే తిరోభావమనఁబడును. జీవపరమాత్మలకు అంశాంశిభావమును దిగువ మంత్రమున గాననగును.

"మాయాం తు ప్రకృతిం విద్యాత్-మాయినం తు మహేశ్వరం, తస్యావయవభూతైస్తు-వ్యాప్తం సర్వ మిదం జగత్"

"అంశో నానా వ్యపదేశాత్" అను బ్రహ్మసూత్రంబు నిదే విషయమును సమర్థించుటచే-జీవమిథ్యాత్వము ఉపపన్నము అగుట లేదు

"శివాంశా బ్రహ్మవిష్ణ్వాద్యా-అంశీ దేవః శివః స్మృతః" శివగీత.

"దివ్యో హ్యమూర్తః పురుషః-సబాహ్యాభ్యంతరో హ్యజః। అప్రాణో హ్యమనాః శుభ్రో-హ్యక్షరాత్ పరతః పరః"

2 వ వాక్యము

స్వతంత్రమగు సర్వప్రకాశమునందున్నందున దివ్యుఁడు, పరిచ్ఛిన్నము కానట్టి స్వరూపముగలవాఁడగుటచే-అమూర్తుఁడు, పురుష పదవాచ్యుఁడునగు శివుఁడు – స్థూలసూక్ష్మశరీరములయందు ఇష్ట ప్రాణభావలింగస్వరూపమున నుండువాఁడై జన్మరహితుఁడు ప్రాకృత ప్రాణశూన్యుఁడు ప్రాకృత మనస్సు లేనివాఁడు నిర్మలుఁడు జడ ప్రపంచాతీతమగు చేతన శక్తి కన్న పరుఁడు నగును.

3 వ వాక్యము

"ఏతస్మా జ్జాయతే ప్రాణో-మనః సర్వేంద్రియాణి చ,
ఖం వాయు ర్జ్యోతి రాపః-పృథివీ విశ్వస్య ధారిణీ"

శివుని నుండియే ప్రాణవాయువు, మనస్సు, జ్ఞానకర్మేంద్రియములు, అకాశము, వాయువు, అగ్ని, ఉదకము, ప్రపంచమును ధరించు భూమి యుదయించును.

ఆకాశాభిమాని దేవతయగు సదాశివుని నుండి-వాయ్వభిమానియగు మహేశ్వరుఁడు, మహేశ్వరునుండి – అగ్న్యభిమానియగు రుద్రుఁడు, రుద్రునినుండి – ఉదకాభిమానియగు నారాయణుఁడు, విష్ణువునుండి-పృథివ్యభిమానియగు బ్రహ్మదేవుఁడు ఆవిర్భవించిరని చెప్పవచ్చును.

"ధ్యాయీతేశానం ప్రధ్యాయితవ్యం। సర్వమిదం బ్రహ్మ విష్ణురుద్రేంద్రాస్తే సంప్రసూయంతే. సర్వాణి చేంద్రియాణి సహభూతై ర్న కారణం కారణానాం ధ్యాతా। కారణంతు ధ్యేయః, సర్వైశ్వర్య సంపన్నః సర్వేశ్వరః శంభు రాకాశ మధ్యే" అథర్వశిఖోపనిషత్తు.

ఇఃట ఇంద్రశబ్దము-మహేశ్వర సదాశివులఁజెప్పును.

ధ్యానింపఁదగిన పరమేశ్వరుని ధ్యానింపవలెను. ఎట్లనఁగా? బ్రహ్మవిష్ణురుద్ర మహేశ్వర సదాశివులు, సర్వేంద్రియములు,పంచ భూతములు, పరమేశ్వరునుండియే జన్మించుచున్నవి. కారుణకారణు డైన శివుఁడు, జీవాత్మయు జన్మించుటలేదు-సర్వైశ్వర్య సంపన్నుడు గాను సర్వేశ్వరుఁడుగాను సర్వకారణుఁడైన పరమేశ్వరుఁడు-హృద యాకాశమున ధ్యానింపఁదగినవాడు".

శ్లో॥ ఏక ఏవ శివః సాక్షాత్-సత్యజ్ఞానాది లక్షణః।
వికారరహితః శుద్ధః-స్వశక్త్యా పంచధా స్థితః॥
సూతసంహిత.

శ్లో॥ కార్యం బ్రహ్మ మహీభాగే-కార్యం విష్ణుర్జలాంశకే।
వహ్నిభాగే తథా రుద్రో-వాయ్వంశే చేశ్వరః స్థితః॥
ఆకాశాంశే శరీరే తు-సాక్షాదేవ సదాశివః॥
సూతసంహిత-

4 వ వాక్యమున – స్వర్గాదిలోకములు శిరస్సుగాను, సూర్య చంద్రులు నేత్రములు గాను, దిశలు చెవులుగాను, వర్ణాది రూపమున వివరింపఁబడిన వేదములు వాక్కుగాను, మహా వాయువు ప్రాణము గాను, చరాచర ప్రపంచము హృదయము గాను, పృథివి పాదములు గాను పరమేశ్వరుని విరాట్ స్వరూపమునకు ఒప్పారుచున్నవి. ఇట్టి పరశివుఁడే–సూక్ష్మరూపమున సర్వప్రాణుల నంతర్యామి యగువాడు. అని చెప్పఁబడినది.

ఇందుకు మరియొక ప్రమాణము-

"ఏకో దేవః సర్వభూతేషు గూఢః-సర్వవ్యాపీ సర్వ

భూతాంతరాత్మా। కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః-సాక్షీ చేతాః కేవలో నిర్గుణశ్చ”

శ్వేతాశ్వతరోపనిషత్తు 6-11

5 వ వాక్యమున ఐదవ విషయము గలదు.

సూర్యుడు సమిధగా గల ద్యులోకము, ద్యులోకమునుండి చంద్రుడు, చంద్రుని నుండి పర్జన్యుడు. మేఘమునుండి పృథివిని ఓషధులు, ఓషధులనుండి పురుషునకు సంభవించు రేతస్సును స్త్రీ యోనియందు విడచినచో సంతానము. కాగా అక్షరుడనబడు శివుని వలననే ఇవియన్నియు ఆవిర్భవించును

6, 7, 8, 9 వాక్యములలో

ఋగ్యజుస్సామవేదములు, యజ్ఞాదిదీక్షయు, యజ్ఞములు, క్రతువులు (యూపస్తంభములేనివి) యజ్ఞాది దక్షిణలు, సంవత్సరాది కాలము, యజమానుడు, కర్మఫలానుభవముగల స్వర్గాదిలోకములు, సూర్యప్రకాశము, చంద్రకాంతియు, బ్రహ్మ విష్ణు రుద్రాది దేవతలు, సాధ్యులు, మానవులు, పశులు, ప్రాణాపానములు, వ్రీహియవాది ధాన్యము. శివారాధనమునకై పుష్పబిల్వాదులను సేకరించు పరిశ్రమ, లేక శివషడక్షరీమహామంత్రజపరూపమైన తపస్సు, శ్రద్ధ, సత్యము, బ్రహ్మచర్యము, నిత్యనైమిత్తికాది కర్మవిధియు, (కర్ణద్వయము, నేత్రయుగ్మము, నాసికాయుగళము, వాక్కు, అను) సప్తప్రాణములు, కర్ణాది ఇంద్రియవ్యాపారములనదగు సప్త అర్చిస్సులు, సముద్రములు, పర్వతములు, ప్రవహించు మహానదులు ఓషధులన్నియు, మధురము మొదలగు షడ్విధరసంబు, పృథివ్యాది పంచభూతముల నధిష్ఠించు బ్రహ్మవిష్ణ్వాది పంచస్వరూపములును పరమేశ్వరు నుండి

యావిర్భవించును గాన పరమేశ్వరుఁడు సర్వకారణుఁడగుచున్న వాడు-సర్వాంతర్యామియు నగువాడు-అని కలదు

10 వ వాక్యము

"పురుష ఏవేదం విశ్వం-కర్మ తపో బ్రహ్మ పరామృతం, ఏతద్యో వేద నిహితం గుహాయాం - సోఽవిద్యాగ్రంధిం వికిరతీహ సౌమ్య".

పరమేశ్వరునివలన జన్మించిన ఈ విశ్వము-పరమేశ్వరుఁడేను, పరమేశ్వరుఁడనగా-ఇఁట శివలింగమని అర్థము.

శ్లో॥ పీఠికా పరమా శక్తి-ర్లింగం సాక్షాత్ పరః శివః।
శివశక్తి సమాయోగం-విశ్వం లింగం తదుచ్యతే ॥

సిద్ధాంతశిఖామణి.

పై వాక్యమున గల పురుషశబ్దము యొక్క-నిర్వచనము ది..వ విధము గలదు.

"పురి స్థూలాది శరీరే ఇష్టాదిలింగరూపేణ
శయనాత్-పురుషసంజ్ఞకం పరశివలింగమేవ"

"స్థూల సూక్ష్మ కారణ శరీరములయందు ఇష్ట ప్రాణ భావలింగ రూపముస శయనించుటచే - శివలింగము-పురుషశబ్దవాచ్యంబైనది" కర్మ (దీక్షాకర్మసాధ్యమగుటచే ఇష్టలింగము) తపస్సు (శివపంచాక్షరీ జపాత్మకమగు ఉపాసనకు విషయమగు ప్రాణలింగము) బ్రహ్మ-(భావలింగము) పరామృతంబేను (పురుషశబ్దవాచ్యుఁడైన పరమేశ్వరుఁడేను.)

శ్లో॥ లింగం తు త్రివిధం ప్రోక్తం-స్థూలం సూక్ష్మం తు
కారణం। ధారయంతో నరాః స్థూలం-కారణం
సంప్రయాంతి హి॥ లింగపురాణము ఉత్తరభాగము,20అ

"శివలింగము-స్థూలమనియు, సూక్ష్మమనియు, కారణమనియు త్రివిధంబు నగు. స్థూలమగు ఇష్టలింగమును ధరించు మానవులు-కారణమగు భావలింగమును పొందుదురు."

అనఁగా-హృదయమున భావలింగ సాక్షాత్కారముచే శివ సాయుజ్యము నొందుదురని భావము.

శ్లో॥ భావలింగం పరం తత్త్వం-ప్రాణలింగం తు సూక్ష్మకం।
ఇష్టలింగం భవేత్ స్థూల-మేతల్లింగత్రయం స్మృతమ్॥
శివానుభవసూత్రము.

సౌమ్యుఁడా ! అత్యంత రహస్యమైన ఇవ్విషయమును గుర్తించువాడు—అవిద్యాగ్రంధినుండి విడిబడి-ముక్తుఁడగును.

ద్వితీయముండకమున
ప్రథమ ఖండము సమాప్తము.

ద్వితీయ ముండకము - ద్వితీయఖండము

ఇందు 11 వాక్యములు గలవు.

1 వ వాక్యమున -

ప్రాణులందరి హృదయగుహలో నుండునదియు, అందువల ననే జీవాత్మను సమీపించునదియు, వస్తుతః అదృశ్యమైనను చంద్ర గత రాహువువలె హృదయమున సాక్షాత్కరించునదియు, గొప్ప స్వరూపము గలదియు, గురు చర ఇష్టలింగరూపమున బయలు పడునదియు, నగు (ఇందుకు ప్రమాణములు - "ఏక ఏవ శివః సాక్షాత్- సర్వానుగ్రహ కారకః। గురు జంగమ లింగాత్మా-వర్తతే భుక్తిముక్తిదః" సిద్ధాంతశిఖామణి. 9-2 "లలాటలోచనం చాంద్రీం కళామపి చ దోర్ద్వయం। అంతర్నిధాయ వర్తేఽహం-గురురూపో మహేశ్వరి! 9-3 సిద్ధాంతశిఖామణి, "సర్వలోకోపకారాయ-యో దేవః పరమేశ్వరః। చరత్యతిథి రూపేణ-నమస్తే జంగమాత్మనే" వీరాగ మము) పరశివతత్త్వము అనఁదగు ఇష్టలింగమునకు ఆహారాది భోగ్యజాతమునంతయు సమర్పించి తత్ప్రసాదముగ అనుభవింప వలెను.

శిష్యులారా! సమర్పింపఁబడు వస్తువుల రూపమును ఇష్ట లింగమునకు; రుచిని ప్రాణలింగమునకు; ఆనందమును భావ లింగమునకు సమర్పింపవలెను. అని అనుభవసూత్రమున గలదు.

జాగ్రత్తు, స్వప్నము, సుషుప్తి అను దశలయందు గోచరించు

నదియు, జీవాత్మలందరిచే ప్రార్థింపఁబడునదియు, బ్రహ్మవిష్ణ్వాదులను మించినదియు, జీవాత్మకంటె విలక్షణమైనదియు నగు శివతత్త్వమునే ఉపాసించి తరింపుఁడు! అను ఆచార్యప్రబోధమును గాననగును

2 వ వాక్యమున-

సర్వప్రకాశకము, అణువులకన్న అణువు, భూరాదిలోకములకు లోకనివాసులకు ఆధారము, ప్రాణము వాక్కు మనస్సు సత్యము అమృతము అక్షరంబు నగు శివలింగమును దర్శింప నారాధింపుడు! అని చెప్పఁబడినది.

2 వాక్యమున ప్రతిపాదింపఁబడిన శివలింగము-

"సద్రూపం భావలింగంస్యాత్-చిద్రూపం ప్రాణలింగకం
ఆనందరూప మాచార్యై - రిష్టలింగ ముదాహృతమ్"
అనుభవసూత్రము

సచ్చిదానందమయము శివలింగము కాగా-భావలింగము సద్రూపమై ప్రాణలింగము చిద్రూపమై ఇష్టలింగము ఆనందరూపముగ-శాంభవ దీక్షితునకు మహాభాగ్యముగ లభించుచున్నయది.

3, 4 వ వాక్యములలో ఇట్లు కలదు

"ఉపనిషత్తులలో ప్రసిద్ధము, శివపంచాక్షరీ మహామంత్రము అను కల్పవృక్షమునకు బీజమగు ప్రణవము అను గొప్ప ధనుస్సును గురుముఖతః స్వీకరించి-శాంభవదీక్షా సంస్కృతమగు శుద్ధాత్మ అను బాణముతో ననుసంధించి శివార్పితంబగు మనస్సు అను హస్తముతో ధనుస్సునాకర్షించి అక్షరశబ్దవాచ్యమైన మహాలింగమును గురిపెట్టి శుద్ధాత్మఅను అమ్మును ప్రయోగింపవలెను.

జీవాత్మ–శాంభవదీక్షితుఁడైనచో–శివస్వరూపుఁడగును శివుఁడు కానిది శివునారాధింపనర్హుఁడు కాదని–

"నాశివస్య శివోపాస్తి–ర్ఘటతే జన్మకోటిభిః" అను అనుభవ సూత్ర ప్రమాణము–చాటినది.

అందువలననే ప్రణవపంచాక్షరి ధనుస్సనియు. శుద్ధాత్మబాణమనియు, శివలింగము లక్ష్యమనియు, చెప్పఁబడినందున బాహ్య విషయాభిరుచి అను ప్రమాదము లేనివాడై శుద్ధాత్మ అను బాణమును ప్రయోగించినచో-బాణము లక్ష్యముతో ఏకీభవించినట్లు శుద్ధాత్మ-శివమయుండగును.

"భ్రమద్భ్రమరచింతాయాం-కీటోఽపి భ్రమరాయతే,
శివచింతాసమాక్రాంతః- శివరూపీ భవేద్ధ్రువమ్"

వీరాగమము

తనచుట్టు తిరుగుచున్న తుమ్మెదను కీటము (పురుఁగు) నిరంతరము భావించుటచే (కీటము) భ్రమరమగునట్లు – శాంభవ దీక్షితుఁడు–ఇష్టలింగము నర్చించుచు ప్రణవపంచాక్షరీ జపాత్మకమగు ప్రాణలింగము ననుసంధించుచు "శివోఽహం" ధ్యానమున భావలింగమును భావించునెడల – శివస్వరూపుఁడగును. ఇద్ది నిశ్చితము.

౫ వ వాక్యమున

"తనను తాను ప్రకాశింపఁజేయు శక్తి (ద్యౌః) పృథివీ జలాగ్నివాయ్వాకాశాఖ్య పంచభూతములు, బాహ్యాంతరింద్రియములతో కూడిన మనస్సు, ఎవనియందు ఆధారపడియున్నవో, అద్వితీయుఁడైన అట్టి పరశివునే పరవిద్య (ప్రణవపంచాక్షరీ మహా

మంత్రము)తో ఆశ్రయింపుడు! ఇంద్ర చంద్రాది కామ్యదేవతలఁ గూర్చిన వాక్యములను విడనాడుడు! "అమృతస్యైష సేతుః" ఈ మహా మంత్రము మోక్షముఁజెందుటకు ముఖ్యసాధన మగును.

కల్యాణ దేశికుఁడు-శాంభవదీక్షితులైన శిష్యులకు ఉపదేశించి నట్లు పై వాక్యమున గాననగును.

"జపః పంచాక్షరాభ్యాసః-ప్రణవాభ్యాస ఏవ వా,
రుద్రాధ్యాయాదికాభ్యాసో-నావేదాభ్యసనాదికమ్"
రేణుకభగవత్పాదులు.

"ప్రణవశివపంచాక్షరి నభ్యసించుట, రుద్రాధ్యాయము మొదలగు శివపరమైన ఉపనిషత్తుల నభ్యసించుటయు జప మనఁబడును. వేదవిరుద్ధములైన వాఙ్మయము నభ్యసించుట-జపము కాజాలదు." అని రేణుకాచార్య నిర్వచనము.

6 వ వాక్యమున-

రథమధ్యమున గల కట్టిల వలె-హృదయమున నాడులు-తగులుకొనియున్నవి. నాడీ పరివృతమైన హృదయమందు-శివుఁడు సంచరించుచున్నవాఁడు. ఇట్టి శివుఁడే బ్రహ్మవిష్ణ్వాది భక్తుల ననుగ్రహించుటకు చంద్రశేఖరాది పంచవింశతి లీలారూపముల నావిర్భవించెను. అట్టి శివునే ప్రణవ ఘటిత శివపంచాక్షరీ మహామంత్ర జపముతో ధ్యానింపుడు!

శిష్యులారా! తమస్సు (ప్రకృతి) నతిక్రమించిన శివునారాధించుటచే శుభము (నిఃశ్రేయస్సు) కలుగుగాక!

అని-గురువు ప్రబోధించెనని కలదు.

7 వ వాక్యము

"యః సర్వజ్ఞః సర్వవి-ద్యస్యైష మహిమా భువి,
దివ్యే బ్రహ్మపురే హ్యేష-వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః"
మనోమయః ప్రాణశరీరనేతా-ప్రతిష్ఠితోఽన్నే
హృదయం సన్నిధాయ । తద్విజ్ఞానేన పరిపశ్యంతి
ధీరా-ఆనందరూప మమృతం యద్విభాతి"

సమస్తమును గుర్తించునట్టి శివుఁడు-భూలోకమున భక్తుల ననుగ్రహించుటకు గురు లింగ జంగమరూపమున తన మహిమను చూపెట్టును ఇట్టి పరశివుఁడు – హృదయాకాశమున భావలింగ రూపమున, హృదయమునందు ప్రాణలింగరూపమున, స్థూల శరీరమున ఇష్టలింగరూపమునను ఆచార్యునిచే ప్రతిష్ఠింపఁబడియున్నవాఁడు.

ధీరులు-అట్టి లింగత్రయము నుపాసించి-సచ్చిదానందమయము స్వయంప్రకాశమానంబు నగు మహాలింగమును సాక్షాత్కరించు కొందురు.

శివుఁడే – శుద్ధమనోగ్రాహ్యుఁడై ప్రాణశరీరముల యొక్క ప్రభువు నగును.

8 వ వాక్యమున-

"భిద్యతే హృదయగ్రంధి-శ్ఛిద్యంతే సర్వసంశయాః,
క్షీయంతే చాస్య కర్మాణి-తస్మిన్ దృష్టే పరావరే"

శివోఽహం ధ్యానమునందు – నిష్కళము సకళంబునగు శివలింగమయమైన జ్యోతిస్సు సాక్షాత్కరించినచో ఈ జీవాత్మ యొక్క - అణు సంబంధమైన మలము అనఁదగు గ్రంధి (ముడి)

విడిపోవును. మాయా మల సంబంధములైన సంశయములన్నియు తొలగును. ప్రారబ్ధముదక్క ఇతర కర్మలన్నియు క్షీణించును. అని కలదు.

9 వ వాక్యమున.

అగ్నితప్త సువర్ణమువలె ప్రకాశించునట్టి కారణశరీరమునందు– అనాదికాలమునుండి ఏట్టి మలము లేనట్టి విభాగరహితము అతి స్వచ్ఛము సూర్యాది జ్యోతిః ప్రకాశకము నగు భావలింగము (బ్రహ్మము)ను శివోపాసకులు గుర్తెరుగుదురు. వేదాగమపురాణేతిహాసాద్యర్థ జ్ఞానమాత్రమున భావలింగ సాక్షాత్కారము కాదనియు, శాంభవదీక్షితులై ఇష్టప్రాణ భావలింగముల నారాధించు శివయోగులకే శివదర్శనము లభించుననియు దిగువ గల అభియుక్తోక్తి-వ్యక్తపఱచినది అని కలదు.

"యది వాచనికాత్ జ్ఞానాత్-ముక్తిఃస్యాద్భావనాం
వినా, శరీరమానసై ర్దుఃఖై-ర్ముచ్యేరన్ సర్వజంతవః"

10, 11 వ వాక్యములలో

"సూర్యచంద్రనక్షత్రములు, మెఱుపులు, అగ్నియు పరశివుని ప్రకాశింపఁజేయునవి కావు. స్వయం ప్రకాశమానమగు శివజ్యోతిస్సు నాశ్రయించియే సూర్యచంద్రాది సమస్త జ్యోతిర్వర్గము వెలుగొందుచు - శివజ్యోతిస్సు కాంతిచేతనే ప్రపంచమును ప్రకాశింపఁ జేయుచున్నవని నిరూపింపఁ బడినది.

జరామరణాది రహితమై అమృతమనఁబడు పరశివ బ్రహ్మము ముందు, వెనుక, దక్షిణమున, ఉత్తరమున, క్రింద, పైన, బ్రహ్మం

దమునంతట వ్యాపించియున్నది. వేయేల? దృశ్యమానమగు ప్రపంచమంతయు సర్వోత్కృష్టమైన బ్రహ్మంబేను.

పృథివ్యాది పంచమహాభూతములు, సూర్య చంద్రులు ఆత్మ యను అష్టమూర్తులతో శివుఁడు-ప్రపంచమును వ్యాపించియున్న వాఁడు. అని ప్రతిపాదింపఁబడినది.

ద్వితీయ ముండకమున-ద్వితీయ ఖండము
సమాప్తము.

శ్రీ మహా గణాధిపతయే నమః

తృతీయ ముండకము - ప్రథమఖండము

ఇందు పది వాక్యములు గలవు-

1 వాక్యము.

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా – సమానం వృక్షం పరిషస్వజాతే। తయో రన్యః పిప్పలం స్వాద్వత్తి-అనశ్న న్నన్యోఽభిచాకశీతి"

"రెండు పక్షులు - కూడినవై – చైతన్యమున సమానములునై ఒకే శరీరవృక్షము నాశ్రయించినవి. అవ్వానిలో నొక పక్షి (జీవాత్మ) పరిపక్వమైన కర్మఫలము ననుభవించుచుండును. మరి యొక పక్షి (పరమాత్మ) కర్మఫలము ననుభవింపక-జీవాత్మను చూచుచుండును.

ఇందుకు సూతసంహితలో

"ద్వౌ సుపర్ణౌ శరీరేఽస్మిన్-జీవేశాఖ్యౌ వ్యవస్థితౌ,
తయో ర్జీవః ఫలం భుంక్తే-కర్మణో న మహేశ్వరః"

2, 3, వాక్యములయందు-

జీవాత్మ పరమాత్మతో కూడి-ఒకే శరీర వృక్షమునందున్నను పరాధీనకర్తయై శరీరమే నేనను మోహముచే దుఃఖించుచుండును. ఎప్పుడైతే తనకంటె వేరైన పరమేశ్వరుని లింగధారణదీక్షితుడై

శివపంచాక్షరీ జప భస్మరుద్రాక్షధారణములఁ గావించి "శివోఽహం" ధ్యానముతో ప్రసన్నుఁజేసికొనునో - అప్పుడు తన నుద్ధరింప సమీపించియుండు పరమేశ్వరు నవలోకింపఁగలుఁగును. అట్టితఁడి సంసారదుఃఖము లొత్తుగా లేనివాడై పరమేశ్వరుని మహిమ (శివ సాయుజ్యము)ను పొందును.

ఏ సమయమున శాంభవదీక్షితుఁడు శివోఽహం భావనతో శుద్ధాంతఃకరణమున-బంగారువన్నె గలిగినట్టి, బ్రహ్మ విష్ణు రుద్రా దులకు కర్తయైనట్టి, పరిపూర్ణుఁడైన శివుని-చూచునో-అప్పుడు పరి పూర్ణ జ్ఞానము గలవాడై - అనేక కోటిజన్మార్జిత పుణ్యపాపములను పోగొట్టుకొని-అజ్ఞాన లవలేశము గూడ లేనివాడునై శివునితో అత్యంత సమానమగు వైభవము గలవాడగును.

"భోగమాత్ర సామ్యలింగాచ్చ" అను బ్రహ్మసూత్రముఁబట్టి- సృష్ట్యాది పంచకృత్యాధికారము దక్క నితరమైన శివమహిమ యంతయు ముక్తాత్మకు లభించునని తెలియవలెను.

4 వ వాక్యమున-

"ప్రాణలింగ స్వరూపుఁడైన పరమాత్మ-పృథివ్యాద్యభిమాని దేవతలగు బ్రహ్మాదులయొక్క నివాసములగు అధారాదిచక్రముల నధిష్ఠించి ప్రకాశించుచుండును. అట్టి పరశివు నుపాసించుచు సాక్షా త్కరించుకొనిన మహాపురుషుఁడు-శివుఁడు దక్క నితరము నవ లోకింపడు. శివునియందే విహారము ఆసక్తి గలవాడై శివతాదాత్మ్య క్రియ (శివోహంభావనతో శివునితో నేకీభవించుట) కలవాడగును. ఇట్టివాడే శివోపాసకులలో శ్రేష్ఠుఁడనఁబడుఁగును.

"సతీ చాహం పతిర్లింగం" ఇత్యాది రీతిని తాను భార్యననియు,

శివుడు భర్తయనియు భావించి-సాధ్వి పతింగూడి ఆనందించునట్లు తాను శివునింగూడి పరవశుడు కావలె"నని శ్రీ రేణుకాచార్యులు ప్రవచించెను" అని నిరూపింపబడినది.

5 వ వాక్యము.

"సత్యేన లభ్య స్తపసా హ్యేష ఆత్మా-సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యం। అంతఃశరీరే జ్యోతిర్మయో హి శుభ్రో-యం పశ్యంతి యతయః క్షీణదోషాః"

"కామక్రోధాది దోషములు లేనట్టి ఇంద్రియములను వశపఱచు కొనినట్టి, శివోపాసకులు-శరీరమున గల హృదయమునందు చిదాకాశ రూపమున ప్రకాశించు ఏ పరమాత్మ నవలోకింతురో అట్టి శివుడు-సత్యముచేతను పంచాక్షరీజపాది నిరంతర తపస్సుచేతను శివోఽహం ధ్యానము చేతను బ్రహ్మచర్యము వలనను పొందం దగినవాడు.

6, 7 వాక్యములలో

సత్యమే జయించును. అనృతము ఓడిపోవును. దేవయాన మార్గము-సత్యముచేతనే లభించును. శివజ్ఞానులు-నిష్కాము లై దేవ యాన మార్గము నాక్రమించి-సత్యము యొక్క పరమ నిధానమగు మహా కైలాసస్థానముం జెంది ఆనందింతురు. తపోధ్యానబ్రహ్మచర్య ములకన్న-సత్యమే శ్రేష్ఠ మగునని ప్రతిపాదింపబడినది.

మరియు

సత్యస్వరూపమైన బ్రహ్మము - ఆకాశమునకంటె గొప్పదై హృదాకాశమున ప్రకాశించునది. ఇద మిత్థమని చెప్పనలవి గాని లింగరూపము గలది, జీవాత్మకంటె సూక్ష్మము నై లింగాంగ

సామరస్యముతో శివునుపాసించువారికి - ఈ శరీరమునందే హృదయ గుహయందు సాక్షాత్కరించునది యగును. ఉపాసకులు గానివారికి దూరమగునని భావము.

"తస్యాః శిఖాయా మధ్యే-పరమాత్మా వ్యవస్థితః"
(మహానారాయణము)"

ఇట-తస్యాః శిఖాయా అనుదానికి జీవుడనియు, అట్టి జీవాత్మలో పరమాత్మయున్నాడనియు పై వాక్యార్థము.

"స బాహ్యాభ్యంతరం సాక్షా-ల్లింగం జ్యోతిఃపరంస్వకం,
తిలే తైల మివాభాతి-హ్యారణ్యామివ పావకః,
క్షీరే సర్పిరివ స్రోత-స్యంబువత్స్థిత మాత్మని''
అనుభవసూత్రము.

బాహ్యమున అంతరమున ప్రకాశించు జ్యోతిర్లింగము-నువ్వులలో నూనెవలె, అరణియందు అగ్నివలె, పాలలో నెయ్యివలె. ప్రవాహమున ఉదకమువలె, తనలో సాక్షాత్కరించునని శ్లోకార్థము.

8 వ వాక్యము.

"న చక్షుషా గృహ్యతే నాపి వాచా-నాన్యై ర్దేవై స్తపసా కర్మణా వా, జ్ఞానప్రసాదేన విశుద్ధసత్వః-తతస్తు తం పశ్యతే నిష్కళం ధ్యాయమానః''

పరశివస్వరూపమగు భావలింగము - ప్రాకృతనేత్రముచేతను శివజ్ఞానము లేనట్టి వాక్కుచేతను కర్మజ్ఞానేంద్రియములచేతను కృచ్ఛ్రచాంద్రాయణాది శరీరశోషణాత్మకమగు తపస్సుచేతను జ్యోతిష్టోమయాగాది కామ్యకర్మచేతను సాక్షాత్కరించునది కాదు.

విభాగములేని పరిపూర్ణుఁడైన శివుని ధ్యానించువాడు—శివానుగ్రహము వలన చిత్తశుద్ధి గలవాడై—హృదయమున భావలింగమును దర్శింపఁ గలుఁగును.

శ్లో॥ విశుద్ధ మన్నజాతం హి-యచ్ఛివాయ నివేదితం।
తదేవ సార్వకాలం తు-భుంజానో లింగతత్పరః॥
మనః ప్రసాద మతులం—లభతే జ్ఞానకారణమ్॥

సిద్ధాంతశిఖామణి.

"శుద్ధమైన ఆహారమును శివునకు నివేదించి తత్ప్రసాదమునే ప్రతిదినము శివపూజావసానమున భుజించు మాహేశ్వరుఁడు—శివ దర్శనకారణమైన తిరుగులేని మనఃప్రసన్నతను పొందును."

9, 10 వ వాక్యములలో

ఐదు విధములగు ప్రాణవాయువునకు ఆధారమగు పరశివునందు ఇంద్రియములను లోబఱచుకొని చిత్తమును నిలుపునట్టి—శివయోగి—పరమేశ్వరు నంతఃకరణమునందే సాక్షాత్కరింపఁజేసికొనును. అట్టి శివయోగియొక్క శుద్ధచిత్తమునందు భావలింగమనఁదగు పరమేశ్వరుఁడు ఎక్కువ ప్రకాశించును.

శివయోగసిద్ధుఁడు—నిర్వికారచిత్తమున అభిలషించు కోరికలను మనస్సునందే తాననుభవించుటేగాక-శివభక్తులైన తన పరివారమునకు కోరికల ననుభవింపఁజేయును.

అందువలన శివయోగులను శివునివలె - పాదప్రక్షాళనాదులచే పూజించి శ్రేయస్సుఁబడయవలెను. శివభక్తుని శివుని శివాచార్యుని సమానులుగ భావించువారికే శివానుగ్రహము లభించును. సానంద మహర్షి—తన పరివారముతో గూడ యమలోకముఁజని నరకవాసు

లందరికి-శివపంచాక్షరీ మహామంత్రమును వినుపించి మహాకైలాస మునకు గొంపోయిన వృత్తాంతము-పురాణప్రసిద్ధమైయున్నది.

ముక్తులు సదేహులు విదేహులునై యుందురు, శివలోకప్రాప్తులకు పునరావృత్తి-అనఁగా-పునర్జన్మ-లేదు.

శ్లో॥ దినకృత్కోటి సంకాశం-స్థాన మాద్య ముమాపతేః।
సర్వకామసమాయుక్త-మంతఃక్లేశవివర్జితాః॥
సర్వజ్ఞాః సగణాః శుద్ధాః-పరిపూర్ణా భవంతి చ।
విశుద్ధకార్యకరణాః-పరమైశ్వర్య సంయుతాః॥
సదేహాశ్చ విదేహాశ్చ-భవంత్యాత్మేచ్ఛయా పునః।
సంప్రాప్తా యే పరం స్థానం-జ్ఞానయోగరతా నరాః॥
న తేషాం పునరావృత్తి-ర్ఘోరే సంసారమండలే॥

పరమేశ్వరుని లోకము-ఆద్యము, సూర్యకోటి ప్రకాశమానము, సర్వకామసమృద్ధంబునగు - ఇష్టప్రాణభావలింగోపాసనాత్మకమగు శివజ్ఞానయోగము నభ్యసించినవారు-శివలోకమునఁబ్రవేశించి అంతః క్లేశములేనివారై, సర్వజ్ఞులు ప్రమథగణములతో క్రీడించువారు నిర్మలురు పరిపూర్ణులు మాయామోహరహితులు దివ్యకార్యసాధనములు గలవారు శివునితో సమానమగు వైభవము గలవారునై ఆనందపడుచుందురు. అని యుల్లేఖింపఁబడినది.

తృతీయముండకమున-ప్రథమ ఖండము సమాప్తము.

శ్రీ మహా గణాధిపతయే నమః

తృతీయ ముండకము-ద్వితీయ ఖండము

ఇందు 11 వాక్యములు కలవు

1, 2 వాక్యములలో

స్థూల సూక్ష్మ ప్రపంచము నధిష్ఠించు బ్రహ్మాది వర్గము-శివునందు ప్రకాశించునదగును. అట్టి శివస్వరూపమును గుర్తించిన మహాపురుషులగు గురువును నిష్కాములై శివప్రీత్యర్థము పూజించువారు-ముక్తులగుదురు గాన వారు పునర్జన్మ నొంది స్త్రీ యోనియందు రేతస్సును విడువవలసినవారు కారు. గురువుచే గుర్తింపఁబడునది-సర్వోత్కృష్టమగు మహాలింగ మగును.

స్వర్గ మర్త్య పాతాళగతములైన కోరికల నపేక్షించువాడు—అట్టి కోర్కెల ననుభవించుటకు పునః పునః జన్మించుచుండును. శివ సాక్షాత్కారముచే కోర్కెల నన్నిటిని పొందినవాడు-అనఁగా-కోర్కెలఁ గోరనివానికి—ఈ జన్మయందే-కామములన్నియు అంతరించును.

3 వ వాక్యము.

"నాయ మాత్మా ప్రవచనేన లభ్యో—న మేధయా న బహునా శ్రుతేన-యమేవైష వృణుతే తేన లభ్య- స్తస్యైష ఆత్మా వివృణుతే తనుం స్వామ్"

వేదశాస్త్రాభ్యాసము చేతను వేదార్థమును విశదీకరించు ప్రజ్ఞ

చేతను గురూపదేశము లేనట్టి వేదపురాణేతిహాసాది శ్రవణము చేతను పరమేశ్వరుఁడు-లభించువాఁడు కాఁడు ఇష్టప్రాణభావలింగధారణముచే ఈ సాధకుఁడు పరమేశ్వరు నుపాసించినదో అట్టి శివయోగికి-పరమేశ్వరుఁడు-తన సచ్చిదానందమయమగు మూ-ర్తి నను గ్రహించును.

"మోక్షార్థినాం ము క్తిహేతు-ర్లింగధారణ మీర్యతే"

పురాణవచనము.

"మల్లింగధారణాల్లోకే-న కించిదపి దుర్లభం"

కామికోత్తరాగమము.

"యే ధారయంతి హృదయే-లింగం చిద్రూప మైశ్వరం
న తేషాం పునరావృత్తిః- ఘోరే సంసారమండలే"

రేణుకాచార్యులు.

మోక్షార్థులకు ముక్తి నిచ్చునది-లింగధారణమని పురాణము నిరూపించెను. శివలింగధారులకు ప్రపంచమున పొందరానిది లేదు. అని కామికోత్తరము వ్యాకుచ్చినది చిద్రూపమగు శివలింగమును బాహ్యాభ్యంతరములయందు ధరించినవారికి-భయంకరమైన సంసార మండలములోనికి రావడం ఉండదు. అని రేణుకాచార్యులు ప్రతి పాదించిరి.

4 వ వాక్యమున-

పరమాత్మ-శాంభవదీక్షచే కలుగు మనోబలము లేనివానికి-లభింపడు. మాటిమాటికి పొరపడువాడును శివుని దర్శింపఁజాలడు. పంచాక్షరీజపములేనట్టి ఇతర మంత్ర జపాత్మకమగు తపస్సు

చేతను శివుఁడు సన్నిహితుఁడు కాడు. శివలింగధారణము లేని వానిని సదాశివుఁడు సమీపింపఁడు.

మనోబలము, అప్రమాదము శివపంచాక్షరీ జపము శివలింగ ధారణము అను ఉపాయములచే శివు నుపాసించు ఆత్మ-పశుత్వమును విడనాడి-పతియనుగ్రహముచే మహాకైలాసముఁ బ్రవేశించును.

"లింగం బ్రహ్మైవ కేవలం" "లింగే సుషుప్తిః" "ఊర్ధ్వాయ నమః ఊర్ధ్వలింగాయనమః" ఇత్యాది ప్రమాణములచే ఈ వాక్యమున గల లింగశబ్దమునకు శివలింగమను నర్థమే సమంజసంబని తేటపడు చున్నది. లింగ శబ్దము సన్న్యాసము అను అర్థము కలదని చెప్పుట- శివనిష్ఠారాహిత్యమును తెలుపును. అని నిరూపింపఁబడినది.

5 వ వాక్యమున-

శివోపాసనచే సంతృప్తిఁబడయునట్టి ధీరులు-దేనియందును ఆసక్తి లేనివారై తమ స్థూలసూక్ష్మశరీరములయందు ఇష్ట ప్రాణ లింగముల నారాధించుచు ఋషితుల్యులై ప్రారబ్ధాంతమున పరమ పదముఁజేరి-నిజరూపమునావిష్కరింపఁజేసికొనియు పరమేశ్వరుని సంపూర్ణముగ ఆశ్రయించినవారై సర్వవ్యాపియగు శివునితో సమానులునై శివానందము ననుభవింతురు. యని యుల్లేఖింపఁ బడినది.

6 వ వాక్యమున-

"వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థాః-
సన్న్యాసయోగా ద్యతయః శుద్ధసత్త్వాః,
తే బ్రహ్మలోకే తు పరాంతకాలే-
పరామృతాత్ పరిముచ్యంతి సర్వే"

లింగధారణపూర్వక శివపంచాక్షరీజప శివార్చనాది ప్రయత్న పరులగు శివయోగులందరు-నిష్కామ నిత్యనైమిత్తిక కర్మాచరణముచే చిత్తశుద్ధి గలవారై వేదాంత ప్రతిపాదితమగు విజ్ఞాన (శివధ్యాన) ముచే-లేక-వేద వేదాంత శ్రవణముచే ఏకార్థనిశ్చయము గలవారై పరమేశ్వరునందు చిత్తమును నిలుపు సమాధియోగమున సిద్ధులునై ప్రారబ్ధాంతమునందు బ్రహ్మ (శివ) లోకముఁజేరి సంపూర్ణ శివానుగ్రహము వలన శివసాయుజ్యమును చెందుదురు.

7 వ వాక్యమున-

ప్రాణము, శ్రద్ధ, స్థూల పంచమహాభూతములు, పంచజ్ఞానేంద్రియములు, అన్నమయమగు మనస్సు, వాక్కు-అను వదునైదు-తమ తమ మూల రూపములయందు లీనములు కాగా - ప్రారబ్ధముదక్క-నితరములైన సంచిత ఆగామి కర్మలు, కర్మజ్ఞానేంద్రియాభిమాని దేవతలు. విజ్ఞానమయుఁడగు జీవాత్మ, ఇవి యన్నియు ముక్తదశయందు పరమేశ్వరునితో ఏకీభవించును. అనఁగా- ప్రాకృతములన్నియు దివ్యములై ముక్తాత్మకు శాశ్వతకాలము ఉపయోగించునని భావము అని విశదీకరింపఁబడినది-

8 వ వాక్యమున-దిగువ విధము చెప్పఁబడినది.

గంగా యమునా సరస్వత్యాది నదులు ప్రవహించుచు-స్థూల దశఁజెందిన నామరూపములను విడనాడి-సముద్రముతో ఏకీభవించినట్లు-శివోపాసకుఁడు-ప్రాకృకములగు నామరూపములను పరిహరించి పరత్పరుఁడైన పరమ పురుష (శివు)ని పొందును

ఇఁట-నదులు సముద్రములో కలియుట యనఁగా - వృత్తిలయము-(అనఁగా ప్రవాహము మరుగుపడుట) అని తెలియవలెను.

నామరూపపరిత్యాగము - స్వవినాశము కాఁజాలదు. సముద్రములో కలిసిన నదులు సముద్రముగా గుర్తింపఁబడునట్లు-శివయోగి శివ సాయుజ్యముఁజెందినతఁడు శివుఁడుగానే గుర్తింపఁబడును. పూర్తిగా లేనివాడగునని చెప్పు వాదమున "సోఽశ్నుతే సర్వాన్ కామాంత్సహ, బ్రహ్మణా విపశ్చితా" "ముక్తః శివసమో భవేత్" ఇత్యాది శ్రుత్యాది ప్రమాణములు వ్యర్థములగును.

ఒకవేళ నదులు పూర్తి లేనివగు ననునెడ-పునః సృష్టిలో నదులు ఉండవని చెప్పవలసి వచ్చును. అట్లగుచో సృష్టిలో లోపము ఏర్పడును. గాన పూర్వోక్తమే సమంజసమై విశిష్టశివాద్వైతమును సమర్థించుచున్న యది.

9 వ వాక్యార్థము

ఏ పురుషుఁడు-నిశ్చయముగా సర్వోత్కృష్టమైన మహాలింగమును దర్శించునో, అట్టివాడు శివసదృశుఁడగును. అతని పుత్రాది వంశమున శైవఁడే జన్మించును. శివదర్శకుఁడు-దుఃఖమును, దుఃఖ హేతువైన అధర్మమును దూర మొనర్చుకొనును. హృదయగతములైన గ్రంధులవంటి సంశయములను తొలగించుకొని-జరామరణ రహితుఁడగును.

10 వ వాక్యార్థము

పరమేశ్వరుని కొరకు సత్కర్మల నాచరించు శ్రోత్రియులు-లింగధారణాత్మకమగు బ్రహ్మనిష్ఠ గలవారై శ్రద్ధతో స్వయముగా శివు నారాధింతురు శిరోవ్రతమనఁబడు లింగధారణము గలవారికే బ్రహ్మవిద్య (శివపంచాక్షరీ మహామంత్రార్థము) నుపదేశింపవలెను.

సూతసంహితాది గ్రంథములు. మాధవాచార్యాది మహాపురుష

లును శివో వ్రతమనగా-భస్మ ముద్రాక్షమంత్రలింగధారణాత్మకమగు పాశుపతవ్రతంబగునని నిర్ణయించినవి. (8.)

అధర్వశిరస్సు, ముండకము, కైవల్యము, శ్వేతాశ్వతరము కాలాగ్ని రుద్రము మున్నగు ఉపనిషత్తులందు-పూర్వోక్త పాశుపతము-శిరోవ్రతమనియు, అత్యాశ్రమమనియు, శాంభవవ్రతమనియు పేర్కొనఁబడినది. కేవలము భస్మధారణము-సంపూర్ణ పాశుపతము కాదు.

శ్లో॥ పరబ్రహ్మాభిధం లింగం-పశుపాశవిమోచకం।
యో ధారయతి సద్భక్త్యా-స పాశుపత ఉచ్యతే॥

స్కాందపురాణము.

పరబ్రహ్మమనఁదగు శివలింగము-పశువునకు పాశమును విడిపించును. అట్టి లింగమును సద్భక్తితో ఎల్లకాలము ధరించువాడు-పాశుపతుఁడనఁబడును. పురాణ ఉపబృంహణముఁబట్టి వేదార్థమును నిర్ణయించుట-ప్రశస్తము.

ఇక చివరి 11 వ వాక్యార్థమేమనఁగా ?

ఈయుపనిషత్తున అక్షరముగ నిరూపింపఁబడిన పరశివబ్రహ్మమే సత్యమైనది. ఇట్లు పూర్వము అంగిరోఋషి-శౌనకునకు ఉపదేశించెను. ఇట్టి బ్రహ్మవిద్యను శిరోవ్రతములేనివాడు-చదువ గూడదు.

పరమ ఋషులైన శివయోగాచార్యులకు నమస్కారము.

నమః పరమ ఋషిభ్యః

(మొత్తం 63 వాక్యములు) ముండకోపనిషత్సారాంశము సమాప్తము.

"ద్వాసుపర్ణా" ఇత్యాది మంత్రములు శివాద్వైతమునే బలపరచు చున్నందున నీ యుపనిషత్తు-శైవ సంప్రదాయ బోధకమని విదిత మైనది.

సర్వం-శ్రీ రాజరాజేశ్వర చరణారవిందార్పణమస్తు.

ఓం తత్సత్.

శ్రీ

కైవల్యోపనిషత్తు ప్రథమ ఖండము

"ఓం సహ నా వవతు, సహ నౌ భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వి నా వధీత మస్తు, మా విద్విషావహై"

ఓం శాంతిః శాంతిః శాంతిః.

కాయిక వాచిక మానసిక దోషములు శమించుటకై "శాంతిః" అని ముమ్మారు ఉచ్చరించి ఆత్మజ్ఞానముకొరకు ఆస్తికులు వేదాంతముల నభ్యసించి యవ్వాని సముచితార్థమును తెలిసికొని-శివపూజన జపధ్యానముల నాచరింపవలెనని-సూత సంహితా నిర్వచనము.

"ఓమ్, అథాశ్వలాయనో భగవంతం పరమేష్ఠిన ముప
సమేత్యోవాచ-అధీహి భగవో బ్రహ్మవిద్యాం వరిష్ఠాం,
సదా సద్భిః సేవ్యమానాం నిగూఢాం-యయాఽచిరాత్
సర్వపాపం వ్యపోహ్య-పరాత్పరం పురుషంయాతి విద్వాన్" 1

ఓంకారము అథశబ్దము మంగళార్థకములు- ఐన నిట అథ శబ్దము-"శాంభవదీక్షాస్వీకారానంతరము" అను నర్థము గలదగును. ఆశ్వలాయనుఁడను బ్రహ్మర్షి-ముముక్షువై-లింగధారణ దీక్షానంతరము-భగవానుఁడైన బ్రహ్మదేవుని సమీపించి ప్రశ్నించెను.

భగవానుఁడా! సత్పురుషులచే సదా సేవింపఁబడునది, రహస్యంబు, "త్వరలో పాపములఁబోగొట్టుకొని సాధకుడు-పరాత్ప

రుఁడు పురుషశబ్దవాచ్యుఁడు నగు శివునిఁజేరునట్లు ప్రయోజనము గలదియు, వరిష్ఠంబు నగు బ్రహ్మవిద్య నుపదేశింపుము !

వివరణ_

"కీర్తింపఁబడుచుండగానే - లింగధారణ పూర్వక శివధ్యాన యోగము నొసఁగి భవమును తొలగించువాడగుటచే ఆచార్యుఁడు భగవానుఁడనఁబడును." ఇట్లు అథర్వశిఖోపనిషత్తు-నిరూపించినది.

సత్పురుషులెవరనఁగా? "పవిత్రం తే వితతం" ఇత్యాది ఋగ్వేద మంత్రములు "యా తే రుద్ర! శివా తనూ రఘోరాఽపాపకాశినీ" ఇత్యాది యజుర్వేద మంత్రములు, బ్రహ్మగీతాది ప్రమాణములును ప్రతిపాదించు లింగధారణము గలవారు.

బ్రహ్మవిద్యయనఁగా-లింగాంగ సామరస్యముతో చేయఁబడు శివారాధనము. హరిబ్రహ్మాదులకన్న శ్రేష్ఠుఁడు-పరాత్పరుఁడనఁబడును. ఇందుకు-

"పరాత్పరతరో బ్రహ్మ-తత్పరాత్ పరతో హరిః,
యత్పరాత్ పరతోఽధీశ- స్తన్మే మనః శివసంకల్పమస్తు"

అను శివసంకల్పోపనిషత్తు మొదలగునవి-ప్రోద్బలకములగునవి.

"ఋతం సత్యం పరంబ్రహ్మ-పురుషం కృష్ణపింగళం" ఇత్యాది శ్రుతులు-పురుషబ్దవాచ్యుఁడు-శివుఁడే నని నిర్ధారించినవి.

"పురుషో వై రుద్ర- స్తన్మహో నమో నమః" మహానారాయణము.

"తమీశానం పురుషమీడ్యం - నిచాయ్యోత్తారం శాంతిమత్యంత మేతి". శ్రీకరభాష్యము.

శ్లో॥ పురుషో నామ సంపూర్ణః-శివః సత్యాదిలక్షణః ।
సాంబమూర్తిధరో నాన్యో-రుద్రో విష్ణు రజోఽపివా ॥
బ్రహ్మగీత

సత్యాదిలక్షణుఁడైన శివుఁడే - పురుషుఁడనఁబడుఁగుచు పరిపూర్ణుఁడై యుండును. రుద్ర విష్ణు బ్రహ్మలకు పురుషశబ్దము ముఖ్యవాచకము కాదని బ్రహ్మగీతోపదేశము.

వరిష్ఠ విద్య యనఁగా-పరా విద్యయగును. అక్షరుఁడైన శివుని చెందించు పంచాక్షరియే బ్రహ్మవిద్యయని గూడా చెప్పవచ్చును.

"తస్మై సహోవాచ పితామహశ్చ-శ్రద్ధా భక్తి ధ్యాన యోగా దవేహి" 2

ఆశ్వలాయనునకు పితామహుఁడు-ఇట్లు వక్కాణించెను. శ్రద్ధ భక్తి ధ్యానము యోగము అను వానితో శివు నుపాసింపుము :

శ్రద్ధ - గురువు మాహేశ్వరుఁడు ఉపదేశించిన విషయముపై విశ్వాసము.

భక్తి - ఎల్లకాలము శివునియందు అనురాగముతో కూడిన ఆసక్తి,

ధ్యానము - శివపూజనభాగముగా శివోఽహంభావన,

యోగము - శివారాధనమే ముఖ్యమని భావించుట.

"న కర్మణా న ప్రజయా న ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః । పరేణ నాకం నిహితం గుహాయాం-విభ్రాజతే యద్యతయో విశంతి. 3

పుణ్యతీర్థ స్నానాది కర్మచేతను పుత్రపౌత్రాది సంతానము చేతను ధనకనకవస్తువాహనాది ప్రాప్తిచేతను మోక్షము లభింపదని

....కొందరు దార ధన పుత్రేషణా త్యాగముచేత – లేక-సర్వకర్మ త్యాగముచేత మోక్షమును పొందిరని స్ఫురించుట యథార్థము కాదు. కర్మ జ్ఞానేంద్రియ విషయములను శివేతరములనుండి మరల్చి–శివ పూజా జప ధ్యానాది ప్రయత్నశీలురు (యతయః) దేనిని పొందుదురో అట్టి శివతత్త్వము-హృదయగుహఁజెందిన చిదాకాశమునందు సన్నిహితమై ఉపాసకుల ననుగ్రహించుటకై-ప్రకాశించుచున్నది. ఇట్టి శివయోగులు_గురూపదిష్టమార్గమున ప్రవర్తించి_మహాకైలాసమునఁ బ్రవేశింతురని భావము.

"జ్ఞానే సిద్ధేఽపి విదుషాం-కర్మాపి వినియుజ్యతే,
ఫలాభిసంధిరహితం-తస్మాత్ కర్మ న సంత్యజేత్"

శివోపాసనాదార్ఢ్యముచే శివస్వరూపము అవగతమగుచున్నను జ్ఞానులు-ఫలాపేక్ష లేనట్టి వైదికకర్మఁజేయవలెను. కాని కర్మను విడువరాదు. శ్రీకరభాష్యము

"వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థాః - సన్న్యాసయోగా
ద్యతయః శుద్ధసత్త్వాః । తే బ్రహ్మలోకే తు పరాంతకాలే-
పరామృతాత్ పరిముచ్యంతి సర్వే" 4

వేదాంతవిజ్ఞానముచే పరతత్త్వము శివుఁడని నిశ్చయించినట్టి ఫలము నపేక్షింపక_శివు నారాధించు యోగమువలన చిత్తశుద్ధి గలిగినట్టి; శివదర్శన ప్రయత్నశీలురు అందరు (యతయః) ప్రారబ్ధ శరీరాంతమున శివలోకముఁ జెందినవారై నిజరూపావిర్భావము వలన శివునితో సమానముగ ఆనందామృతరసాస్వాదలోలురగుదురు.

లింగశూలాంకములు గలది తాంత్రికపాశుపతమగును గాన భస్మరుద్రాక్షమంత్ర శివలింగ ధారణాత్మకమగు వైదిక పాశుపతము

నవలంబింపవలెననియు, విఘ్నేశ రవి విష్ణు శక్తి శివులు సమాను లని భావించుచు పూజించు మిశ్రపాశుపతము-శ్రౌతశైవులకు కూడ దనియు కూర్మ మహాపురాణము నిర్వచించినది.

5, 6, 7, వ వాక్యములు

"వివిక్తదేశే చ సుఖాసనస్థః-శుచిః సమగ్రీవశిరఃశరీరః, అత్యాశ్రమస్థః సకలేంద్రియాణి - నిరుధ్య భక్త్యా స్వగురుం ప్రణమ్య"

"హృత్ పుండరీకం విరజం విశుద్ధం-విచింత్య మధ్యే విశదం విశోకం, అచింత్యమవ్యక్త మనంతరూపం - శివం ప్రశాంత మమృతం బ్రహ్మయోనిమ్" 6

"త మాదిమధ్యాంతవిహీన మేకం-విభుం చిదానంద మరూప మద్భుతం, ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం-త్రిలోచనం నీలకంఠం ప్రశాంతమ్" 7

ధ్యాత్వాముని ర్గచ్ఛతి భూతయోనిం - సమస్తసాక్షిం తమసఃపరస్తాత్".

"అత్యాశ్రమమనఁగా - బ్రహ్మచర్య గృహస్థ వానప్రస్థ సన్న్యాసములు అను నాలుగు ఆశ్రమముల లక్షణము గలదై ఆశ్రమములను మించినదగును.

శాంభవీదీక్షా ప్రధానాంగమగు ఇష్ట ప్రాణ భావలింగధారణ ముతో యావజ్జీవము శివు నుపాసించు విప్రోత్తముఁడు-అత్యాశ్రమియై తనకు ఇష్టమైన ఏకాంత ప్రదేశమున సుఖాసనోపవిష్టుఁడై జలభస్మ స్నానాదులచే శుచియై - కంఠము శిరస్సు, శరీరము అనువానిని

సమానములుగ నిలిపి—కర్మ జ్ఞానేంద్రియములను విషయముల నుండి మఱల్చి — భక్తిచే తన శాంభవదీక్షాగురువునకు ప్రణమిల్లిన వాడై కమలమువంటి హృదయమును దుష్టచింతనరహితముగ శుభ్రి పఱచి-అట్టి హృదయమునడుమ విశదము శోకరహితము శబ్దస్పర్శ రూపరసాదులు లేనిదగుటచే వ్యక్తముకానిదియు, ఇదమిత్థమని నిర్ణయింప నలవిఁగానిదియు చంద్రశేఖరత్వాది అనంత లీలా రూప ములు గలదియు—లేక—గురు చర ఇష్ట ప్రాణ భావ లింగాద్యనంత రూపములు గలదియు నగు శివస్వరూపము ప్రశాంతమనియు అమృతంబనియు వేదవేదాంగకారణమనియు లేక చతుర్ముఖ బ్రహ్మ జనకమనియు ధ్యానింపవలెను.

పుణ్యాశ్రమము, అరణ్యము తనకు ప్రశస్తముగ కనఁబడు స్వగృహాదికంబు - ఏకాంతస్థలమగును. శివాలయము, బిల్వవృక్ష మూలము, పర్వతగుహ, అగ్ని ఇసుక మున్నగునవి లేనిదియు నదీ తీరము దేశకాలోచితంబు నగునవి—ఏకాంత స్థలములనఁబఱఁగును.

శుచిత్వము-జలభస్మ స్నానాదులచేతను శాంతి సత్యాదుల చేతను ఏర్పడును. సాత్త్వికమితాహారమున చిత్తశుద్ధి కలుగును.

స్వస్తికము పద్మము ఇత్యాదులు - సుఖాసనములగును.

"లింగాంగసంగినాం చైవ-పునర్జన్మ న విద్యతే"

శ్రీకరభాష్యము

"సర్వవేదాంతసారోఽయ - మత్యాశ్రమ ఇతి శ్రుతిః"

ఇంద్రియనిగ్రహమే తపస్సగును.

సాష్టాంగనమస్కారము—ప్రణామ మనఁబడును.

ఆరాధ్యశైవులు - శివపూజనమునందు దశావధానవిధానముగ

శివ ధ్యానమును చేయవలెను. శైవులందరు సామాన్యముగ ఇష్ట లింగమునందు భావలింగమును దిగువవిధము చింతించుటయు శివ ధ్యానమగును.

ఆది మధ్యాంతములయందు పరిచ్ఛిన్నమైన రెండవవస్తువు లేనివాడు, సృష్టి స్థితి లయములలో ఇతర సహకారము లేనివాడై ఏకరూపముగ నుండువాడు, లేక వృద్ధిక్షయాది రహితుఁడై ఏక స్వరూపుఁడగువాడు, ఇష్ట ప్రాణ భావలింగాది స్వగత భేదములు కలవాడైనను మూలరూపమున ఏకైకమహాలింగ మగువాడు, సూక్ష్మాతి సూక్ష్ముఁడగుటచే సర్వమును వ్యాపించువాడు, చిదానంద (జ్ఞానా నంద) స్వరూపుఁడు, ప్రాకృతిరూపము లేనివాడు, హరిబ్రహ్మాదులకు అచ్చెరువుఁగలిగించు జ్యోతిర్లింగస్వరూపము గలవాడు, ఉమ యనఁ బడు పరాశక్తి నెడబాయని ఇష్టలింగ మగువాడు, (రుద్రో లింగ ముమా పీఠం-తస్మై తస్యై నమోనమః, రుద్రహృదయోపనిషత్తు) బ్రహ్మాదుల ప్రభువు, ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులు-లేక - సూర్య చంద్రాగ్నులు మూడు కన్నులుగా గలవాడు, విషపానముచే-స్వల్ప రేఖగా నల్లఁబడిన కంఠము గలవాడు,

క్షుత్పిపాసాదులు లేమిఁజేసి ప్రశాంతుఁడగువాడు పరమేశ్వ రుఁడు నని శివుఁడు ధ్యానింపఁదగినవాడు

మునిః = మోక్షాపేక్షచే నిరంతరము ముక్తిఁగూర్చి మననము (చింతన) గలవాడై పైవిధము శివుని ధ్యానించినచో-మహాప్రళయ మున తమస్సుగా నుండు ప్రకృతిని నియమించి మించునట్టి, జీవాత్మలందరి పుణ్యపాపములను కనిపెట్టునట్టి, సమస్తప్రాణులను పుట్టించునట్టి, శివుని-ప్రారబ్ధాంతమునందు పొందఁగలుగును.

8, 9 వాక్యములయందు-

బ్రహ్మదేవుఁడు, రుద్రుఁడు, ఇంద్రుఁడు, అక్షరుఁడు పరముఁడు, స్వరాట్, విష్ణువు, ప్రాణము, కాలము, అగ్ని, చంద్రుఁడు ఇత్యాది శబ్దములచే నిరూపింపఁబడు, లేక బ్రహ్మాదిరూపములు గలయట్టి, భూత భవిష్యత్ వర్తమానములఁజెందినట్టి, సనాతనుఁడు నగు శివు నుపాసించి-దర్శించియు జననమరణాత్మకమగు సంసారమును పొందకుండును. శివజ్ఞానముదక్క- వేరొక మార్గము—మోక్షమునకు లేదని తెలియవలెను. అని ప్రతిపాదింపఁబడినది.

శ్లో॥ బ్రహ్మణా విష్ణునా చైవ-రుద్రేణాపి సదా హృది ।
ఉపాస్యమానః సర్వాత్మా—భగవాన్ శివ ఉచ్యతే ॥
సూతసంహిత

"బ్రహ్మ విష్ణు రుద్రులచే తమ హృదయములయందు ఉపాసింపఁబడునాడు-భగవానుఁడగు శివుఁడేను"

ఇట్టి శివుని ఇష్టలింగమునందే పూజింపవలెను-ధ్యానింపవలెనని సిద్ధాంతశిఖామణి-దిగువవిధము వాక్రుచ్చినది.

శ్లో॥ సర్వగోఽపి స్థితః శంభుః-స్వాధారే హి విశేషతః ।
తస్మా దన్యత్ర విముఖః- స్వేష్టలింగే యజే చ్ఛివమ్"

శంకరుఁడు సర్వవ్యాపియైనను తన యాధారమునందు విశేషించి నివసించును గాన-ఇతర లింగములయందు గాని మూర్తులయందు గాని ఆసక్తిని విడనాడి-తన ఇష్టలింగమునందే శివుని పూజింపవలెను.

"యో వై రుద్రః స భగవాన్. యశ్చ బ్రహ్మ, యశ్చ విష్ణుః" ఇత్యాది అథర్వశిరోపనిషత్తు-శివుఁడే బ్రహ్మవిష్ణ్వాదిరూపములు గలవాడగునని తేటపఱచినది.

శ్లో॥ తదీయం త్రివిధం రూపం-స్థూలం సూక్ష్మం చ తత్పరం।
అస్మదాద్యమరై ర్దృశ్యం-స్థూలం సూక్ష్మం చ యోగిభిః॥
తతః పరం తు యన్నిత్యం-జ్ఞాన మానంద మవ్యయం।
తన్నిష్ఠై స్తత్పరై ర్భక్తై-ర్దృశ్యం తద్వ్రత మాశ్రితైః॥

వాతూలాగమము

స్థూలము సూక్ష్మము పరము నని పరమేశ్వరుని రూపము త్రివిధము కాగా-స్థూలరూపము మానవులు దేవతలు మున్నగువారికి దృశ్యమగును. సూక్ష్మరూపము యోగాభ్యాసులకు సాక్షాత్కరించును. ఆనందమయము జ్ఞానాత్మకము నిత్యము ఏకరూపంబు నగు పరశివ స్వరూపము-శివునియందే నిష్ఠ, శివునియందే ఆసక్తి, ఇతరదేవతా భక్తిని విడనాడినట్టి అనన్య భక్తి గల లింగధారణవ్రతము నవలంబించినవారికే-ప్రారబ్ధాంతమున గోచరించును.

10 వ వాక్యమున-

పరమాత్మ-జ్యోతిర్లింగముగ ప్రాణులందరిలో ఉన్నాడనియు, పరమాత్మలో ప్రాణులందరు-మర్రివిత్తనమున (వట) వృక్షశాఖోపశాఖలవలె-ఉన్నారనియు - శివపూజనమున మనస్సులో భావించు శివయోగి-పరశివుని పొందఁగలుఁగును. మరియొక బాహ్యసాధనముతో శివసాయుజ్యము లభింపదు. అని వ్రాయఁబడినది.

11 వ వాక్యమున దిగువవిధము అర్థము కలదు.

శివధ్యాననిష్ఠుఁడు-తన నిర్మల చిత్తమును అరణి (క్రిందికఱ్ఱ) గాను ప్రణవపంచాక్షరిని-ఉత్తరారణి (పైకఱ్ఱ)గా నమర్చి-ప్రణవ పంచాక్షరీ జపముతో కూడిన "శివోఽహం" ధ్యానము అను మథనము

నభ్యసించినచో కాయిక వాచిక మానసిక జ్ఞానకృత అజ్ఞానకృత దురితమునంతయు పోగొట్టుకొనును.

జాబాలోపనిషత్తునందు-శతరుద్రీయాంతర్గతమగు ప్రణవపంచాక్షరీ జపముతో అమృతత్వము లభించునని నిరూపింపఁబడినది-ఇందుకు సూతసంహితాప్రమాణము దిగువ గాననగును.

శ్లో॥ శతరుద్రీయ సంజ్ఞస్తు-మంత్రో జప్యో మహత్తరః ।
రుద్రజాపీ విముచ్యేత-మహాపాతక పంజరాత్ ॥

సమ్యక్ జ్ఞానం చ లభతే-తేన ముచ్యేత బంధనాత్ ।
పంచాక్షరే మహాదేవః-సర్వదా సుప్రతిష్ఠితః ॥

ఆచార్యముఖతః ప్రాజ్ఞా-సిద్ధ్యత్యేవాచిరేణ తు ।
ఆచార్యరహితో మంత్రః-పుంసోఽనర్థస్య కారణమ్ ॥

శతరుద్రీయము అను గొప్ప మంత్రము జపింపఁదగినది. రుద్రాధ్యాయమును పఠించువాడు-మహాపాతకసముదాయము నుండి విడిబడును. మరియు సంపూర్ణ శివజ్ఞానము గలవాడై సంసారబంధ వినిర్ముక్తుఁడగును. రుద్రాధ్యాయమందలి శివపంచాక్షరీమంత్రమునందు శివుఁడు ఎల్లకాలముండును. ఈ మంత్రము-గురువు వలన లభించినచో శీఘ్రము సిద్ధించును. గురూపదేశము లేని మంత్రము అనర్థమును కలుగఁజేయును అనఁగా నిరుపయోగమగునని భావము.

"జీవాత్మ-మాయచే మోహముఁజెందినవాడై శరీరేంద్రియాదుల నధిష్ఠించి-ప్రాకృతికవ్యవహారము నంతయు చేయుచున్నవాడు. ప్రాకృతిక వ్యవహారము-ఎట్టిదనఁగా ?

జాగ్రత్ (మేలుకొనియున్న) దశయందు - స్త్రీరతి ఆహార పానీయాది విచిత్ర భోగములతో తృప్తిఁజెందుట.

స్వప్నావస్థ (నిద్ర) యందు పరమేశ్వరునిచే కల్పింపఁబడిన రథ గజ తురగాది వస్తువుల సంయోగమువలన సుఖ దుఃఖముల ననుభవించుట.

సుషుప్తి (గాఢనిద్ర)లో తమస్సునిండినవాడై ఇంద్రియ వ్యాపారములన్నియు స్తంభింపగా నిద్రాసుఖము ననుభవించుట;

వస్తుతః = జీవుఁడు-శివాంశమైనను అనాదికాలమునుండి శివారాధనమును చేయకుండుటచే భ్రమ ప్రమాదములకు లోనై జనన మరణాది సంసారపాశబద్ధుఁడై - వ్యధఁజెందుచుండుననియు, జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలలో సుఖదుఃఖానుభవము - పరమేశ్వరుని వలననే కలుగుననియు 12, 13 వ వాక్యములలో నిరూపింపఁబడినది.

14 వ వాక్యమున దిగువవిధము కలదు.

పూర్వజన్మలయందు చేయఁబడిన కర్మయొక్క సంబంధము వలన జీవాత్మ-గాఢనిద్ర (సుషుప్తి)లో సుఖముగా పరుండును. మేలుకొని స్థూల సూక్ష్మ కారణ శరీరముల (పురత్రయము)లో విహరించును.

విచిత్రమైన చరాచర ప్రపంచమంతయు జీవాత్మ నంటుకొనియుండును. సమస్తజగత్తునకు ఆధారము, పరమానందభరితము, జ్ఞానపరిపూర్ణము నగు బ్రహ్మ (శివలింగ)మునందు సమస్తము మహాప్రళయమున విశ్రాంతిఁజెందును. అందువలననే "విశ్వమంతయు విశ్వనాథునిచే వ్యాపింపఁబడి శివమయంబని" దిగువ శ్రుతివాక్యము ఉద్ఘోషించినది.

"విశ్వం భూతం చిత్రం బహుధా జాతం జాయమానం
చ యత్, సర్వోహ్యేష రుద్ర స్తస్మై రుద్రాయ నమః"
నారాయణోపనిషత్తు

"ఏతస్మా జ్జాయతే ప్రాణో-మనః సర్వేంద్రియాణి చ,
ఖం వాయు ర్జ్యోతి రాపశ్చ-పృథ్వీ విశ్వస్యధారిణీ" 15

సర్వాధారమగు బ్రహ్మ (శివలింగ)ము వలన-ప్రాణవాయువు, మనస్సు, కర్మజ్ఞానేంద్రియములు, ఆకాశము, వాయువు, అగ్ని, ఉదకము, జగత్తునకు ఆధారమగు పృథివియు అవిర్భంచును. ఇట్లు కూర్మమహాపురాణము-ద్వితీయభాగమున, 31 అధ్యాయమున

శ్లో॥ యేనేదం భ్రామ్యతే విశ్వం-యదాకాశాంతరం శివం।
యోగిభి శ్చింత్యతే తత్త్వం-మహాదేవః స శంకరః ॥

విశ్వమునంతయు కర్మచక్రమున త్రిప్పునట్టి, చిదాకాశమున వెలుగొందునదియు, శ్రేయస్కరంబు, శివయోగులచే ధ్యానింపఁబడునట్టి పరతత్త్వము-మహాదేవుఁడైన శంకరుఁడగునని-వాక్కుచ్చినది.

ప్రపంచమునకు ఆశ్రయము, సర్వాంతర్యామియు మహత్తును, సూక్ష్మమునకంటె సూక్ష్మము, నిత్యము, సద్రూపంబు నగు పరబ్రహ్మము అంత్యరామిగా గల జీవాత్మ-ఏనాటికైనను బ్రహ్మసదృశుండగునని 16 వాక్యముఁదగు భావము.

జాగ్రత్స్వప్న సుషుప్తులలో అనుభవింపఁబడు ప్రపంచమును ప్రకాశింపఁజేయు బ్రహ్మమునేను (శివోఽహం) అని శివు నుపాసించువాడు-సర్వవిధ సంసారబంధములనుండి విముక్తుఁడగునని 17 వ వాక్యము నిరూపించినది.

జాగ్రత్ స్వప్నసుషుప్తులు అను స్థానములయందు అనుభవింపఁ దగినది, అనుభవించువాడు అనుభవము అనువానిని సాక్షిగ నవలోకించునట్టి, భోగ్యభోక్తృభోగములకన్న వేరైనట్టి, చిన్మాత్రుఁడు నగు సదాశివుఁడు నేనని శివోపాసకుఁడు-భావింపవలెనని-18 వ వాక్యమున విదితమైనది.

"భోక్తా దేవో మహేశ్వరః
"శివో దాతా శివో భోక్తా-శివః సర్వమిదం జగత్,
త్రిషు ధామసు యద్భోగ్యం-భోక్తా యశ్చ ప్రకీర్తితః,
ఉభయం బ్రహ్మ యో వేద-స భుంజానో న లిప్యతే"
బ్రహ్మగీత, అ-8 (శ్రీకరభాష్యము)

భోగ్యము భోక్త రెండును శివుఁడే నని భావించువాడు-సంసార సుఖదుఃఖముల ననుభవించినను అట్టి కర్మఫలమునకు బాధ్యుఁడు కాడని భావము.

చరాచర మంతయు బ్రహ్మమువలననే పుట్టుచున్నది. బ్రహ్మమునందే నిలిచియున్నది. బ్రహ్మములోనే దాగియుండునది. తనతో సమానమగు రెండవ వస్తువు లేనట్టి బ్రహ్మ నేనగుదునను నిశ్చిత బుద్ధిని-శివోపాసకుడు-శాంభవదీక్షితుఁడై ఇష్టలింగమునందు చూపు నిలిపి-"శివోఽహం" అని భావలింగమును ధ్యానితపవలెనని 19 వ వాక్యముఁదగు నిరూపణము.

శ్లో॥ నమఃశివాయేతి శివం ప్రపద్యే-శివ ప్రసీదేతి శివంప్రపద్యే।
శివాత్ పరం నేతి శివం ప్రపద్యే—శివోఽహ మస్మీతి
శివం ప్రపద్యే ॥

శివునకు నమస్కారమనియు, శివా! ప్రసన్నుడవు కమ్మనియు, శివునికన్న శ్రేష్ఠమైనది లేదనియు అను భావనతో శివుని ఆశ్రయించి శరణమును ప్రార్థించుచున్నాను.

కైవల్యోపనిషత్తు
ప్రథమఖండము - సమాప్తము

కైవల్యోపనిషత్సారాంశము-ద్వితీయఖండము

"అణో రణీయా నహ మేవ తద్వత్-మహానహం
విశ్వ మహం విచిత్రం।పురాతనోఽహం పురుషోఽ
హ మీశో-హిరణ్మయోఽహం శివరూపమస్మి" 20

స్థూల సూక్ష్మ శరీరేంద్రియాదులకన్న నణువగు జీవాత్మకంటె నణువగు శివుఁడు-నేనేను; మహత్తగు ఆకాశమునకంటె గొప్పవాడు, విశ్వవ్యాపకుఁడు, విచిత్రములగు చంద్రశేఖరత్వాది లీలారూపములు గలవాడు, అన్నిటికన్న ముందున్నవాడు, సూక్ష్మ శరీరమున వరుండి పురుషుఁడనఁబఱఁగువాడు, జ్యోతిర్లింగస్వరూపుఁడు, సమస్త చరాచరమును శాసించువాడు నగు శివస్వరూపుఁడు-నేనని-శివోపాసకుఁడు-ఉపాసనయందు శివతాదాత్మ్యము గలవాడై శివుని ధ్యానింపవలెనని-పై 20 వ వాక్యమునందు-ఉపాస్య ఉపాసకులకు ఏకత్వము నిర్ధారింపనైనది.

శ్లో॥ అథవాఽనంత కల్యాణ-గుణైక ఘన ఈశ్వరః।
శివ ఇత్యుచ్యతే సద్భిః-శివతత్త్వార్థవేదిభిః॥

శివ మహాపురాణము.

విశ్వవ్యాపకత్వము. విచిత్రలీలారూపత్వము, మొదలగు అనంత కల్యాణగుణములు గలవాడు-శివుఁడని — శివతత్త్వార్థవిదులు విశదీకరించిరి.

ఇఁక 21 వ వాక్యమున-

పాదములు లేకున్నను వేగము గలవాడు, హస్తములు లేకున్నను స్వీకరించువాడు, ప్రాకృతమనస్సుచే గ్రహింపరానట్టి సామర్థ్యము గలవాడు, కన్నులు లేకున్నను చూచువాడు, చెవులు లేకున్నను వినువాడు, వివిధరూపములు గలవాడు నగు శివుఁడు నేనగుదును గాన శివసాయుజ్యముఁజెందిన నన్ను బద్ధజీవుఁడెవఁడును కనుగొనఁజాలడు. ఎల్లకాలము-పునరావృత్తి రహితుఁడనై జ్ఞానమయుఁడనై యుందునని-శివోపాసకుఁడు ధ్యానింపవలెనని నిరూపింపఁబడినది.

22 వ వాక్యము దిగువవిధము ఉద్ఘోషించినది.

"చతుర్విధ వేదములతో పరమాత్మయే (అహమేవ) తెలియఁదగినవాడు. వేదాంతములను రచించువాడు వేదార్థమును గుర్తించువాడును వరమాత్మయేను; పుణ్యాపాపములు, వినాశము, జనన మరణాదులు గల శరీరేంద్రియములు బుద్ధియు పరమాత్మకు లేవు"

23 వ వాక్యమున ఇట్లు కలదు.

"భూమి జలము అగ్ని వాయువు ఆకాశము అను పంచమహాభూతములయొక్క ప్రత్యేక రూపములతో పరమాత్మ (శివున)కు సంబంధము లేదు."

24 వ వాక్యమున క్రింది విధము గాననగును.

"ఇవ్విధము-పరమాత్మ (శివుఁడు) ప్రాణుల హృదయగుహయందుండువాడనియు, విభాగములేనివాడై అద్వితీయుఁడనియు, నామరూపవిభాగార్హమగు స్థూల ప్రపంచముతో, నామరూపవిభాగము చేయరానట్టి సూక్ష్మ ప్రపంచముతోడను సంబంధము లేనివాడనియు, సమస్త సాక్షి యనియు భావించు శివోపాసకుఁడు-సచ్చిదానందమయమైన శివస్వరూపము గలవాడగును."

"రుద్రో జనానాం హృదయే సన్నివిష్టః" శ్రీకరభాష్యము.
"ఏకో దేవః సర్వభూతేషు గూఢః" శ్వేతాశ్వతరము.
"సర్వాత్మా శంకరో నామ-సాక్ష్యేవ సకలస్యతు" బ్రహ్మగీత

ఇత్యాది ప్రమాణాంతరములు పై విషయమును సమర్థించు చున్నవి.

"యః శతరుద్రీయ మధీతే, సోఽగ్నిపూతో భవతి-
స వాయుపూతో భవతి-స ఆత్మపూతో భవతి-
స సురాపానాత్ పూతో భవతి-స బ్రహ్మహత్యాయాః
పూతో భవతి-స సువర్ణస్తేయాత్ పూతో భవతి-
స కృత్యాకృత్యాత్ పూతో భవతి"
"తస్మాదవిముక్త మాశ్రితో భవతి-అత్యాశ్రమీ సర్వదా
సకృద్వా జపేత్"
"అనేన జ్ఞాన మాప్నోతి-సంసారార్ణవనాశనం-తస్మా
దేవం విదిత్వైనం-కైవల్యం పదమశ్నుతే కైవల్యం
పద మశ్నుతే" 26

శతరుద్రీ (రుద్రాధ్యా)యమును శివసన్నిధానమున ప్రతిదినము పఠించువాడు-అగ్నివలె, వాయువువలెను పవిత్రుఁడగును పరిశుద్ధాత్మ యగును. సురాపానము, బ్రహ్మహత్య, సువర్ణస్తేయము, తెలిసి తెలియక చేసినవి మొదలగు పాపములను పోగొట్టుకొనును-

శాంభవదీక్షితుఁడగు అత్యాశ్రమి-శుచియై రుద్రాధ్యాయమును జపింపవలెను-లేక-ప్రతిదినము స్నానసంధ్యావందనాద్యనంతరము, భోజనాత్ పూర్వము ఒక పర్యాయమైనను జపింపవలెను,

రుద్రాధ్యాయ పఠనమువలన అవిముక్తమును (అనఁగా పునరావృత్తిరహిత శివసాయుజ్యమును) పొందును. లేక కాశీక్షేత్రము నాశ్రయించి ముక్తుఁ డగును.

రుద్రాధ్యాయ పఠనమువలన సంచిత అగామి పాపములు నశించుటచే చిత్తశుద్ధిగలవాఁడై-సంసారసముద్రమునుండి తరింపఁజేయునట్టి శివదర్శనమును పొందును. లేక కాశీక్షేత్రమున మరణించినచో అంత్యకాలమున విశ్వనాథుని దర్శించి ముక్తుఁడగును.

ఇట్లు గుర్తించి గురుముఖతః అధీతమైన రుద్రాధ్యాయమును పఠించినచో శాశ్వత శివానందానుభవము గలవాఁడగును. రుద్రాధ్యాయముతో శివు నభిషేకించుట-పఠనమున కన్న ప్రశస్త మగును. ఇందువలన హృదయమున భావలింగమును ధ్యానించు యోగ్యత సంఘటించును.

కైవల్యోపనిషత్తు

ద్వితీయఖండము సర్వము సమాప్తము.

ఓమ్

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ మేధాదక్షిణా మూర్తయే నమః.

మాండూక్యోపనిషత్తు

"శివతత్త్వప్రపట" అను శాంకరీయ ఆంధ్రానువాద సహితము

ఈ యుపనిషత్తు- కేవలాద్వైతమును ప్రతిపాదించుటయందు తాత్పర్యము గలది కాదు. ఎట్లనఁగా ?

"అయమాత్మా బ్రహ్మ" "ఈ జీవాత్మ-బ్రహ్మము" ఇత్యాది వాక్యములు—జీవబ్రహ్మైక్యమును గాక-పరమేశ్వరుఁడు—చేతనాచేతనముల నంతర్యామిగ సర్వాత్మకుండగునను విషయమునే సమర్థించు చున్నయది. "ఐతదాత్మ్య మిదగ్ం సర్వం" ఇత్యాది ఛాందోగ్య వాక్యములు, "యఃసర్వేషు భూతేషు తిష్ఠన్" "యో విజ్ఞానే తిష్ఠన్" ఇత్యాది బృహదారణ్యక వాక్యములు పరమేశ్వరుఁడు సర్వాంతర్యామియై జీవాత్మలో నుండునని ప్రతిపాదించుటచే-ఈ మాండూక్యము గూడ—ఇతర ఉపనిషత్తులకు నవిరుద్ధముగా ఉపాసక ఉపాస్య భేదమునే నిరూపించినదని-తెలియవలెను. మరియు "జ్ఞాత్వా శివం శాంతి మత్యంత మేతి" "ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిమ్", ఇత్యాది శ్రుతులు జీవుని కన్న వేరైన శివు నుపాసించి దర్శించుట వలననే ముక్తి లభించునని విశదీకరించుటఁజేసి—బహుశ్రుతులకు అను

గుణముగా మాండూక్యముఁగూడ శివాద్వైతమునే బలపఱచుచున్నదని గ్రహింపవలెను

ఇంతియే గాక ఇందు "శివమద్వైతం" అనుచో-పరమేశ్వరుని అసాధారణ నామధేయమగు "శివ" అనునది ఉండుట-శివాద్వైతమునకు ప్రబలకారణ మగుచున్నయది.

ఇందు నాలుగు ఖండములు, పన్నెండు వాక్యములు కలవు.

ప్రథమఖండమున-మొదటివాక్యమందు-భూత భవిష్యత్ వర్తమాన ప్రపంచమంతయు కాలత్రయము నతిక్రమించు పరమాత్మయు ఓంకారమేను; ఓంకారము వాచకము, పరమాత్మ-వాచ్యుఁడు కాగా-వాచ్యవాచకములకు భేదము లేదని-సమస్తము ఓంకారమని చెప్పఁబడినది.

రెండవ వాక్యమున-"అయ మాత్మా బ్రహ్మ" "ఈ జీవాత్మ బ్రహ్మ అంతర్యామిగ కలదగుటచేతను ముక్తదశయందు శివునితో అత్యంత సామ్యముఁ జెందుటవలనను-ఇట జీవాత్మ బ్రహ్మంబని చెప్పఁబడినది. అంతమాత్రమున జీవబ్రహ్మైక్యమును భావించినచో బహుశ్రుతులకు విరోధము సంభవించును. అట్టి జీవాత్మను వెంటాడు పరమాత్మ-"సోఽయ మాత్మా చతుష్పాత్" "జీవాత్మద్వారా జాగ్రత్ స్వప్నసుషుప్తులు అను మూడు విభాగములు గలదై నాలుగవ భాగమున పరిపూర్ణుఁడై శివుఁడనఁబడుఁగునని ప్రతిపాదింపఁబడినది.

ప్రథమఖండము సమాప్తము

ద్వితీయ ఖండమున గల ఐదు వాక్యములయందు-జీవాత్మ జాగ్రదవస్థయందు చక్షురాదీంద్రియగోచరములగు రూపాది విషయముల ననుభవించుచు-సూక్ష్మపంచభూతములు ధర్మాధర్మములు అను ఏడు అంగములు కలవాడై-కర్మజ్ఞానేంద్రియములు పంచ

ప్రాణములు అంతఃకరణ చతుష్టయము అను పందొమ్మిది ముఖములతో బాహ్యప్రపంచము నవలోకించుచు వైశ్వానరుఁడని చెప్పఁబడును.

స్వప్నావస్థయందు లోని తెలివి గలవాఁడై—ఇతరులకు తెలియని విషయముల ననుభవించు జీవాత్మ తైజసుఁడనఁబడును. సుషుప్తియందు ఏమియు నపేక్షింపక-పరమాత్మతో ఏకీభవించి ఆనందము ననుభవించుచు-తెలివితో నుండుటఁజేసి-ప్రాజ్ఞుఁడనఁబడును.

సుషుప్తియందు జీవాత్మ నానందము ననుభవింపఁజేయు పరమాత్మ ఎట్టివాడనఁగా ?

"ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోఽంతర్యామ్యేష
యోనిః, సర్వస్య ప్రభవాప్యయౌ హి భూతానామ్" 4

"ఈ పరమాత్మ-సర్వేశ్వరుఁడు, సర్వజ్ఞుఁడు, అంతర్యామి, సర్వకారణుఁడు కాగా-సమస్తప్రాణులయొక్క జనన మరణములు పరమాత్మవలన సంభవించును" జాగ్రత్ స్వప్న సుషుప్తులు మూడు పాదములు కాగా-అవస్థాత్రయమును కాలత్రయము నతిక్రమించు నాలుగవపాదమగు పరమేశ్వరుఁ గూర్చి-ఐదవ (దిగువ) వాక్యమున ప్రతిపాదింపఁబడినది.

"లోని తెలివిని విడనాడి వెలుపలి విజ్ఞానము అవసరము లేనివాఁడై చక్షురాది ఇంద్రియములకు గోచరుఁడు కానివాఁడై బాహ్యప్రపంచమున వ్యవహరింప నలవిఁగానివాఁడై స్థూలప్రపంచ సంబంధ రహితుఁడునై నిర్వికారుఁడు "శివ మద్వైతం చతుర్థం మన్యంతే, స ఆత్మా స విజ్ఞేయః" నగునట్టి, జీవాత్మతో ఏకీభవించునట్టి శివుని-

నాలుగవ పాదముగా - వేదాంతవిదులు భావించుచున్నవారు. అట్టి శివుఁడు పరమాత్మయగుటచే జీవాత్మచే ఉపాసింపఁదగినవాఁడు తెలియఁదగినవాఁడు నగును.

ద్వితీయఖండము సమాప్తము

తృతీయ ఖండమున ప్రథమవాక్యమందు-(ఇట్లు పరమాత్మ-జీవాత్మ ద్వారా మూఁడు పాదములు, స్వయము నాలుగవపాద మగునని నిరూపించి -ప్రస్తుతము పరమాత్మను ఓంకారమునందు భావింపవలెననియు-ఓంకారమునందు గల అకార ఉకార మకార ములు పరమాత్మఁజెందినవనియు, రెండవ వాక్యమున-ఓంకారముఁ జెందిన అకారము-ప్రథమపాదము, అని భావించువారికి-కామితము లన్నియు లభించుననియు;

మూడవ వాక్యమున ప్రణవగతమైన ఉకారము ద్వితీయపాద మని ఉపాసించువారు-విజ్ఞానము గలవారై ఇహపరలోకములయందు గౌరవింపఁ బడుదురనియు,

నాలుగవ వాక్యమున-ఓంకారమందలి మకారమును మూడవ పాదముగ ధ్యానించిన యెడల - శివేతరమంతయు పరిచ్ఛిన్నముగా కనఁబడుటయే గాక-దుఃఖనివృత్తి సంభవించుననియు; నిరూపింపఁ బడినది.

తృతీయఖండము సమాప్తము

చతుర్థ ఖండమున గల ఒకే ఒక వాక్యమునందు-అకార ఉకార మకార సమష్టి రూపుడై విడిగా మాత్రలచే వ్యవహరింప రానట్టి, స్థూలప్రపంచమును తనలో సూక్ష్మముగా ఇమిడ్చుకొనునట్టి,

శివుఁడు - శక్తితో అవినాభావముగలవాడగుటచే - స్వతస్సిద్ధమగు భేదము లేనివాడై ఓంకారముగ ప్రతిపాదింపఁబడుచున్నవాడు.

ఇవ్విధము బుద్ధిబలమున గుర్తెరిగి ప్రణవముతో లేక స్థూల ప్రణవమగు శివపంచాక్షరీ మహామంత్రముతో పరమేశ్వరు నుపాసించు పుణ్యపురుషుఁడు-జన్మాంతమున - అర్చిరాదిగతిని పరమపదముఁజేరి ఆవిర్భూత నిజరూపుఁడై శివసాయుజ్యమును పొందును.

శ్రీ నీలకంఠ భగవత్పాదకృత భాష్యమును శ్రీ నాగలింగ శాస్త్రి కృత వ్యాఖ్యానము ననువదించుటతో - చతుఃఖండ యుక్తముగ మాండూక్యోపనిషత్తు-సర్వము సమాప్తము-

ఇది-ఉపనిషద్భాష్యముఁదగు ప్రథమభాగము

ఓమ్

శ్రీ మహాగణాధిపతయే నమః

శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః

ఉపసంహారము

ఈశావాస్యము, కేనము, కఠము, ప్రశ్నము, ముండకము, కైవల్యము, మాండూక్యము, అను ఏడు ఉపనిషత్తులకు—జగద్గురు శ్రీ నీలకంఠ భగవత్పాదాచార్యులచే వ్రాయబడిన భాష్యమును, మరియు మహోపాధ్యాయ, శివశ్రీ॥ ముదిగొండ నాగలింగశాస్త్రి వరేణ్యుల సంస్కృత వ్యాఖ్యానమును తెలుగు ననువదించి—శివతత్త్వ ప్రభ—అను పేరుతో పదార్థమును భావార్థమును సారాంశమును—శివశ్రీ॥లోకారాధ్యులైన అన్నదేవర సుబ్బారావుగారి ప్రేరణ ననుసరించి—వయోవృద్ధుఁడనైనను శ్రమను గణింపక—ఇందు వ్రాసితిని.

తైత్తిరీయమును ముగించి ఐతరేయము ననువదించుచున్నాను. ఛాందోగ్యము బృహదారణ్యకము శ్వేతాశ్వతరము వ్రాయవలసియున్నవి. (కాలాగ్నిరుద్ర జాబాల అథర్వశిఖాదులను అనువదించుటకు సదవకాశము అపేక్షింపఁబడుచున్నయది).

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీతలు అనునవి-ప్రస్థానత్రయమనఁబడును. వేదాంతశాస్త్రము - ప్రస్థానత్రయముతో-సమాప్తమగును. "ప్రకర్షేణ స్థీయతే శాస్త్ర మస్మిన్నితి" అని ప్రస్థాన శబ్దనిర్వచనము. ప్రయాణము, మహాప్రయాణము ఇత్యాది అర్థాంతరములు - ఇఁట అప్రస్తుతములగునవి. ప్రస్థానమనఁగా—ఒకానొక

ప్రామాణిక మహాశాస్త్రమని చెప్పుట-ఇఁట ప్రస్తుతమగును. "ఔచిత్యా దర్థనిర్ణయః",

శ్రీ నీలకంఠ శంకర రామానుజ పూర్ణప్రజ్ఞాద్యాచార్యవర్యులు-ఉపనిషత్ బ్రహ్మసూత్ర భగవద్గీతలను ప్రస్థానత్రయముగ వ్యవహరించిన తీరును సమకాలిక పీఠాధిపతులు గుర్తించి అన్యార్థములఁ జూపరాదనియు. తమ పాండిత్య అభినివేశముతో శ్రోతలను సందిగ్ధ చిత్తులఁజేయరాదనియు, ఈ సందర్భమున హెచ్చరిక-చేయఁబడు చున్నది.

ఈశాద్యుపనిషత్ప్రకమునందు శివాద్వైతసిద్ధాంతమే ఇమిడి యున్నదనియు, కేవలాద్వైత విష్ణువిశిష్టాద్వైత మాధ్వాది సిద్ధాంతములకు అవకాశము లేదనియు; ప్రతి ఉపనిషత్తుయొక్క సారాంశము వ్రాయఁబడినది. శైవమహాజనులు-సావధానముగ చదివి అవగాహనఁ జేసికొనగలరని కోరుచున్నాను.

"విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమం" అన్నట్లు నా యీ పరిశ్రమను యథార్థహృదయులగు శైవ శైవేతరపండితులు గుర్తించి అనభిజ్ఞులకు విశదీకరింపగలరని ఆకాంక్ష.

ఉపనిషద్వాక్యములు - ముఖ్యములైనవి- ఉదాహరింపఁబడినవి గాన మూలమును చదివినవారికి-మొత్తం ఉపనిషదర్థము ఇందు అవగతమగును గ్రంథవిస్తరభీతిచే మూలమునంతయు వ్రాయలేదు.

జిజ్ఞాస గల చదువరులందరు-ఉపనిషత్ బ్రహ్మసూత్ర భగవద్గీతల సారాంశము - శివపారమ్యమును పాశుపతదీక్షను శివాద్వైత సిద్ధాంతమును సమర్థించునదని గ్రహించి-కర్మసహిత జ్ఞానః (ఉపాసన)తో శివుని ధ్యానించి తరించుటకు వలయు చిత్తశుద్ధి సంపాదింతురుగాక!

శివలింగధారణమును యథావిధిగ ఆచరించువారికి - శివానుగ్రహమువలన ఈ జన్మయందే చిత్తశుద్ధి కలుగును. అంత్యకాలమున శివదర్శనము శాశ్వత శివసాయుజ్యము లభించును.

దీనికంతటికీ - వేదవేదాంత పఠనము (లేక) శ్రవణము అత్యావశ్యకములని భావించి - ఉపనిషత్తులకు తెలుగర్థమును వ్రాయనైనది బుద్ధిమంతులు గమనింతురుగాక!

నిర్మల శంకరశాస్త్రి ఆరాధ్యులు
శైవమహాపీఠాధిపతి

విషయసూచిక